'ఆర్థిక అసమానతలు తొలగకపోతే
రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 273

బుధవారం 24-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హెచ్-1బీ లాటరీకి చెల్లుచీటీ

హెచ్-1బీ వీసాదారుల ఎంపికకు పాటిస్తున్న లాటరీ విధానాన్ని రద్దు చేస్తున్నట్టు హోం లాండ్ సెక్యూరిటీ విభాగం ప్రకటించింది. ఇకపై హెచ్చు నైపుణ్యం, వేతనం ఉన్న వారికే ఆ వీసాల జారీలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపింది. -6లో

MARUTI SUZUKI ARENA
VICTORIS
HYBRID
VICTORIS
VICTORIS
GOT IT ALL
SCAN AND CONNECT TO
A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT
WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
Applicable T&C available at your nearest dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Features may vary by model/conditions.
VICTORIS

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 273

బుధవారం 24-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

మీరూ శాంటా కావచ్చు

శాంటా కథ 'మంచికి ప్రతిఫలం ఉంటుంది' అని చెబుతుంది -11లో

షఫాలీ 'షో'

రెండో టి20లో శ్రీలంకపై 7 వికెట్లతో నెగ్గిన భారత మహిళల జట్టు -12లో

అద్భుతాల యుద్ధ నౌక

కనీవినీ ఎరగని యుద్ధనౌకను అమెరికా తయారు చేయనుంది. దానికి 'బ్యాటిల్‌షిప్' అని పేరు పెట్టినట్టు ట్రంప్ వెల్లడించారు.

వివరాలు 6లో ▸

కృత్రిమ గర్భాశయం!

సైంటిస్టులు కృత్రిమ గర్భాశయాన్ని రూపొందించారు. ఉమ్మ నీటితో సహా ఇది అచ్చం అమ్మ గర్భంలాగానే ఉంటుంది.

వివరాలు 6లో ▸

తేజస్.. మరింత సేఫ్

భద్రత చర్యల్లో భాగంగా తేజస్ యుద్ధ విమానం వెనుక అత్యాధునిక హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్‌ను అనుసంధానించారు.

వివరాలు 6లో ▸



శ్రీలంకకు రూ.4 వేల కోట్లు

తుపానుతో కలావికలమైన శ్రీలంకకు రూ.4,000 కోట్ల సాయం అందిస్తున్నట్లు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు.

వివరాలు 6లో ▸

బాబు స్కామ్‌ల రోత.. కేసుల మూత

కేసులు కంచికి!

అటు 'స్కామ్'లు.. ఇటు క్లోజర్‌లోనూ చంద్రబాబు 'స్కిల్'

'స్కిల్' కుంభకోణం కేసు అడ్డగోలుగా మూసివేతకు పన్నాగం

'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్..' ముసుగులో సీఐడీ ద్వారా కుతంత్రం.. పూర్తి ఆధారాలతో బాబు అవినీతిని అప్పట్లో నిగ్గు తేల్చిన సిట్

అందుకే రిమాండ్ విధించిన న్యాయస్థానం

52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు

ఇదే కేసులో ఆధారాలున్నాయన్న ఈడీ

ఇప్పుడు మాత్రం ఆధారాలు లేవంటూ సీఐడీ 'పచ్చ' పాట.. కేసు క్లోజ్ చేయడంపై అప్పటి స్కిల్ కార్పొరేషన్ ఎండీకి నోటీసులు

నిజానికి నాడు ఫిర్యాదు చేసింది కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి.. స్కిల్ స్కామ్ కేసు మూసివేతకు కూటమి సర్కారు బరితెగింపు

ఇప్పటికే చంద్రబాబుపై ఉన్న ఫైబర్ నెట్, మద్యం కేసులు అడ్డగోలుగా మూసివేత

2 లో



PRESS RELEASE

28/4/2023

Directorate of Enforcement (ED) has provisionally attached properties amounting to Rs. 31.20 Crore belonging to M/s Designtech Systems Private Limited (DTSPL) in a money laundering investigation.

ED initiated investigation under the Prevention of Money laundering Act (PMLA), 2002 on the basis of FIR registered by AP CID against M/s Designtech Systems Private Limited and others for cheating the Andhra Pradesh Government by diverting and siphoning off funds in the case of Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) Siemens Project which was meant to promote skill development & entrepreneurship in Andhra Pradesh.

Investigation conducted by ED revealed that M/s DTSPL, its director and others diverted the Government funds with the help of shell entities through multi-layered transactions and siphoned off the funds on the strength of bogus invoices under the pretext of supply of materials/services.

Part of the diverted funds was received back by DTSPL its bank accounts. Proceeds of crime in the possession of DTSPL have been traced in the form of fixed deposits. These fixed deposits totaling to Rs 31.20 Crore have been provisionally attached during investigation.

Previously, in the instant case, ED had arrested MD of DTSPL, Vikas Khanvelkar, Suman Bose, Mukul Chandra Agarwal and Suresh Goyal on 04.03.2023. The arrested accused persons are presently in Judicial Custody.

Further investigation is in progress.

నిధులు కొల్లగొట్టారు.. నిగ్గు తేల్చిన ఈడీ..

ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. అక్రమ నిధులను షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు తరలించినట్లు గుర్తించింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ జప్తు కూడా చేసింది. చంద్రబాబుకు సన్నిహితులు, ఆ కుంభకోణంతో ప్రమేయమున్న షెల్ కంపెనీల ప్రతినిధులు సౌమ్యాద్రి శేఖర్ బోస్ అలియాస్ సుమన్ బోస్ (సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ), వికాస్ ఖన్విల్కర్ (డిజైన్ టెక్ కంపెనీ ఎండీ), ముకుల్‌చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్)లను అరెస్టు చేసింది.

టీడీపీ-జనసేన దుష్ప్రచారం ఆర్బీఐ నివేదికతో

బట్టబయలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- గత ప్రభుత్వ హయాంలో బ్రాండ్ ఏపీ దెబ్బతిందని టీడీపీ, జనసేన నేతలు పచ్చి అబద్ధాలు
- పెట్టుబడిదారులు పారిపోయారంటూ నాడూ.. నేడు దుష్ప్రచారం
- 2019–24 మధ్య తయారీ రంగంలో దక్షిణ భారతదేశంలోనే ఏపీ నంబర్ వన్.. దేశంలో ఐదో స్థానం
- పారిశ్రామికాభివృద్ధిలో దక్షిణ భారత దేశంలో నంబర్ వన్.. దేశంలో ఎనిమిదో స్థానం
- ఇప్పుడు చెప్పండి.. 2019–24 మధ్య ఏపీ బ్రాండ్ దెబ్బతిందా? లేక ఇంతకుముందెన్నడూ చూడని ఆర్థిక పురోగతిని చూశామా?

2 లో

పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

రాబోయే రోజులు మనవే

టీడీపీ నేతల బాధితులకు వైఎస్ జగన్ భరోసా

పులివెందుల కార్యకర్తలు, ప్రజలతో మమేకం

3లో

విషపు రాతలకు ఢిల్లీ హైకోర్టు కళ్లెం!

తిరుమల లడ్డూ వ్యవహారంలో తప్పుడు కథనాలపై న్యాయస్థానం సీరియస్

ఇకపై తిరుమల లడ్డూ వ్యవహారం గురించి గానీ, వైవీ సుబ్బారెడ్డి గురించి గానీ ప్రచురించే ప్రతి కథనం కోర్టు విచారణకు లోబడి ఉంటుంది. ఇష్టారాజ్యంగా తప్పుడు రాతలు రాస్తే కోర్టులో మూల్యం చెల్లించుకోక తప్పదు. వాటికి తగిన పరిణామాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి.

- ఢిల్లీ హైకోర్టు హెచ్చరిక

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌పై విచారణ

ఈనాడు సహా పలు మీడియా సంస్థలు, గూగుల్‌కు నోటీసులు

ఇకపై ఇష్టారాజ్యంగా రాస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక

ఇప్పటినుంచి రాసే కథనాలు కోర్టు పరిధికి లోబడి ఉంటాయని స్పష్టీకరణ

తదుపరి విచారణ జనవరి 29కి వాయిదా

14 లో

న్యాయం చేయడం అధికారుల పని కూడా!

- ప్రజలు ఏ పని కోసమైనా వస్తారో.. అందులో వారి జీవితాలుంటాయి
- అధికారులు అన్ని విషయాల్లో నిష్పాక్షికంగా ఉండాలి.. వైఎస్సార్‌సీపీ కార్యాలయం విషయంలో హైకోర్టు వ్యాఖ్య

14 లో

తహశీల్దార్‌ను చుట్టుముట్టిన గిరిజనులు

తహసీల్దార్ కళ్లలో కారం..

3 గంటలు నిర్బంధం

- ఏలూరు జిల్లా ఇనుమూరులో భగ్గుమన్న భూ వివాదం
- అధికారుల వాహనాలను ధ్వంసం చేసిన గిరిజనులు
- పోలీసులతో తోపులాట.. పలువురికి గాయాలు
- రాత్రి సమయానికి నచ్చజెప్పి బయటపడ్డ తహసీల్దార్
- రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు

14 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	140 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	242 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	167 కిలో	స్కిన్ లెస్	276 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయబడినది



బ్యాంకులకు రఘురామ టోకరా

ఇండ్ భారత్ థర్మల్ కంపెనీ పేరిట బ్యాంకులకు కుచ్చుటోపీ

బ్యాంకుల నుంచి రూ.1,383 కోట్ల రుణాలు

సొంత అవసరాలకు మళ్లింపు

బ్యాంకుల ఫిర్యాదుతో రంగంలోకి సీబీఐ

2020 అక్టోబర్‌లో రఘురామ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు

కేసు విచారణపై 2022లో సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న రఘురామ

తాజాగా స్టేఎత్తివేసి విచారణకు అనుమతించిన అత్యున్నత న్యాయస్థానం

దీంతో చర్చనీయాంశంగా మారిన రఘురామ మోసాలు



- వివరాలు 5లో

పద్మశ్రీ ఇమ్మనలే.. సీబీఐ విచారణకు ఆదేశించారు

- అయినా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కామెడీ చేస్తున్నారు
- బ్యాంకులను మోసగించిన కేసులో నేనూ ఇంప్లీడ్ అవుతా
- నా వద్దనున్న వివరాలతో మొత్తం బండారం బయటపెడతా
- సర్వీస్ నుంచి తొలగించడానికి నేనేమీ పేకాట క్లబ్‌లు నడపడం లేదు
- వీడియోలో స్పష్టం చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్

5 లో

ఆర్బీఐ నివేదికతో టీడీపీ-జనసేన దుష్ప్రచారం బట్టబయలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై టీడీపీ, జనసేన నేతలు చేస్తున్న దుష్ప్రచారాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019–24 మధ్య పారిశ్రామిక ప్రగతి, తయారీ రంగంలో వృద్ధిపై స్థూల విలువ జోడింపు (జీవీఏ–గ్రాస్ వ్యాల్యూ యాడెడ్)తో ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఈ నెలలో విడుదల చేసిన నివేదికలోని గణాంకాలను ఉటంకిస్తూ విష ప్రచారాన్ని ఎండగట్టారు. ఆ నివేదికలో పేర్కొన్న అంశాలను జత చేస్తూ.. 'సత్యమేవ జయతే' హ్యాష్‌ట్యాగ్‌తో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. ''టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఎన్నికల ముందు, ఇప్పుడూ పనిగట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ బ్రాండ్ దెబ్బతిందని, ఫలితంగా పెట్టుబడిదారులు రాష్ట్రం వదిలి వెళ్లిపోయారంటూ విమర్శలు చేస్తున్నారు. అంతే కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదంటూ పచ్చి అబద్ధాలు వల్లె వేస్తున్నారు. టీడీపీ, జనసేన నేతలు చెబుతున్న దాంట్లో వాస్తవం ఉంటే తయారీ, పరిశ్రమల రంగంలో రాష్ట్రం పని తీరు దయనీయంగా ఉండేది. కానీ.. వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. తయారీ, పరిశ్రమల రంగంలో స్థూల విలువను జోడిస్తూ ఆర్బీఐ ఈ నెల విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది. తయారీ రంగం వృద్ధిలో దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్.. దేశ వ్యాప్తంగా ఐదో స్థానంలో ఉంది. పారిశ్రామికాభివృద్ధిలో దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్.. దేశ వ్యాప్తంగా ఎనిమిదో స్థానంలో ఉంది. ఇప్పుడు చెప్పండి.. 2019–24 మధ్య ఏపీ బ్రాండ్ దెబ్బతిందా? సమర్థవంతమైన నాయకత్వం వల్ల ఇంతకుముందెన్నడూ చూడని ఆర్థిక పురోగతిని చూశామా?



2019-24 మధ్యలో పారిశ్రామికవృద్ధిలో దక్షిణ భారత్‌లో నంబర్ వన్‌లో, దేశంలో ఎనిమిదో స్థానంలో ఏపీ నిలిచినట్లు ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదిక



2019-24 మధ్య తయారీ రంగంలో దక్షిణ భారత్‌లో తొలి స్థానంలో, దేశంలో ఐదో స్థానంలో ఏపీ నిలిచినట్లు ఆర్‌బీఐ విడుదల చేసిన నివేదిక

(వీటినే 'ఎక్స్'లో వైఎస్ జగన్ ఉటంకించి ఎల్లో మీడియా విష ప్రచారాన్ని ఎండగట్టారు)

సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు

హైకోర్టులో సెమీ క్రిస్మస్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తోపాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ్, సంఘం కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏకీకృత కుటుంబ సర్వే మంగళవారం ప్రారంభమైంది. దీని ద్వారా ప్రజల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సర్వేకు రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారమే ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని కచ్చితమైన గృహ, పౌరస్థాయి వివరాలను నిర్ధారించడానికి ఈ సర్వే చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు సజావుగా అందించవచ్చని తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్‌లోని డిజిటల్ సర్వే అప్లికేషన్‌ను సమాచార సేకరణకు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఈ ప్రక్రియను సమన్వయం చేస్తుందని తెలిపారు. సర్వేయర్లు అన్ని ఇళ్లకు వెళ్లి.. స్వయంగా వివరాలు సేకరించాలని ఆదేశించారు.

● బాబు స్కామ్‌ల రోత.. కేసుల మూత

కేసులు కంచికి!

అటు 'స్కామ్'లు.. ఇటు క్లోజర్‌లోనూ చంద్రబాబు 'స్కిల్'

'స్కిల్' కుంభకోణం కేసు అడ్డగోలుగా మూసివేతకు పన్నాగం

సాక్షి, అమరావతి: బరితెగించి అవినీతికి పాల్పడటంలోనే కాదు.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఆ అవినీతి కేసులను అడ్డగోలుగా మూసివేయడంలోనూ చంద్రబాబు తన 'స్కిల్' ప్రదర్శిస్తున్నారు! నాడు ఆధారాలున్నాయన్న సీఐడీ వాదనతో ఏకీభవించి న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధిస్తే.. నేడు అసలు ఆధారాలే లేవంటూ కోర్టు కళ్లకు గంతలు కట్టేందుకు తెగబడుతున్నారు! 2014 – 19 మధ్య అధికారంలో ఉండగా చంద్రబాబే కుట్రదారు, లబ్ధిదారుగా సాగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసుకు అర్ధంతరంగా తెరదించేందుకు టీడీపీ కూటమి సర్కారు కుతంత్రానికి సిద్ధపడింది. ఇప్పటికే చంద్రబాబుపై ఫైబర్ నెట్, మద్యం కేసులను అడ్డగోలుగా మూసివేసిన ప్రభుత్వం.. తాజాగా స్కిల్ స్కామ్ కేసుకు గురి పెట్టింది. 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'.. పేరిట ఆ కేసును క్లోజ్ చేసేందుకు పక్కాగా పన్నాగం పన్నింది.

తానే దొంగా.. తానే పోలీసూ!!

తాను ప్రధాన నిందితుడిగా ఉన్న అవినీతి కేసులను ఏడాది క్రితం ముఖ్యమంత్రి హోదాలో సమీక్షించినప్పుడే చంద్రబాబు ఈ కుతంత్రానికి తెరతీశారు. ఆ బాధ్యతను తన ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు అప్పగించారు. అప్పటి డీజీపీ ద్వారకా తిరుమలరావు, ప్రస్తుత డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్‌తోపాటు యావత్ పోలీసు, న్యాయ శాఖలను లూథ్రా గుప్పిట్లో పెట్టారు. ఆ కేసుల్లో చార్జ్‌షీట్లను అటకెక్కించారు. న్యాయస్థానాల్లో విచారణకు సహాయ నిరాకరణ చేశారు. చంద్రబాబు సాగించిన మద్యం దోపిడీపై ఫిర్యాదు చేసిన అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఫైబర్‌నెట్ కుంభకోణంపై ఫిర్యాదు చేసిన ఫైబర్ నెట్ కార్పొరేషన్ పూర్వ ఎండీ మధుసూదన్‌రెడ్డి, అసైన్డ్ భూదోపిడీపై న్యాయస్థానంలో సీఆర్‌పీసీ 164 వాంగ్మూలం ఇచ్చిన అప్పటి సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్, ఇలా అందరినీ బెదిరించి లొంగదీసుకున్నారు. దీంతో గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి పూర్తి భిన్నంగా అబద్ధపు వాంగ్మూలాలు ఇచ్చారు. అలా సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి మరీ చంద్రబాబుపై అవినీతి కేసులు అర్ధంతరంగా మూసివేతకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా సాగిస్తున్న కుతంత్రాన్ని క్లైమాక్స్‌కు తెచ్చింది. ఈ పన్నాగానికి పదును పెడుతూ చంద్రబాబు ప్రభుత్వం 'స్కిల్' కుంభకోణం అడ్డగోలుగా మూసివేత కుట్ర కార్యాచరణను వేగవంతం చేసింది.

'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' కానే కాదు... బాబే 'స్కిల్' క్రిమినల్..!

స్కిల్ స్కామ్ కేసు మూసివేతకు ప్రస్తుతం సీఐడీ అధికారులు 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' అనే పేరుతో కట్టుకథ అల్లుతున్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని పొరపాటుగా అభిప్రాయపడ్డాం ...! కానీ అసలు అవినీతే లేదు..! అని సీఐడీ పచ్చ పాట పాడుతోంది. వాస్తవం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. సీమెన్స్ ప్రాజెక్టు పేరిట చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని అప్పట్లోనే సీఐడీ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పూర్తి ఆధారాలతో సహా నిగ్గు తేల్చడం గమనార్హం.



స్కిల్ కుంభకోణంలో ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా తరలించిన తీరు ఇదీ..

రూ.370 కోట్ల నుంచి రూ.3,300 కోట్లకు పెంచేసి..

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర అంశాలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, ప్రాథమిక నివేదిక ప్రకారం ఈ ప్రాజెక్టు విలువ రూ.370 కోట్లు మాత్రమే. అయితే చంద్రబాబు దీన్ని అమాంతం రూ.3,300 కోట్లకు పెంచేసి ఆ మేరకు నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం పది శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్‌టెక్ 90 శాతం నిధులు పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు 2015 జూన్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు వ్యయంగా చెప్పుకున్న రూ.3,300 కోట్లలో 90 శాతం కాదు కదా కనీసం ఒక్క రూపాయి విలువైన ఆర్థిక సహకారంగానీ, వస్తు సహాయాన్ని గానీ అందించలేదు. ఇక అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, ఆర్థిక శాఖ కార్యదర్శి పీవీ రమేశ్, ప్రత్యేక కార్యదర్శి సునీత అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం తన వాటా కింద జీఎస్టీ కలిపి డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేసింది. ఈ కుంభకోణానికి రాచబాట పరుస్తూ మొత్తం 13 నోట్ ఫైళ్లలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకాలు కూడా చేశారు. డిజైన్ టెక్‌కు చెల్లించిన రూ.371 కోట్లలో సాఫ్ట్‌వేర్ కొనుగోలు కోసం రూ.56 కోట్లు చెల్లించారు. మిగతా రూ.315 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి వివిధ దశల్లో అక్రమంగా తరలించారు. ప్రతి దశలోనూ షెల్ కంపెనీల సృష్టికర్తలు, దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు రూ.241 కోట్లు చేర్చారు. 2018లో కేంద్ర జీఎస్టీ అధికారులు పుణెలోని పలు షెల్ కంపెనీల్లో సోదాలు చేసి భారీగా నకిలీ ఇన్వాయిస్‌లను గుర్తించడంతో ఆ కుంభకోణం బయటపడింది. కేంద్ర జీఎస్టీ అధికారులు సమాచారం ఇచ్చినా అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఏసీబీ అధికారులు విచారణ చేయకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. 2019లో పుణెకి చెందిన ఓ సామాజిక కార్యకర్త ఈ కుంభకోణం గురించి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంతో చంద్రబాబు అవినీతి వెలుగులోకి వచ్చింది. సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో ఆ అవినీతి ఆధారాలతో సహా నిగ్గు తేలింది.

సీమెన్స్ కంపెనీ ముసుగులో...

2014లో అధికారంలోకి రాగానే ప్రజాధనాన్ని కొల్లగొట్టడాన్నే చంద్రబాబు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ క్రమంలో జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా, ఆ కంపెనీ పేరుతో ప్రాజెక్టు అంటూ కనికట్టు చేశారు. భారత్‌లో ఆ కంపెనీ ఎండీగా ఉన్న సుమన్ బోస్, డిజైన్‌టెక్ ఎండీ వికాస్ వినాయక్ కన్విల్కర్ సహకారంతో చంద్రబాబు అక్రమాలకు తెర తీశారు. మొదట విద్యా శాఖ ద్వారా సీమెన్స్ కంపెనీ పేరుతో 2014 ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీవో జారీ చేశారు. అడ్డగోలుగా నిధులు కొల్లగొట్టేందుకు కనీసం కేబినెట్ ఆమోదం కూడా లేకుండానే చంద్రబాబు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ)ని ఏర్పాటు చేశారు. అనంతరం ఏపీఎస్ఎస్‌డీసీతో సీమెన్స్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు మభ్యపుచ్చారు.



fixed. The said price list is a general commercial price of the products. There is a separate set of product codes created for academic licenses in order to differentiate them from the standard commercial licenses. For academic purpose, the bundles of software are created which consist of multiple product codes. The eligible academic customers are granted the academic product bundles under the "GO PLM Policy" upon approval of "GO PLM" grant, which entitles the customer to buy the software licenses with a high discount or at concessional price. The Academic price is also negotiated by customers and further discounts are provided. Therefore "In-kind grant" is discounts offered in the form of discounted academic price.

We therefore clarify that SISW was only providing discount and SISW is not aware of any representations otherwise made by the project team on the nature of in-kind grant.

2. With reference to the tripartite agreement 2nd cited, it may be clarified whether it was a work order placed on Siemens and either Siemens or DesignTech provided any grant in aid/grant in kind towards implementation of the tripartite agreement.

Reply:

SISW has not received any work order in relation to the APSSDC Project from APSSDC or from DesignTech.

SISW has supplied the products pursuant to Purchase Orders dated July 2, 2015; July 3, 2015, and September 23, 2015 raised by DesignTech for the APSSDC Project for an aggregate amount of INR 58,98,82,163/- (inclusive of tax) (which is the final highly discounted price of our products). However, SISW is not aware of any grant-in-aid under this project as mentioned under the response to question 1.

3. Provide the present status of Sri Soumyadri Shekhar Bose @ Suman Bose with respect to Siemens. Whether he is authorized on behalf of Siemens to commit to provide the grant in aid of 90% project cost of Siemens project.

Reply: Mr. Suman Bose resigned from the Company on March 27, 2018 and is no longer a part of the organization and we are not aware of his present status. From media reports we understand that Mr. Bose, DesignTech officers, APSSDC officials and certain others are being interrogated by CID office for their alleged involvement in misuse of funds by DesignTech in the Project.

As stated above, in-kind grant is a discount offered on the academic price of products supplied by SISW. Therefore, in kind grant cannot be calculated on the project cost as stated by you. To avail in-kind grant eligible institutions make an application for it. The same is processed in accordance with the Global In-kind grant policy. Mr. Bose was not authorized to unilaterally

Siemens Industry Software (India) Private Limited — Tower D, 16th Floor, Global Business Park,
Regd. Office: E-20, 1st & 2nd Floor, Hauz Khas, New Delhi -110016 — Gurgaon 122002, Haryana, India

approve, reject and/or provide in kind grant and / or commit that SISW will do so contrary to the policy of SISW. We did not find any records where Mr. Bose was authorized to commit on providing in-kind grant on the 90% of the total project cost.

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్ట్‌తో తమకు ఏమాత్రం సంబంధం లేదని పేర్కొంటూ సిట్‌కు సీమెన్స్ కంపెనీ పంపిన ఈ-మెయిల్

అవినీతిని నిర్ధారించిన కాగ్..

రూ.355 కోట్ల మేర ఖజానాకు గండి

రాజ్యాంగబద్ధ సంస్థ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) సైతం చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని నిర్ధారించింది. ఆ ప్రాజెక్టులో రూ.355 కోట్ల మేర ఖజానాకు గండి పడిందని నిగ్గు తేల్చింది.

కాగితాలపై ప్రాజెక్టు చూపించి...

జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని చంద్రబాబు కొల్లగొట్టారు. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి, సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందంటూ బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా హైదరాబాద్‌లోని చంద్రబాబు ప్యాలస్‌కు తరలించారు. ఈ అవినీతి నెట్‌వర్క్‌ను సీఐడీ పక్కా ఆధారాలతో ఛేదించింది. ఈ కేసులో చంద్రబాబును ఏ–1గా పేర్కొంటూ చార్జ్‌షీట్ కూడా నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఏ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1) (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేసి 2023 సెప్టెంబరు 9న చంద్రబాబును అరెస్టు చేసింది. సీఐడీ అధికారుల రిమాండ్ నివేదికతో ఏకీభవించిన ఏసీబీ న్యాయస్థానం చంద్రబాబుకు రిమాండ్ విధించింది. దీంతో ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం ఆరోగ్య సమస్యలు సాకుగా చూపడంతో హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అంతేగానీ చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని చెప్పలేదు.

'స్కిల్' స్కామ్ కేసు మూసివేతకు పక్కా పన్నాగం..

'స్కిల్' స్కామ్ మూసివేత కుతంత్రానికి టీడీపీ కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందుకోసం టీడీపీ ప్రధాన కార్యాలయం స్క్రిప్ట్‌ను సీఐడీ వల్లె వేస్తోంది. ఆ కేసులో ఆధారాలు లేవని.. 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా ముద్రవేసింది. 'ఆ కేసును ఇక క్లోజ్ చేయాలని భావిస్తున్నాం.. మీ అభిప్రాయాన్ని వారం రోజుల్లో చెప్పండి..' అంటూ అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ కార్పొరేషన్ ఎండీ బంగార్రాజుకు సీఐడీ నోటీసులు జారీ చేయడం గమనార్హం. అంటే అప్పటికే బంగార్రాజును తమదైన శైలిలో బెదిరించి దారికి తెచ్చుకున్నట్లు స్పష్టమైంది. సీఐడీ నోటీసులు ఇవ్వడమే తరువాయి.. ఆ కేసు మూసివేతకు తనకు అభ్యంతరం లేదని ఆయన లిఖితపూర్వకంగా జవాబు ఇస్తారన్నది సుస్పష్టం. మరి ఇదంతా టీడీపీ పెద్దల స్క్రిప్టే కదా!!



GOVERNMENT OF ANDHRA PRADESH
CRIME INVESTIGATION DEPARTMENT

Form-70 — Chapter-28 — Order.No 481-1 of APPM

Notice to the complainant
(u/s 173 (ii) of Cr.P.C)

To
Sri Nallaparaju Bangara Raju, the then Managing Director, APSSDC, Tadepalli, Guntur District.

Please take notice that the complaint under section 120-B, 166, 167, 418, 420, 465, 468, 471, 406, 409, 201, 109 r/w 34,37 IPC and Sec.13(2), r/w 13(1)(c)(d) of Prevention of Corruption Act, 1988 in Cr.No.29/2021 of CID PS, AP, Mangalagiri has been reported to the Hon'ble Court of Special Judge for SPE & ACB Cases -cum- III Addl Sessions Judge, Vijayawada duly charged/ (1)False, (2)Non-cognizable, (3)Mistake of fact or law (4)Civil, (5)Undetectable (cases in which investigation are refused at any stage come under this head) and that if you want to oppose this report you will have to do so before the above Hon'ble Court within a week from the date of receipt of this notice.

Station: Tadepalli
Date: 19.12.2025

Signature of the Police Officer
Dy. Supdt. of Police
EOW-II, C.I.D., A.P., Mangalagiri

స్కిల్ స్కాం కేసును మూసివేస్తామని అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ బంగార్రాజుకు ప్రస్తుతం సీఐడీ పంపిన నోటీసులు

ఫిర్యాదుదారు బంగార్రాజు కాదు... చైర్మన్ అజయ్ రెడ్డి

చంద్రబాబు అవినీతి కేసును అడ్డగోలుగా మూసివేయాలన్న ఆత్రుతలో సీఐడీ అసలు వాస్తవాలను విస్మరిస్తోంది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ ప్రాజెక్టు ముసుగులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని ఆనాడు ఫిర్యాదు చేసింది ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ బంగార్రాజు కాదు. అప్పుడు చైర్మన్‌గా ఉన్న కె.అజయ్‌రెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. మరి ఆ కేసును మూసివేయాలని ప్రస్తుతం సీఐడీ భావిస్తే... అందుకు నోటీసులు జారీ చేయాల్సింది కూడా ఆయనకే కదా!! సీఐడీ అధికారులు అందుకు విరుద్ధంగా అప్పటి ఎండీ బంగార్రాజుకు నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఎందుకంటే ఆయన్ను బెదిరించి... బెంబేలెత్తించి ఇప్పటికే తమ దారికి తెచ్చుకున్నారు. అందుకే ఆయనకు నోటీసులు ఇవ్వడం.. ఆయన సమ్మతించడం.. అంతా పక్కా పన్నాగంతో కేసు క్లోజర్ కథ నడిపించాలన్నది ప్రభుత్వ పెద్దల కుట్ర.



FIRST INFORMATION REPORT
(Under Section 154 Cr. P.C)

1. Dist: GUNTUR — P.S: CID PS, A.P., AMARAVATHI, MANGALAGIRI — Year: 2021 — FIR No: 29/2021 — Date: 09.12.2021
2. Acts: IPC — Sections: U/S 166, 167, 418, 420, 465, 468, 471, 409, 201, 109, r/w 120(B) IPC and Sec 13(2) r/w 13(1)(c) and (d) of Prevention of Corruption Act 1988.
3. (a) General Diary Reference: Entry No: Nil – Nil. Time: 12.00 hrs
(b) Occurrence of Offence: Prior to 09.12.2021
(c) Information received at the Police Station: 09.12.2021 at 12.00 hrs — G.D. Page No.49
4. Type of information: English typed report
5. Place of Occurrence: 2nd floor, Infosight Building, O/o the APSSDC, Tadepalli, Guntur Dist.
(a) Direction and Distance from P.S: 5 Km towards North
(b) Address: NIL — Beat No: NIL
(c) In case outside limit of this Police Station: NIL — District: NIL
6. Complainant/Informant: Sri K. Ajay Reddy, Chairman, APSSDC, A.P., Tadepalli, Guntur Dist, A.P.
(a) Father's Name: Mum Reddy
(b) Date, Year of Birth / Age: 59 Years
(c) Nationality: Indian
7. Details of known /suspected / unknown /accused with full particulars.

Scanned with CamScanner

చంద్రబాబు స్కిల్ స్కాంపై ఫిర్యాదు చేసింది అప్పటి ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్ రెడ్డి అని పేర్కొన్న కాపీ

అవినీతి సొమ్ము.. టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకే!

స్కిల్ స్కామ్ ద్వారా కొల్లగొట్టిన నిధులను టీడీపీకి చెందిన బ్యాంకు ఖాతాల ద్వారానే బదిలీ చేసినట్లు కూడా ఆనాడు సీఐడీ నిగ్గు తేల్చింది. పెద్ద నోట్ల రద్దు సమయంలో టీడీపీ ప్రధాన కార్యాలయం తమ బ్యాంకు ఖాతాల్లో భారీస్థాయిలో నోట్లను మార్పిడి చేయడం గమనార్హం. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచీలలో టీడీపీకి బ్యాంకు ఖాతాలున్నాయి. ఆ బ్యాంకు ఖాతాలను సీఐడీ అధికారులు విశ్లేషించడంతో అసలు విషయం బయటపడింది. 2016–18లో ఆ ఖాతాల్లో ఏకంగా రూ.77.37 కోట్ల విలువైన రద్దు అయిన పెద్ద నోట్లను డిపాజిట్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం పెద్ద నోట్లను డిపాజిట్ చేయాలంటే కేవైసీ నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీల ఎన్నికల బాండ్లకు సంబంధించి అయితే రూ.20 వేలకు మించిన డిపాజిట్లపై కేవైసీ నిబంధలను పాటించడం తప్పనిసరి. డిపాజిట్ చేసినవారి పేరు, పాన్ నంబరు, ఫోన్ నంబరు, ఐడీ ప్రూఫ్ మొదలైన వివరాలు తప్పనిసరిగా సమర్పించాలి. కానీ టీడీపీకి చెందిన బ్యాంకు ఖాతాల్లో ఏకంగా రూ.77.37 కోట్ల విలువైన రద్దు అయిన పెద్ద నోట్లను డిపాజిట్ చేసినా సరే... కేవైసీ నిబంధనలను పాటించలేదు. అసలు ఎవరు ఆ నోట్లను ఇచ్చారో ఆ వివరాలు ఏవీ బ్యాంకులకు సమర్పించనేలేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం స్కిల్ స్కామ్‌కు పాల్పడటం గమనార్హం. అంటే స్కిల్ స్కామ్ ద్వారా కొల్లగొట్టిన నల్లధనాన్ని పెద్ద నోట్ల రద్దు సమయంలో బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు స్పష్టమవుతోంది. సీఐడీ ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు కూడా నివేదించింది. అయినా సరే ఆధారాల్లేవు..! మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్..! అంటూ ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో సీఐడీ వితండవాదం చేస్తుండటం విస్మయపరుస్తోంది.

Abstract of Year-wise cash deposits into the accounts of TDP (from 01-06-2014 to 31-12-2018)

S. No.	Bank A/c, Branch	Year wise Cash deposits - (In Rs.)					Grand total (in Rs)
		2014	2015	2016	2017	2018	
1	18090200001238, BOB, Jubli hills	13289081/-	6050616/-	9251000/-	11058736/-	10124770/-	4,97,74,203/-
2	110511011000822, UBI, Jubilhills,	6513501/-	15088510/-	282789012/-	29152288/-	31690885/-	38,47,34,196/-
3	18090400000018, BOB, Jubli hills	38183030/-	75480400/-	55180522/-	56701900/-	31715770/-	33,66,57,292/-
4	18090200001259, BOB, Jubli Hill	12499500/-	10129000/-	0	0	0	2,26,28,500/-
	Total	69985112	106748526	347220534	97002924	123531425	77,37,94,191/-

25(k): The examination of the Auditor Sri J.Venkateswarlu of TDP is very much necessary to ascertain the details of the donors and how the cash deposits Rs.77.37 crores have been deposited into the account of TDP to which the petitioner/A.37 is the authorized signatory. The abnormal spike in the deposits of cash was seen in 2016-2017, soon after the monies were transferred from APSSDC to M/s Designtech. For verifying the details of the donor, pay-in-slips for the above cash deposits are being collected by sending letters to Zonal Manager, UBI, Secunderabad and Branch Manager, Jubilee Hills, Bank of Baroda, Hyderabad. In this connection, the pay in slips for 11,862 cash deposits in UBI Bank account are yet to be collected for verification. Meanwhile, 41 pay-in-slips have been collected from Bank of Baroda, Jubilee Hills, Hyderabad and it was found that in most of the cases, there were no details of the depositors. The details are shown in the table given below (Annexure-R.14)

కేవైసీ నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ బ్యాంకు ఖాతాల్లో భారీగా పెద్ద నోట్లను జమ చేశారని న్యాయస్థానానికి సీఐడీ సమర్పించిన నివేదిక

హజ్ కార్యాలయం ఎదుట ముస్లింల ధర్నా

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రభుత్వం ప్రకటించిన రాయితీని వెంటనే చెల్లించాలని కోరుతూ 2024లో హజ్ వెళ్లిన యాత్రికులు మంగళవారం విజయవాడ లబ్బీపేటలోని హజ్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. గన్నవరం విమానాశ్రయం నుంచి 2024లో దాదాపు 720 మంది హజ్ యాత్రకు వెళ్లారని, వారికి ప్రభుత్వం ప్రకటించిన రాయితీ నేటి వరకూ చెల్లించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హజ్ యాత్రికుల–2024 సంఘం కన్వీనర్ అలీ మాట్లాడుతూ.. 2024లో గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లినప్పుడు అదనంగా రూ.68 వేలు హాజీలకు భారంగా మారిందని ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా 720 మందికి సబ్సిడీ నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేశారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు ఎన్నికల సమయంలో హాజీలకు సబ్సిడీ నిమిత్తం రూ.లక్ష ఇస్తానని చెప్పిన మాటను పక్కనబెట్టారని విమర్శించారు. వైఎస్ జగన్ మంజూరు చేసిన రాయితీ నిధులను ఇప్పటికీ విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌ను కలిసినా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్తార్ అలీ, నెల్లూరు, కడప, గుంటూరు, రాయచోటి, హైదరాబాద్, తిరుపతి కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల హాజీలు పాల్గొన్నారు.

ఏపీ మంత్రి లోకేశ్‌కు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చాలెంజ్

తిరుమల మెట్ల మార్గంలో నడిచి పరిశీలించాలని సూచన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చాలెంజ్ విసిరారు. ఏడుకొండలు మెట్లమార్గంలో ఎక్కి పరిశీలించాలని, ఇక్కడ నిర్వహణ ఎలా ఉందో పరిస్థితి తెలుసుకోవాలని ఎక్స్ వేదికగా సూచించారు. వంశీకృష్ణ తన తాత గడ్డం వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా కుటుంబంతో కలిసి మెట్ల మార్గంలో దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో భక్తులు పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మెట్ల మార్గంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మరుగుదొడ్ల నిర్మాణ సమయంలో వచ్చే వ్యర్థాలు, ఇతరత్రా అక్కడే పడేస్తున్నారని తెలిపారు. మార్గమధ్యంలో ఉన్న స్టీల్ చువ్వలు కాలికి గుచ్చుకునే ప్రమాదం ఉందని, దారి పొడవున ఎక్కడా ప్రథమ చికిత్స కేంద్రాలు లేవని పేర్కొన్నారు. మోకాలి పర్వతం మెట్ల వద్ద భక్తులు రోడ్డు దాటడం కోసం వాహనాలను తప్పించుకుని వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఏడు కొండలు ఎక్కేటప్పుడు ఇలాంటి పరిస్థితి చూసి చాలా బాధ కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా టీటీడీ చైర్మన్, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌కు ఫొటోలు, సమస్యను ట్యాగ్ చేశారు.

కర్రెగుట్టల్లో మావోయిస్టుల భారీ డంప్

చర్ల: ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మంగళవారం మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను భద్రతా బలగాలు గుర్తించాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి కర్రెగుట్టల్లో బలగాలు తనిఖీ చేస్తుండగా కర్రెగుట్ట శివారు డోలిగుట్టపై మావోయిస్టులకు చెందిన డంప్ బయటపడింది. ఈ మేరకు రెండు శక్తివంతమైన ప్రెజర్‌బాంబులను నిర్వీర్యం చేయడమే కాక బీజీజీఎల్ లాంచర్లు, లాంచర్ల తయారీకి అవసరమైన భాగాలు, ఇతర మందుగుండు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

22 మంది మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కేర్లపాల్, డోర్నపాల్ ఏరియా కమిటీ సభ్యులు 22 మంది మావోయిస్టులు మల్కాజిగిరిలో మంగళవారం లొంగిపోయారని ఒడిశా డీజీపీ యోగేశ్ బహదూర్ కురాణియా తెలిపారు. వారిలో డీవీసీఎం కమాండర్ లింగే అలియాస్ మడకం బూయే, ఏరియా కమిటీ కమాండర్లు బామన్ మడకం, సుక్కా ముచ్కి, కోసా కవసీ, జోగి ముచికి, భట్టి మడకం అలియాస్ అంజు మరో కమాండర్‌తో పాటు 15 మంది వివిధ కేడర్ల వారు ఉన్నారని వెల్లడించారు.

అక్కచెల్లెమ్మల సమస్యలు ఓపికగా వింటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌టీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్

రాబోయే రోజులు మనవే

టీడీపీ అరాచకాల బాధితులకు వైఎస్ జగన్ భరోసా

- పులివెందులలో కార్యకర్తలు, ప్రజలతో మమేకం
- యోగక్షేమాలు విచారిస్తూ.. అందరి కష్టాలు వింటూ..
- బాధితులకు నేనున్నానంటూ ఊరడింపు
- జగన్‌ను కలిసేందుకు భారీగా తరలివచ్చిన జనం

సాక్షి కడప ప్రతినిధి/పులివెందుల: రాబోయే రోజులు మనవేనని, ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను కలిసి సమస్యలు చెప్పుకున్న వారికి భరోసా ఇచ్చారు. టీడీపీ నేతల అరాచకాలతో ఇబ్బందులు పడిన వారి కష్టం విని.. నేనున్నానని ధైర్యం చెప్పి ఊరడించారు. మంగళవారం ఆయన తన సొంత నియోజకవర్గం కార్యకర్తలు, ప్రజలతో మమేకమయ్యారు. సాయంత్రం పులివెందులకు చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులతో పాటు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అందరినీ పేరుపేరున పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ కష్టాలను జగన్‌తో వెళ్లబోసుకున్నారు. వారి కష్టాన్ని ఓపికతో విని.. నేనున్నానని, రాబోయే రోజులు మనవేనంటూ ధైర్యం చెప్పారు. సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల కష్టాలు వింటూ సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. వైఎస్ జగన్ పులివెందులకు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న పార్టీ అభిమానులు, క్యాడర్‌తో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలి రావడంతో క్యాంపు కార్యాలయ ప్రాంగణం నిండిపోయింది. జగన్ అక్కడకు రాగానే జై జగన్ నినాదాలతో కార్యాలయం ప్రాంగణం హోరెత్తింది.



క్యాంపు కార్యాలయం వద్ద అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

వైఎస్సార్‌టీఎఫ్ నూతన డైరీ, క్యాలెండర్లను వైఎస్ జగన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీచర్లను ప్రభుత్వం వేధిస్తున్న తీరును వైఎస్సార్‌టీఎఫ్ నేతలు వివరించారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ గుదిబండగా మారిందని జగన్ దృష్టికి తెచ్చారు. తద్వారా రాష్ట్రంలోని 1.30 లక్షల మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టీచర్ల సమస్యలను సావధానంగా విన్న వైఎస్ జగన్.. మన ప్రభుత్వంలో టీచర్లకు అన్ని విధాలుగా మేలు చేశామని, ఈ ప్రభుత్వం నాలుగు డీఏలు పెండింగ్ పెట్టిందని, ఇప్పటి వరకు పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించలేదని, పీఆర్‌సీ కూడా ప్రకటించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులందరికీ మేలు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తదితరులు వైఎస్ జగన్‌ను కలిశారు.

డిప్యూటీ సీఎం 'పీకుడు భాష' అభ్యంతరకరం

పవన్‌కళ్యాణ్ కాగితం పులి మాటలు కట్టిపెట్టాలి

- గోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా పేకాట క్లబ్బులు
- సీపోర్టుల ద్వారా లక్షల టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా
- 18 నెలల్లో రూ.2.66 లక్షల కోట్లకు పైగా అప్పులు
- కూటమి పాలనపై బొత్స సత్యనారాయణ ఫైర్

సాక్షి, విశాఖపట్నం: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పీకుడు భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉందని.. ఆయన కాగితం పులి మాటలు కట్టిపెట్టాలని వైఎస్సార్‌సీపీ ముఖ్యనేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. మంగళవారం విశాఖలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'రాజకీయాల్లో ఉన్నతమైన పదవిలో ఉన్న మీరు మొదట మీ భాష మార్చుకోండి. మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలి. మీ సొంత లాభం కోసం ప్రజారోగ్యాన్ని పాడుచేస్తే చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది. అధికారంలో ఉన్నప్పుడు మీరేం పీకారంటూ.. ఈ పీకుడు భాషేంటి?. ఈ డైలాగులు సినిమాల్లోనే పనికొస్తాయి తప్ప రాజకీయాల్లోను, ప్రజా జీవితంలోను పనికిరావు' అని పవన్‌కు హితవు పలికారు.

ఈ అక్రమాలపై చర్యలేవి

గోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నా, సీపోర్టుల ద్వారా లక్షల టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని చంద్రబాబు ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. పేదల ఉపాధికి గండం కలిగేలా ఉపాధి హామీ చట్టాన్ని మార్చుచేస్తే చంద్రబాబు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు.

చంద్రబాబు పాలనలో ప్రతి స్థాయిలోనూ అవినీతి రాజ్యమేలుతోందని, యూరియా కొరతపై డిప్యూటీ సీఎం పవన్ కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు. పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్య అందించాలన్నదే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని.. అందులో భాగంగానే మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలన్నదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ రద్దు చేయడంతో పాటు కుంభకోణాలకు పాల్పడ్డ వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు.

భూ కేటాయింపులపై న్యాయపోరాటం

చంద్రబాబు ప్రభుత్వం భూ కేటాయింపులపై తాము న్యాయ పోరాటం చేస్తున్నామని బొత్స చెప్పారు. రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎకరా రూ.కోటికే ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. లులు, సత్వా కంపెనీలకు కారుచౌకగా, ఓపెన్ ఆక్షన్ లేకుండా నేరుగా భూములు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. గతంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై చంద్రబాబు అండ్ కో నానా రాద్ధాంతం చేసిందని, ఇప్పుడు అంతకంటే ఎక్కువ ధరకు విద్యుత్ కొంటున్న ప్రభుత్వాన్ని ఏమనాలని ప్రశ్నించారు. జీవీఎంసీ మేయర్ మార్పు విషయంలో రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని చాలెంజ్ చేస్తామన్నారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేకే రాజు, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ముమ్మాటికీ అసమర్థ ప్రభుత్వమే

ప్రతిరోజూ పత్రికల్లో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలతో పాటు సంక్షేమ హాస్టళ్లలోనూ కొరవడిన తాగునీరు, పౌష్టికాహార వార్తలే దర్శనమిస్తున్నాయని.. చంద్రబాబు ప్రభుత్వ అసమర్థపాలనకు ఇదే నిదర్శనమని బొత్స పేర్కొన్నారు. 18 నెలల్లో రూ.2.66 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసినా.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు కూడా చెల్లించలేని అసమర్థ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు–నేడు లాంటి అద్భుతమైన కార్యక్రమాలను అటకెక్కించి స్కూళ్లలో కనీసం తాగునీరు సరఫరా చేయలేని ఈ అసమర్థ ప్రభుత్వం ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తామని చెబుతోందన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో సంక్రాంతి నాటికి గోతులు పూడ్చాలని చంద్రబాబు చెప్పారని, మళ్లీ ఈ సంక్రాంతికి అదే మాట చెబుతున్నారని.. గోతులు పూడ్చేది ఏ సంక్రాంతి నాటికో మాత్రం ఆయన చెప్పరని ఎద్దేవా చేశారు.

క్వాంటం రంగంలో ఏపీది లీడ్ రోల్

- 'క్వాంటం టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- రెండేళ్లలో అమరావతి నుంచే క్వాంటం పరికరాల ఉత్పత్తి
- క్వాంటం విజన్‌ను, విప్లవాన్ని అందిపుచ్చుకోండి
- క్వాంటం టెక్నాలజీతో మన పరిశోధనలు నోబెల్ స్థాయికి చేరాలి
- ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే రూ.వంద కోట్లు ఇస్తాం

సాక్షి, అమరావతి: వచ్చే రెండేళ్లలో క్వాంటం నిపుణులు, క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం పరికరాలను ఏపీ నుంచే ఉత్పత్తి చేసి, ప్రపంచానికి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భారతదేశంలో క్వాంటం టెక్నాలజీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. క్వాంటం సహా దాని అనుబంధ రంగాల్లో నిపుణులను తయారు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. ఏపీ ప్రభుత్వం, వైసర్, క్యూబిట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న క్వాంటం ప్రోగ్రామ్ శిక్షణలో భాగంగా వేలాది మంది టెక్ విద్యార్థులతో మంగళవారం 'క్వాంటం టాక్ బై సీబీఎన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్వాంటం మెకానిక్స్, అల్గారిథమ్స్ లాంటి అంశాల్లో 10 లక్షల మంది నిపుణులను.. క్వాంటం సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రంగాల్లో 3 లక్షల మందిని, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్‌లో లక్ష మంది నిపుణుల్ని తయారు చేస్తామని చెప్పారు. 'ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే వంద కోట్లు ఇస్తామని గతంలో ప్రకటించాం. క్వాంటం టెక్నాలజీ ద్వారా దీనిని ఎవరైనా అందిపుచ్చుకుంటే వారికి రూ.వంద కోట్లు ఇచ్చేందుకు సిద్ధం. అమెరికాకు సిలికాన్ వ్యాలీ లాగా భారత్ క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం' అని చెప్పారు.



పాఠశాల స్థాయి నుంచే క్వాంటంపై అవగాహన

ఏపీలోని యువతకు నూతన నైపుణ్యాల కోసం త్వరలో క్వాంటం టెక్నాలజీ కోర్సులను అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులు చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పిస్తామని,, ఇందుకోసం దశల వారీగా కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో డిజిటల్ పద్ధతుల ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలపై ఆయన సమీక్షించారు. 2026 జనవరిలో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు.

యూరియా అక్రమ తరలింపునకు ▸ టీడీపీ నేతల పన్నాగం

- అడ్డుకుని రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాతల ఆందోళన
- యూరియా తరలింపులో టీడీపీ నేతల మధ్య తలెత్తిన విభేదాలు
- దీంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న వైనం
- ఈ దృశ్యాలను వీడియో తీశారనే నెపంతో ఓ వ్యక్తిపై దాడి.. తీవ్రగాయాలు



గాయపడిన హరినాథ్‌రెడ్డి

యూరియా కోసం ఘర్షణ పడుతున్న రైతులు

మాచర్ల రూరల్: యూరియా అక్రమ తరలింపును రైతులు అడ్డుకున్న ఘటన పల్నాడు జిల్లా జమ్మలమడక గ్రామంలో సోమవారం జరిగింది. రైతులకు అందాల్సిన యూరియా బస్తాలను అక్రమంగా తరలించేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్న విషయాన్ని స్థానిక రైతులు తెలుసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకొని తమకు రావాల్సిన ఎరువులను తరలిస్తే ఊరుకునేది లేదంటూ రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. ఆ సమయంలోనే వ్యవసాయ శాఖాధికారులు, పోలీసుల సమక్షంలో గ్రామ టీడీపీ నేతలు దుర్గెంపూడి అంజిరెడ్డి, గంటా నాగిరెడ్డిలు ఒకరిపై ఒకరు దూషించుకుంటూ ఘర్షణకు దిగారు. పోలీసులు ఇరువురికి సర్దిచెప్పారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారుల సమక్షంలో అందరికీ పాసు పుస్తకం ద్వారా యూరియా పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన ముగించారు. ఈ దృశ్యాలను అదే గ్రామానికి చెందిన గాదె హరినాథ్‌రెడ్డి, దుర్గెంపూడి గోపాలరెడ్డి వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఆ ఇద్దరి ఇళ్లపై టీడీపీ నేతలు మంగళవారం దాడి చేశారు. తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి హరినాథ్‌రెడ్డిని తీవ్రంగా గాయపరిచారు. దుర్గెంపూడి గోపాలరెడ్డి ఇంట్లో లేకపోవడంతో దాడి నుంచి బయటపడ్డాడు. గాయపడిన హరినాథ్‌రెడ్డిని స్థానికులు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- వైఎస్సార్‌సీపీ నేతలు
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: పొరుగువారిని ప్రేమించడం, సహాయం చేయడం, కరుణ, దయ, క్షమ గుణాలను కలిగి ఉండాలన్న ఏసుక్రీస్తు బోధనలు అందరూ అనుసరించాలని వక్తలు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం మాజీ మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, మాజీ ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, లేళ్ళ అప్పిరెడ్డితోపాటు కొమ్మూరి కనకారావు తదితరులు కేక్ కట్ చేశారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పట్ల అపారమైన ప్రేమ కలిగి ఉన్నారని చెప్పారు. అందువల్లే ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే రాష్ట్రంలో ఆర్థిక వనరులు సహకరించపోయినా, కరోనా వంటి పెనువిపత్తు వచ్చినా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించారని చెప్పారు. నందిగం సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు 18 నెలల అధ్వాన పాలన చూసిన తర్వాత రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఇవాళ వైఎస్ జగన్ ఉంటే బాగుండేదని చర్చించుకుంటోందని తెలిపారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననానికి విశేష ప్రాముఖ్యత ఉందన్నారు. మానవసేవ చేయడమే దేవునికి సేవ చేయడంగా భావించి క్రైస్తవ మిషనరీలు మన దేశంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాయని వివరించారు. మొండితోక అరుణ్‌కుమార్, అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవిస్తూ కలిసిమెలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.నారాయణమూర్తి, నత్తా యోనారాజు, పాసుగంటి చైతన్య, ఎ.రవిచంద్ర, బూదాల శ్రీను, ముదిగొండ ప్రకాశ్, దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎం.మనోహర్‌రెడ్డి, మల్లవరపు సంధ్యారాణి, కాలే పుల్లారావు, బేతంపూడి రాజేంద్ర, నూతక్కి జోషి, పాస్టర్లు షారోన్, ఎబినేజర్, అబ్రహం, జె.యేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అపచారం

ఏపీ భవన్‌లోని టీటీడీ ఆలయంలో బీర్ బాటిళ్ల కలకలం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామికి అపచారం జరిగింది. ఢిల్లీ నడిబొడ్డున ఉన్న ఏపీ భవన్‌లో కొలువైన శ్రీవారి సన్నిధిలో మద్యం సీసాలు లభించడం కలకలం రేపింది. రాత్రివేళ మందుబాబులు బీర్లు తాగి సీసాలను శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాలకు పది అడుగుల దూరంలోనే పడేశారు. విషయం మీడియా దృష్టికి రావడంతో ఆగమేఘాల మీద భవన్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మూడు ఖాళీ బీర్ బాటిళ్లు, ఒక కూల్‌డ్రింక్ బాటిల్, తిని పడేసిన ఆహార పదార్థాల ప్లేట్లు అక్కడి నుంచి తొలగించారు. దీనిపై సిబ్బందిని ఆరా తీయగా.. రాత్రి వేళలో ఇక్కడి పరిసరాల్లో నిద్రిస్తున్న క్యాంటీన్ సిబ్బంది తాగి పడేసి ఉంటారని ఏపీ భవన్ సిబ్బంది తెలిపారు. ఈ ఘటన స్వామివారి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. పవిత్రమైన ఆలయంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ భవన్‌లో వేంకటేశ్వ స్వామి వారితోపాటు దుర్గా మల్లేశ్వరి అమ్మవారు కూడా కొలువై ఉన్నారు. ఆలయం నిర్వహణ, ఆలనా పాలన బాధ్యతలు టీటీడీతోపాటు ఏపీ భవన్ అధికారులు చూస్తారు. కానీ.. ఈ ఆలయంపై ఏపీ భవన్ అధికారులకు చిత్తశుద్ధి లోపించిందనే ఆరోపణలున్నాయి. బీరు సీసాలు పడేసిన వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నా కిడ్నీలు అమ్ముకునేందుకు అనుమతివ్వండి!

నడవలేని తల్లిదండ్రులతో అన్వర్‌బాషా

''కలెక్టర్ మేడం.. మా నాన్న మహబూబ్‌బాషాకి బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి. పింఛన్ మంజూరు కోసం సదరం క్యాంప్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. మా అమ్మ హమిదాబీకి ఏడాది నుంచి టీబీ సోకడంతో రెండు కాళ్లు పనిచేయక మంచం పట్టింది. నాకు గతంలో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి రాడ్లు వేశారు. పాలిష్ కటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇక నాకు ఓపిక లేదు మేడం.. నా కిడ్నీలు అమ్ముకుని మా అమ్మనాన్నలను పోషించుకోవాలనుకుంటున్నా.. అనుమతివ్వండి'' అంటూ నంద్యాల జిల్లా దొర్నిపాడుకు చెందిన అన్వర్‌బాషా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కన్నీటి పర్యంతమయ్యాడు. ఇద్దరిలో ఎవరో ఒకరికి పింఛన్ మంజూరు చేయాలని వేడుకున్నాడు. ఎంపీడీఓ సావిత్రి అతని నుంచి అర్జీ స్వీకరించారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పింఛన్ మంజూరుకు కృషి చేస్తామన్నారు. – దొర్నిపాడు

చంద్రబాబుకు పొలిటికల్ టూల్ పవన్ కళ్యాణ్

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోతిన మహేష్

సాక్షి,అమరావతి: చంద్రబాబుకు రాజకీయంగా ఇబ్బంది వచ్చినప్పుడు పనిచేసే పొలిటికల్ టూల్ లా పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని, బాబు దగ్గర మేత తిని వైఎస్సార్‌సీపీపై నోటికొచ్చిన కూతలు కూస్తున్నారని వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్ర ప్రజలందరికీ చేరిందని, దాన్నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే పవన్ కళ్యాణ్ సమయం, సందర్భం లేకుండా మధ్యలో వచ్చి వైఎస్సార్‌సీపీ నాయకుల గురించి నోటికొచ్చినట్టి మాట్లాడి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఎప్పుడు ఏం మాట్లాడతాడో ఆయనకే స్పష్టత ఉండదని, సినిమా భాషలో ఆయన మైండ్ సెట్ గురించి చెప్పాలంటే ఓపెనింగ్‌లో ఓవరాక్షన్, ఇంటర్వెల్‌లో ఇరిటేషన్, క్లైమాక్స్‌లో కన్ఫ్యూజన్ అన్నట్టుగా ఉందని చెప్పారు. సింగపూర్‌లో అమలు చేసే కేనింగ్ పనిష్మెంట్‌ను విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్న జనసేన ఎమ్మెల్యేల దగ్గర నుంచే మొదలుపెట్టాలని పోతిన సూచించారు. అధికారంలో ఉన్న ఈ 18 నెలల కాలంలో ప్రజల కోసం తాను చేసిన ఒక్క మంచి పని ఉన్నా చూపించాలని పవన్ కళ్యాణ్‌కి పోతిన సవాల్ విసిరారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నా, 18 లక్షల మంది జాబ్ కార్డులు తీసేసినా నోరు మెదపని పవన్ కళ్యాణ్ ప్రజల బాగోగులు అంటూ డ్రామాలాడుతున్నారని, ముందుగా తన శాఖలో ఏం జరుగుతోందో తెలుసుకోవాలని పోతిన మహేష్ హితవు పలికారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు చంద్రబాబు ఎన్నికలకు ముందే కుతంత్రం పన్నారని, అధికారంలో వస్తే మెడికల్ కాలేజీలు కట్టబెట్టేలా ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు.

ఒక క్షణం రోజునే మార్చగలదు.
ఒక రోజు జీవితాన్నే మార్చగలదు.
ఒక జీవితం ప్రపంచాన్నే మార్చగలదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 24 డిసెంబర్ 2025

న్యూజిలాండ్‌తో ఎఫ్‌టీఏ

ఇది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ) యుగం. మన దేశం ఈ ఏడాది ఇంతవరకూ బ్రిటన్, ఒమన్ దేశాలతో ఎఫ్‌టీఏలపై సంతకం చేసింది. తాజాగా న్యూజిలాండ్‌తో ఎఫ్‌టీఏపై అవగాహన కుదిరింది. మరో మూడు నెలల్లో సంతకాలు కాబోతున్నాయి. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక వాణిజ్య, వాణిజ్యేతర కారణాలతో మన దేశంపై ఎడాపెడా సుంకాలు విధించి తన షరతులకు తలొగ్గటమో, ఆర్థికంగా నష్టపోవటమో తేల్చుకోమని సవాలు విసురుతున్నారు. ఆ నష్టాలను వీలైనంత తగ్గించుకోవటానికి ప్రత్యామ్నాయాలు వెదుక్కునే క్రమంలోనే మన దేశం వివిధ దేశాలతో ఎఫ్‌టీఏలు కుదుర్చుకొనేందుకు ప్రయత్నిస్తోంది. సరుకులు, సేవల్లో ఇరు దేశాల మధ్యా 130 కోట్ల డాలర్ల విలువైన వర్తమాన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రాగల అయిదేళ్లలో 500 కోట్ల డాలర్లకు తీసుకెళ్లటం, వచ్చే పదిహేనేళ్లలో భిన్న రంగాల్లో న్యూజిలాండ్ 2,000 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టడం భారత్–న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ సారాంశం. దీని ప్రకారం మన సరుకులన్నిటిపైనా దాదాపు సుంకాలు విధించకుండా ఉండేందుకు న్యూజిలాండ్ అంగీకరిస్తే, అక్కడినుంచి యాపిల్స్, కివీ పండ్లు, చెర్రీలు, నూలు ఉత్పత్తులు దిగుమతి చేసుకునేందుకు మన దేశం సుముఖత వ్యక్తం చేసింది. కార్మికుల అవసరం ఎక్కువున్న జౌళి, ఆభరణాలు, తోలు, ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్, మెరైన్, హస్త కళలు వగైరా ఉత్పత్తులకు న్యూజిలాండ్ తక్కువ సుంకాలు విధిస్తుంది. కొన్నింటి విషయంలో అసలు సుంకాలే ఉండవు. అలాగే సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్(స్టెమ్) పట్టభద్రులకు న్యూజిలాండ్‌లో ఉద్యోగావకాశాలుంటాయి. అక్కడి వర్సిటీల్లో చదువుకొనేందుకూ, పరిశోధనలు సాగించేందుకూ మన విద్యార్థులకు వీలుంటుంది. మరో విశేషమేమంటే మన తరఫున ఈ ఒప్పందం సాకారానికి కృషి చేసింది మొత్తంగా మహిళా అధికారుల బృందమే.

ఎఫ్‌టీఏలపై ఆరోపణలూ, విమర్శలూ కూడా లేకపోలేదు. ఆహారం, ఆరోగ్యం, కార్మిక వర్గం, పర్యావరణం తదితర అంశాలపై ఇవి తీవ్రంగా ప్రభావం చూపే అవకాశమున్నా అధిక శాతం ఎఫ్‌టీఏల చుట్టూ గోప్యత అలుముకుని ఉంటుందనీ, ఆచరణ మొదలయ్యాకే వాటి అసలు పర్యవసానాలేమిటో ప్రజలకు తెలుస్తుందనీ సామాజిక కార్యకర్తల ఆరోపణ. తొలి ఆధునిక సమగ్ర ఎఫ్‌టీఏ ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(నాఫ్తా) 1994లో కుదరగా, మన దేశం తొలిసారి 1999లో శ్రీలంకతో ఎఫ్‌టీఏ కుదుర్చుకుంది. అటుతర్వాత జపాన్, మలేసియా, దక్షిణ కొరియా, సింగపూర్, ఆగ్నేయాసియా దేశాల కూటమి ఆసియాన్ వగైరాలతో ఈ ఒప్పందాలు కుదిరాయి. వర్తమాన యుగంలో ఏ దేశమూ ఒంటరిగా మనుగడ సాగించలేదు. ఆత్మ నిర్భర భారత్, మేకిన్ ఇండియా వంటివి స్వావలంబనకు కొంతమేర తోడ్పడవచ్చుగానీ, వాటినే సర్వస్వంగా భావించటం సాధ్యం కాదు.

చిత్రమేమంటే భారత్–న్యూజిలాండ్ ఎఫ్‌టీఏపై సామాజిక రంగాల కార్యకర్తలకన్నా ముందు న్యూజిలాండ్ విదేశాంగ మంత్రి విన్‌స్టన్ పీటర్స్ చిర్రుబుర్రులాడుతున్నారు. న్యూజిలాండ్ డెయిరీ ఉత్పత్తులకు మన మార్కెట్‌ను బార్లా తెరవకపోవటం ఆయనగారికున్న అభ్యంతరం. పార్లమెంటులో ధ్రువీకరణకొచ్చినప్పుడు ఒప్పందాన్ని ప్రతిఘటిస్తామని కూడా ప్రకటించారు. న్యూజిలాండ్ అధికార కూటమి ప్రభుత్వంలో ఆయన పార్టీ భాగస్వామి. ఈ ఏడాది ఇంతవరకూ 2,400 కోట్ల డాలర్ల డెయిరీ ఉత్పత్తులు పాలు, వెన్న, జున్ను వగైరాలు తాము ఎగుమతి చేయగా, ఒక్క భారత్ మాత్రమే అందుకు సమ్మతించటం లేదన్నది ఆయన అభ్యంతరం. అయితే కుదరబోయే ఈ ఒప్పందం ఒక వెసులుబాటునిస్తోంది. ముడి పదార్థాలు తీసుకొచ్చి ఉత్పత్తులు చేసి వంద శాతం ఎగుమతులు చేసుకునేందుకు న్యూజిలాండ్‌కు అవకాశం ఉంటుంది. డెయిరీ, సాగు ఉత్పత్తులకు అనుమతులిస్తే మన సాగు, పాడి రంగాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ విషయంలోనే అమెరికా ప్రధానంగా పట్టుబడుతోంది. ఇప్పుడు న్యూజిలాండ్‌తో కుదిరిన అవగాహన చూశాక ట్రంప్ ఏమంటారో చూడాలి. మొత్తానికి మన ప్రయోజనాలు దెబ్బతినకుండా, లబ్ధి చేకూరేలా కుదుర్చుకునే ఏ ఒప్పందమైనా స్వాగతించదగిందే!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.చవితి ఉ.10.51 వరకు తదుపరి పంచమి, **నక్షత్రం:** ధనిష్ఠ తె.6.24 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి శతభిషం, **వర్జ్యం:** ప.10.00 నుండి 11.38 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.18 వరకు, **అమృత ఘడియలు:** రా.7.35 నుండి 9.15 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

కోలుకున్నాక...

నేను మళ్లీ ఆడలేనని డాక్టర్లు చెప్పారు! ఆ సమయంలో నేననుకున్నాను... ఇక జావెలిన్ త్రోకూ, నాకూ 'బంధం' తెగిపోయినట్లేనని! కొంచెం కోలుకున్నాక మళ్లీ అనిపించింది, తిరిగి నేను పోటీలోకి దిగగలనని. కలలు ముక్కలైపోవు, తిరిగి పుంజుకుంటాయి.

– నీరజ్ చోప్రా, ఒలింపిక్ స్వర్ణ విజేత

మీ గురించి



మీరు ఏం చేయగలరో, ఏం చేయలేరో మీకు ఎవరినీ చెప్పనివ్వకండి. పరిమితులను కూడా దాటుకుని ముందుకు వెళ్లిపోండి. మీ పని మీద, మీ మీద మీకు నమ్మకం ఉంటే మీరు ఎవరి మాటా వినక్కర్లేదు. మీ గురించి మీకే కదా ఎక్కువ తెలుస్తుంది!

– అనిల్ కపూర్, సినీ నటుడు

కనుగొంటాం!



ఇతరుల సేవలో ఉన్నప్పుడు మనం మన జీవితానికి నిజమైన అర్థాన్ని కనుగొంటాం. ప్రేమ, దయతో కూడిన మీ ప్రతి చర్య కూడా ప్రపంచాన్ని వెలిగిస్తుంది. క్షమించగల, కరుణ చూపించగల వ్యక్తులు మానవ సంబంధాలను మెరుగుపరుస్తారు.

– ఓస్వాల్డ్ గ్రేసియాస్, ఇండియన్ బిషప్

తీసుకెళ్తున్నా!

రెండు దశాబ్దాలకు పైగా మైదానంలో ఉన్న తర్వాత, వీడ్కోలు పలుకుతున్నప్పుడు బాధగానే ఉంటుంది. నేను క్రీజుకు దూరం అయినప్పటికీ, క్రికెట్ నాలో ఎల్లప్పుడూ ఉంటుంది. ఆటను నాతో తీసుకెళ్లి మరొకరికి నేర్పించటానికి ఎదురు చూస్తున్నాను.

– పీయూష్ చావ్లా, క్రికెటర్

ఏం కాదు!

బాధ మన జీవితాల్లోకి ఒక అవసరంగా వస్తుంది! మన శక్తి ఏపాటిదో తెలియజేస్తుంది. మన మనోబలం ఎంతటిదో పరీక్షిస్తుంది. ఏం కాదు. ధైర్యంగా ఉండండి. వచ్చిపోతుండే బాధ్యతలే మన జీవితంలోని భయాలను పోగొడతాయి.

– కానన్ గిల్, స్టాండ్‌–అప్ కమెడియన్

'గోల్' ముఖ్యం

ఫుట్‌బాల్‌లో మీరు స్థిమితంగా ఉండలేరు. నేను ఇంఫాల్‌లో ఉన్నా, కోల్‌కతాలో ఉన్నా, త్రిశ్శూర్‌లో ఉన్నా అస్థిమితంగానే ఉంటాను. గోల్స్ సాధించటానికి ఆట మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతుందో అక్కడి వెళ్లటానికి సిద్ధంగా ఉండాల్సిందే.

– సోరమ్ అంగన్బా, ఫుట్‌బాలర్

నేపాల్ దారి అగమ్యగోచరం

అభిప్రాయం



టంకశాల అశోక్

నేపాల్‌లో బహుళ రాజకీయ పార్టీల వ్యవస్థ 1990లో ఏర్పడిన 35 సంవత్సరాల తర్వాత, రాచరిక వ్యవస్థ పూర్తిగా 2008లో రద్దయిన 17 సంవత్సరాలకు, ఆ దేశ భవిష్యత్తు 'అగమ్యగోచరమేనా?' అనే ప్రశ్న వేసుకోవలసి రావటం నిజంగానే విచిత్రమైన పరిస్థితి. గత సెప్టెంబర్ నాటి జెన్–జీ భూకంపం సృష్టించిన స్థితిగతులు, రేకెత్తించిన ప్రశ్నల కారణంగా దేశం ఈ దశలోకి ప్రవేశించింది.

2008 వరకు ఒకవైపు రాచరికాన్ని, మరొకవైపు ప్రజాస్వామిక పార్టీల ద్వంద్వ పాలనను, 2008లో రాచరికం రద్దు తర్వాత నుంచి మధ్యేమార్గ పార్టీలు, సాధారణ కమ్యూనిస్టులు, మావోయిస్టుల పాలనను చూసిన యువతరం, దానికి మద్దతుగా నిలిచిన సమాజం కలిసి అగ్నిపర్వత విస్ఫోటనం వంటి తిరుగుబాటు చేశాయి. అనగా అది ప్రస్తుత తరపు తిరుగుబాటు. మరి ఈ తరం గడిచిపోయి మరొక 15–20 సంవత్సరాలకు కొత్త తరం ఉనికిలోకి వచ్చే సమయానికి పరిస్థితి ఏమిటి? ఈ తిరుగుబాటుకు కారణమైన పరిస్థితులు అప్పటికి మారుతాయా? మారగలవన్న హామీని ఇపుడున్న రాజకీయ పార్టీలు యువతరానికి, ప్రజలకు ఇవ్వగలవా?

కనీసం ప్రశ్నించుకోని వైనం

ఈ ప్రశ్నలను ఇంతే సూటిగా అన్ని ప్రధాన పార్టీల నాయకులను నేను అడిగాను. ఆశ్చర్యం కలిగించేది ఏమంటే, ఏ ఒక్క పార్టీ కూడా సెప్టెంబర్ పరిణామాల అనంతర కాలంలో ఈ ప్రశ్నలను తనకు తాను వేసుకోలేదు. ప్రశ్నలు వేయగానే అందరిలో కన్పించిన మొదటి స్పందన నా వైపు శూన్యంగా చూడటం. కొద్దిసేపటికి తేరుకుని స్పష్టాస్పష్టంగా కొద్ది మాటలేవో చెప్పటం. ప్రస్తుతం మితవాదులు, మధ్యేమార్గీయుల నుంచి మావోయిస్టుల వరకు అందరూ తమను తాము కూడదీసుకోవటం, పార్టీలలో తలెత్తిన అంతర్గత సంక్షోభాలను, చీలిక అవకాశాలను నియంత్రించటం, చీలినవారు ఇతరులతో కలిసి కొత్త పార్టీలు ఏర్పాటు చేయటం, మార్చి 5న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధపడటం వంటి పనులలో తలమునకలై ఉన్నారు.

మరొకవైపు చూడగా, తిరిగి అధికారంలోకి రావాలనే కోరికలో నైతే ఎటువంటి మార్పు లేదు. తిరుగుబాటు తరాన్ని ఎట్లా చల్లబరచటం, వీలైనన్ని జెన్–జీ గ్రూపులను తమ వైపు ఏ విధంగా ఆకర్షించటం, ప్రజలలో తమ పార్టీలకు ఉండిన సంప్రదాయికమైన నెట్‌వర్క్ ఇటీవలి పరిణామాల వల్ల చెదిరి పోకుండా తిరిగి ఎట్లా కూడదీయటమన్నవి అందరి ప్రాధాన్యాలుగా మారాయి. ఈ ప్రయత్నాలలో భాగంగా అందరి నోటినుంచి దాదాపు ప్రతిరోజూ కొన్ని మాటలు నిత్య పారాయణం వలె వినవస్తున్నాయి. అవి: జెన్–జీ ఆలోచనలూ, మావీ ఒకటే; వారి డిమాండ్లన్నీ సమంజసమైనవే; వారూ, మేమూ కలిసి పని చేయాలని భావిస్తున్నాము. అందరి మాటల సారాంశం స్థూలంగా ఇదే. ఇటువంటి మొక్కుబడి మాటలు బయటకు మాట్లాడటం తప్ప, తమవైపు నుంచి గతంలో జరిగిన తప్పులు, భవిష్యత్తులో జరగవలసిన మార్పుల గురించి అంతర్గతంగా ఏ పార్టీ కూడా ఒక పద్ధతిలో చర్చించలేదని ఆ యా పార్టీల సీనియర్ నాయకులే నాతో స్వయంగా చెప్పారు.

◆ మొదటినుంచి ఉన్న పార్టీలు విశ్వాసాన్ని కోల్పోయి, కొత్త ప్రత్యామ్నాయాలు ఏర్పడనపుడు; సమస్యలూ, అసంతృప్తులూ అదే విధంగా కొనసాగుతున్నప్పుడు నేపాల్ భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న తలెత్తడం సహజం.

రాజకీయ శూన్యం

జెన్–జీ గ్రూపులు కొన్ని ఇటీవలి వారాలలో వేర్వేరు పార్టీలతో చేరినా, అసలు పార్టీ నాయకులు, వారి తీరు, ఒకవేళ గెలిచినట్లయితే పరిపాలన ఎంతవరకు మారవచ్చుననే ప్రశ్నపై ఆ యువకులలో పూర్తి ఆశాభావం కన్పించటం లేదు. ఏ పార్టీతో చేరని గ్రూపులే ఎక్కువ. వాటి గురించి చెప్పనక్కర లేదు. అవి తమ వాదనలు, ఒత్తిడులు యథావిధిగా కొనసాగిస్తున్నాయి. విషయం ఏమంటే, ఆ నాయకులు ఏమి చెప్తున్నా ఇప్పటికీ తిరిగి విశ్వాసం కలగటం లేదు. అందుకే ఇటీవలి ఒపీనియన్ పోల్‌లో ఏ నాయకునికీ 10 శాతానికి మించిన ఓట్లు రాలేదు. ఇందులోని విచారకర స్థితి ఏమంటే, స్వయంగా జెన్–జీ గ్రూపులు ఏకమై ఒక దేశవ్యాప్త పార్టీని ఏర్పాటు చేయటంగానీ, లేదా ఇపుడున్న పార్టీలకు భిన్నంగా ప్రజల విశ్వాసాన్ని పొందగల ఒక కొత్త పార్టీగానీ ముందుకు రాకపోవటం వల్ల రాజకీయంగా అతి పెద్ద శూన్యం కనిపిస్తున్నది. మొదటినుంచి గల పార్టీలు విశ్వాసాన్ని కోల్పోయి, అటువంటి కొత్త ప్రత్యామ్నాయాలూ ఏర్పడనపుడు, సమస్యలూ, అసంతృప్తులూ అదే విధంగా కొనసాగే పరిస్థితి కనిపిస్తున్నప్పుడు, నేపాల్ దేశ భవిష్యత్తు ఏమిటి? ఆ స్థితి అగమ్యగోచరంగా తోస్తున్నదనటం అందువల్లనే!

పైన పేర్కొన్న ప్రశ్నలకు సమాధానంగా కొద్దిమంది నాయకులు మాత్రం నాతో కొన్ని మాటలు అన్నారు. అవి ఈ విధంగా ఉన్నాయి: అన్ని పార్టీల అగ్రనాయకత్వాలు కూడా జెన్–జీకి, ప్రజలకు మూర్తీభవించిన విలన్లుగా కనిపిస్తున్నందున అందరూ అధ్యక్ష పదవుల నుంచి వైదొలగి ఇతరులకు నాయకత్వం అప్పగించాలి. కొత్త కార్యవర్గాలలో యువకులకు భారీగా అవకాశాలు కల్పించాలి. నాయకులంతా అవినీతిని, బంధుప్రీతిని పూర్తిగా వదలుకోవాలి. అధికారంలోకి వచ్చినట్లయితే పారదర్శక పాలన, సమర్థవంతమైన పాలన, సమర్థులూ నిజాయితీపరులైన వారికి అధికారంలో స్థానం, వేగవంతమైన, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, యువతకు ఉపాధి అవకాశాలు అనే వాటిపై చిత్తశుద్ధి చూపగలమని ప్రకటించి ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నించాలి. అదే విధంగా వ్యవహరించాలి. లేని పక్షంలో ప్రస్తుత జెన్–జీ తరంగానీ, లేదా కొత్త తరం గానీ ఇంతకన్న తీవ్రమైన తిరుగుబాటు చేయగలదు. రాజకీయ పార్టీలకు ఇది చివరి అవకాశం వంటిది.

కోల్పోయిన విశ్వాసం

వీరు ఇట్లా అంటున్నట్లు బయట వేర్వేరు వర్గాలకు చెందిన ప్రజలతో నేను ప్రస్తావించాను. వారిలో ఒక్కరు కూడా ఆ మాటలను నమ్మలేదు. గతంలో పలుమార్లు ఈ తరహా మాటలు నమ్మి మోసపోయామని అన్నారు. మరి భవిష్యత్తేమిటి? అది వారికీ అగమ్య గోచరంగానే ఉంది. నిజానికి రాచరిక వ్యవస్థలోనే బహుళ పార్టీల ప్రజాస్వామిక పార్లమెంటరీ వ్యవస్థ కోసం 30 ఏళ్లపాటు తీవ్రమైన ఉద్యమాలు జరిపి సాధించిన నేపాలీ కాంగ్రెస్, సాధారణ కమ్యూనిస్టులూ సక్రమంగా పాలించి ఉంటే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు. తర్వాత మావోయిస్టులు దశాబ్దంపాటు భీకరమైన పోరాటం సాగించి, కేవలం ప్రభుత్వానికి అమెరికా, బ్రిటన్, బెల్జియం, ఇండియా ఆధునిక ఆయుధాలు సమకూర్చటం వల్ల, చివరి దశలో వెనుకకు తగ్గారు. అయినా ఇతరులతో కలిసి 2008 నుంచి 2025 వరకు 17 సంవత్సరాలలో 12 సంవత్సరాలు వామపక్షాలే పాలించాయి. వీరి పాలన సవ్యంగా సాగినా ఈ విపత్తు ఎదురయేది కాదు. ఆ విధంగా మొత్తం అందరూ కలిసి 47 సంవత్సరాల పాటు విఫలమై, అందరికందరూ విశ్వాసాన్ని కోల్పోయినందునే, ప్రత్యామ్నాయ సృష్టి అయినా జరగనందునే, నేపాల్ భవిష్యత్తు అగమ్యగోచరమవుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

అలసిన హృదయాలకు శతాబ్దాల లేపనం

టైమ్ మిషన్

అవి మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. ఓ రోజు యూరప్ యుద్ధ భూమిలో ఒక అద్భుత సంఘటన జరిగింది. క్రిస్మస్ ఈవ్ రాత్రి, ఎదురెదురుగా ఉన్న జర్మన్, బ్రిటిష్ సైనికులు ఆయుధాలు దించి, ఒకరినొకరు చూసుకున్నారు. ఆ సమయంలో ట్రెంచ్‌ల నుంచి ఒక పాట వినిపించింది. జర్మన్ సైనికులు జర్మన్‌లో, బ్రిటిష్ సైనికులు ఇంగ్లీష్‌లో అదే పాట పాడారు. కొన్ని గంటల పాటు యుద్ధం ఆగిపోయింది. ఇది చరిత్రలో నమోదైన 'క్రిస్మస్ ట్రూస్'. ఈ అద్భుతం ఏదో రాజకీయ ఒప్పందం వల్ల జరిగింది కాదు. మత నాయకుల ఆదేశాల వల్లా కాదు. ఒక పాట వల్ల జరిగింది. అదే 'సైలెంట్ నైట్– హోలీ నైట్'.

1818 డిసెంబర్ 24 రాత్రి ఆస్ట్రియాలోని 'ఓబెర్న్‌డార్ఫ్' చర్చిలో తొలిసారి వినిపించిన ఈ పాట, ఈ రోజు ప్రపంచంలో అత్యధిక భాషల్లో పాడే గీతంగా నిలిచింది. నెపోలియన్ యుద్ధాల తరువాత యూరప్ తీవ్ర ఆర్థిక కష్టాల్లో మునిగిపోయిన కాలం అది. ఆకలి, నిరుద్యోగం, యుద్ధ గాయాలతో ప్రజల జీవితాల్లో ఆశ అనే పదం మసకబారింది. అటువంటి కాలంలోనే, యువకుడైన పూజారి జోసెఫ్ మోర్ ఒక కవిత రాశాడు. ఒక ప్రశాంతమైన రాత్రి, పేద గొర్రెల కాపరుల మధ్య పుట్టిన శిశువు గురించి రాసిన కవిత అది. దానికి సంగీతం అందించిన వ్యక్తి ఫ్రాంజ్ జేవియర్ గ్రూబర్. అతను పెద్ద సంగీతకారుడు కాదు. ఒక సాధారణ స్కూల్ టీచర్. చర్చిలో ఆర్గన్ వాయించే వ్యక్తి మాత్రమే. ఆ రోజున చర్చిలో ఆర్గన్ పాడైందంటారు. అందువల్ల ఆ పాటను గిటార్‌తో, ఇద్దరు గాయకులు ప్రజల ముందు పాడారు.



ఆస్ట్రియాలోని 'ఓబెర్న్‌డార్ఫ్' చర్చి



జోసెఫ్ మోర్



ఫ్రాంజ్ జేవియర్ గ్రూబర్

మానవత్వ గీతం

ఆ కాలంలో యూరప్ చర్చిల్లో ఎక్కువగా వినిపించిన గీతాలు దేవుడి మహిమను, శక్తిని, పాపానికి శిక్షను గుర్తు చేసేవి. కానీ ఈ పాట మాత్రం మనుషుల బాధను అర్థం చేసుకునే దేవుడి రూపాన్ని చూపించింది. అందుకే ఈ పాట మత పరిమితులను దాటింది. క్రైస్తవులు మాత్రమే కాదు, క్రైస్తవేతరులు కూడా ఈ పాటలో ఒక శాంతి భావాన్ని గుర్తించారు. ఇది మత ప్రచార సాధనం కంటే, శాంతి సందేశంగా మారింది.

ఆస్ట్రియా ప్రభుత్వం ఈ పాటను తమ జాతీయ సాంస్కృతిక వారసత్వంగా గుర్తించింది. యునెస్కో కూడా దీనిని అమూల్యమైన మౌఖిక, సంగీత వారసత్వంగా పరిగణించింది. ఈ విధమైన అధికారిక గుర్తింపుల కన్నా ప్రజల మనసుల్లో ఈ పాటకు ఉన్న స్థానం ఎన్నో రెట్లు ఉన్నతమైనది.

ఈ పాటను గ్రామ చర్చీల్లో, పెద్ద పెద్ద నగరాల కచేరీల్లోనే కాదు... యుద్ధ స్మారక సభల్లోనూ, ప్రకృతి విపత్తుల తర్వాత జరిగే శాంతి ప్రార్థనల్లోనూ పాడుతారు. సందర్భం మారినా, భావం ఒకటే. ఇంత ఆధునిక యాంత్రికత రాజ్యమేలుతున్నా, ఇంత సంపద పోగుచేసుకోవడానికి వెంపర్లాట కొనసాగుతున్నా... ఇంకా మానవ హృదయం సున్నితత్వాన్ని కోల్పోలేదని ఆ యా సందర్భాల్లో ఈ పాట మనకు గుర్తు చేస్తోంది.

భారత్‌లో...

భారతదేశంలోనూ క్రిస్మస్ మతపరమైన పండుగ మాత్రమే కాదు; ఒక సామాజిక సాంస్కృతిక సంబురం కూడా. కేరళ నుంచి కోల్‌కతా వరకు, గోవా నుంచి ఉత్తర భారతం వరకు 'సైలెంట్ నైట్' వినిపిస్తుంది. కాకపోతే భాష మారుతుంది, స్వరం మారుతుంది, కానీ భావం మారదు. ఇది మన దేశ సహజీవన సంస్కృతికి కూడా ఒక నిదర్శనం.

రెండు శతాబ్దాల క్రితం యూరప్‌లో ఒక చిన్న గ్రామంలో మొదలైన ఈ పాట, ఈ రోజు ప్రపంచం అంతా అల్లుకుపోయింది. రాజులు మారారు, సామ్రాజ్యాలు కూలాయి, యుద్ధాలు జరిగాయి, సాంకేతిక విప్లవాలు వచ్చాయి. కానీ 'సైలెంట్ నైట్' మాత్రం నిలిచే ఉంది. అందుకు మనిషితనమే అసలైన కారణం! ◆

అగ్ని కవి

ఇన్ బాక్స్

మోదుకూరి జాన్సన్ ప్రధానంగా నాటక కర్త. కానీ సినిమా రచయితగా ప్రసిద్ధి చెందాడు. 'నటనాలయం', 'దేవాలయం', 'హృదయాలయం' వంటి ఆయన నాటకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. సమాజంలో ఉన్న అంతర్గత వైరుధ్యాలు, రుగ్మతలు, మూఢనమ్మకాలు, విలువల్లేని ఆచార వ్యవహారాలపై తన కలాన్ని ఎక్కుపెట్టాడు జాన్సన్. 'నిచ్చెనమెట్లు' ఈ సమాజ కుల వ్యవస్థపై ధిక్కారంగా రచించిన నాటకం. అగ్రవర్ణాల బరువు మొత్తం దళితులు మోస్తున్నట్లు చిత్రించిన నాటకం ఇది. అంబేడ్కర్ సామాజిక తత్వాన్ని ఈ నాటకం ప్రతిబింబించింది.

జాన్సన్ గుంటూరు జిల్లా, కొలకలూరు గ్రామంలో 1936 ఆగస్టు 8న జన్మించారు. సాధారణ వ్యవసాయ కూలీ మాదిగ కుటుంబంలో పుట్టిన జాన్సన్, 'కళావాచస్పతి' జగ్గయ్య శిష్యుడు. తెనాలిలో రాడికల్ హ్యూమనిస్టులతో సన్నిహితంగా ఉండి సామాజిక అవగాహన పెంచుకున్నాడు.



మోదుకూరి జాన్సన్

1970లో ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో అక్కినేని హీరోగా నటించిన 'మరో ప్రపంచం' ద్వారా సినీ రచయితగా పరిచయం అయ్యాడు. ఆయన నటనాలయం నాటకం చూసి అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు తమ సొంత చిత్రమైన మరో ప్రపంచం సినిమాకు సంభాషణల రచయితగా అవకాశమిచ్చారు. జాన్సన్ 50కి పైగా తెలుగు సినిమాలకు సంభాషణలు, కథ, పాటలు రచించారు. ఆయన రచనలు సామాజిక స్పృహతో ఆలోచింపజేస్తాయి. 'కరుణామయుడు', 'ఇంద్రధనుస్సు', 'మానవుడు–దానవుడు', 'డబ్బుకు లోకం దాసోహం', 'ఆంధ్ర కేసరి', 'దేశోద్ధారకులు', 'సావాసగాళ్ళు', 'విచిత్ర దాంపత్యం', 'ఇల్లాలికో పరీక్ష' వంటివి ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ లాంటి నటుల చిత్రాలకు పనిచేశారు.

కరుణామయుడు సినిమాలో 'కదిలింది కరుణ రథం... సాగింది క్షమా యుగం...' పాట ప్రజల గుండెల్లో శాశ్వతంగా ముద్రవేసుకుంది. జాన్సన్‌ని పరిశ్రమ మర్చిపోయినా ఆ పాట గుర్తుచేస్తుంది. అదే విధంగా 'పాడిపంటలు' సినిమాలో' 'మన జన్మభూమి... బంగారు భూమి...' సినీ చరిత్రలో నిలిచిపోయింది. 'రాగహృదయం' అనే రూపకానికి నేపథ్య గానం అందించాడు. 'ఛండాలిక', 'పైరుపాట' రూపకాలకు సంగీత దర్శకత్వం వహించాడు. 'ఢక్కాభిషేకం' అనే నవల కూడా వ్రాశాడు. 1988 డిసెంబర్ 24న హైదరాబాద్‌లో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన మోదుకూరి రచనలు తెలుగు సాహిత్యంలో పెనుమంటలా జ్వలించాయి. అందుకే జాన్సన్‌ను 'అగ్ని కవి' అన్నారు.

– కత్తి కళ్యాణ్ । రచయిత, ఎడిటర్ (మన కాలం)
(నేడు ఒంగోలులో మోదుకూరి జాన్సన్ వర్ధంతి సభ)

యూపీలోనే అధిక మరణాలు

డేటా పాయింట్

దేశంలో 2023లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారణంగా అత్యధిక మరణాలు నమోదైన రాష్ట్రం ఉత్తరప్రదేశ్. ఏపీలో 1,788, తెలంగాణలో 1202 నమోదయ్యాయి.

రాష్ట్రాల వారీగా మరణాలు

రాష్ట్రం	మరణాలు
యూపీ	4,763
తమిళనాడు	3,755
మహారాష్ట్ర	3,171
పశ్చిమబెంగాల్	2,692
బిహార్	2,415
కర్ణాటక	2,156

ఆధారం: జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్

దారి చూపిన తార



నాడు ఏసు జన్మించిన ప్రదేశపు నేటి రూపం

క్రిస్మస్ కాలంలో వీధివీధినా నక్షత్రాలు దర్శనమిస్తాయి. క్రిస్మస్ పండుగలో నక్షత్రం ఒక భాగం. ఏసు జన్మించిన కాలంలో ఉదయించిన నక్షత్రం ప్రపంచ ఖగోళ శాస్త్ర వేత్తలకే దారిచూపిందంటారు. తూర్పు దిక్కున ఉదయించిన తార మూలాలు కను గొన్నవారి పరిశోధనల మేర లోకంలో ఒక రారాజు జన్మిస్తాడనీ, ఆయన లోక మార్గనిర్దేశకుడనీ అంచనా వేస్తారు. వారినే బైబిల్‌లో జ్ఞానులు అని అనువదించారు. తార గమనాన్ని బట్టి బెత్లెహేములో ఏసు జన్మించినట్టు, జ్ఞానులు దర్శించి బహుమతులు సమర్పించినట్టు నూతన నిబంధన తెలియజేస్తుంది.

సాధారణంగా నక్షత్రానికి ఐదు కోణాలుంటాయి. ఐతే బెత్లెహేములో ఏసు జన్మించిన పశువుల పాక ప్రాంగణంలో 14 కోణాలున్న నక్షత్రాన్ని భూమిపై గ్రానైట్ రాయితో స్థిరపరచారు. ఈ ప్రదేశంలో నిరంతరం దీపాలు వెలుగుతూనే ఉంటాయి. 14 కోణాలున్న ఈ తార ఏసు వంశావళికి చెందిన 14 తరాలకు ప్రతీక. ఏసుకు చెందిన 14 తరాల వివరాలు మత్తయి సువార్త మొదటి అధ్యాయంలో వివరంగా ఉన్నాయి. క్రిస్మస్ ముందు రాత్రి అంటే డిసెంబర్ 24న బెత్లెహేములోని 'చర్చ్ ఆఫ్ నేటివిటీ' అగ్రభాగాన 14 కోణాలున్న తారను అలంకరిస్తారు. ఈ ప్రదేశాన్ని క్రీ.శ. 326లో సందర్శించిన రోమన్ చక్రవర్తి కాన్‌స్టాంటైన్ తల్లి సెయింట్ హెలీనా ఈ ఆలయ నిర్మాణాన్ని తలపెట్టారు. ఈ ఆలయం బెత్లెహేములో నేటికీ చెక్కుచెదరకుండా ఉంది.

ఏసు లోకానికి వెలుగు అన్న బైబిలు సందేశం ఆధారంగా లోకమంతా నక్షత్రాలు అలంకరించి ముందస్తు క్రిస్మస్ పండుగకు ముస్తాబు చేస్తారు. మానవ జీవితం చీకటి నుండి వెలుగులోకి రావాలనీ, వెలుగు జీవనజ్యోతిగా నిత్యం వెలగాలనీ, ప్రతి వ్యక్తి జీవితం వెలుగుమయం కావాలనీ క్రిస్మస్ తార ద్వారా తెలియవచ్చే సందేశం.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని, తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అరవింద్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జస్టిస్ అరవింద్‌కుమార్ కుటుంబ సమేతంగా చిత్తూరు జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని కూడా దర్శించుకున్నారు.

– తిరుమల/చంద్రగిరి/కాణిపాకం

ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

తిరుచానూరు ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్

గణనాథుని సేవలో త్రిపుర హైకోర్టు జడ్జి

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఈవో స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

– కాణిపాకం

జస్టిస్ రామచంద్రరావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అమ్మవారి సన్నిధిలో సింగపూర్ సుప్రీంకోర్టు జడ్జి

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సింగపూర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ కన్నన్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ధ్వజ స్తంభానికి మొక్కుకుని, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు.

– చంద్రగిరి

ఆలయం వెలుపల సింగపూర్ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ రమేశ్ కన్నన్

మద్యం మత్తులో 'తులసి' డ్రైవర్

- కండీషన్‌లోలేని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు
- కుదుపులకు గాయపడిన బస్సులోని ప్రయాణికుడు
- అర్ధరాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు

కలువాయి(సైదాపురం): ఓ వైపు వరుసగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాల బారిన పడుతుంటే.. కొంతమంది బస్ డ్రైవర్లు నిర్లక్ష్య వైఖరిని ఏ మాత్రం వీడటం లేదు. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం నుంచి వింజమూరు, ఆత్మకూరు, అనంతసాగరం, కలువాయి, పొదలకూరు మీదుగా బెంగుళూరు వెళ్లే శ్రీతులసి ట్రావెల్స్ బస్సు సోమవారం రాత్రి కలిగిరి నుంచి బయలుదేరింది. మార్గమధ్యంలో డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడపడంతో ఓ ప్రయాణికుడికి తలకు బలమైన గాయమైంది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అదే సమయంలో ఏసీ పాడైందని బస్సును ఆపగా, మరి కొద్దిసేపటికీ కలువాయి మండల తోపుగుంట వద్ద మళ్లీ డైనమో చెడిపోయిందని, లైట్లు వెలగడం లేదని చెబుతూ మరోసారి బస్‌ను నిలిపివేశారు. చీకట్లో లైట్లు లేకుండా బస్సు నిలిచిపోవడంతో సిబ్బందిని ప్రయాణికులు నిలదీశారు. అనుమానం వచ్చిన ప్రయాణికులు డ్రైవర్‌ను గమనించగా అతడు మద్యం తాగి ఉన్నట్లు బయటపడింది. ఈ విషయాన్ని ప్రశ్నించగా డ్రైవర్ బాధ్యతారహితంగా మాట్లాడాడు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయం కావడం, బస్సులో మహిళలు, పిల్లలు ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే వారు కలువాయి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను ఓ ప్రైవేటు వాహనంలో కలువాయి వరకు సురక్షితంగా చేర్చారు. డ్రైవర్ మద్యం మత్తులోనే బస్సు నడుపుతున్నట్లు నిర్ధారించారు. అతనిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- తిరుమలలో వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ తిరుమంజనం అనంతరం ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారన్నారు. ఈనెల 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే కారణంగా చంటి పిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ వంటి ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామని చెప్పారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నప్రసాదాల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు.

బ్యాంకులకు రఘురామ టోకరా

ఇండ్ భారత్ థర్మల్ కంపెనీ పేరిట బ్యాంకులకు కుచ్చుటోపీ

సాక్షి, అమరావతి: బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన ఉండి టీడీపీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు చేసిన మోసాలపై దర్యాప్తు పూర్తి చేయడానికి సీబీఐ రంగం సిద్ధం చేస్తోంది. ఈ మోసాలపై దర్యాప్తు చేయకుండా కృష్ణరాజు గతంలో ఇచ్చిన స్టేను సుప్రీంకోర్టు తొలగించి, దీనిపై ముందుకు వెళ్లడానికి సీబీఐకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో మరోసారి ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ చేసిన మోసాలు చర్చనీయాంశంగా మారాయి.

➤ తనఖాగా పెట్టిన భూముల్ని మోసపూరితంగా అమ్మేసుకోవటం, 95 శాతం బొగ్గు కాలిపోయిందని చెప్పడం వంటి అక్రమాల నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

➤ 2020 అక్టోబర్‌లో రఘురామకృష్ణరాజుకు చెందిన ఇళ్లు, కంపెనీలు, కార్యాలయాల్లో 11 సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సోదాలు నిర్వహించి పలు ఫైళ్లు, హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నాయి. సంస్థకు చైర్మన్‌గా ఉన్న రఘురామతో పాటు ఆయన భార్య, కుమార్తె ఇతర డైరెక్టర్లపై కేసులు నమోదు చేశాయి.

మోసాల చిట్టా బారెడు..

➤ ఇండ్ భారత్ థర్మల్ పవర్ కంపెనీ పేరుతో రఘురామ కృష్ణరాజు వివిధ బ్యాంకుల నుంచి దాదాపు రూ.1,383 కోట్ల రుణాలను తీసుకున్నారు.

➤ థర్మల్ పవర్ కంపెనీ ఏర్పాటు పేరుతో తీసుకున్న రుణాలను కంపెనీ అవసరాలకు వినియోగించకుండా వాటిని తన వారి ఖాతాల్లోకి తరలించి బ్యాంకుల నెత్తిన చేయిపెట్టారు.

➤ పంజాబ్ నేషనల్ బ్యాంకు, దాని అనుబంధ బ్యాంకుల నుంచి ఇండ్ భారత్ థర్మల్ పవర్ పేరిట తీసుకున్న రూ.826.17 కోట్ల రుణాన్ని పక్కకు మళ్లించడంతో పాటు తీసుకున్న రుణాలపై వడ్డీ కూడా చెల్లించడం లేదంటూ బ్యాంకు సీబీఐని ఆశ్రయించడంతో రఘురామ మోసాలు వెలుగులోకి వచ్చాయి.

దివాళా ప్రక్రియ షురూ..

తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకులు దివాళా ప్రక్రియకు అనుమతి కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌ని ఆశ్రయించాయి. ఇండ్ భారత్ థర్మల్ రూ.1,383 కోట్ల రుణాన్ని బ్యాంకులకు చెల్లించాల్సి ఉండగా, చాలాకాలంగా బకాయిలు చెల్లించడం లేదని పేర్కొన్నాయి. అయితే కంపెనీ తనఖా చేసిన ఆస్తుల విలువ కేవలం రూ. 872 కోట్లే ఉండటంతో ఈ కంపెనీ దివాళా తీసినట్లుగా పరిగణించి.. దివాళా పరిష్కార ప్రక్రియ చేపట్టాలంటూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. బ్యాంకుల వాదనతో ఏకీభవించిన ఎన్‌సీఎల్‌టీ దివాళా ప్రక్రియకు అనుమతించింది.

ఫెమా నిబంధనల ఉల్లంఘన.. రంగంలోకి ఈడీ

ఇండ్ – భారత్ సన్ ఎనర్జీ ప్రైవేట్ పేరిట విదేశాల నుంచి పెద్ద ఎత్తున నిధులను అక్రమంగా తరలించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. తన సంస్థ కోసమని రఘురామ 2011లో మారిషస్‌కు చెందిన స్ట్రాటజిక్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి రూ. 202 కోట్లు రుణం తీసుకున్నారు. అయితే నిధులు అందిన మరుసటి రోజే రూ. 200 కోట్లను ఇండ్ – భారత్ ఎనర్జీ లిమిటెడ్ (ఉత్కళ్)కు తరలించేశారు. ఈ వ్యవహారం మొత్తం ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) దృష్టిలో పడింది. దాంతో విషయాన్ని లోతుగా దర్యాప్తు చేసిన ఫెమా అధికారులు.. మారిషస్ కంపెనీ నుండి ఏపీకి చెందిన కంపెనీ ఇండ్ భారత్ సన్ ఎనర్జీకి రూ.202 కోట్లు అందినట్లు గుర్తించారు. అలాగే మరుసటి రోజే ఇండ్ భారత్ ఎనర్జీ లిమిటెడ్‌కు బదిలీ అయినట్లు కూడా నిర్ధారించుకున్నారు. రఘురామరాజు కంపెనీ ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో ఈడీ రూ.40 కోట్లు పెనాల్టీ విధించింది.

బస్సు నడుపుతుండగా ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

అప్రమత్తంగా వ్యవహరించి బస్సు పక్కకు నిలిపివేత
68 మంది ప్రయాణికులు సురక్షితం

కోటేశ్వరరావు

ప్రత్తిపాడు: బస్సులో ఉన్న ప్రయాణికుల భద్రత డ్రైవర్ చేతిలోనే ఉంటుంది. అలాంటి డ్రైవర్‌కు బస్సు నడుపుతుండగా గుండెపోటు వస్తే..ప్రయాణికుల ప్రాణాలకే ప్రమాదం. కానీ పర్చూరు నుంచి గుంటూరుకు వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు డ్రైవర్ తనకు గుండెపోటు వచ్చినా ప్రయాణికుల ప్రాణాలే తనకు ముఖ్యమని భావిస్తూ విధి నిర్వహణలో తన నిబద్ధతను చాటుకున్నాడు. ఒళ్లంతా చెమటలు పడుతున్నా.. గుండె బరువుగా ఉన్నా తట్టుకుంటూ బస్సును పక్కకు నిలిపి 68 మంది ప్రాణాలను కాపాడాడు. మంగళవారం ఉదయం పర్చూరు నుంచి గుంటూరుకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు బయల్దేరింది. మధ్యలో పెదనందిపాడు దాటిన తరువాత వరగాని సమీపంలో బస్సు డ్రైవర్ ఎంవీ కోటేశ్వరరావుకు ఛాతీలో తీవ్రమైన నొప్పి వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆయన వరగాని చెక్‌పోస్టు సమీపంలో బస్సును పక్కకు నిలిపాడు. ఒళ్లంతా చెమటలు పడుతున్నాయని, గుండె నొప్పి తీవ్రంగా ఉందని డ్రైవర్ చెప్పడంతో..ప్రయాణికులు డ్రైవర్‌ను స్థానిక ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. పరీక్షించిన ఆయన గుండెపోటు లక్షణాలుండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరుకు తరలించాలని సూచించారు. దీంతో డ్రైవర్‌ను ప్రైవేట్ వాహనంలో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన సమయంలో బస్సులో 68 మంది ప్రయాణికులున్నారు.

నేడు 'బ్లూ బర్డ్ బ్లాక్-2' ఉపగ్రహ ప్రయోగం

షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న ఎల్‌వీఎం3-ఎం6 ఉపగ్రహ వాహకనౌక

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) బుధవారం ఉదయం 8.59 గంటలకు తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3–ఎం6 రాకెట్ ద్వారా 'బ్లూ బర్డ్ బ్లాక్–2' సమాచార ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఈ ఉపగ్రహాన్ని అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏఎస్‌టీ అనే మొబైల్ కమ్యూనికేషన్ సంస్థ రూపొందించింది. ఉపగ్రహ ప్రయోగానికి 24 గంటల ముందుగా మంగళవారం ఉదయం 8.59 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియను ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ పర్యవేక్షణలో ఈ ప్రయోగం చేస్తున్నారు. ఎల్‌వీఎం3–ఎం6 రాకెట్ ద్వారా మూడు దశల్లో ఈ ప్రయోగాన్ని పూర్తి చేయనున్నారు. ఇప్పటి వరకు ఎల్‌వీఎం3–ఎం6 ద్వారా 8 ఉపగ్రహాలను ప్రయోగించగా, అన్నీ విజయవంతమయ్యాయి. తొమ్మిదో ప్రయోగం ద్వారా బ్లూ బర్డ్ బ్లాక్–2 ఉపగ్రహాన్ని కూడా విజయవంతంగా ప్రయోగించాలని శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

పచ్చ కండువా కప్పుకోకపోతే చంపేస్తాం కొ...ల్లారా

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసిన టీడీపీ నేతలు
- ఆటోలో వెళ్తుండగా ఒకరిపై, గ్రామం వద్ద పోలీసుల ఎదుటే నలుగురిపై దాడి
- మోకాళ్లపై కూర్చోబెట్టి టీడీపీ కండువా కప్పుకొంటే బతికిపోతారని హెచ్చరిక

కంటి వద్ద దెబ్బను చూపుతున్న అపర్ణ

జమ్మలమడుగు/కొండాపురం: 'రేయ్... మీరు వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు చేస్తారా? మా పార్టీ కండువా కప్పుకొంటే బతికిపోతారు. లేకపోతే చంపేస్తాం నా కొ...ల్లారా' అంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడికి దిగారు. మోకాళ్లపై కూర్చొబెట్టి దారుణంగా కొట్టి ఇంట్లో సామగ్రి, నాలుగు వాహనాలను ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలం పొట్టిపాడు గ్రామంలో ఈ ఘటన జరిగింది. బాధితులు సింగంశెట్టి సత్యనారాయణ, సింగంశెట్టి నారాయణస్వామి, సింగంశెట్టి ఆనంద్, అపర్ణ తెలిపిన వివరాల మేరకు... నారాయణస్వామి, సత్యనారాయణలు ఇటీవల గ్రామంలో మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. దీంతో టీడీపీ నేతలు చింతా సుమంత్‌రెడ్డి, చింతా శివశంకర్‌రెడ్డి, గురివిరెడ్డి, గుర్విరెడ్డిగారి గురుమహేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులరెడ్డి, ఉప్పు ఆంజనేయులు కక్ష పెంచుకున్నారు. సత్యనారాయణ సోమవారం రాత్రి తిమ్మాపురం నుంచి ఆటోలో వస్తుండగా, ఐదుగురు టీడీపీ నాయకులు బైక్‌లపై వచ్చి అడ్డగించి దాడి చేశారు. స్థానికులు విడిపించడంతో వెళ్లిపోయారు. కానీ, తర్వాత ఆటోను పొట్టిపాడు బయటే నిలిపి మరో నలుగురిపై పోలీసుల ఎదుటే మళ్లీ తీవ్రంగా కొట్టారు. బాధితుల ఇళ్ల ఎదుట ఉన్న నాలుగు బైక్‌లు, ఇంట్లోని సామగ్రి ధ్వంసం చేశారు. అడ్డుపడిన నారాయణస్వామి భార్య అపర్ణను తీవ్రంగా గాయపరిచారు. బాధితులు ఈ విషయాన్ని పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, పొట్టిపాడు గ్రామంలో నలుగురు కుటుంబ సభ్యులపైన దాడిచేసిన అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులను వదిలేసి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే దాడికి కారణమని కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సామాన్య ప్రజలు అవాక్కయ్యారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడిని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తీవ్రంగా ఖండించారు. పోలీసు ఉన్నతాధికారులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉదయాన్నే మద్యం అమ్మకాలపై ఘర్షణ

ఇద్దరికి తీవ్ర గాయాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఉదయాన్నే మద్యం ఎక్కడిదని ఓ వ్యక్తి ప్రశ్నించడంతో చెలరేగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం కాకర్లలో చోటుచేసుకుంది. వివరాలు.. కాకర్ల గ్రామంలోని మద్యం దుకాణం పక్కనే ఉన్న సిట్టింగ్ రూమ్‌లో ఉదయం 9 గంటలకే కొందరు మద్యం సేవిస్తూ ఉన్నారు. వారిని గమనించిన రావూరి పౌలురాజు అక్కడకు వెళ్లి ఇంత ఉదయాన్నే మద్యం ఎక్కడిదని ప్రశ్నించాడు. దీంతో మొదలైన వాగ్వాదం.. ఘర్షణకు దారి తీసింది. కట్టెలతో దాడి చేసుకోవడంతో పులిగుజ్జు నాని, నల్లబోతుల కాశీరావుకు తీవ్ర గాయాలయ్యాయి. రావూరి పౌలు రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పద్మశ్రీ ఇమ్మనలే.. సీబీఐ విచారణకు ఆదేశించారు

బ్యాంకులను మోసగించిన కేసులో నేనూ ఇంప్లీడ్ అవుతా
వీడియోలో స్పష్టం చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్

సాక్షి, అమరావతి : బ్యాంకులను రూ. 2 వేల కోట్ల మేర మోసం చేసిన నేరంలో డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజును విచారించాలనే సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది తప్ప... ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇవ్వమని సిఫార్సు చేయలేదని సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ అన్నారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రఘురామకృష్ణరాజు కామెడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తనను పోలీసు సర్వీసు నుంచి తొలగించాలని రఘురామకృష్ణరాజు డీజీపీకి లేఖ రాయడాన్ని సునీల్‌కుమార్ గట్టిగా తిప్పికొట్టారు. ఆ లేఖలో పేర్కొన్న అంశాలకు జవాబిస్తూ మంగళవారం ఓ వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో సునీల్‌కుమార్ పోస్టు చేశారు. సీబీఐ నమోదు చేసింది ఎఫ్ఐఆరేగానీ.. తాను అవినీతికి పాల్పడినట్టు శిక్ష పడలేదని రఘురామకృష్ణరాజు పేర్కొనడాన్ని సునీల్‌కుమార్ ఎద్దేవా చేశారు. కస్టోడియల్ టార్చర్ చేశామని తనపై, అప్పటి అదనపు ఎస్పీ విజయ్‌పాల్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై ఆయన చేసినవి కూడా కేవలం ఆరోపణలేనని గుర్తు చేశారు. అంతేగానీ తాము కస్టోడియల్ టార్చర్‌కు పాల్పడినట్టు న్యాయస్థానం ఏమీ నిర్ధారించలేదన్న వాస్తవాన్ని రఘురామ గుర్తు చేసుకోవాలన్నారు. అయినా సరే రఘురామకృష్ణరాజు ఏళ్ల తరబడి మీడియాలో ఆ అంశంపై ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

కాల్ డేటా భద్రపరచాలని పిటిషన్ వేస్తా

ప్రభుత్వ ఉద్యోగినైన తాను రఘురామకృష్ణంరాజు బ్యాంకులను మోసం చేసిన కేసు గురించి మాట్లాడకూడదని చెప్పడాన్ని పీవీ సునీల్‌కుమార్ ఖండించారు. ప్రభుత్వ ఉద్యోగినైనంత మాత్రాన తాను ఏపీ పౌరుడిని కాకుండా పోతానా అని ప్రశ్నించారు. ఎస్‌బీఐ బ్యాంకు డిపాజిట్‌దారుగా ఆ బ్యాంకుకు జరిగిన మోసాన్ని ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు. ఇదే ప్రాతిపదికన ఆ కేసులో తాను ఇంప్లీడ్ అవుతానన్నారు. రఘురామకృష్ణంరాజు బ్యాంకులను మోసం చేసిన కేసు గురించి మాట్లాడటం ద్వారా దర్యాప్తు అధికారులను తాను ప్రభావితం చేస్తున్నానని ఆయన చెప్పడాన్ని సునీల్ కుమార్ తిప్పికొట్టారు. కస్టోడియల్ టార్చర్ అంటూ పెట్టిన కేసులో ఆయన ఎన్నిసార్లు దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులతో మాట్లాడారో తెలుసుకోవాలన్నారు. ఆయన కాల్ డేటాను భద్రపరచాలని తాను త్వరలోనే న్యాయస్థానంలో పిటిషన్ వేస్తానని.. దాంతో అన్నీ బయటపడతాయని చెప్పారు. బ్యాంకులను మోసం చేసిన కేసు గురించి ఇతరులు మాట్లాడితే మీడియా ట్రయల్ అంటూ రఘురామకృష్ణరాజు కంగారుపడి కామెడీ చేస్తున్నారని సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. మాదిగ సోదరుడు విజయ్ పాల్, కాపు సోదరి డాక్టర్ ప్రభావతి గురించి ఆయన ఏళ్ల తరబడి రోజూ మీడియాతో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. తనను పోలీసు సర్వీసు నుంచి తొలగించాలని రఘురామకృష్ణరాజు డీజీపీని కోరడాన్ని ఆయన తోసిపుచ్చారు. పేకాట క్లబ్బులు నడుపుతున్నానా...? బెల్ట్ షాపులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నానా...? తనను ఎందుకు సర్వీసు నుంచి తొలగిస్తారని ప్రశ్నించారు. రఘురామకృష్ణరాజు రూ.2 వేల కోట్ల మేర బ్యాంకులను మోసం చేసిన వ్యవహారానికి సంబంధించి తన వద్ద ఇంకా వివరాలున్నాయని... అన్నీ బయటపెడతానని సునీల్ కుమార్ చెప్పారు.

న్యాయవాదిని దూషించిన టీడీపీ అధికార ప్రతినిధి

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా నరసరావుపేటలో న్యాయవాది రామినేని ప్రసాద్‌ను టీడీపీ అధికార ప్రతినిధి చల్లా సుబ్బారావు అసభ్య పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు విధులకు గైర్హాజరయ్యారు. అనంతరం పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిసి సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. సాక్ష్యాలున్న ఫోన్ ఆడియో రికార్డింగ్‌ను అందజేశారు. ఎస్పీ సూచన మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాది ప్రసాద్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐ ఫిరోజ్‌ను వివరణ అడగ్గా ఇచ్చిన ఫిర్యాదు నాన్ కాగ్నిజబుల్ కావడంతో న్యాయాధికారి అనుమతి కోరామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విదేశీ విద్యాదీవెనపై సర్కారు నిర్లక్ష్యం

- విదేశాల్లో ఎంబీబీఎస్ చదవడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవకాశం
- రెండు విడతలుగా విదేశీ విద్యాదీవెన నిధులు కూడా జమ
- ఇప్పుడు ఆ పథకం ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- ఫీజు కట్టకపోతే తమ పిల్లలను పరీక్షలకు అనుమతించరట
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

మాట్లాడుతున్న తల్లిదండ్రులు తదితరులు

నెల్లూరు రూరల్: వైఎస్ జగన్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'విదేశీ విద్యాదీవెన' పథకం ద్వారా విదేశాల్లో డాక్టర్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు వెంటనే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబుతో కలిసి తల్లిదండ్రులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో విదేశాల్లో ఎంబీబీఎస్ చదవడానికి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కలిగిన వారిని ఎంపిక చేసి రెండు విడతల్లో రూ.12 లక్షల ఫీజులు అందించారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రస్తావనే లేదన్నారు. కజికిస్థాన్‌లోని అల్ఫారాభి వర్సిటీలో ఎంబీబీఎస్ 3వ సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించమని హెచ్చరిక లెటర్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విదేశీ విద్యాదీవెన ద్వారా విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాము అప్పులు తెచ్చి ఫీజు కట్టలేమని, వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆదుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

డివైడర్‌కు జనసేన పార్టీ రంగులు

గుంటూరు రూరల్: 'అధికారం మాది.. ఎవడు మమల్మి అడిగేది' అన్నట్లుంది అధికార పార్టీ నాయకుల తీరు. ప్రభుత్వ, ప్రజలకు చెందిన ఆస్తులకు సైతం పార్టీ రంగులు రుద్ది తమ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం గ్రామంలోని ప్రధాన రహదారి డివైడర్‌కు రాత్రికి రాత్రే జనసేన నేతలు పార్టీ రంగు, గుర్తు వేశారు. తెల్లవారి చూసిన ప్రజలు ఇదేంటి డివైడర్‌కు పార్టీ రంగులు ఎలా వేస్తారని ఆశ్చర్యపోయారు. ఈ అంశం గ్రామంలో చర్చనీయాంశమైంది. అధికారులు కూడా ఏం చేయలేని స్థితిలో ఉన్నారా? లేక తెలిసీ వదిలేశారా? అనే చర్చ జరుగుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి పార్టీ రంగులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED

e-Procurement Tender Notice

Bids are invited for the Spec. No. e-EHVT-21/2025 for System strengthening works at 400/220kV SS Podili, Prakasam District by Making Double LILO (approx. 2.5 kM) of 400 kV Manubolu-VTS/Nunna DC Line (PGCIL Lines) at 400/220kV SS Podili (APTransco) on LS basis. Tenders will be available in https://www.apeprocurement.gov.in from 24.12.2025 at 15:00 Hrs. Ph.No. 0866-2429232, Extn: 2057/2083.

Sd/- Chief Engineer/Projects/VS/Vijayawada

DIPR RO No. 4695PP/CL/Advt/1/1/2021-22, Dt. : 23.12.2025

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
చీఫ్ ఇంజినీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.51/D3/CE/TTD/2025-26 Dt: 22-12-2025

TTD ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో డెబ్బై ఒకటి (71) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి: SE-I: NIT నం.73/SE-I/2025-26 (1 పని), SE-II: NIT నం.870 నుండి 890/SE-II/2025-26 (21 పనులు), SE-III: NIT నం.40 నుండి 43/SE-III/2025-26 (4 పనులు), SE(Elec): NIT నం.29/SE(Elec)/2025-26 (1 పని), EE-III: NIT నం.94 నుండి 95/EE-III/2025-26 (2 పనులు), EE-V: NIT నం.105 నుండి 106/EE-V/2025-26 (2 పనులు), EE-VI: NIT నం.149 నుండి 150/EE-VI/2025-26 (2 పనులు), EE-IX: NIT నం.68 నుండి 69/EE-IX/2025-26 (2 పనులు), EE-XI: NIT నం.100 నుండి 104/EE-XI/2025-26 (5 పనులు), EE-XII: NIT నం.189 నుండి 190/EE-XII/2025-26 (2 పనులు), DE(Elec)-I: NIT నం.264 నుండి 278/DE(Elec)-I/2025-26 (15 పనులు), DE(Elec)-II: NIT నం.466 నుండి 476/DE(Elec)-II/2025-26 (11 పనులు), DE(Elec)-TML: NIT నం.377 నుండి 379/DE(Elec)-TML/2025-26 (3 పనులు). వివరాల కోసం www.tirumala.org కి లాగిన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.

TTD-40021/10/2025-PRO SEC (Adv.No.332) Dt: 23-12-2025 — ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

మీడియా సమావేశానికి ముందు ప్రదర్శించిన యుద్ధ నౌక చిత్రమిది. ఇన్‌సెట్లో ట్రంప్

అద్భుతాల యుద్ధ నౌక

అతి పెద్దది, అత్యాధునికం

- అణు క్షిపణుల్ని మోహరిస్తాం
- నేనే డిజైన్ చేస్తున్నా: ట్రంప్
- గోల్డెన్ ఫ్లీట్‌లో భాగమని వెల్లడి

వాషింగ్టన్: ప్రస్తుత యుద్ధ నౌకలన్నింటికంటే అతి పెద్దది. వేగంలో సాటి లేనిది. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులతో పాటు అణు క్షిపణులను, అత్యాధునిక హై పవర్డ్ లేజర్ క్షిపణులతో శత్రు దుర్నిరీక్ష్యం. అటువంటి కనీ వినీ ఎరగని యుద్ధ నౌకను ఒకదాన్ని అమెరికా తయారు చేయబోతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఈ మేరకు స్వయంగా ప్రకటించారు. 'కొత్త నౌకను నేనే డిజైన్ చేస్తా. ఎందుకంటే సహజంగా నేను మంచి సౌంద ర్యారాధకుణ్ణి' అని చెప్పుకున్నారు. దానికి ముద్దుగా బ్యాటిల్ షిప్ అని పేరు కూడా వెల్ల డించారు. సాగర తలంలో అమెరికా రక్షణ కోసం తాను కలలుగంటున్న గోల్డెన్ ఫ్లీట్ ప్రాజెక్టులో ఇది కీలక భాగం కానుందని ఆయన తెలిపారు. ఇప్పటిదాక నిర్మితమైన అన్ని యుద్ధ నౌకల కంటే కూడా ఇది కనీసం 100 రెట్లు శక్తిశాలిగా ఉండనుందంటూ ఊరిం చారు. గోల్డెన్ ఫ్లీట్‌లోని నౌకలన్నీ అంతే శక్తిమం తంగా ఉంటాయని కూడా ట్రంప్ భవిష్య ద్దర్శనం చేశారు. తన ముద్దుల బ్యాటిల్ షిప్‌కు యూఎస్ఎస్ డిఫైంట్‌గా నామకరణం చేస్తామని తెలిపారు. అయితే ట్రంప్ చెప్పిన ట్టుగా నౌకలపై అణు క్షిపణులను మోహరిం చడం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందానికి విరుద్ధం అవుతుంది. కనుక ఇది ఎంతమేరకు ఆచరణసాధ్యం అన్నదానిపై ఎన్నో సందేహాలు న్నాయి. అధ్యక్షునిగా తొలి టర్మ్‌లో కూడా నేవీని ఆధునీకరించేందుకు ట్రంప్ ఎన్నో పథ కాలు ప్రకటించినా అవి చాలావరకు కాగితాలకే పరిమితమయ్యాయి.

కష్టాల్లో యూఎస్ నేవీ

అమెరికా నావికా దళం కొద్ది రోజులుగా కష్టాల్లో కొనసాగుతోంది. అంచనాలు దాటి మరీ అదుపు తప్పుతున్న వ్యయం కారణంగా చిన్న తరహా యుద్ధ నౌకల తయారీ ప్రాజెక్టును ఇటీవలే అటకెక్కించాల్సి వచ్చింది. ఫోర్డ్ శ్రేణికి చెందిన విమానవాహక నౌకల తయారీ ఆలోచన కూడా చివరి నిమిషంలో వెనక్కు తీసుకుంది. కొత్త నౌకల్లో ట్రంప్ గొప్పగా చెప్పుకున్న పలు అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల ఏర్పాటులో కూడా విఫలమే అయింది. వంద కోట్ల డాలర్లతో ఏళ్ల తరబడి చేపట్టిన నౌకలపై రైల్ గన్ టెక్నాలజీ ప్రాజెక్టుకు కూడా 2021లో నేవీ మంగళం పాడింది. ఈ ఈనేపథ్యంలో నేవీ స్థైర్యాన్ని పెంచేందుకే ట్రంప్ సరికొత్త బ్యాటిల్ షిప్ ఆర్ చేసినట్టు భావిస్తున్నారు.

అన్నీ అబ్బురాలే

ట్రంప్ ఊరిస్తున్న సరికొత్త అత్యాధునిక యుద్ధ నౌకలో అన్నీ అబ్బురాలేనని గోల్డెన్ ఫ్లీట్ పేరిట అమెరికా నేవీ రూపొందించిన కొత్త వెబ్ సైట్ చెబుతోంది. 'ఇదో గైడెడ్ మిస్సైల్ యుద్ధనౌక కానుంది. తక్కువ సిబ్బంది, ఎక్కువ సంఖ్యలో అత్యాధునిక ఆయుధాలు. శత్రు దుర్భేద్యంగా నిర్మాణం. ఇదే దీని మంత్రం. దీనిలో ప్రాథమిక స్థాయి ఆయుధాలే క్షిపణులు కానున్నా యి' అని అందులో రాసుకొచ్చారు. అయితే, దీని తయారీ బహుశా 2030 నాటికి మొదలు కావచ్చని పేరు వెల్లడించేందుకు ఇష్టపడని నేవీ అధికారి ఒకరు చెప్పడం విశేషం!

కృత్రిమ గర్భాశయం!

నెలలు నిండని శిశువులకు వరప్రసాదమే ● కొన్నేళ్లలో అందుబాటులోకి

నెలలు నిండకుండానే జననం. నవజాత శిశు మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ సమస్యకు సైంటిస్టులు తాజా వినూత్న పరిష్కారం కనిపెట్టారు. అదే... కృత్రిమ గర్భాశయం!

37 వారాలు నిండకముందే పుడితే నెల తక్కువ శిశువు అంటారు. అదే 23 నుంచి 27వ వారం మధ్యలోనే, అంటే ఆరు లేదా ఏడు నెలలకే కాన్పు జరిగితే అలాంటి శిశువు బతకడం చాలాసార్లు కష్టమవుతుంది. అంత లేత ఊపిరితిత్తులు బయటి ప్రపంచపు పరిస్థితులను తట్టుకునేందుకు అనువుగా ఉండవు. మిగతా కీలక శరీరాంగాలదీ అదే పరిస్థితి. ఆస్పత్రుల్లో ఇంక్యూబేటర్లలో ఉంచినా, ఎంత వైద్య చికిత్స అందించినా చాలాసార్లు లాభముండదు. అలాంటి శిశువుల్లో ఎక్కువమంది మృత్యువాత పడుతుంటారు. సైంటిస్టులు రూపొందించిన కృత్రిమ గర్భాశయం ఇందుకు పరిష్కారంగా కనిపిస్తోంది. ఇందులో ఉమ్మ నీటితో సహా అన్నీ అచ్చం అమ్మ గర్భంలో లాంటి పరిస్థితులే ఉండటం విశేషం!

సంక్లిష్టమే

కృత్రిమ గర్భాశయం ఆలోచన వినేందుకు సింపుల్ గానే ఉన్నా దాని రూపకల్పన మాత్రం చాలా సంక్లిష్టం. అది పరిమాణంలో దాదాపు ఇళ్లలో పెట్టుకునే సాధారణ అక్వేరియాల మాదిరిగా ఉంటుంది. సిజేరియన్ ద్వారా పుట్టిన నెలలు నిండని శిశువును వెంటనే ఉమ్మనీటితో నిండిన సంచీలో పెడతారు. అక్కడ శిశువుకు వెచ్చదనంతో పాటు తల్లి గర్భంలోని అన్ని పరిస్థితులూ అమరుతాయి. మరి పుట్టిన క్షణం నుంచి అతి కీలకంగా మారే శ్వాసక్రియ పరిస్థితి ఏమిటంటారా? దానికీ మార్గం కనిపెట్టారు. బొడ్డుతాడుకు అనుసంధానించి సింథటిక్ ఉమ్మసంచీ ద్వారా శిశువుకు నిరంతరం ఆక్సిజన్ అందుతూ ఉంటుంది. ఈ కృత్రిమ గర్భాశయంలో అవసరాన్ని బట్టి కొద్ది రోజులు, వారాల నుంచి నెల, ఆపైన కూడా ఉంచే వెసులుబాటు ఉందంటున్నారు దీన్ని రూపొందించిన సైంటిస్టులు. అయితే ఈ కృత్రిమ గర్భాశయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి ఒకటి రెండేళ్ల కన్నా ఎక్కువే పట్టవచ్చట. కానీ ఈ పద్ధతిపై ఇప్పటికే నైతిక తదితర సందేహాలు తలెత్తుతుండటం విశేషం! అవన్నీ తీరి, నెలలు నిండకుండా పుట్టే ప్రతి పాపాయీ బతికి బట్ట కట్టే రోజు వస్తే బాగుంటుంది కదా అన్నది సైంటిస్టుల మాట.

కృత్రిమ గర్భాశయమున్న అక్వేరియం వంటి పరికరం

-సాక్షి, నేషనల్ డెస్క్

ఆగ్రహ జ్వాలలు

హిందూ కార్మికుడి హత్యపై తీవ్ర నిరసనలు

- ఢిల్లీలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తల ఆందోళన
- బంగ్లాదేశ్ హైకమిషన్‌ను ముట్టడించేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. ఇరువర్గాల మధ్య ఘర్షణ

న్యూఢిల్లీ/కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో హిందూ కార్మికుడు దీపూచంద్ర దాస్‌ను అల్లరిమూకలు కొట్టి చంపడం పట్ల విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ మారణకాండను ఖండించడం పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించాయి. వందలాది మంది కార్యకర్తలు కాషాయం జెండాలు చేతబూని బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బారికేడ్లను దాటుకొని ముందుకు దూసుకొచ్చిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హిందూ సంస్థలు ఆందోళనకు పిలుపు ఇవ్వడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బంగ్లాదేశ్ హైకమిషన్ చుట్టూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఏడు అంచెల బారికేడ్లు సిద్ధంచేశారు. పారా మిలటరీ బలగాలను మోహరించారు. ప్రజా రవాణా సంస్థ బస్సులను సైతం వలయంగా నిలిపి ఉంచారు. హైకమిషన్‌కు 800 మీటర్ల దూరంలోనే నిరసనకారులను అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు.

హిందువులకు రక్షణ కల్పించాలి

యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య పట్ల బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున హింసాకాండ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ సిటీలో వస్త్రాల పరిశ్రమలో పనిచేసే దీపూచంద్ర దాస్(25)ను ఈ నెల 18న దుండగులు కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని దహనం చేశారు. దైవ దూషణకు పాల్పడినందుకే దీపూచంద్ర దాస్‌ను శిక్షించినట్లు దుండగులు ప్రకటించారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. హిందూ కార్మికుడి హత్యను పలు దేశాలు ఖండించాయి. భారత్‌లోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం చోద్యం చూస్తోందని వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు ఆరోపించారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ బంగ్లాదేశ్ సర్కార్ తీరును ఖండించారు. దీపూచంద్ర దాస్‌ను పొట్టనపెట్టుకున్న ముష్కరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే బంగ్లాదేశ్‌లోని హిందువులకు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వంపై దౌత్యపరంగా ఒత్తిడి పెంచాలని చెప్పారు. పొరుగు దేశంలోని హిందూ కుటుంబాలకు తమ మద్దతు ఉంటుందన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిరసనకారులు హనుమాన్ చాలీసా పఠించారు. మతపరమైన నినాదాలతో హోరెత్తించారు.

నిరసనలో పాల్గొన్న హిందూ సంఘాల కార్యకర్తలు

భారత రాయబారికి బంగ్లాదేశ్ సమన్లు

భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ మంగళవారం సమన్లు జారీ చేసింది. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమం పట్ల వివరణ ఇవ్వాలని ఆదేశించింది. భారత్‌లోని తమ కార్యాలయాలను నిరసనకారులు లక్ష్యంగా చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తంచేసింది. ఇలాంటి ఘటనలు ఇరుదేశాల దౌత్య సంబంధాలను దెబ్బతీస్తాయని పేర్కొంది. ప్రణయ్ వర్మకు సమన్లు జారీ చేయడం పది రోజుల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం.

హిందూ కుటుంబం ఇల్లు దహనం

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా చట్టోగ్రామ్‌లో హిందూ కుటుంబం ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఇంట్లో జయంతి సంఘా, బాబు షుకుశీల్ కుటుంబాలు నివసిస్తున్నాయి. దుండగుల దుశ్చర్యకు ఇల్లు చాలావరకు దహనమైపోయింది. ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. పెంపుడు శునకాలు మరణించాయి. హిందువులను హెచ్చరిస్తూ దుండగులు ఓ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇస్లామిక్ వ్యతిరేక కార్యకలాపాలు వెంటనే ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అందులో హెచ్చరించారు.

కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న హిందూ జాగరణ్ సభ్యురాలు

కోల్‌కతాలో నిరసనలు

బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వందలాది మంది హిందూ సంఘాల సభ్యులు 'బోంగియో జాగరణ్ మంచ్'ఆధ్వర్యంలో నగరంలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిరసనకారులను చెదరగొట్టడానికి లాఠీచార్జి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణలో పలువురు నిరసనకారులు, పోలీసులు గాయపడ్డారు. మరోవైపు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

ఉద్యోగాలకు క్రైస్తవంతో లింకు

జేడీ వాన్స్ తీరుపై విమర్శలు

వాషింగ్టన్: ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు, ఉపాధికి, మతానికి ముడిపెడుతూ మరోసారి నోటికి పని చెప్పారు. అమెరికా తాలూకు నిజమైన క్రైస్తవ గుర్తింపు కేవలం వ్యక్తిగత విశ్వాసాలకే పరిమితమైనది కాదు. ఈ దేశ ఉపాధికి, ముఖ్యంగా హెచ్–1బీ వీసాలకు కూడా సంబంధించినది. అమెరికా కంపెనీలు మూడో ప్రపంచ దేశాల నుంచి కారుచౌకగా ఉద్యోగులను దేశంలోకి గుమ్మరించడం సరికాదు. వ్యక్తి కుటుంబం ఎంత ముఖ్యమో, దేశక్షేమం కోసం ప్రభుత్వం ఏం చేస్తోందో పూర్తి అవగాహన కలిగివుండటం కూడా అంతే ముఖ్యం. అది మన కనీస బాధ్యత ' అంటూ సోమవారం వ్యాఖ్యలు చేశారు. 'ఇక్కడి ఉద్యోగాలను దేశీయులకు కట్టబెడుతున్న కంపెనీలకు జరిమానాలు విధిస్తున్నాం. ఎందుకంటే సొంత దేశంలో మంచి ఉద్యోగం చేయాలనే ఎవరికైనా ఉంటుంది. అమెరికన్ల ఆ కలలకు ఈ కంపెనీల తీరు తూట్లు పొడుస్తోంది' అని వాన్స్ ఆరోపించారు. హెచ్–1బీ వీసాలకు పరిమితులు విధించేందుకు అదే కారణం. అమెరికా ఎన్నటికీ క్రైస్తవ దేశమే. ఆ విశ్వాసమే మనకు దిక్సూచి' అన్నారు. వాన్స్ వ్యాఖ్యలపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. పలువురు అమెరికన్లు వారిని స్వాగతిస్తుండగా, చాలామంది విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

ఆ రాష్ట్రాల్లో 95 లక్షల పేర్లు మాయం

న్యూఢిల్లీ/భోపాల్/తిరువనంతపురం: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే తర్వాత మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ రాష్ట్రాలు, అండమాన్, నికోబార్ దీవుల్లో మంగళవారం ప్రచురించిన ఓటర్లకు సంబంధించిన ముసాయిదా జాబితాలో దాదాపు 95 లక్షల ఓటర్ల పేర్లు కనిపించకుండా పోయాయి. అండమాన్ నికోబార్‌లో గతంలో 3.10 లక్షల మంది ఓటర్లు ఉండగా వారిలో 64,000 మంది పేర్లు ముసాయిదా జాబితాలో లేకుండా పోయాయి. కేరళలో ఎస్ఐఆర్‌కు ముందు ఏకంగా 2.78 కోట్ల ఓటర్ల పేర్లుండగా ముసాయిదా లిస్ట్‌లో 24.08 లక్షల పేర్లు తొలగించారు. ఛత్తీస్‌గఢ్‌లో 2.12 కోట్ల ఓటర్లుగాను 27.34 లక్షల పేర్లు, మధ్య ప్రదేశ్‌లో 5.74 కోట్ల ఓటర్లకుగాను 42.74 లక్షల పేర్లను తొలగించారు. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను 2026 ఫిబ్రవరి 14వ తేదీన ముద్రిస్తారు. అన్యాయంగా తమ పేరు తొలగించారని భావించే ఓటర్లు వెంటనే మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వీటిపై సమీక్ష తర్వాత ఎలక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారు.

శ్రీలంకకు రూ. 4 వేల కోట్ల ఆర్థిక సాయం

శ్రీలంక అధ్యక్షుడు, ప్రధానితో భేటీ అయిన విదేశాంగ మంత్రి జైశంకర్

కొలంబో: దిత్వా తుపానుతో కలావికలమైన శ్రీలంకను పునరావాసం, పునరుజ్జీవన కార్యక్రమాల కోసం రూ.4,000 కోట్ల ఆర్థికసాయంతో ఆదుకునేందుకు భారత్ ముందుకొచ్చింది. పొరుగున ఉన్న మిత్రదేశం శ్రీలంకకు భారత్‌సదా అండగా నిలబడుతుందని ఈ 45 కోట్ల డాలర్ల సాయాన్ని ప్రకటించిన సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా భారత ప్రధాని మోదీ తరపున ప్రత్యేక రాయబారిగా శ్రీలంకకు విచ్చేసిన మంత్రి జైశంకర్ మంగళవారం శ్రీలంక అధ్యక్షుడు అరుణకుమార దిస్సనాయకే, ఆ దేశ మహిళా ప్రధానమంత్రి హరిణి అమరసూర్యలతో విడివిడిగా భేటీ అయ్యారు. ''శ్రీలంక పునర్‌నిర్మాణానికి 45 కోట్ల డాలర్ల ఆర్థికసాయం అందించేందుకు భారత్ ముందుకొచ్చింది. దిత్వా తుపాను నుంచి తేరుకుని పునర్‌నిర్మాణం దిశగా అడుగులేస్తున్న శ్రీలంకకు ఆపన్న హస్తంఅందించేందుకు మేమున్నామని భారత్ తరఫున ప్రధాని మోదీ రాసిన లేఖను అధ్యక్షుడు అరుణ కుమార దిస్సనాయకేకు అందించా''అని శ్రీలంక విదేశాంగ మంత్రి విజిథ హెరాత్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో జైశంకర్ చెప్పారు. 45 కోట్ల డాలర్లలో 35 కోట్ల డాలర్లను రుణాలరూపంలో, 10 కోట్ల డాలర్లను గ్రాంట్ల రూపంలో భారత్ అందివ్వనుంది.

పునర్‌నిర్మాణం కోసం నిధుల వినియోగం

తుపాను కారణంగా దారుణంగా దెబ్బతిన్న మౌలికవసతుల పునరుద్ధరణకు ప్రధానంగా నిధులను ఖర్చుచేయనున్నారు. నామరూపాల్లేకుండా కొట్టుకుపోయిన రోడ్ల పునర్‌నిర్మాణం, రైల్వే ట్రాక్‌లు, వంతెనల మరమ్మతులు, కుప్పకూలిన ఇళ్లను నిర్మించడం, ఆరోగ్య, విద్యా వ్యవస్థలకు తోడ్పాటునందించడం, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలకు తగు ఆర్థికసాయం అందించడం వంటి కీలక పనులను నిధులను సద్వినియోగం చేయనున్నారు. ''నిధుల సత్వర విడుదలతోపాటు ఆయా పనుల కోసం సమన్వయంతో పనిచేసేలా 'ప్రభావవంత సహకార వ్యవస్థ'ఏర్పాటుకు కృషిచేస్తున్నాం''అని జైశంకర్ చెప్పారు. అంతకుముందు స్టీల్ ప్యానెళ్లతో నిర్మించిన 120 అడుగుల పొడవైన బేలీ రకం వంతెనను తుపాను ప్రభావిత ఉత్తర ప్రావిన్స్‌లోని కొలినొచ్చి జిల్లాలో జైశంకర్ ప్రారంభించారు. 110 టన్నుల బరువైన ఈ వంతెనను విడిభాగాలుగా భారత్ నుంచి విమానంలో తీసుకొచ్చి శ్రీలంకలో బిగించారు. ఆపరేషన్ సాగర్ బంధు కార్యక్రమంలో భాగంగా బేలీ వంతెనను శ్రీలంకకు భారత్ సరఫరాచేసింది. ఆపరేషన్ సాగర్ బంధు సహాయక మిషన్‌లో భాగంగా భారత్ ఇప్పటికే పెద్ద ఎత్తున టెంట్లు, టార్పాలిన్లు, శుభ్రతా కిట్లు, నిత్యావసర వస్తువులు, నీటి శుద్ధి యంత్రాలను అందించింది. 14.5 టన్నుల ఔషధాలు, వైద్య ఉపకరణాలనూ ద్వీపదేశానికి సరఫరాచేసింది.

జై శంకర్‌తో శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య

3 వేల డాలర్లు ఇస్తాం.. వెళ్లిపోండి

అక్రమ వలసదారులకు అమెరికా ఆఫర్

వాషింగ్టన్: అక్రమ వలసదారులను సాధ్యమైనంత త్వరగా వదిలించుకోవాలని అమెరికా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. నయానో భయానో బయటకు పంపించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా అక్రమ వలసదారులకు సరికొత్త ఆఫర్ ప్రకటించింది. 3 వేల డాలర్లు(రూ.2.68 లక్షలు) ఇస్తామని, దేశం విడిచిపెట్టి వెళ్లిపోవాలని సూచించింది. ఇప్పటిదాకా ఈ ఆఫర్ వెయ్యి డాలర్లుగా ఉండేది. యూఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ దీన్ని 3 వేల డాలర్లకు పెంచింది. అంతేకాకుండా బయటకు వెళ్లిపోయేవారికి ఉచితంగా విమాన ప్రయాణ టికెట్ కూడా అందజేస్తామని పేర్కొంది. అమెరికాలో ఇన్నాళ్లూ అక్రమంగా ఉన్నందుకు విధించే పన్నులు, జరిమానాలు సైతం రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. స్వదేశాలకు వెళ్లిపోవాలని భావించేవారు సీబీపీ వన్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని వెల్లడించింది. ఈ నెల 31వ తేదీకల్లా రిజిస్టర్ చేసుకొని, సమగ్రంగా వివరాలు అందజేసినవారికి ఆఫర్ వర్తిస్తుందని స్పష్టంచేసింది.

పీఐఏను రూ.4 వేల కోట్లకు అమ్మేసిన పాకిస్తాన్

ఇస్లామాబాద్: నష్టాల ఊబిలో చిక్కుకున్న ప్రభుత్వరంగ విమానయాన సంస్థ భారాన్ని పాకిస్తాన్ విజయవంతంగా వదిలించుకుంది. పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్(పీఐఏ)ను ఆ దేశ కరెన్సీలో రూ.13,500 కోట్లకు అమ్మేసింది. భారత కరెన్సీలో ఇది రూ.4,317 కోట్లకు సమానం. వేలంలో మూడు సంస్థలు పోటీ పడగా చివరికి ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఆరిఫ్ హబీబ్ ఈ బిడ్‌ను దక్కించుకుంది.

హెచ్-1బీ లాటరీకి చెల్లుచీటీ

- హెచ్చు నైపుణ్యం, వేతనం
- ఇవే వీసా జారీకి కొత్త ప్రాతిపదిక
- ట్రంప్ సర్కారు కీలక నిర్ణయం
- భారతీయులకు శరాఘాతమే

న్యూయార్క్/వాషింగ్టన్: హెచ్–1బీ వీసాలపై కొంతకాలంగా కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కారు వాటి కట్టడి దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్–1బీ వీసాదారుల ఎంపికకు పాటిస్తున్న లాటరీ విధానాన్ని రద్దు చేస్తున్నట్టు హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ విభాగం మంగళవారం ప్రకటించింది. ఇకపై అత్యధిక నైపుణ్యం, వేతనం ఉన్న వారికే ఆ వీసాల జారీలో అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు స్పష్టంచేసింది. దీంతో నైపుణ్యం తక్కువగా ఉన్న విదేశీఉద్యోగుల రాక తగ్గిపోయి ఆ ఉద్యోగాలు అమెరికన్లకు దక్కే అవకాశముంది. హెచ్–1బీ వీసాల జారీని ఇకపై యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) ద్వారా చేపట్టనుంది. ''ఇప్పటిదాకా కొనసాగిన కంప్యూటరైజ్ హెచ్–1బీ వీసా లాటరీ వ్యవస్థ లోపభూయిష్టంగా తయారైంది. దీనిని కంపెనీలు ఎంతగానో దుర్వినియోగం చేశాయి. విదేశీ ఉద్యోగులను కారుచవగ్గా తీసుకొచ్చి అమెరికాలో పని చేయించుకున్నాయి. ఫలితంగా ఐటీ తదితర ఉద్యోగాల్లో అమెరికన్లకు చాలా అన్యాయం జరిగింది. ఇకపై దీన్ని సరిదిద్దుతాం. ఇకపై నాలుగు రకాలుగా వేతనాలను వర్గీకరించి దానికనుగుణంగా హెచ్–1బీలను జారీచేస్తాం. ఎంట్రీ లెవల్ అభ్యర్థులు(1), అర్హత సాధించిన అభ్యర్థులు(2), అనుభవం ఉన్న అభ్యర్థులు(3), అత్యధిక నైపుణ్యమున్న అభ్యర్థులు(4)గా దరఖాస్తులను విభజించి ఆ మేరకే హెచ్–1బీ వీసాలను జారీచేయాలని ప్రతిపాదించాం. ఈ ప్రతిపాదనలను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్(ఓఎంబీ)కి సమీక్ష కోసం పంపించాం. అక్కడ ఆమోదం పొందాక ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురిస్తాం. ఆ తర్వాత 30 రోజులకు కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి'' అని యూఎస్‌సీఐఎస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ స్పష్టం చేశారు. హెచ్–1బీ వీసా విధానాన్ని సమూలంగా సంస్కరించాలన్న ట్రంప్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అయితే అన్ని స్థాయిల్లో అర్హులకు వీసాలు లభించేలా చూసే ప్రయత్నం జరుగుతుందంటూ ఆయన ముక్తాయించారు. కొత్త విధానం వచ్చే ఫిబ్రవరి 27వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. అమెరికాలో ఉన్నతోద్యోగాలు చేయాలన్న విద్యాధిక భారత యువత, ముఖ్యంగా ఐటీ జీవుల కలలపై ఈ నిర్ణయం మరిన్ని నీళ్లు చల్లింది.

అస్సాంలో ఘర్షణలు.. ఇద్దరు మృతి

దిపు/గువాహటి: గిరిజన ప్రాంతాల్లో పశుమేత కోసం కేటాయించిన భూములను బిహార్ నుంచి వలసవచ్చిన అక్రమ చొరబాటుదారులు అన్యాక్రాంతం చేస్తున్నారని, వాళ్లను తక్షణం వెళ్లగొట్టాలన్న డిమాండ్‌తో మొదలైన ఆందోళనలు అస్సాంలో రెండోరోజూ కర్బీ అన్‌గ్లాంగ్ జిల్లాలో కొనసాగాయి. రెండు బృందాలకు చెందిన నిరసనకారులు ఆందోళనకు దిగడంతో భద్రతాబలగాలు లాఠీచార్జ్ చేశాయి. ఈ ఆందోళనల్లో 45 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఐపీఎస్ ఆఫీసర్లు సహా 38 మంది పోలీసులు ఉన్నారు. దీంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు భాష్పవాయు గోళాలను ప్రయోగించాయి.

తేజస్.. మరింత సేఫ్

సురక్షితమైన ల్యాండింగ్‌ను సుసాధ్యం చేసే హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్ బిగింపు

దేశీయతయారీ తేలికపాటి యుద్ధవిమానం తేజస్ భద్రతను మరింత పెంచే దిశగా భారత్ మరో ముందడుగు వేసింది. అత్యాధునిక హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్‌ను తేజస్ వెనుకభాగంతో అనుసంధానించింది. అత్యవసర సందర్భాల్లో అత్యంత వేగంగా యుద్ధవిమానవాహక నౌక లేదా రన్‌వేపై దిగాల్సిన సందర్భాల్లో ఎలాంటి ప్రమాదం జరక్కుండా పైలట్‌కు, విమానానికి సాయపడేలా హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్‌ను డిజైన్‌చేశారు. పూర్తి దేశీయంగా గ్లైడర్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ అధునాతన పారాచూట్‌కు తుదిరూపునిచ్చింది. తేజస్ వంటి యుద్ధవిమానాల రక్షణను ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని దీనిని తయారుచేశారు. ఈ పారాచూట్ బరువు సైతం చాలా తక్కువ. దీంతో పేలోడ్(మందుగుండు)ను మోసుకెళ్లే తేజస్‌కు కొత్తగా అదనపు బరువు లాంటి సమస్యలేవీ ఉండబోవు. దీంతో అత్యంత వేగంగా గాల్లో దూసుకెళ్లేటప్పుడు భార సంబంధ ఇబ్బందులు తలెత్తబోవు. దీంతో అత్యవసర సందర్భాల్లో అత్యల్ప పొడవైన రన్‌వేలపై ల్యాండ్ అయ్యాక తక్కువ దూరంలో ఆగిపోయేలా ఈ పారాచూట్ ఎంతగానో సాయపడుతుంది.

ఎలా ఉపయోగకరం?

సాధారణ పౌరవిమానాలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ల్యాండ్ అయినప్పుడు రన్‌వేకు ఆ కొన వద్ద ల్యాండ్ అయి రెండు, మూడు కిలోమీటర్ల దూరం దాకా రన్‌వేపై పరుగులు తీస్తాయి. అత్యవసర సందర్భాల్లో తేజస్ వంటి యుద్ధవిమానాలకు అంత పొడవాటి రన్‌వే ఉండే విమానాశ్రయాలు అందుబాటులో ఉండవు. తక్కువ పొడవున్న రన్‌వేలపై ల్యాండ్ అయ్యాక వేగంతో అలాగే ముందుకు దూసుకెళ్లకుండా ఈ హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్ నిలువరిస్తుంది. దీంతో బ్రేకింగ్ వ్యవస్థలపై పనిభారం భారీగా తగ్గుతుంది. వెడల్పాటి ప్లస్ గుర్తు ఆకృతిలో ఉండే భారీ వస్త్రపు చివరలను కలుపుతూ గొడుగు ఆకృతిలో దీనిని తయారుచేస్తారు. ల్యాండింగ్ పూర్తయ్యాక రన్‌వే మీద విమానం అటూఇటూ ఊగకుండా స్థిరంగా ముందుకు కదిలేలా ఈ పారాచూట్ సాయపడుతుంది. రన్‌వే మీద విమానం ముందుకు దూసుకెళ్లేటప్పుడు ఎదురుగా వచ్చే అత్యధిక గాలి, ఒత్తిడిని తట్టుకుని ఇది విమానాన్ని వేగంగా ఆపేయగలదు. పారాచూట్ వెడల్పు కేవలం 5.75 మీటర్లు. విస్తీర్ణం 17 చదరపు మీటర్లు. దీని బరువు కేవలం 10 కేజీలు. యుద్ధవిమానం గంటకు 285 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తూ హఠాత్తుగా రన్‌వేపై ల్యాండ్ అయినా కూడా సమయానుగుణంగా విచ్చుకుని త్వరగా విమానం రన్‌వే మీద ఆగేలా చేస్తుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్ అంటే?

సాధారణ సందర్భాలతోపాటు అత్యవసర సమయాల్లోనూ విమానాన్ని నిర్దేశిత దూరం తర్వాత రన్‌వే మీద ఆపగలిగే సామర్థ్యమున్న పారాచూట్‌ను హైబ్రిడ్ బ్రేక్ పారాచూట్‌గా పిలుస్తారు. తెగిపోని, అత్యంత కఠినమైన నైలాన్, కెవ్లార్ వంటి కృత్రిమ రసాయన దారాలతో ఈ పారాచూట్‌ను తయారుచేస్తారు. విమానం రకం, బరువు, ల్యాండింగ్ గరిష్ట వేగాలకు తగ్గ బరువు, సైజు, డిజైన్‌తో పారాచూట్‌ను తయారుచేస్తారు.

యూపీలో పొగమంచు బీభత్సం

- రహదారిపై ఒకదానితో మరోటి ఢీకొన్న పలు వాహనాలు
- ఇద్దరు మృతి ● 16 మంది గాయాలు

అమేథీ(యూపీ): రహదారులపై పొగమంచు సంబంధ వాహన ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. సోమవారం అర్ధరాత్రిదాటాకా 2.30 గంటలప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని అమేథి జిల్లాలో రహదారిపై భారీగా పొగమంచు కమ్ముకోవడంతో రోడ్డు సరిగా కనబడక ట్రక్కు రోడ్డుపక్క రెయిలింగ్‌ను ఢీకొట్టగా దాని వెనుకొచ్చే వాహనాలు ఒకదానివెంట మరోటి ఢీకొని ధ్వంసమై శిథిలాల కుప్పగా మారాయి. మొత్తం నాలుగు ట్రక్కులు, ఒక కారు, ఒక బస్సు ఢీకొన్న ఈ దుర్ఘటనలో వాహనాల్లో ఇరుక్కుపోయి ఇద్దరు ట్రక్కు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారు. 16 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించారు. ముసాఫిర్‌ఖాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిపై అమేథీ–సుల్తాన్‌పూర్ మలుపు వద్ద జరిగింది.

సాక్షి
గుంటూరు

బుధవారం । 24 । డిసెంబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 567.70 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 37,777 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు నిల్వ 41.6840 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1100 వరకు పలికింది.

న్యూస్‌రీల్

క్రిస్మస్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్థానిక బాలఏసు దేవాలయంలో ప్రత్యేక పూజాబలి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశా రు. దేవాలయానికి విద్యుత్ దీపాలు వేయడంతో కాంతులీనుతుంది. నవదిన ప్రార్థనల్లో భాగంగా కొత్తపేటకాలనీ, లూర్దునగర్, క్రీస్తునగర్, జగన్ కాలనీ ప్రాంతాల్లో దేవాలయ సహాయ విచారణ గురువు కె.సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 24న ఉదయం విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో దివ్యపూజాబలి, రాత్రి 11.30 గంటలకు క్రీస్తుజయంతి మహోత్సవం, జాగరణ దివ్యపూజాబలిలో మేత్రాసన గురువు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొంటారని చెప్పారు. 25న దివ్యపూజాబలి నిర్వహిస్తారని గురువులు ఫాతిమా మర్రెడ్డి, టి.కమలేష్‌లు పాల్గొంటారని తెలిపారు. అదేరోజు రథోత్సవం, తేరు ప్రదక్షణ నిర్వహిస్తారని చెప్పారు.

ఆంధ్రా రోమ్ ఫిరంగిపురం

ఫిరంగిపురం: ఆంధ్రారోమ్‌గా ఫిరంగిపురాన్ని పిలుస్తారని బాలఏసు దేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి అన్నారు. బిషప్‌హౌస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఫిరంగిపురం అనగానే కథోళిక క్రైస్తవులు ఎక్కువ మంది కలిగిన గ్రామంగా ప్రసిద్ధి చెందిందన్నారు. దేవాలయం నిర్మించి 140 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పండుగను వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

నరసింహావతారంలో వేంకటేశ్వరస్వామి

తెనాలిటౌన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో స్వామివారికి ముక్కోటి ఏకాదశి దశావతార మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామివారిని నరసింహావతారంలో అలంకరించి పురవీధుల్లో రథంపై ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్



తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయాన్ని దాతల సాయంతో ఆధునికీకరించి ఇటీవల పునఃప్రారంభించిన సంగతి విదితమే. ఈ కార్యాలయాన్ని తన పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి, నూతన సౌకర్యాలు, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యాలయానికి అధునాతన శోభగులద్దిన తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, దాతలను అభినందించారు. కలెక్టర్ వెంట తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా ఉన్నారు.

పోలేరమ్మకు బంగారు హారం



ప్రత్తిపాడు: పోలేరమ్మ తల్లికి భక్తులు బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో కొలువుదీరిన పోలేరమ్మ తల్లికి తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన వి.వి శేఖర్‌రెడ్డి సుమారు రూ.5.60లక్షల విలువచేసే బంగారు హారాన్ని అమ్మవారికి సమర్పించారు. హారాన్ని మంగళవారం ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జక్కా శ్రీనివాసరావుకు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రిస్మస్ సందడి

"లోక రక్షకుడి జననం సర్వమానవాళికి శుభదినం
క్రీస్తు జననానికి దృగ్గోచ్చకం ఆకాశన వెలిసిన నక్షత్రం
పశువుల పాకలో మహనీయుని జననం..
విధేయతా నిదర్శనం
ఆయన జననం, జీవనం.. సర్వమానవాళికి
పంచెను శాంతి సందేశం"

గుంటూరు జిల్లా అంతటా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. లోక రక్షకుడైన క్రీస్తు ఆగమనాన్ని తెలిపే రకరకాల నక్షత్రాలను క్రైస్తవులు తమ ఇళ్లపై అలంకరించగా.. చర్చిలపై, ఆయా కూడళ్లలో భారీ స్టార్లు వెలిశాయి. గుంటూరు మార్కెట్లలో రకరకాల ఆకారాల్లో స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, ట్రీ అలంకరణ సామగ్రి, పశువుల పాక సెట్టింగులు, శాంటాక్లాజ్ మొదలైన క్రిస్మస్ వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

విద్యుత్ వెలుగుల్లో గుంటూరులోని నార్త్ ప్యారిస్ చర్చి

విద్యుత్ కాంతుల్లో డాన్‌బాస్కో చర్చి

విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న డాన్‌బాస్కో కార్యాలయం

ఆర్వోబీ నిర్మాణ ప్లాన్

బహిర్గతం చేయాలి

- ప్లాన్ లేకుండా బ్రిడ్జి నిర్మాణం గుంటూరులోనే జరుగుతోంది
- శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో చట్టబద్ధంగా వ్యవహరించాలి
- కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలి
- ముందు చూపు లేకుండా బ్రిడ్జి కూల్చివేతతో నరకాన్ని చూస్తున్న ప్రజలు
- అధికారుల ఏకపక్ష వైఖరి ప్రజలందర్నీ ఇబ్బందుల్లోకి నెట్టింది
- భూ సేకరణ చేస్తామన్న కేంద్ర మంత్రి పెమ్మసాని
- క్షేత్రస్థాయిలో నిబంధనలు పాటించేలా చూడాలి
- బెటర్ శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి

మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ ఎల్ ఎస్ భారవి

గుంటూరుఎడ్యుకేషన్: గుంటూరు నగరంలో శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూల్చివేసి, కొత్తది నిర్మించే వ్యవహారంలో అధికార యంత్రాంగం చేసిన తప్పిదాలతో ప్రజలు నరకాన్ని చవి చూస్తున్నారని బెటర్ శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ సాధన జేఏసీ కన్వీన్ ఎల్.ఎస్.భారవి అన్నారు. ప్లాన్ లేకుండా బ్రిడ్జి నిర్మాణం ఒక్క గుంటూరులోనే జరుగుతోందన్నారు. మంగళవారం గుంటూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా ఆగస్టు 9న పాత బ్రిడ్జి కూల్చివేసిన తరువాత గుంటూరు నగరంలో ప్రజలు తీవ్రమైన ట్రాఫిక్ కష్టాలు చవి చూస్తున్నారని చెప్పారు. సాంకేతికంగా సర్వే నిర్వహించకుండా ఏకపక్షంగా కూల్చివేసిన అధికారులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

అధికారుల తప్పిదాలపై మొదటి నుంచీ చెబుతున్నాం

బ్రిడ్జి కూల్చివేతకు రంగం సిద్ధం చేసిన సమయంలోనే అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, ఏకపక్ష విధానాలపై జేఏసీ పరంగా తాము వెలుగులోకి తెచ్చామని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి ముందుగా ఆర్‌యూబీ నిర్మించాలని చేసిన ప్రతిపాదనలపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తాజాగా దృష్టి సారించడం మంచి విషయమేనని అన్నారు. బ్రిడ్జి కూల్చివేత, పునఃనిర్మాణ పనుల పరిశీలనకు హైకోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ నెల రోజుల క్రితం క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన సమయంలో నిర్మాణ ప్లాన్‌ను ప్రజలకు తెలిసే విధంగా బహిరంగ పర్చాలని తాము చేసిన డిమాండ్‌పై అధికార యంత్రాంగం ఇప్పటికీ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు.

ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత

పాత బ్రిడ్జి స్థానంలో ఎటువంటి బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతున్నారో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. 930 మీటర్ల పొడవు, 74 అడుగుల వెడల్పుతో చేపడుతున్న బ్రిడ్జి కారణంగా రెండు వైపులా సర్వీసు రోడ్లు కేవలం 17 అడుగుల మేరకు ఉంటాయని, అవి వాహనాల రాకపోకలకు, పార్కింగ్‌కు ఏ మాత్రం సరిపోవన్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలను కూల్చివేయకుండా ఒకే పిల్లర్‌తో ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని జేఏసీ తరఫున మొదటి నుంచి చేస్తున్న డిమాండ్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎట్టకేలకు గుర్తించిన మీదట భూ సేకరణ జరుపుతామని ప్రకటించడం మంచి పరిణామమేనని, దీనిపై జిల్లా కలెక్టర్‌తో నోటిఫికేషన్ జారీ చేయించి, నిబంధనల ప్రకారం చేయించాలని కోరారు. 930 మీటర్ల పొడవు, ఎర్త్‌వాల్‌తో కూడిన బ్రిడ్జి నిర్మాణం కారణంగా ఏసీ కళాశాల కూడలిలో యూ టర్న్ తీసుకునే పరిస్థితులు ఉండవని, హిందూ కళాశాల కూడలికి వెళ్లి అక్కడ టర్న్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫలితంగా ట్రాఫిక్ మొత్తం బ్రిడ్జిపైనే పడుతుందని, అంబులెన్స్‌లు, అత్యవసర ఆస్పత్రులకు వెళ్లాల్సిన రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ముందుగానే ఆర్‌యూబీ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు కమల్ కాంత్, మద్ది రాధాకృష్ణ, బెల్లంకొండ శ్రీనివాసరావు, వల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

గుంటూరులో 104 ఉద్యోగుల ధర్నా

కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న 104 సిబ్బంది

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : 104 ఉద్యోగులకు భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ చేస్తున్న అన్యాయానికి నిరసనగా జిల్లా కలెక్టరేట్ వద్ద మాస్ లీవ్ పెట్టి మంగళవారం ధర్నా చేపట్టారు. ధర్నాకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ఎల్ఐసీ నాయకులు వీవీకే సురేష్, ఎం. రాజేశ్వరరావు, 108 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, వై.శివశంకర్‌లు మద్దతు తెలిపారు.

- లక్ష్మణరావు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు తగ్గించిన వేతనాలు, రద్దు చేసిన క్యాజువల్ లీవులు పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులపై భవ్య యజమాన్యం వేధింపులు ఆపాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి చాట్ల రాంబాబుకు ఇచ్చిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వారిపై వేధింపులకు పాల్పడాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఐదు ఏళ్లు సర్వీసు దాటిన డ్రైవర్లకు స్లాబ్ వేతనాలు చెల్లించాలన్నారు. డీఈవోలకు డ్యూటీలను విధించకుండా జీవో ప్రకారం రూ.18,500 వేతనం చెల్లించాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులు 104 వాహనంలో అందుబాటులో ఉంచాలన్నారు.
- ఎల్ఐసీ నాయకులు వీవీకే సురేష్, 108 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబు, వై.శివశంకర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించడంలో వెనుకబడిందన్నారు. భవ్య యాజమాన్యం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. రోడ్లపైకి వచ్చే ఆందోళన చేపట్టానికి పూర్తి బాధ్యత భవ్య యాజమాన్యందే అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు.
- ధర్నా అనంతరం డీఆర్వో షేక్ ఖాజావలిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరంట్ల సురేష్ కుమార్, శ్రీహర్ష, కోశాధికారి ఐ.నాగులు, నాయకులు సుధా, ఏడుకొండలు, సత్యరాజ్, బాలకృష్ణ, జి.సుబ్బారావు, శంకర్, విజయ్, సాయిరాం, వెంకట్రావు, హరి, విజయ్ 108 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు షేక్ హసన్, హాసన్ కమల్, రాజకుమార్, బాజీ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

అభ్యుదయ రైతును సన్మానిస్తున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరురూరల్: నగర శివారుల్లోని లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ అధ్యక్షత వహించగా, వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ అకాల పరిస్థితులను తట్టుకుని అధిక ఆదాయం పొందే రకాలను, శాస్త్ర పరిజ్ఞానాన్ని, శాస్త్రవేత్తలు రైతులకు అందజేయాలన్నారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు కొలకలూరు గ్రామానికి చెందిన యన్నం లక్ష్మయ్య, గుడిపూడికి చెందిన గద్దె హనుమంతరావు, మోతడక గ్రామానికి చెందిన మన్నవ వెంకటేశ్వర్లు, గ్రంధసిరి గ్రామానికి చెందిన కిలారి రామారావు, మునిపల్లికి చెందిన గుంటుపల్లి వరప్రసాద్, వేజండ్లకు చెందిన తాడిబోయిన చంద్రశేఖర్‌లను సన్మానించారు.

మొక్కజొన్న వైపు రైతు మొగ్గు

- తెనాలి డివిజన్‌లో రబీలో విస్తారంగా సాగు
- ఎకరాకు 35–40 టన్నుల దిగుబడి
- మార్కెట్ ధర కూడా ఆశావహం
- తెగుళ్ల దాడితో అపరాలకు స్వస్తి

కొల్లిపరలో రెండు వారాల దశలో మొక్కజొన్న పైరు

తెనాలి: జీరో టిల్లేజ్ (సున్నా ఖర్చులు) విధానంలో వరి మాగాణుల్లో మొక్కజొన్న సాగును చేపట్టి విప్లవాన్ని సృష్టించిన తెనాలి రైతులు ప్రస్తుత రబీలోనూ అదే పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజనులో ప్రతికూల పరిస్థితుల్లో ఖర్చులు పెరిగి, దిగుబడులు తగ్గాయి. చేదు అనుభవంతో ఎంతోకొంత ఆదాయాన్ని ఇచ్చే మొక్కజొన్న వైపు మళ్లుతున్నారు. జిల్లాలో వరి నూర్పిడులు అయిన చోట్ల పంటను వేస్తున్నారు. ముందుగా విత్తిన చేలల్లో ఇప్పుడు పైరు రెండు వారాల దశలో ఉంది. ఈ పర్యాయం జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

తెనాలి డివిజన్‌లో అధికం

ఏటా రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు అత్యధికంగా తెనాలి డివిజన్‌లోనే అధికంగా ఉంటుంది. గతేడాది జిల్లాలో 1,22,887 ఎకరాల్లో సాగుచేశారు. దుగ్గిరాలలో 10 వేల ఎకరాలు, పొన్నూరులో 20,665, తెనాలిలో 15,027, కొల్లిపరలో 13,037 ఎకరాల్లో సాగుచేశారు. ఈ పర్యాయం విస్తీర్ణం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2025–26 సీజన్‌లో మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400గా నిర్ణయించింది. గతేడాదితో పోలిస్తే రూ.175 అదనం. ప్రస్తుతం పొరుగున ఉన్న కృష్ణా జిల్లాలో క్వింటాలు రూ.2,020కు కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం రూ.2,100–రూ.2,200కు కొనుగోళ్లు జరిగాయి.

హైబ్రిడ్ రకాల సాగు

ప్రస్తుత రబీ సీజనులో అధిక దిగుబడిని ఇవ్వగల అడ్వాట్, పయొనీర్, డీకేజీ రకాల హైబ్రిడ్ రకాలను రైతులు విత్తుతున్నారు. నాలుగు కిలోల ప్యాకెట్ ధర రూ.2,000ఉంది. ఒక్కో ఎకరాకు ఎనిమిది కిలోలు వేస్తున్నారు. విత్తనాలకు రూ.4,000, విత్తటానికి కూలీలు ఖర్చు, బెజ్జాలు చేయటానికి, కలుపుమందుకు కలిపి ఎకరాకు రూ.7,300 అవుతోంది. ముందుగా వరి నూర్పిడులు పూర్తయిన కొల్లిపర మండలంలో ఇప్పటికే మూడు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న విత్తారు. ఇక్కడ పైరు 15 రోజుల దశలో ఉంది. మొదటి నీటి తడినీ కూడా ఇచ్చారు. ఇతర ప్రాంతాల్లోనూ సాగులో రైతులున్నారు. గతేడాది చంద్రబాబు ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అయినా మార్కెట్ ధర 'మద్దతు' ధరకు దగ్గర్లో ఉండటంతో రైతులు ఆశావహంగా ఉన్నారు.

అమెరికాను మించిన ఉత్పాదకత

మొక్కజొన్న సాగుకు పేరొందిన అమెరికాలో హెక్టారుకు 10 టన్నుల దిగుబడిని సాధిస్తుంటే, డెల్టాలో మరీ ముఖ్యంగా తెనాలి ప్రాంత రైతులు 11 టన్నుల వరకు తీయడం రికార్డు. దీనిపై ఢిల్లీలోని డైరెక్టరేట్ ఆఫ్ మెయిజ్ రీసెర్చ్ అధికారులు ఇక్కడ కొచ్చి పరిశీలించారు. వివరాలు, విశేషాలతో 'ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న విప్లవం–ఏక సంకరజాతి, జీరో టిల్లేజ్ పాత్ర'అనే సాంకేతిక బులెటిన్‌ను ప్రచురించారు. దేశమంతా వణికించిన కత్తెర తెగులునూ సమర్థంగా ఎదుర్కొన్నారు. ఖర్చులు భరించలేని కొందరు రైతులు మొక్కజొన్నకు బదులుగా జొన్నపైరును కూడా వేస్తున్నారు.

తెనాలి రైతుల ప్రత్యేకత

తెనాలి-చదలవాడ రోడ్డులో పొలంలో యూరియా చల్లుతున్న కూలీలు

మాగాణి పొలాల్లో మొక్కజొన్న సాగుకు ఆద్యులు డెల్టా రైతులే. వరి తర్వాత రబీలో సంప్రదాయంగా సాగుచేసే అపరాలకు పల్లాకు తెగులు సోకడంతో మంగళం పాడారు. తెనాలి ప్రాంత రైతులు దుక్కి దున్నకుండానే ఏక సంకరజాతి మొక్కజొన్నను విత్తారు. చక్కని దిగుబడులు రావడంతో కొనసాగించారు. ఏటికేడాది విస్తీర్ణం పెంచారు. వందల ఎకరాలతో ఆరంభించి, ఏడెనిమిదేళ్లలోనే 2.20 లక్షల ఎకరాల వరకు పెరిగింది. మధ్యలో అపరాలకు మార్కెట్ ధరలు భారీగా పెరగటంతో పంట మార్పిడికి వెళ్లినా, తర్వాత వాటి ధరలు తగ్గటంతో మళ్లీ మొక్కజొన్న సాగుకే మళ్లారు. ఎకరాకు 35–40 టన్నుల దిగుబడిని తీస్తున్నారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళ వారం ధరలు)

వచ్చిన బస్తాలు	82,244
అమ్మకాలు	55,787
నిల్వ	12,631

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు-5	12,000–15,200
273	11,000–17,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,800
నంబరు-5	11,000–15,000
341	11,000–16,500
4884	12,000–14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 16,200
బాడిగ-355	11,000 - 16,500
దేవనూరు డీలక్స్	11,000 - 16,500
ఆర్మూర్	10,000 - 12,700
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ - 355	10,000–16,500
దేవనూరు డీలక్స్	10,500–16,000
తాలు	5,200 -7,000

-కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళ వారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 624

కొమ్ములు : 506 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,650	13,000	12,625

కాయలు : 118 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,625	13,000	12,625

మొత్తం అమ్మకాలు : 468 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మైనారిటీల ఆస్తులు దోపిడీకి కుట్ర

నువ్వు అసలు మైనారిటీవేనా..!
- వక్ఫ్ భూముల లాక్కుంటుంటే చేతకాని దద్దమ్మలా..
- ఎమ్మెల్యేపై వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ముస్లిం మైనారిటీల ఆస్తులు దోపిడీ చేస్తుంటే.. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చేతకాని దద్దమ్మలా చూస్తూ.. తనకేమి తెలియదంటూ వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా నిప్పులు చెరిగారు. అంజుమన్ ఏ ఇస్లామియాకు చెందిన చినకాకానిలోని 71.57 ఎకరాల భూమిని ఇండ్రస్టియల్ పార్క్ పేరుతో దోచుకుంటుంటే.. మైనారిటీ ఎమ్మెల్యేగా నసీర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన 71 ఎకరాల భూమి చినకాకానిలో ఉందని చెప్పారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆయన సోదరుడు రవి, ఎమ్మెల్యే నసీర్అహ్మద్, కూటమి పెద్దలు కలిసి గుట్టుచప్పుడు కాకుండా ఆ భూములను కైంకర్యం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఇండ్రస్టియల్ పార్క్‌కు ఇవ్వాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేసిన తరువాత ఇవ్వాలని, అదేమి లేకుండా నేరుగా టెండర్లు పిలవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నసీర్అహ్మద్ ఈవిషయంపై ప్రశ్నిస్తే తనకేమి తెలియదని చెప్పటం సిగ్గుచేటన్నారు. పర్సంటేజ్ తీసుకుని నోరు మెదపటంలేదని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామని, శాంతియుత వాతావరణంలో ఎంతటి పోరాటానికి వెనుకాడబోమన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాంరసూల్ మాట్లాడుతూ చినకాకానిలో అంజుమన్‌కు సంబంధించిన భూమి మొత్తం 81.22 ఎకరాలు ఉంటే.. ఇప్పుడు 71 ఎకరాలకు టెండర్లు పిలిచారని, అసలు ఆ 10 ఎకరాలు ఏమైందో తెలియకుండా పోయిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు, మైనారిటీ విభాగం నేతలు పఠాన్ సైదాఖాన్, పఠాన్ అబ్దుల్లాఖాన్, లియాఖత్‌ఆలీ, అప్సర్, కార్పొరేటర్లు ఫర్జానా, ఆబీద్‌బాషా, మెహమూద్, నేతలు వైఎస్సార్ రబ్బాని, జాఫర్, సలీం, షౌకత్, యూసఫ్, రహీమ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములుకండి

ర్యాలీలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఈగల్ ఐజీ రవికృష్ణ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : మాదక ద్రవ్యరహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం ర్యాలీని మంగళవారం గుంటూరులోని మహాత్మగాంధీ పార్క్ వద్ద ప్రారంభించారు.

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఈ సామాజిక శత్రువును ఓడించవచ్చునని అన్నారు. ధృఢమైన యువశక్తి నిర్మాణమే లక్ష్యంగా అందరూ సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
- ఈగల్ ఐజీ ఆకే.రవికృష్ణ మాట్లాడుతూ నేటి యువతను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య మాదక ద్రవ్యాల వ్యసనమని అన్నారు.
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అవగాహనతోనే నిర్మూలించవచ్చునని అన్నారు.
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ల రామయ్య, తూర్పు ఎమ్మెల్యే నసీర్అహ్మద్‌లు మాట్లాడారు.
- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినదిస్తూ గాంధీ పార్క్ నుంచి జిన్నాటవర్ కూడలి, పాతబస్టాండ్ కూడలి మీదుగా తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది.

కార్యక్రమంలో మేయర్ కొవెలమూడి రవీంద్ర, తూర్పు డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, పోలీస్ అధికారు, సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షా సమావేశం

మాదక ద్రవ్యాల నివారణ కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్లో మంగళవారం(నవంబర్ – 2025) నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ ఏ ఒక్కరిపై అయిన ఒక మాదక ద్రవ్యాల కేసు నమోదైనా, అతని విధిగా సస్పెక్ట్ షీట్ నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సంకల్పం, డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్) పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి తోడ్పడతాయని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో గుంటూరు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. జిల్లా ఫెన్సింగ్ అధ్యక్షులు క్రిస్టోఫర్ మాట్లాడుతూ పోటీలలో 20 మంది పాల్గొన్నారన్నారు. విజేతలు ఈ నెల 26, 27వ తేదీలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికల విభాగంలో శాంత కుమారి, లక్ష్మీప్రశాంతి, సాయి నివేదిత, అనన్యశ్రీ. ఈపీ విభాగంలో భవ్య శ్రీ, జ్యోతిర్మయి, పూజ ప్రణవి.బాలుర విభాగంలో చరణరాజ్, డానీ జోసఫ్ రాజ్. ఈపీ విభాగంలో హేమంత్, ధీరజ్, కౌశిక్. సేబర్ విభాగంలో హర్షవర్ధన్, డానీ నిహాల్‌లు విజయాలు నమోదు చేశారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బాల్య వివాహాలరహిత భారత్‌పై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న సయ్యద్ జియాఉద్దీన్

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాల్య వివాహాలు లేని సమాజం నిర్మించడానికి 100 రోజుల అవగాహన సదస్సులో భాగంగా మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరులో మహిళా పోలీసులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆశా (అవేర్‌నెస్, సపోర్ట్, హెల్ప్ అండ్ యాక్షన్)-2025 కొత్త కార్యాచరణను రూపొందించిందని తెలిపారు. ఈ పథకం ప్రకారం బాల్య వివాహాలను నిరోధించడంలో ఒకే విధమైన, సమర్థ, చట్టబద్ధమైన స్పందనను అందించడమే ఈ 'ఆశా' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లా స్థాయిలో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసి ఈ యూనిట్ ద్వారా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, పోలీసులు, న్యాయ సేవాధికార సంస్థలు కలిసికట్టుగా పని చేస్తాయని తెలిపారు. భారత రాజ్యాంగం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ సెక్షన్ – 12–సి ప్రకారం 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ వారి ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ఉందన్నారు. బాల్య వివాహ బాధితులకు, వేధింపులకు గురైన పిల్లలకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా ప్యానెల్ లాయర్స్‌ను నియమిస్తామని తెలిపారు. సీడబ్ల్యూసీ, జేజేబీ సంస్థలు పిల్లలకు అవసరమైన చట్టపరమైన సేవలు ఉచితంగా అందుతాయన్నారు. అలాగే పిల్లల హక్కుల రక్షణ కోసం చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణంలో న్యాయం జరిగేలా చూడటం మన లక్ష్యమని తెలిపారు. ఆషా యూనిట్ కొత్త నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ సమన్వయ కర్త టి. శ్రీవాణి, జిల్లా బాలల హక్కు రక్షణ అధికారి సీహెచ్. విజయ్ కుమార్, ప్యానెల్ అడ్వకేట్ కొత్త నిబంధనల గురించి మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు.

సీఎస్ఎస్ నిధులు నూరు శాతం వినియోగించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలకు(సీఎస్ఎస్) మంజూరు చేసిన నిధులు నూరుశాతం నిర్దేశించిన కాలపరిమితిలో వినియోగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బీఎల్ఓలకు కలర్ ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాస్తవతో కలసి అందజేశారు. అదే విధంగా జనవరి 15 నాటికి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారానికి ఈ-ఆఫీస్ విధానం ను అమలు చేయాలని ఆదేశించారు.

క్రిస్మస్ సెలవులు కుదించడం తగదు

ఆర్జేడీకి ఫ్యాప్టో వినతి

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రిస్మస్‌కు ముందు, తరువాత రోజు పాఠశాల మొత్తానికి సెలవు పరిగణించుకుంటున్న విధానాన్ని మార్చివేసి, క్రిస్మస్ ఒక్కరోజునే ఉపాధ్యాయులకు సెలవు ఇచ్చే పద్ధతి తీసుకురావడం తగదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ కె.నరసింహరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వై.శ్యాంబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆర్జేడీ బి. లింగేశ్వర రెడ్డితో పాటు డీఈవో షేక్ సలీమ్‌బాషాను వారి కార్యాలయాల్లో కలిసిన ఫ్యాప్టో నాయకులు క్రిస్మస్ సెలవులను కుదించడం తగదని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ క్రిస్మస్ ముందు రోజు, తరువాతి రోజు పాఠశాలలు యథావిధిగా పని చేయాలని, పాఠశాలలో పని చేస్తున్న సగం మంది ఉపాధ్యాయులు ఆప్షనల్ హాలిడే ఉపయోగించుకోవాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో క్రైస్తవ ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, అనేక మంది క్రైస్తవ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారందరూ క్రిస్మస్ ముందు రోజు, తరువాతి రోజు పాఠశాలకు హాజరు కాని నేపథ్యంలో పాఠశాల మొత్తానికి సెలవు పరిగణించుకునే విధానం అవకాశం కల్పించాలని కోరారు. ఆర్జేడీని కలసిన వారిలో ఫ్యాప్టో జిల్లా నాయకులు షేక్ బాజీ, ఎం.కోటిరెడ్డి, ఎల్.ప్రసాద్‌బాబు, పి.బాలాజీ, జిలానీబాషా, ఎస్ఆర్ రెహ్మాన్, వై.మనోజ్‌కుమార్ సయ్యద్ ఫర్హతుల్లా, జి.సుధాకర్, ఎండీ షుకూర్ ఉన్నారు.

జిల్లా అంపైరింగ్ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ స్టేట్ ప్యానల్ పరీక్ష కోసం అంపైరింగ్ తరగతులకు దరఖాస్తు చేసుకోవచ్చని త్రీ మెన్ కమిటీ సభ్యులు వి.మనోజ్ సాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాలో జన్మించిన వారై ఉండాలన్నారు. క్రికెట్ పరిజ్ఞానంతోపాటు ఇంగ్లిషు భాషలో ప్రావీణ్యం ఉండాలని తెలిపారు. జిల్లా జట్టులో క్రికెట్ ఆడిన అనుభవం ఉండాలన్నారు. 1985 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలి. జిల్లా టీంలో క్రికెట్ ఆడిన వారైతే 1990 సెప్టెంబర్ 1, తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పి. కిషోర్ సెల్ నంబర్99120 69152లో సంప్రదించాలని పేర్కొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
దర్శి బ్రాంచ్, ప్రకాశం జిల్లా-523247.
ఫోన్: 81794 53717, ఇ-మెయిల్: ubin0813451@unionbankofindia.bank.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లో రూలు 8 ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దర్శి బ్రాంచ్ అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్)కు రావలసిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో తేది. 09.01.2026న ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. ధరావత్తు & రిజర్వు ధర వివరములు దిగువన తెలుపబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 09.01.2026, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-హామీదారు(లు): 1) మెస్సర్స్ శ్రీ అంజనీపుత్ర ఎడ్యుకేషనల్ సొసైటీ, దర్శి, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సెక్రటరీ మరియు కరస్పాండెంట్, శ్రీ ఇస్తలమూడి చెన్నారెడ్డి, సత్రం వీధి, దర్శి. 2) శ్రీ ఇస్తలమూడి చెన్నారెడ్డి, తండ్రి : ఇ.బ్రహ్మారెడ్డి - సెక్రటరీ కరస్పాండెంట్ చిరునామా : ఇ.సి.ఆర్. మోడల్ గ్రామం, చింతలపాలెం రోడ్, దర్శి-523247. 3) శ్రీ మూలే గోపాల్ రెడ్డి, తండ్రి : రత్తయ్య, ట్రెజరర్, చిరునామా : 14-215/1, అద్దంకి రోడ్, ఆటో నగర్, దర్శి-523247. 4) శ్రీ ఇస్తలమూడి రాజారామిరెడ్డి, తండ్రి : ఇ.బ్రహ్మారెడ్డి, ప్రెసిడెంట్, చిరునామా : 14-185, పూచలమెట్ల, అద్దంకి రోడ్, దర్శి. 5) శ్రీ ఇస్తలమూడి బ్రహ్మారెడ్డి, తండ్రి : సుబ్బారాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా : 14-185, పూచలమెట్ల, అద్దంకి రోడ్, దర్శి. 6) శ్రీమతి ఇస్తలమూడి రమణమ్మ, భర్త : ఇ.బ్రహ్మారెడ్డి - ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా : 14-185, పూచలమెట్ల, అద్దంకి రోడ్, దర్శి. 7) శ్రీమతి మూలే శ్యామల, భర్త : మూలే గోపాల్ రెడ్డి - ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా: 14-215/1, అద్దంకి రోడ్, ఆటో నగర్, దర్శి-523247. 8) శ్రీమతి ఇస్తలమూడి రాగలత, భర్త : ఇస్తలమూడి చెన్నారెడ్డి - ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా : ఇ.సి.ఆర్. మోడల్ గ్రామం, చింతలపాలెం రోడ్, దర్శి-523247. 9) శ్రీ ఇస్తలమూడి చెన్నారెడ్డి, తండ్రి : సుబ్బారాయుడు - ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా : ఇ.సి.ఆర్. మోడల్ గ్రామం, చింతలపాలెం రోడ్, దర్శి-523247. 10) శ్రీమతి కొమరనేని మాధవి హరిత, భర్త : శ్రీ ఇస్తలమూడి రాజారామిరెడ్డి - ఎగ్జిక్యూటివ్ మెంబర్, చిరునామా : 14-185, పూచలమెట్ల, అద్దంకి రోడ్, దర్శి. 11) శ్రీ రావి సూరిబాబు, తండ్రి : శ్రీ రామారావు, గరికపాలెం గ్రామం, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా.

డిమాండ్ నోటీసు తేది : 02.05.2022, స్వాధీనత నోటీసు తేది : 17.08.2022

బకాయి మొత్తం: రూ. 2,57,46,363 (అక్షరాల రెండు కోట్ల యాభై ఏడు లక్షల నలభై ఆరు వేల మూడు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) + తదుపరి జమకూడు వడ్డీ, కాస్ట్స్ మరియు వ్యయాలతో సహా.

స్థిరాస్తుల వివరములు : ఆస్తి నెం.1: ప్రకాశం జిల్లా, దర్శి మండలం మరియు గ్రామం, పోతవరం రోడ్డు, చలివేంద్రం, సర్వే నెం.216/2 216/3 లలోని 18392 చ.గ.ల విస్తీర్ణం గల భూమి మరియు స్కూల్ భవనము టైటిల్ డీడ్స్ సమాన నిష్పత్తిలో తనఖా ఉంచబడిన మెస్సర్స్ శ్రీ అంజనీపుత్ర ఎడ్యుకేషనల్ సొసైటీ వారికి చెందినది. (దర్శి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రర్డు కాబడిన అమ్మకపు దస్తావేజు నెం.368/2001, తేది.30-03-2001 మరియు దస్తావేజు నెం.369/2001, తేది.30-03-2001 ప్రకారం) హద్దులు : తూర్పు: సర్వే నెం.216/4 లోని దర్శి – అంజనీపుత్ర ఎడ్యుకేషనల్ సొసైటీ, సెక్రటరీ మరియు కరస్పాండెంట్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న ఇస్తలమూడి చెన్నారెడ్డి గారి స్థలము, దక్షిణం: దారం లక్ష్మీరెడ్డి గారి భూమి, పడమర : వీరం రెడ్డి సుబ్బారెడ్డి గారి భూమి, ఉత్తరం : సావిత్రమ్మ గారి భూమి.

రిజర్వు ధర: రూ. 3,99,00,000/- ధరావత్తు: రూ. 39,90,000/- బిడ్ పెంపుదల: రూ. 3,99,000/-

ఆస్తి నెం.2: ప్రకాశం జిల్లా, దర్శి మండలం మరియు గ్రామం, ఇసిఆర్ వెంచర్‌కు తూర్పు వైపున సమీప డోర్ నెం.14-410, సర్వే నెం.340/3ఎ వద్ద 203.28 చ.గ.ల విస్తీర్ణం గల సెమీ-అర్బన్ రెసిడెన్షియల్ ఖాళీ స్థలము మరియు అందలి రెసిడెన్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ మరియు ఫస్ట్ ఫ్లోర్ భవనము సమాన నిష్పత్తిలో తనఖా ఉంచిన టైటిల్ డీడ్స్ శ్రీ ఇస్తలమూడి చెన్నారెడ్డి గారికి చెందిన ఆస్తి.(దర్శి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రర్డు కాబడిన అమ్మకపు దస్తావేజు నెం.1710/2014, తేది.01-07-2014 ప్రకారం) హద్దులు : తూర్పు: రోడ్డు, దక్షిణం: పిచ్చల లక్ష్మీనారాయణ రెడ్డి మరియు ఇతరుల స్థలము, పడమర: గోగు వెంకయ్య గారి భూమి, ఉత్తరం: ప్లాటు నెం.05 లోని పి.వెంకట రెడ్డి గారి స్థలము.

రిజర్వు ధర: రూ. 26,71,000/- ధరావత్తు: రూ. 2,67,100/- బిడ్ పెంపుదల: రూ. 26,710/-

ఆస్తి నెం.3: ప్రకాశం జిల్లా, దర్శి మండలం, చింతలపాలెం, ఇసిఆర్ మోడల్ గ్రామం, వార్డు నెం.14, సర్వే నెం.726/1, 726/2 వద్ద 4 ప్లాట్ నెం.లు. 36, 37, 73, 74తో (ప్రతి ప్లాట్ విస్తీర్ణం 165 చ॥గ॥లు) 660.00 చ॥గ॥ల విస్తీర్ణంలో సమాన నిష్పత్తిలో తనఖా ఉంచిన టైటిల్ డీడ్స్ సెమీ-అర్బన్ నివాస ఖాళీ స్థలము మరియు అందుగల నివాస గ్రౌండ్ అంతస్తు భవనం శ్రీ ఇస్తలమూడి చెన్నారెడ్డి గారికి చెందినది.(దర్శి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రర్డు కాబడిన అమ్మకపు దస్తావేజు నెం.4917/2018, తేది.12.07.2018 మరియు రెండవ దస్తావేజు నెం.4928/2018, తేది.12.07.2018 ప్రకారం). హద్దులు: తూర్పు: 33 అ॥ వెడల్పు రోడ్డు–ఈ వైపు 66 అ॥, దక్షిణం : 33 అ॥ వెడల్పు రోడ్డు –ఈ వైపు 90 అ॥, పడమర : 33 అ॥ల వెడల్పు రోడ్డు–ఈ వైపు 66 అ॥, ఉత్తరం : ప్లాట్ నెం.35 మరియు 75 యొక్క స్థలం–ఈ వైపు 90 అ॥.

రిజర్వు ధర: రూ. 66,31,000/- ధరావత్తు: రూ. 6,63,100/- బిడ్ పెంపుదల: రూ. 66,310/-

ఆస్తి నెం.4: చింతలపాలెం గ్రామమునకు దక్షిణ ముఖంగా, దర్శి, ఇసిఆర్ మోడల్ గ్రామం, వార్డు నెం.14, సర్వే నెం.726, సబ్ డివిజన్ చేసిన తరువాత 726/5బి వద్ద ప్లాట్ నెం.లు. 389, 390, 420, 421తో 1215.48 చ॥గ॥ల విస్తీర్ణంతో సమాన నిష్పత్తిలో తనఖా ఉంచిన టైటిల్ డీడ్స్ సెమీ అర్బన్ నివాస డిటిసిపి వారు ఆమోదించిన 4 ఖాళీ ప్లాట్స్ శ్రీమతి మూలే శ్యామల భర్త: మూలే గోపాలరెడ్డి గారికి చెందినది. (దర్శి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రర్డు కాబడిన అమ్మకపు దస్తావేజు నెం.3931/2015, తేది.16.07.2015 ప్రకారం). ఐటమ్ ఎ: ప్లాట్ నెం.389నకు హద్దులు: తూర్పు : ప్లాట్ నెం.421 యొక్క స్థలం–ఈ వైపు 33 అ॥, దక్షిణం: ప్లాట్ నెం.390 యొక్క స్థలం (ఐటమ్ నెం.బి)–ఈ వైపు 70 అ॥, పడమర: 33 అ॥ల రోడ్డు–ఈ వైపు 33 అ॥, ఉత్తరం: ప్లాట్ నెం.388 యొక్క స్థలం–ఈ వైపు 70 అ॥. ఈ పై హద్దులలో ప్లాట్ నెం.389 యొక్క ఖాళీ స్థలం విస్తీర్ణం 256.66 చ॥గ॥లు. ఐటమ్ బి: ప్లాట్ నెం.390నకు హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.420 యొక్క స్థలం–ఈ వైపు 33 అ॥, దక్షిణం: 33 అ॥ల రోడ్డు –ఈ వైపు 70 అ॥, పడమర: 33 అ॥ల రోడ్డు–ఈ వైపు 33 అ॥, ఉత్తరం: ప్లాట్ నెం.389 యొక్క స్థలం (ఐటమ్ నెం.ఎ) –ఈ వైపు 70 అ॥. ఈ పై హద్దులలో ప్లాట్ నెం. 390 యొక్క ఖాళీ స్థలం విస్తీర్ణం 256.66 చ॥గ॥లు. ఐటమ్ సి: ప్లాట్ నెం.420నకు హద్దులు: తూర్పు: 40 అ॥ల రోడ్డు–ఈ వైపు 35.90 అ॥, దక్షిణం: 33 అ॥ల రోడ్డు –ఈ వైపు 100.90 అ॥, పడమర: ప్లాట్ నెం.390 యొక్క స్థలం (ఐటమ్ నెం.బి)–ఈ వైపు 33 అ॥, ఉత్తరం: ప్లాట్ నెం.421 యొక్క స్థలం (ఐటమ్ నెం. డి) –ఈ వైపు 87 అ॥. ఈ పై హద్దులలో ప్లాట్ నెం.420 యొక్క ఖాళీ స్థలం విస్తీర్ణం 358.47 చ॥గ॥లు. ఐటమ్ డి: ప్లాట్ నెం.421నకు హద్దులు: తూర్పు: 40 అ॥ల రోడ్డు–ఈ వైపు 35.90 అ॥, దక్షిణం: ప్లాట్ నెం.420 యొక్క స్థలం (ఐటమ్ నెం. సి)–ఈ వైపు 87 అ॥, పడమర: ప్లాట్ నెం. 389 యొక్క స్థలం (ఐటమ్ నెం. ఎ)–ఈ వైపు 33 అ॥, ఉత్తరం: ప్లాట్ నెం.422 యొక్క స్థలం –ఈ వైపు 73 అ॥. ఈ పై హద్దులలో ప్లాట్ నెం. 421 యొక్క ఖాళీ స్థలం విస్తీర్ణం 343.69 చ॥గ॥లు.

రిజర్వు ధర: రూ. 40,91,000/- ధరావత్తు: రూ. 4,09,100/- బిడ్ పెంపుదల: రూ. 40,910/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 20.12.2025
స్థలం: దర్శి

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దర్శి బ్రాంచ్

గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం

లక్ష్మీపురం: నాన్-ఫేర్ రెవెన్యూ చొరవలో భాగంగా, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యాన్ని ప్రారంభించడం జరిగిందని గుంటూరు డివిజన్ డీఆర్ఎం సుథేష్ట సేన్ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంలో మంగళవారం ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన స్లీపింగ్ పాడ్స్‌ను ఆమె ప్రారంభించారు. ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను, బెడ్స్, వాష్ రూమ్‌లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం మొత్తం 64 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు.

గుంతకల్లు- మార్కాపురం ప్యాసింజర్ ప్రారంభం

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నంద్యాల మీదుగా గుంతకల్లు – మార్కాపూర్ రోడ్ నూతన ప్యాసింజర్ సర్వీస్ ప్రారంభమైంది. రైల్వే మంత్రిత్వ శాఖ గుంతకల్లు– మార్కాపూర్ రోడ్– గుంతకల్లు(నంద్యాల మీదుగా) రోజువారీ ప్యాసింజర్ రైలు సర్వీస్ ప్రవేశపెట్టడానికి ఆమోదం తెలిపిందని గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్ఓ వినయ్ కాంత్ మంగళవారం తెలిపారు. రైలు నంబర్ 57407/ 57408 గుంతకల్లు – మార్కాపూర్ రోడ్- గుంతకల్లు రోజువారీ ప్యాసింజర్ రైలు సర్వీస్ యొక్క ప్రతిపాదితన కేటాయించడం జరిగిందని తెలిపారు.

27న చలో రాజభవన్‌ను జయప్రదం చేయాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఉపాధి హామీ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 27న 'ఛలో రాజభవన్' విజయవాడను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలో కొరటాల భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పాశం రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కొత్త చట్టం వల్ల ఉపాధి కోల్పోయి అనేకమంది గ్రామాలు వదిలి వలస బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లా అజయ్ కుమార్‌లు మాట్లాడుతూ చలో రాజ్ భవన్ విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.రవి, బి.వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్రిటెక్ హ్యాకథాన్-2025

ప్రదర్శనలను తిలకిస్తున్న మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు

గుంటూరు రూరల్: జమీందారీ వ్యవస్థ రద్దులో కీలక పాత్ర పోషించి, భారత రాజకీయాల్లో రైతుల పక్షాన ధైర్యంగా నిలిచిన గొప్ప నాయకుడు భారతదేశ మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యులు యలమంచిలి శివాజీ తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో గత రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్–2025 మంగళవారంతో ముగిసింది.

- జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ కిసాన్ దివస్ ఎక్స్ పో–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ సాంకేతికత ప్రత్యక్ష ప్రదర్శనలను, అగ్రి–టెక్ స్టార్టప్‌ల వినూత్న నమూనాలను తిలకించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో జరిగిన ముఖాముఖి చర్చల్లో పాల్గొన్నారు.
- అనంతరం అతిథులు చౌదరిచరణ్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025లో విజేతలకు అతిథులు నగదు బహుమతులను, మెమెంటోలను, సర్టిఫికెట్‌లను అందించారు.
- యలమంచిలి శివాజీ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తన రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులను కూడా తృణప్రాయంగా వదిలేసిన ధీరుడు చౌదరిచరణ్‌సింగ్ అని కొనియాడారు. రైతు బాంధవుడైన ఆయన సేవలకు గుర్తింపుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 23ను భారత ప్రభుత్వం జాతీయ రైతు దినోత్సవం కిసాన్ దివస్‌గా ప్రకటించిందని తెలిపారు.
- రైతుల సంక్షేమమే దేశ ప్రగతికి మార్గమని, చౌదరి చరణ్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యార్థులు వ్యవసాయ రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు చేయాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె. మురళీ మోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు.
- విద్యతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే వినూత్న ఆలోచనలతో విద్యార్థులు ముందుకు రావాలని కళాశాల సెక్రటరీ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్‌లు తెలిపారు.
- ఉత్తమ రైతు ప్రదర్శనలకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఢిల్లీ ఇందిరాగాంధీ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాంనారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్.వి.పి. చంద్రశేఖర్‌రావు, సి.ఈ.ఓ డాక్టర్ ఆర్. హఫీజ్‌బాషా, డాక్టర్ రాధిక, డాక్టర్ శోభ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, Hitherto Known As Bachu T V S L Narasimha Rao Alias Bachu Teja Narasimha Rao S/o. Upendra Gupta Bachu R/o. At D No 11-823/4, 1/7 Line Pattabhiseetaram Nagar, Nagaralu, Amaravathi Road, Gorantla, Guntur, Andhra Pradesh-522034, Have Changed My Name And Shall Hereafter Be Known As Bachu Teja Venkata Sai Lakshmi Narasimha Rao For All Future Purposes

GOLD FINANCE

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED

తెనాలిలోని ప్రముఖ కంపెనీ నందు పని చేయుటకు అనుభవం గల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ (M.S. Office) మంచిజీతం. సంప్ర: 86869 35606

గ్రీన్ ఆర్బిట్ సర్వీసెస్ ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ వర్క్ చేయుటకు మండలాల వారీగా PRO లు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, జీతం: 15,000–18000. సంప్రదించండి ॥ 8008899861, 8179316236

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలు వినుకొండ ఏరియాలలో 8గం॥ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ M/F కావలెను. జీతం: 12,000. సంప్ర॥ 9515524430

సె॥ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను వ 45 Q: 10th P/F, జీతం: 17 వేలు+ PF, ESI. ✆ 94903 80213, 94902 48039

టోల్ ప్లాజా నందు పని చేయుటకు 10 to PG కంప్యూటర్ ఆపరేటర్,క్యాషియర్ కావలెను 8గంల డ్యూటీ భోజనం వసతి ఉచితం. ✆ 78934 36019.

సాక్షి క్లాసిఫైడ్స్
రూ. 475/-
ప్రతి అదనపు లైను రూ. 100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167663
7075167541

క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి గుడ్ న్యూస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో మంగళ వారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రెవ.ఫాదర్ జె.ఆరోగ్యదాస్ మాట్లాడుతూ.. క్రీస్తు లోకానికి తన ప్రేమను చాటారని వివరించారు. అదే విధంగా మనం ప్రేమను పేదలకు సహాయ రూపంలో పంచి ఆదరించాలని సూచించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. విద్యార్థులకు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ.ఫాదర్ సుగంధన్, రెవ.ఫాదర్ సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల 'ఆకలి పోరు'

ఫిరంగిపురం: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు 'ఆకలి పోరు' బాట పట్టారు. పంచాయతీ కార్యాలయంలో 32 మంది పారిశుద్ధ్య కార్మికులు, 16 మంది హరితరాయబారులు పనిచేస్తున్నారు. కాగా పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలు, హరితరాయబారులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదు. దీంతో కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. తమకు వేతనాలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు. క్రిస్మస్ పర్వదినం వస్తున్నా నేటికీ తమకు వేతనాలు ఇవ్వలేదని.. అధికారులు పలు సాకులతో కాలయాపన చేస్తున్నారుని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, యూనియన్ నాయకులు రామారావు, ఇబ్రహీం, రాజేశ్వరరావు, శ్రావణ్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

గ్రామస్తుల జోక్యంతో డ్రెయిన్ పూడికతీత పనులు

తాడేపల్లి రూరల్: చిర్రావూరులో కరకట్ట వెంబడి నిలిచిపోయిన కచ్చా డ్రెయిన్ పూడికతీత పనులు తిరిగి మంగళవారం ప్రారంభమయ్యాయి. గత కొంతకాలంగా కనకదుర్గ వారధి, రేపల్లి కరకట్ట వెంబడి చిర్రావూరులో పంటపొలాలు, గ్రామంలోని మురుగు తరలించేందుకు గతంలో ఉన్న కచ్చా డ్రెయిన్ పూడికతీత పనులు ఇటీవల చేపట్టారు. ఈ పనులను కార్పొరేషన్ అధికారులు చేపట్టినప్పుడల్లా ఏదో వివాదం వచ్చి పనులు నిలిచిపోయేవి. తాజాగా పనులు ప్రారంభిస్తే వివాదాలు చెలరేగి ఆ పనులు మరలా నిలిచిపోయాయి. ఎట్టకేలకు గ్రామంలో అన్ని పార్టీల నాయకులు మాట్లాడుకుని ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో కచ్చా డ్రెయిన్ పూడికతీత పనులకు సహకరించడంతో కార్పొరేషన్ సిబ్బంది పనులు పూర్తిచేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాడేపల్లి సీఐ వీరేంద్ర సూచించారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణంతో పాటు మండలంలో 'మత్తు వీడండి.. ఆరోగ్యంగా ఉండండి' అనే నినాదంతో మంగళవారం డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టే దిశగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం, అలానే వివిధ ప్రాంతాల్లో ప్రజలు, యువతకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వీరేంద్ర మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీస్‌శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ, మండలాల్లో మైకులతో ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడదామని సంకల్పం బ్యానర్లను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

385 రోజులుగా కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారంతో 385వ రోజుకు చేరుకున్నాయి. యూనియన్ నాయకులు స్టీవెన్, శారద, రిబ్కా, లక్ష్మి, సువర్ణకుమారి దీక్షా శిబిరాన్ని ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. సాంబశివరావు, రమాదేవి, శారమ్మ, ఇమాంబి, శివకుమారి సుభాని, అంకయ్య, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ రైతులకు అందని సబ్సిడీ

- ఎరువులు సైతం బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు
- లబోదిబోమంటున్న అసైన్డ్ భూముల రైతులు

మొక్కజొన్న పంట వేసిన అసైన్డ్ భూములు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలో అసైన్డ్ రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఏదీ అందడం లేదు. విత్తనాల దగ్గర నుంచి ఎరువుల వరకూ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంప్లెక్స్ ఎరువులు అయితే బ్లాక్ మార్కెట్‌లో అదనపు నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములు ఉన్న రైతులకు రాయితీలు కల్పిస్తూ అన్నదాతలను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అసైన్డ్ భూములకు పాస్‌బుక్ ఉండేనే ప్రభుత్వ సబ్సిడీలు అందజేస్తున్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా కృష్ణానది కరకట్ట లోపల లంక భూముల్లో 3000 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నాయి. ఇందులో 70 శాతం మంది రైతులకు పాస్ పుస్తకాలు లేవు. ఏడాదిగా అసైన్డ్ రైతులు అధికారులకు విన్నవించుకున్నా వారు పట్టించుకోవడంలేదని అన్నదాతలు వాపోతున్నారు.

నష్టపోతున్న రైతన్నలు..

గతంలో పలుమార్లు వరదలు, తుఫాన్‌లు, అధిక వర్షాల వల్ల అసైన్డ్ రైతులు పూర్తిగా నష్టపోయారు. అప్పులు చేసి పంటలు పండిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా కొంతమేర సరఫరా ఇబ్బందిగా ఉండడంతో రైతులు ఏం చేయాలో పాలుపోక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిర్రావూరు, రామచంద్రాపురం, దుగ్గిరాలలోని పలు గ్రామాల్లో ఈ అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్నాయి. మొక్కజొన్న పండించే రైతులు సబ్సిడీపై యూరియా లభించకపోవడంతో బయట మార్కెట్‌లో రూ.100 అధికంగా చెల్లించి యూరియా బస్తాలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యూరియా అక్రమ నిల్వలు..

నూతక్కికి చెందిన ఓ రైతు 10 ఎకరాలలో మొక్కజొన్న వేశారు. రైతు మధ్యవర్తి అయిన ఆటో డ్రైవర్‌కు 50 బస్తాలకు ఒక్కో బస్తాకు రూ.360 చొప్పున రూ.18 వేలు నగదు చెల్లిస్తే, ఆటో డ్రైవర్ రెండు రోజుల తరువాత ఇంటికి తీసుకువచ్చి బస్తాలు దింపి వెళ్లాడు. ఆ రైతును ప్రశ్నించగా అక్రమంగా నిల్వ చేసినందని పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ ప్రాతూరులో ఒక రైతు ఇంట్లో 150 బస్తాల యూరియా నిల్వ ఉంచాడు. చిర్రావూరుకు చెందిన మరో రైతు పెదవడ్లపూడిలో ఒక యూరియా బస్తా రూ.340 చొప్పున మూడు బస్తాలు కొనుగోలు చేశాడు. దీంతో అసైన్డ్ భూములు కలిగిన రైతులు కాంప్లెక్స్ ఎరువులు కొనే విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సొసైటీలో యూరియా ఇవ్వడం లేదు..

సొసైటీలో యూరియా దొరకడం కష్టంగా ఉంది. లోడ్ వస్తే 10 నిమిషాల్లో రైతులు లైన్‌లో నిలబడి ఒక్కో బస్తా కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నారు. అసైన్డ్ రైతులకు ఒక్క బస్తా కూడా ఇవ్వడం లేదు. బయట దుకాణాల్లో ప్రయత్నించినా యూరియా దొరకలేదు. పెదవడ్లపూడిలో ఒక బస్తా రూ. 350కి అమ్ముతున్నారు.

– పేక మోహన్

ఒకేసారి 10 బస్తాలు కావాలి..

10 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నా. ప్రస్తుతం యూరియాతో అంత అవసరం పడలేదు. విత్తనం మొలక ఎత్తగానే 10 రోజులు ఆగి ఒకేసారి 10 బస్తాలు కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో ఎక్కువో, తక్కువో ముందు దొరికితే పెట్టిన పెట్టుబడులు అన్నా వస్తాయి. అనుకూల సమయంలో యూరియా కాంప్లెక్స్ ఎరువులు చల్లకపోతే మొక్క ఎదగదు. దీని వల్ల దిగుబడి కూడా తగ్గుతుంది.

– బెజవాడ సాంబశివరావు

భూసేకరణపై కౌలు రైతుల ఆవేదన

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం చినకాకాని గ్రామం సర్వే నంబరు 201, 204లో అంజుమన్ వక్ఫ్‌కు చెందిన సుమారు 71.57 ఎకరాల భూములు ఉన్నాయి. దాదాపు వందేళ్లుగా చినకాకాని గ్రామానికి చెందిన సుమారు 50 మందికి పైగా కౌలు రైతులు సాగుచేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాగా ప్రభుత్వం ఇటీవల ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ చేస్తున్నట్లు నోటీసులు జారీ చేసింది. దీనిపై గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళగిరి డిప్యూటీ తహసీల్దార్‌కు సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు, కౌలు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, వందేళ్లుగా కౌలుపై ఆధారపడి జీవిస్తున్న పేద కౌలురైతుల జీవనోపాధిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. భూములు కోల్పోతే రైతుల కుటుంబాలు, కూలీలతో సహా రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. భూములు సాగుచేస్తున్న ప్రతి కౌలు రైతుకు అర ఎకరం చొప్పున భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు చిన్ని తిరుపతయ్య, వెంకటేశ్వరరావు, చంద్రమోహన్, చంద్రారావు, యశ్వంత్, సుబ్బారావు, బాబూరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ అధికారంలో ఆర్థిక వ్యవస్థకు దెబ్బ

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాతే దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ శతవార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళగిరి పట్టణంలోని ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గౌతమ బుద్ధ రోడ్ మీదుగా దేవస్థానం, మెయిన్‌బజార్, మిద్దె సెంటర్, పాత మంగళగిరిలో సాగింది. అనంతరం పట్టణ సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన సభలో ముప్పాళ్ల మాట్లాడారు. పేదలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాటం చేసింది కమ్యూనిస్టు పార్టీయేనని స్పష్టం చేశారు. రానున్న కాలంలో జరుగునున్న ఉద్యమాలకు శతవార్షికోత్సవ ప్రజాప్రస్థానం ఒక పునాది అని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, బ్రహ్మేశ్వరరావు, ఏపీ చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

నూతక్కి కిసాన్ దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్‌యూ విద్యార్థులు, ప్రొఫెసర్లు

మంగళగిరి టౌన్: సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి పెరుగుతుందని.. రసాయన ఎరువులతో పంట దిగుబడి తగ్గుతుందని విద్యార్థి విభాగ అధికారి డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ (సీఈఏ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ బీసీఏ ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్ దివాస్ (రైతుల దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. పంటలపై ఎక్కువగా పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల పంట నాణ్యత, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఏ ఏ పంటలపై ఎలాంటి ఎరువులు వాడాలో వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పంట వేసే ముందు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించాలని వివరించారు. ప్రకృతి సిద్ధమైన ఎరువులతో వ్యవసాయం లాభసాటి, ఆరోగ్యకరం అని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతిశ్రీ, సీఈఏ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, బీసీఏ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ కాశేశ్వరరావు, సీఈఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పేరు మార్చడం హేయం

మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి భాస్కరరావు

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వీబీ జీ రామ్ జీగా పేరు మార్చడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని తాడికొండ మండల రైతు సంఘం కార్యదర్శి చింతల భాస్కరరావు అన్నారు. తాడికొండ బస్టాండ్ ఆవరణలో ఈ మేరకు నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాలలో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని.. ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేశారని వివరించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని.. ఉన్న నిబంధన ఇప్పుడు తొలిగించారని.. ఈ కొత్త బిల్లు ఉపాధిని హరించేదిగా ఉందని.. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టమే ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, జోషి, పిచ్చయ్య, మాణిక్యమ్మ, సుభాని, రైతు కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మేడికొండూరు: మండలంలోని సిరిపురం ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం సైకిళ్లు, బ్యాగులు, షూ పంపిణీ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, విశిష్టాధినిగా జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా, ఆత్మీయ అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదుర్గ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బాలమోహన్ రావు, స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ తేజస్విని హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్, విద్యాశాఖ అధికారి మాట్లాడారు. కార్యక్రమంలో మేడికొండూరు తాహసీల్దార్ గాలం రాఘవరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మేడికొండూరు: ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో రోబోటిక్స్ టెక్నాలజీపై ఘనంగా వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టెస్లా హాస్ సీఈవో తుమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టెస్లా హాస్ అనేది ఆధునిక రోబోటిక్స్ అభివృద్ధిలో విశేష పరిశోధన చేస్తున్న సంస్థ అని అన్నారు. రోబోటిక్ విద్యార్థి దశలోనే మంచి పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటే అనేకమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. కళాశాల ఎకడమిక్ డైరెక్టర్ కోటా శ్రీనివాసు అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.సంజయ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం పట్ల కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు వర్క్ షాప్ నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్మెంట్ వారిని అభినందించారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ అభిమానుల చేరిక

నూతనంగా పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధి 17, 22వ వార్డుల నుంచి పలువురు టీడీపీ అభిమాన కుటుంబాలకు చెందిన వారు పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ.. తాతల కాలం నుంచి టీడీపీకి అభిమానంగా ఉన్నామని, నేటికీ పార్టీలో తమకు ప్రాధాన్యత లేకపోవడం, స్థానిక సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకత్వం విఫలమవ్వడంతో పార్టీని వీడామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా ప్రజలకు ఏమీ చేయలేదని.. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజా పోరాటం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో పార్టీకి చేరువైనట్లు తెలిపారు. పార్టీలో స్వచ్ఛందంగా చేరేందుకు ముందుకు వచ్చిన వారిని పేరుపేరునా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని, పార్టీలో వారికి ప్రాధాన్యత ఇస్తామని, అన్ని విధాలా అండగా ఉంటామని దొంతిరెడ్డి వేమారెడ్డి భరోసా ఇచ్చారు. నూతనంగా పార్టీలో చేరిన వారిలో పట్టణానికి చెందిన నందాల్య శ్రీనివాసరావు, కఠారి సాంబయ్య, వేల్పుల సాంబయ్య ఉన్నారు.

ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం కురగల్లు గ్రామ పంచాయితీలో ఆక్రమణకు గురైన స్థలం వద్ద గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కురగల్లులోని సర్వే నంబరు 217లోని గ్రామ కంఠం పోరంబోకు భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారి ధూళిపాళ శేఖర్, వీఆర్వో రఘురామ్ గౌడ్, సర్వేయర్ సాయికృష్ణ తమ సిబ్బందితో సదరు స్థలం వద్దకు చేరుకుని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అధికారి శేఖర్ మాట్లాడుతూ.. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ కంఠం పోరంబోకు భూమి ఆక్రమణ పట్ల పంచాయతీ అధికారులు త్వరితగతిన స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

'పొలం పిలుస్తోంది'లో రైతులకు అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు మోహన్ రావు శెనగ పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. అదే విధంగా మొక్కజొన్న పైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ సమయంలో సాగునీరు అందించాలో రైతులకు వివరించారు. ఫిరంగిపురంలోని రైతు సేవా కేంద్రంలో పురుగు మందు దుకాణాదారుల సమావేశం నిర్వహించారు. మొక్కజొన్న రైతులు అధికంగా యూరియా వాడతారని.. దీనిని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏవో వాసంతి, షేక్. సుభాని, గోపి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు బండ్ల అందజేత

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన ఇద్దరు చిరు వ్యాపారులకు టీడీపీ నాయకులు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ ఆర్థిక సహకారంతో రెండు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. రాయపూడికి చెందిన సయ్యద్ ఖాసిం, షేక్ ఖాసింలకు మంగళవారం బండ్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జమ్ముల అనీల్‌కుమార్, కొల్లి నరేంద్ర, నల్లూరి మధుబాబు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై అవగాహన

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సీఎస్‌ఈ–2, సీఎస్‌ఈ–4 విభాగాల ఆధ్వర్యంలో కాలుష్య నివారణపై దుగ్గిరాల మండల పరిధి పెదపాలెం, వీర్లపాలెంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్‌ఈ–2 విభాగాధిపతి డాక్టర్ బి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కాలుష్యం వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి ప్రజలకు వివరించామని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ.. కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాధ్యతగా వ్యవహరిస్తే కాలుష్యం ముప్పు నుంచి బయటపడవచ్చని పేర్కొన్నారు. వీర్లపాలెంలో సీఎస్‌ఈ–4 విభాగ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మోహనరావు ఆధ్వర్యంలో వలంటీర్లు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. విభాగాధిపతి డాక్టర్ టి.పవన్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ హక్కుల విలువలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు, కోఆర్డినేటర్ పి.సురేష్‌లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, అభినందించారు.

ఏసు మార్గం అనుసరణీయం



దుగ్గిరాల: క్రీస్తు మార్గం అనుసరణీయవని ఎస్‌ఐ ప్రభుదాస్ అన్నారు. మంగళవారం స్థానికి పోలీస్‌స్టేషన్‌లో సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, దుగ్గిరాల ఎస్‌ఐ వెంకట రవి పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జాషువా విగ్రహం కూడలిలోనూ క్రిస్మస్‌ను ఘనంగా జరిపారు.

ఆకస్మికంగా పాఠశాల తనిఖీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి ఎడ్యుకేషన్ డివిజన్ డిప్యూటీ డీఈవో శాంతకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాశక్తి నిర్వహణ కార్యక్రమాలు, 10వ తరగతి 100 రోజుల సంసిద్ధత కార్యక్రమం, స్లిప్ టెస్ట్‌ల మార్కులు, రైసింగ్ స్టార్స్ షైనింగ్ స్టార్స్ విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలించినట్లు శాంతకుమారి వివరించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పది ఫలితాలు గతేడాది కంటే ఈ యేడు మెరుగుగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరుగుతున్న మతోన్మాద దాడులు

తాడికొండ: ప్రధాని మోడీ మత రాజకీయాలు చేస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ శతజయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రచార జాత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గుంటూరు నుంచి బయలుదేరిన జాత వెంకటపాలెం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద దాడులు పెరిగాయన్నారు. అనంతరం పొన్నెకల్లు పార్టీ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి జెండా ఆవిష్కరణ చేశారు. అలానే సత్రం సెంటర్‌లో జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి అరుణ్ కుమార్, జంగాల చైతన్య, ఆరేటి రామారావు, ముప్పాళ్ల శివశంకర రావు, పచ్చల సాంబశివరావు, రేపూడి శ్రీనివాసరావు, గుర్రంకొండ సత్యానందం, కంభంపాటి దేవుని దయ, రామినేని రామారావు పాల్గొన్నారు.

తాడికొండ: ప్రపంచ రాజధాని అంటూ లక్షల ఎకరాలు తీసుకుంటూ 50,000 ఎకరాల్లో కట్టేది మున్సిపాలిటీగా ఉంటుందని సీఎం పేర్కొనడం సరికాదని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు.

ప్రకటన

నా క్లయింట్ M/s .Shriram Finance Ltd, Patamata Branch, Vijayawada. వారి సంబంధించి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, మందడం కాపురస్తులు నాగభూషణరావు గారి భార్య యెర్రంనేని సీతారావమ్మగారు అభివృద్ధి ఒప్పందం 9.14బి మరియు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీతో కూడిన అనుబంధ దస్తావేజు (సివాస) నెంబర్ 5903/2018 (SRO- మందడం) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ కు మార్టిగేజు చేసుకుని యెర్రంనేని సీతారావమ్మ గారి బంధువు దాగర్లమూడి శ్రీనివాసరావు గారి పేరు మీద లోన్ పొందియున్నారు. సదరు దాగర్లమూడి శ్రీనివాసరావు గారి పేరు మీద లోన్ ఇచ్చుటకు ఎవరికైనను ఎటువంటి కోర్టు అటాచ్మెంట్లు గాని, క్లెయిమ్స్ గాని మరియు ఏ ఇతర అభ్యంతరములు ఉన్న యెడల వాటి అభ్యంతరములను ఈ క్రింది అడ్రస్ కు 7 రోజులలో Regd. Post with ack due ద్వారా తెలియజేయగలరు. అట్టి వచ్చు క్లెయిములు గాని, అభ్యంతరములు గాని నా క్లయింట్‌ను బైండ్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, అమరావతి రి.జి. మందడం సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకా, తుళ్లూరు మండలం లోని మందడం గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన మందడం గ్రామం నందు ఆంధ్ర ప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టము ద్వారా కేటాయించబడిన ప్లాట్లలో టౌన్ షిప్ నెం.17, బ్లాక్ నెం.4334, సెక్టార్ -142, కాలనీ -619, ప్లాట్ నెం.4, సర్వే నెం.378 రు దాఖలా చ.గ.250.0 లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.18రు స్థలం, దక్షిణం: ప్లాట్ నెం.5రు స్థలం, పడమర : 15.6 మీటర్ల రోడ్, ఉత్తరం: ప్లాట్ నెం.3రు స్థలం.

Y.VIJAYA KUMAR - Advocate
20-4-21, Near Lotus Land Mark, Santhi Nagar, VIJAYAWADA-3. ✆ 99490 77010

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance ltd, ... [illegible]

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, తాడేపల్లి మండలం, చిర్రావూరు గ్రామములోని డాక్యుమెంట్ నెం. 8111/2024 ... [illegible]

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, తాడేపల్లి మండలం, చిర్రావూరు గ్రామములోని డాక్యుమెంట్ నెం. 8113/2024 ... [illegible]

Y. విజయకుమార్
తేది: 23-12-2025 అడ్వకేట్ & నోటరీ, సెల్: [illegible]

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

> ఓటమిని అంగీకరించకుంటే.. గెలవడానికి మీకు మరో అవకాశం ఉన్నట్లే! ఓటమిని అంగీకరించడమే అన్నింటికంటే పెద్ద వైఫల్యం
>
> -జాక్‌మా, అలీబాబా గ్రూప్

సైన్స్ పరిశోధనలు.. ఆవిష్కరణలతోపాటు అపార జ్ఞానం

'నేటి ఏఐ, ఐఓటీ కాలంలోనూ వన్నె తరగని విభాగంగా ఆర్ అండ్ డీని పేర్కొనొచ్చు. సైన్స్ రంగంలో అవకాశాలు రోజురోజుకీ విస్తృతమవుతున్నాయి. అదే విధంగా నిపుణుల కొరత కూడా పెరుగుతోంది. సైన్స్ రంగంలో పరిశోధనలు.. కొత్త ఆవిష్కరణలు చేసే నైపుణ్యం ఇవ్వడమే కాకుండా.. మరెన్నో విషయాల్లో పరిజ్ఞానం అందిస్తాయి' అంటున్నారు ప్రముఖ టెక్నాలజీ సంస్థ హనీవెల్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియాలో వివిధ హోదాల్లో విశేష అనుభవం గడించిన అక్షయ్ బెల్లారే. ఐఐటీ-చెన్నై నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, ఆ తర్వాత వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుని.. అంతర్జాతీయంగా, జాతీయంగా పలు సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించిన **అక్షయ్ బెల్లారే**తో ఈ వారం ప్రత్యేక ఇంటర్వ్యూ..

విదేశాల్లోని లెర్నింగ్‌కు, మన దేశంలోని విధానాలకు తేడా ఏంటి?

విదేశాల్లో ముఖ్యంగా జర్మనీ, జపాన్‌లతో పోల్చుకుంటే మన దేశానికి మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం.. ప్రాక్టికల్ బేస్డ్ లెర్నింగ్. ఫలితంగా విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి, తపన, ఉత్సుకత పెరుగుతాయి. ఇది వారిలో ఇమిడి ఉన్న సహజ నైపుణ్యాలు బయటికి వచ్చేలా చేస్తుంది. ఇలాంటి విధానాన్నే మన దేశంలోనూ అనుసరిస్తే బాగుంటుంది. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి కలిగేలా బోధన చర్యలకు శ్రీకారం చుట్టాలి.

ప్రస్తుత జాబ్ మార్కెట్ పరిస్థితుల్లో యువతకు ఆర్ అండ్ డీ ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది?

ఎలాంటి పరిస్థితుల్లోనైనా సమాజ అభివృద్ధి, దేశ జీడీపీకి ఊతం వేసేవి పరిశోధనలు. వీటి వల్ల కొత్త ఆవిష్కరణలు, తద్వారా ఆయా రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది. ఫలితంగా ఇవి దేశ ఉత్పాదకత పెంపునకు దోహదం చేస్తాయి. అందుకే మన ప్రభుత్వం ఆర్ అండ్ డీపై విస్తృతంగా దృష్టి సారిస్తోంది. దీంతో.. ఆర్ అండ్ డీ ఎవర్‌గ్రీన్ అవకాశాలు కల్పిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకునేందుకు సైన్స్ పరిశోధనలు ఎలా దోహదం చేస్తాయి?

వాస్తవానికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థానాలు చేరుకునేందుకు సైన్స్ ఎంతో దోహదం చేస్తుంది. ఈ రంగంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలంటే.. పరిశోధనలను కేరాఫ్‌గా పేర్కొనొచ్చు. పరిశోధనల ఫలితంగా కొత్త ఆవిష్కరణలతోపాటు మరెన్నో అంశాల్లో పరిజ్ఞానం లభిస్తుంది. ప్రాబ్లమ్ డయాగ్నసిస్, ప్రాబ్లమ్ సాల్వింగ్, క్రిటికల్ థింకింగ్, ప్రాక్టికల్ అప్రోచ్.. ఇలా ఎన్నో నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు పరిశోధనలు దోహదం చేస్తాయి.

పరిశోధనలు సఫలమై జీవితంలో స్థిరపడాలంటే ఏళ్ల తరబడి వేచి చూడాలనే అభిప్రాయం ఉంది? దీనికి మీ సమాధానం?

సైన్స్ రంగంలో.. కెరీర్ అవకాశాలు అందుకోవడంలో సుదీర్ఘ సమయం పడుతుందనే వాదనలో రెండు అంశాలు ప్రస్తావించాలి. ఆలస్యం అనే మాట కొంత వాస్తవమే. కానీ.. ఒకసారి కుదురుకుంటే వెనుదిరిగి చూసుకోనక్కర్లేదు. ఇక.. రెండో విషయం.. పదో తరగతి తర్వాత నుంచే సైన్స్ రంగంపై దృష్టి సారించి ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేస్తే 26, 27 ఏళ్ల వయసు వచ్చేసరికి కెరీర్ గమ్యం చేరుకోవచ్చు. ఇంజనీరింగ్‌తో బీటెక్ పూర్తవగానే ఉద్యోగాలు లభిస్తున్నాయి. కానీ.. వాటిలో మనుగడ సాగించాలంటే ఉన్నత విద్య అవసరం. బీటెక్‌తోనే ఉద్యోగాల్లో చేరిన యువత ఈ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. కానీ.. సైన్స్ విషయానికొస్తే దీని తుది గమ్యం పీహెచ్‌డీ. దీన్ని పూర్తి చేసుకుంటే ఇక కెరీర్ పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావు.



సైన్స్ పరిశోధనలకు అవసరమైన స్థాయిలో నిపుణుల లభ్యత ఉందా?

స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) విభాగాల్లో నిపుణుల కొరత అధికంగా ఉంది. అందుకే ఈ రంగంలో నిపుణులను తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకత నెలకొంది. ముఖ్యంగా స్టెమ్ విభాగంలో సైన్స్ ఎంతో ప్రత్యేకం అని చెప్పొచ్చు. స్టెమ్‌లోని మిగతా మూడు విభాగాలకు సైన్స్ బేసిక్స్ మూలంగా నిలుస్తాయని పేర్కొనొచ్చు. అందుకే మొత్తం స్టెమ్ నిపుణుల కొరతలో సైన్స్ నిపుణుల కొరతే. 30 శాతం మేరకు ఉంటోంది. ప్రస్తుతం దేశంలో స్టెమ్ నిపుణుల సంఖ్య దాదాపు 26 లక్షలుగా ఉంది. అయినప్పటికీ ఇంకా స్కిల్ గ్యాప్ కారణంగా స్టెమ్ నిపుణులకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. అయితే సైన్స్ కోర్సుల అభ్యసనం పరంగా ఇటీవల కాలంలో విద్యార్థుల దృక్పథంలో కొంత మార్పు వచ్చింది. ఇప్పుడిప్పుడే విద్యార్థులు సైన్స్ కోర్సుల దిశగా దృష్టి సారిస్తున్నారు. గత దశాబ్ద కాలంలో ఆర్ అండ్ డీ వైపు వెళుతున్న వారిలో గణనీయంగా వృద్ధి కనిపిస్తోంది.

రీసెర్చ్ అకడమిక్స్ కోణంలో ప్రభుత్వ చర్యలపై మీ అభిప్రాయం?

రీసెర్చ్ ఔత్సాహికులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల పలు చర్యలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయితే ఇవి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకే పరిమితం అయ్యే విధంగా ఉన్నాయి. వీటిని అన్ని స్థాయిల ఇన్‌స్టిట్యూట్‌లకూ విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలి. అప్పుడే అన్ని ప్రాంతాల నుంచి భావి సైంటిస్ట్‌లు రూపొందుతారు.

వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనా?

కచ్చితంగా సాధ్యమవుతుంది. ఈ విషయంలో మనకు బాగా కలిసొచ్చే అంశం.. మన దేశంలో యువత సంఖ్య ఎక్కువగా ఉండడం. దీన్నే మనం డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటున్నాం. మన దేశంలో 14 నుంచి 25 ఏళ్లలోపు యువత సంఖ్య ఎక్కువగా ఉంది. వీరిని సైన్స్‌వైపు దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటే మనం కూడా యూఎస్, కెనడా, జపాన్‌ల మాదిరిగా ఆర్ అండ్ డీ రంగంలో అద్భుతాలు సృష్టించొచ్చు. డెమోగ్రాఫిక్ డివిడెండ్.. ప్రయోజనాల కోణంలో ప్రస్తుతం దేశంలోని స్టార్టప్ ఎకో సిస్టమ్‌నే ఉదాహరణగా పేర్కొనొచ్చు. ఎంతో మంది యువత 25, 26 ఏళ్ల వయసులోనే సొంతంగా సంస్థలు నెలకొల్పి అద్భుతాలు చేస్తున్నారు. ఇదే తరహాలో సైన్స్ విషయంలోనూ దృష్టి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

సైన్స్ పరిశోధనల వైపు రావాలనుకునే వారికి మీ సలహా?

ఈ విభాగంలో రాణించాలంటే ఆసక్తి ఉండాలి. అప్పుడే సమర్థవంతంగా ముందుకుసాగే వీలుంటుంది. లేకపోతే మధ్యలోనే అడుగులు తడబడతాయి. గమ్యం చేరుకోవడం కష్టంగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో ఎలాంటి గమ్యం, లక్ష్యం చేరుకోవాలో కూడా తెల్చుకోలేని విధంగా మానసిక పరిస్థితి ఎదురవుతుంది. కాబట్టి సైన్స్ అంటే సహజ ఆసక్తి ఉంటేనే అడుగు పెట్టాలి. ఇక తల్లిదండ్రుల ఆలోచనలోనూ మార్పు రావాలి. ఇంజనీరింగ్, మెడిసిన్ అనే కాకుండా.. తమ పిల్లల ఆసక్తి మేరకు వారిని చదివించాలి. అది సైన్స్ అయినా.. ఆర్ట్స్ అయినా సరే! దాని ఆధారంగా వారు ఎంపిక చేసుకున్న రంగంలో ఉన్నత అవకాశాల గురించి తెలుసుకోవాలి. వాటిని అందుకునే విధంగా ప్రోత్సహిస్తే ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ అవకాశాలు స్వాగతం పలుకుతున్నాయి.

జాబ్ స్కిల్స్

ఆధునిక పోటీ ప్రపంచం.. ఏ రంగంలో చూసినా.. ఏ విభాగాన్ని పరిగణనలోకి తీసుకున్నా.. ఉద్యోగాల కోసం విపరీతమైన పోటీ ఉంది. ఆ పోటీలో నిలదొక్కుకుని.. ఆఫర్ అందుకోవడం కొందరికే సాధ్యమవుతున్న పరిస్థితి. ఇలాంటి తరుణంలో కొద్దిపాటి స్కిల్స్‌తోనే తిరుగులేని కెరీర్‌కు మార్గం వేస్తోంది.. డేటా సైన్స్!! డేటా సైన్స్‌కు సంబంధించిన నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. డేటా సైన్స్ స్వరూపం, కెరీర్ అవకాశాలు, సంస్థలకు డేటా సైన్స్ ఆవశ్యకతకు కారణాలు, అవసరమైన నైపుణ్యాలు అందుకునేందుకు మార్గాలు తదితర అంశాలపై విశ్లేషణ..

డేటా సైన్స్.. కెరీర్ ష్యూర్

- డేటా సైన్స్ నిపుణుల కోసం సంస్థల అన్వేషణ
- సాఫ్ట్‌వేర్ నుంచి సర్వీస్ సెక్టార్ వరకు అవకాశాలు
- నైపుణ్యాలు పెంచుకునేందుకు ఎన్నో మార్గాలు

ప్రస్తుత జాబ్ మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఏటేటా నియామకాల్లో వృద్ధి నమోదవుతున్న విభాగం డేటా సైన్స్. రానున్న రోజుల్లోనూ ఇదే ధోరణి కొనసాగడం ఖాయం అంటున్నారు నిపుణులు. కాబట్టి యువత ఈ రంగంలో ఉద్యోగాలు సొంతం చేసుకునేలా నైపుణ్యాలు పెంచుకోవాలని సూచిస్తున్నారు.

డేటా సైన్స్ అంటే..: డేటా సైన్స్‌కు డిమాండ్ పెరుగుతుందని పలు పోర్టల్స్, నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో అసలు డేటా సైన్స్ అంటే ఏమిటి ? అనే సందేహం ఎదురవుతుంది. దీన్ని వివరించాలంటే.. కంపెనీల కార్యకలాపాల వైపు నుంచి పరిశీలించాలి. ప్రస్తుతం అన్ని రంగాల్లోని సంస్థలు తమ వినియోగదారుల అభిరుచి, ఆసక్తులకు అనుగుణంగా ఉత్పత్తులను, సేవలను అందించాలని తాపత్రయ పడుతున్నాయి. అందుకోసం వినియోగదారుల అభిరుచులు, ఆసక్తులు తెలుసుకోవడం చాలా ముఖ్యం. వీటికి సంబంధించిన గణాంక సహిత సమాచారాన్ని అందించే విభాగమే డేటా సైన్స్‌గా చెప్పొచ్చు.

మల్టీ డిసిప్లినరీ విధానం

డేటా సైన్స్ అనేది సమాచార సేకరణ, విశ్లేషణకు సంబంధించినది. అయితే సంస్థల్లో డేటా సైన్స్.. ఇతర విభాగాలతో సమ్మిళితంగా మల్టీ డిసిప్లినరీ విధానంలో కొనసాగుతోంది. అంటే.. డేటా సైన్స్ విభాగంలో విధులు నిర్వర్తించే వారు స్టాటిస్టిక్స్, అల్గారిథమ్స్, డేటా అనాలిసిస్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్, ప్రోగ్రామింగ్ విభాగాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఇలా అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ఒక ఉత్పత్తి లేదా సేవకు సంబంధించిన సమగ్ర గణాంకాలను సేకరించాలి. వీటి ఆధారంగా కంపెనీలు వినియోగదారులకు చేరువయ్యే ప్రణాళిక రూపొందించడం డేటా సైన్స్ విభాగం కీలక విధులుగా ఉంటున్నాయి. డేటా సైన్స్ విభాగం తయారు చేసే నివేదికల ఆధారంగానే సంస్థలు భవిష్యత్తు వ్యాపార, మార్కెటింగ్ వ్యూహాలపై నిర్ణయం తీసుకుంటున్నాయి.

డేటా నిపుణులు

ఇటీవల కాలంలో డేటా సైన్స్ నిపుణులకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అంతర్జాతీయ వ్యాపార వాణిజ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. అమెరికా మొదలు అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక మన దేశం విషయానికొస్తే.. డేటా సైన్స్ నిపుణులకు డిమాండ్ రీత్యా ప్రపంచంలో రెండో స్థానంలో నిలుస్తోంది. అంతేకాకుండా డేటా సైన్స్‌కు సంబంధించిన ఉద్యోగాల పరంగా ప్రతి పది ఉద్యోగాల్లో ఒకటి భారత్‌లోనే లభిస్తోంది. దీనికి కారణం.. మన దేశంలో ఇటీవల కాలంలో అన్ని రంగాల్లోని సంస్థల కార్యకలాపాలు విస్తృతం అవుతుండటమే.

లక్షల కొలువులు..: డేటా సైన్స్ విభాగంలో లక్షల సంఖ్యలో కొత్త కొలువులు అందుబాటులోకి రానున్నాయి. లింక్‌డిన్ ఎమర్జింగ్ జాబ్స్ రిపోర్ట్ ప్రకారం -అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఉద్యోగ విభాగంగా డేటా సైన్స్ నిలుస్తోంది. గత దశాబ్ద కాలంలో 650 శాతం మేర ఉద్యోగాల్లో వృద్ధి నమోదవడమే ఇందుకు నిదర్శనంగా సదరు నివేదిక పేర్కొంటోంది. ఏఐఎం రీసెర్చ్ నివేదిక ప్రకారం-అంతర్జాతీయంగా లభిస్తున్న ఉద్యోగాల్లో దాదాపు పది శాతం భారత్‌లోనే ఉంటున్నాయి. డేటా సైన్స్ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. రూ.లక్షల ప్యాకేజీతో కొలువులు దక్కించుకునే అవకాశముంది.

➤ **ప్రతి రంగంలోనూ..:** ప్రతి రంగంలోనూ నియామకాల పరంగా డేటా సైన్స్ హవా నడుస్తోంది. బీఎఫ్ఎస్ఐ, ఈ-కామర్స్ రంగాలు ముందు వరుసలో ఉంటున్నాయి. మొత్తం నియామకాల్లో ఈ రెండు రంగాల్లోనే దాదాపు 50 శాతం జరుగుతున్నట్లు పలు స్టాఫింగ్, రిక్రూటింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి. సాఫ్ట్‌వేర్ మొదలు సర్వీసెస్ వరకూ.. అన్ని విభాగాల్లోనూ డేటా సైన్స్ కొలువులు లభిస్తున్నాయి. గత ఏడాది ఐఐటీలు, ఐఐఎంల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో డేటా సైన్స్ జాబ్ ప్రొఫైల్స్ టాప్-5 జాబితాలో నిలిచాయి. డేటా నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌కు ఇదే నిదర్శనం.

➤ **జాబ్ ప్రొఫైల్స్ ఇవే..:** డేటా సైన్స్ విభాగంలో డేటా సైంటిస్ట్, డేటా ఇంజనీర్, స్టాటిస్టిషియన్, మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్, డేటా అనలిస్ట్ వంటి జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి.

అవసరమైన నైపుణ్యాలివే..: డేటా సైన్స్ విభాగంలో అడుగు పెట్టాలనుకునే వారికి ప్రత్యేక నైపుణ్యాలు ఉండాలి. మెషీన్ లెర్నింగ్, ఆర్, పైథాన్, హడూప్, ఎస్‌క్యూఎల్ వంటి లాంగ్వేజ్ స్కిల్స్ నేర్చుకుంటే ఇందులో రాణించొచ్చు. మ్యాథమెటిక్స్, కంప్యుటేషన్, స్టాటిస్టిక్స్‌పై ఆసక్తి, అవగాహన ఉండాలి. బ్యాచిలర్ స్థాయిలో సైన్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సీఎస్ఈ విద్యార్థులకు కొంత ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

అకడమిక్ కోర్సులు..: పలు ఇన్‌స్టిట్యూట్‌లు బ్యాచిలర్ స్థాయిలోనే డేటా సైన్స్, డేటా అనలిటిక్స్ సబ్జెక్ట్‌లతో కోర్సులను అందిస్తున్నాయి. బీఎస్సీ, బీకాం గ్రూప్స్‌లో డేటా అనలిటిక్స్‌ను ప్రవేశ పెడుతున్నాయి. దీంతోపాటు జావా, పైథాన్, ఆర్, ఎస్‌క్యూఎల్ వంటి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ పూర్తి చేయడం ద్వారా డేటా సైన్స్ ఉద్యోగాలకు సిద్ధం కావొచ్చు.

పలు సర్టిఫికేషన్ కోర్సులు

డేటా సైన్స్ నైపుణ్యాలు సొంతం చేసుకునేందుకు పలు సర్టిఫికేషన్ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ద్వారా డేటా మైనింగ్, స్టాటిస్టికల్ టూల్స్, మెషీన్ లెర్నింగ్ వంటి అంశాల్లో నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చు.

కోర్స్ఎరా/ యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్: అప్లైడ్ డేటా సైన్స్ విత్ పైథాన్ స్పెషలైజేషన్. **ఉడాసిటీ:** ఇంట్రో టు మెషీన్ లెర్నింగ్; **డేటా క్వెస్ట్:** డేటా అనలిస్ట్ ఇన్ ఆర్; **యుడెమీ:** పైథాన్ ఫర్ డేటా సైన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ బూట్ క్యాంప్.

కోర్స్ఎరా: ఐబీఎం డేటా సైన్స్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్; **యుడెమీ:** డేటా సైన్స్ కోర్స్; **ఎడ్యురేకా:** డేటా సైన్స్ సర్టిఫికేషన్ కోర్స్ యూజింగ్ ఆర్; **ఎడెక్స్/హార్వర్డ్ యూనివర్సిటీ:** ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ డేటా సైన్స్ తదితరాలు.

తెలంగాణ టెట్ -2026.. మెరుగైన మార్కులే లక్ష్యమా?

'సాక్షి ఎడ్యుకేషన్'లో ఉచిత స్టడీ మెటీరియల్..!

తెలంగాణలో ఉపాధ్యాయ కొలువు సాధించాలనే లక్ష్యంతో ఉన్న వేలాది మంది అభ్యర్థులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అత్యంత కీలకం. త్వరలో జరగనున్న టీజీ టెట్ – 2026 పరీక్షలో అభ్యర్థులు మెరుగైన స్కోరు సాధించేందుకు వీలుగా 'సాక్షి ఎడ్యుకేషన్' ప్రత్యేక కథనాలను, నాణ్యమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తోంది. అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా కరెంట్ అఫైర్స్, వాటికి సంబంధించిన నెలవారీ మ్యాగజీన్‌లు, సబ్జెక్టుల వారీగా, టాపిక్ వారీగా, కరెంట్ అఫైర్స్ బిట్ బ్యాంక్ తదితర సమగ్ర అభ్యసన సామగ్రిని ఉచితంగా పొందవచ్చు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ స్టడీ మెటీరియల్స్, బిట్ బ్యాంక్‌లను నేరుగా చదువుకోవచ్చు.

ఉద్యోగ సమాచారం

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 550 యాక్ట్ అప్రెంటిస్‌లు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్) యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ప్రముఖ కోచ్ తయారీ యూనిట్‌లలో ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ➤ **మొత్తం ఖాళీల సంఖ్య:** 550.
- ➤ **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్.
- ➤ **అర్హత:** మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- ➤ **వయసు:** 07.01.2026 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- ➤ **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in

యూఐఐసీఎల్, చెన్నైలో 153 అప్రెంటిస్‌లు

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీఎల్) గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ➤ **మొత్తం ఖాళీల సంఖ్య:** 153.
- ➤ **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-03, అస్సాం-01, బీహార్-02, చండీగఢ్-02, ఛత్తీస్‌గఢ్-04, ఢిల్లీ-09, గోవా-02, గుజరాత్-08, హర్యానా-01, జార్ఖండ్-01, కర్ణాటక-26, కేరళ-10, మధ్యప్రదేశ్-06, మహారాష్ట్ర-23, ఒడిశా-01, పుదుచ్చేరి-04, పంజాబ్-02, రాజస్థాన్-18, తమిళనాడు-19, తెలంగాణ-02, ఉత్తరాఖండ్-05, పశ్చిమ బెంగాల్-04, అస్సాం-01.
- ➤ **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- ➤ **వయసు:** 21 నుంచి 28 ఏళ్లు మించకూడదు.
- ➤ **స్టైపెండ్:** నెలకు రూ.9000.
- ➤ **ఎంపిక విధానం:** మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.12.2025.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://www.uiic.co.in

ఎండీఎస్ఎల్, ముంబైలో 200 అప్రెంటిస్‌లు

ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎస్ఎల్) 2025-26 సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ➤ **మొత్తం ఖాళీల సంఖ్య:** 200.
- ➤ **ఖాళీల వివరాలు:** ఇంజనీర్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-110, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-60, డిప్లొమా అప్రెంటిస్‌లు-30.
- ➤ **విభాగాలు:** సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్, షిప్‌బిల్డింగ్ టెక్నాలజీ, నేవల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ కామర్స్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వర్క్.
- ➤ **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ, జనరల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 01.04.2021 లేదా ఆ తర్వాత ఉత్తీర్ణులై ఉండాలి.
- ➤ **వయసు:** 01.03.2026 నాటికి 18 నుంచి 27 ఏళ్లు.
- ➤ **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,900.
- ➤ **ఎంపిక విధానం:** సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2026.
- ➤ **ఇంటర్వ్యూలు ప్రారంభం:** 27.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://www.mazagondock.in

సీఎస్ఐఆర్-ఎన్‌సీఎల్, పుణెలో 34 పోస్టులు

పుణెలోని సీఎస్ఐఆర్-నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ(ఎన్‌సీఎల్) ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ➤ **మొత్తం పోస్టుల సంఖ్య:** 34.
- ➤ **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్-15, టెక్నికల్ అసిస్టెంట్-19.
- ➤ **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో ఎంఎస్సీ, ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- ➤ **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- ➤ **వేతనం:** నెలకు టెక్నీషియన్‌కు రూ.19,900 నుంచి రూ.63,200, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.12.2025.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://www.nclin-dia.org

ఐఓసీఎల్‌లో 394 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) వివిధ రిఫైనరీల్లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ➤ **మొత్తం పోస్టుల సంఖ్య:** 394.
- ➤ **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- ➤ **వయసు:** 31.12.2025 నాటికి 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
- ➤ **వేతనం:** నెలకు రూ.25,000 నుంచి రూ.1,05,000.
- ➤ **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ప్రొఫిషియెన్సీ/ఫిజికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.12.2025.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://iocl.com

ఎయిమ్స్ పాట్నాలో 117 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) పాట్నా ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్(నాన్-అకడమిక్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ➤ **మొత్తం పోస్టుల సంఖ్య:** 117.
- ➤ **విభాగాలు:** జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అనెస్తీషియాలజీ, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ.
- ➤ **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/డీఎం/ఎంహెచ్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- ➤ **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
- ➤ **వేతనం:** నెలకు రూ.67,700.
- ➤ **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- ➤ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.12.2025.
- ➤ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.01.2026.
- ➤ **వెబ్‌సైట్:** https://aiimspatna.edu.in/

ఇదేం చెత్త వాగుడు ● శివాజీపై పలువురి ఫైర్

''చాలా బాగుందమ్మా (యాంకర్‌ని ఉద్దేశించి) ముఖ్యంగా నీ డ్రెస్ సెన్స్ చాలా బాగుంది. ఇంకో విషయం చెబుతున్నాను. హీరోయిన్లు ఏ బట్టలు పడితే ఆ బట్టలు వేసుకుని పోతే మనమే దరిద్రం అనుభవించాల్సి వస్తుందమ్మా... ఏమీ అనుకోవద్దు హీరోయిన్లందరూ. మీరు అనుకున్నా నాకు భయం లేదు. లాగి పెట్టి, పీకుతాం మనం. అది వేరే విషయం. కానీ మీ అందం చీరలోనూ, నిండుగా కట్టుకునే బట్టల్లోనే ఉంటుంది తప్పితే 'సామాను' కనబడే వాటిలో ఏమీ ఉండదమ్మా. అవి వేసుకున్నంత మాత్రాన చాలామంది చూసినప్పుడు నవ్వుతూ ఉంటారు... కానీ 'దరిద్రపు... (రాయడానికి వీలు లేని పదం)' ఇలాంటి బట్టలు ఎందుకు వేసుకుంది? కాస్త మంచివి వేసుకోవచ్చు కదా... బాగుంటావు అని అనాలనిపిస్తుంది కానీ అనలేం. అంటే... స్త్రీకి స్వేచ్ఛ లేదా అంటారు. నేనిలా మాట్లాడితే... పెద్ద పెద్దోళ్లంతా స్త్రీకి స్వేచ్ఛ లేదని అంటారు. స్వేచ్ఛ అనేది అదృష్టం. మన గౌరవం మన దేశ భాషల నుంచే పెరుగుతుంది. ప్రపంచ వేదికల్లో కూడా చీర కట్టుకున్నవారికే విశ్వ సుందరి కిరీటం వచ్చింది'' అంటూ సోమవారం సాయంత్రం జరిగిన 'దండోరా' సినిమా ప్రచార కార్యక్రమాల్లో శివాజీ చేసిన వ్యాఖ్యలు వివాదం అయ్యాయి. అమ్మాయిల దేహాన్ని 'సామాను' అనడం... 'దరిద్రపు...' అంటూ బహిరంగంగా అనడం పట్ల పాపులర్ యాంకర్–నటి అనసూయ, గాయని–అనువాద కళాకారిణి చిన్మయి, ప్రముఖ స్త్రీవాది కొండవీటి సత్యవతి స్పందించారు. అలాగే, దర్శకురాలు నందినీ రెడ్డి, నిర్మాతలు స్వప్న దత్, సుప్రియ, నటి–నిర్మాత లక్ష్మీ మంచు, దర్శకురాలు నందినీ రెడ్డి, పాపులర్ యాంకర్ ఝాన్సీ తదితరులు శివాజీ నుంచి క్షమాపణ కోరాలంటూ 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్'కి లేఖ రాశారు. ''శివాజీ... ఏమిటా చెత్తవాగుడు'' అంటూ సత్యవతి నిప్పులు చెరిగారు. ''ఏంటా ధైర్యం? రాజకీయాల్లో ఉన్నామనా'' అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''శివాజీ హీరోయిన్లకు అనవసరమైన సలహా ఇచ్చాడు. వాళ్ల సామాను కవర్ చేసుకోవడానికి చీరలు కట్టుకోమంటున్నాడు. అతనేమో జీన్స్, హుడీలు వేసుకుంటాడు. మరి... భారతీయ సంప్రదాయాన్ని అనుసరించి, ధోతీలు కట్టుకోవచ్చుగా'' అని చిన్మయి అతని మాటలను ఖండించారు. ''శివాజీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరం... ఒకరి ప్రవర్తనతో గౌరవం లభిస్తుంది కానీ ధరించే దుస్తులతో కాదు... మహిళలు గౌరవించబడాలి'' అంటూ ప్రముఖ హీరో మంచు మనోజ్ ఓ లేఖ వెలువరించారు.

ఇలా శివాజీ చేసిన వ్యాఖ్యలకు పెద్ద ఎత్తున దుమారం రేగడంతో మంగళవారం సాయంత్రం 'క్షమాపణ' చెబుతూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

శివాజీ మట్టెలు ధరించాలి – చిన్మయి

''తెలుగు నటుడు శివాజీ నటీమణులను 'దరిద్రపు... (రాయడానికి వీలు లేని పదం)' వంటి అసభ్య పదజాలంతో దూషిస్తూ, వారు తమ 'సామాను'ను కప్పుకోవడానికి చీరలు ధరించాలని అనవసరమైన సలహాలు ఇస్తున్నాడు. శివాజీ ఒక అద్భుతమైన సినిమాలో విలన్‌గా నటించి, చివరికి ఇన్సెల్ బాయ్స్‌కు హీరోగా మారిపోయాడు. గమనించాల్సిన విషయం ఏంటంటే... వృత్తిపరమైన ప్రదేశాల్లో శివాజీ 'దరిద్రపు...' వంటి పదాలను ఉపయోగిస్తున్నాడు. శివాజీ జీన్స్, హుడీ ధరిస్తాడు. అయితే అతను ధోతీలు మాత్రమే ధరించి, భారతీయ సంస్కృతిని పాటించాలి... బొట్టు పెట్టుకోవాలి. అతను వివాహితుడని తెలిసేలా కంకణం, మెట్టెలు ధరించాలి. ఇక్కడ (ఫిల్మ్ ఇండస్ట్రీని ఉద్దేశించి కావొచ్చు) మహిళలను చూసే విధానం బాగాలేదు'' అంటూ సోషల్ మీడియా వేదికగా గాయని చిన్మయి స్పందించారు.

నీ ఒంట్లో ఇంత కొవ్వేంది

ఏమిటా చెత్త వాగుడు శివాజీ?
నువ్వేమో అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ
మా గురించి అవాకులు చవాకులు
పేలతావా
నీ ఒంట్లో ఇంత కొవ్వేంది
మా బట్టల గురించి వాగడానికి
నువ్వెవడివి
చెప్పులు తేవాలా
చెర్నాకోలా తేవాలా

నిన్ను తన్ని తగలెయ్యడానికి

అడ్డమైన వాళ్ళూ
చెడ్డీలేసుకుని బయలుదేరుతారు
సిగ్గూ ఎగ్గూ వదిలేసి
అయినా నువ్వెవడివి
మా గురించి తీర్పులు చెప్పడానికి
మర్యాదగా చెంపలేసుకుని సారీ చెప్పు
గుంజీళ్ళు తీసి మోకాళ్ళ మీద కూర్చుని

క్షమాపణ అడుగు
ఇంకెప్పుడూ ఇలా వాగనని
నీకు నువ్వు ప్రమాణం చేసుకో
మా జోలికొస్తే ఖబడ్దార్
బండకేసి ఉతికి ఆరేస్తాం.

– కొండవీటి సత్యవతి
ఎడిటర్, భూమిక, స్త్రీవాద పత్రిక

పరిశ్రమ మౌనం వహించడం ఆందోళనకరం

''తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో పని చేస్తున్న వంద మందికి పైగా మహిళా నిపుణుల తరపున మేము ఈ లేఖ రాస్తున్నాం'' అంటూ నందినీ రెడ్డి, సుప్రియా యార్లగడ్డ, స్వప్న దత్, లక్ష్మీ మంచు, ఝాన్సీ లక్ష్మీ అంటూ 'మా'కి లేఖ రాశారు. ఆ లేఖ సారాంశం ఈ విధంగా...

● 'మా' సభ్యునిగా ఉన్న శివాజీ 'దండోర' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో, బహిరంగ వేదికపై హీరోయిన్ల దుస్తుల గురించి చేసిన వ్యాఖ్యల్ని చాలా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది. ఇటువంటి వ్యాఖ్యలు అనుచితమైనవి మాత్రమే కాదు... ముఖ్యంగా సినిమా పరిశ్రమ నుండి ప్రయోజనం పొందుతున్నవాళ్లూ సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులూ చేసినప్పుడు చాలా హానికరం. అతను ఉపయోగించిన 'సామాన్లు, దరిద్రపు' వంటివి అవమానకరమైనవి. అంతేకాదు... నటీమణులను బెదిరించినట్లు అయింది. ఇది బీఎన్ఎస్ 509 సెక్షన్ ప్రకారం మహిళలను అవమానించడంగా పరిగణించబడుతుంది. ఇది శిక్షార్హమైన నేరం. శివాజీ నుంచి బహిరంగ, షరతులు లేని క్షమాపణ కోరుతున్నాం.. లేకుంటే మేం తీవ్ర చట్టపరమైన మార్గాన్ని ఆశ్రయించాల్సి వస్తుంది. మహిళ దుస్తులు, చీర లేదా ఇతరత్రా డ్రెస్సింగ్‌పై ఆంక్షలు విధించడం ఆమోదయోగ్యం కాదు. ఆధునిక, సృజనాత్మక పరిశ్రమలో దీనికి స్థానం లేదు. మహిళలు నిజమైన బెదిరింపులను ఎదుర్కొంటున్నప్పుడు పరిశ్రమ మౌనం వహించడం కూడా ఆందోళనకరమైనది. నటీమణులు నిధీ అగర్వాల్, సమంత ఇటీవల మూక దాడులకు గురైనప్పుడు సామూహిక ఆగ్రహం, జవాబుదారీతనం లేకపోవడం ఆందోళనకరమైనది.

మహిళల భద్రతను గౌరవాన్ని ఉల్లంఘించినప్పుడు నిశ్శబ్ద ప్రతిస్పందన ఎందుకు ఉంది? క్షమాపణకు మించి మేము 'మా' నుండి స్పష్టమైన, జవాబుదారీతనం, చర్యను కోరుతున్నాం. 'మా' అసోసియేషన్ వెంటనే ఈ కింది చర్యలను రూపొందించి అమలు చేయాలని అభ్యర్థిస్తున్నాం.

● కేవలం క్షమాపణలు మాత్రమే కాదు. ఈ విషయాలపై కూడా 'మూవీ ఆర్టిస్టు అసోసియేషన్' జవాబుదారీతనం వహిస్తుందని అనుకుంటున్నాము. అలాగే 'మా' అసోసియేషన్ ఈ క్రింది అంశాలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతుందని ఆశిస్తున్నాం'' అంటూ కొన్ని అంశాలను ప్రస్తావించారు.

వాయిస్ ఆఫ్ ఉమెన్ ప్రతినిధులు
– నందినీ రెడ్డి, సుప్రియా యార్లగడ్డ, స్వప్న దత్, లక్ష్మీ మంచు, ఝాన్సీలక్ష్మి

ఇదిలా వుంటే... శివాజీ క్షమాపణలు చెప్పిన నేపథ్యంలో ఈ వివాదం సద్దుమణిగింది అన్నట్లుగా 'మా' ఓ ప్రకటన విడుదల చేసింది.

అలా అనడానికి ఎంత ధైర్యం? - అనసూయ

శివాజీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అనసూయ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని ముఖ్య విశేషాలు ...

● నా లైఫ్‌లో హీరోల ఫ్యాన్స్ పేరుతో చేసిన ట్రోల్స్‌లో ముఖ్యంగా మూడు ఉన్నాయి. ఒకటి 'అత్తారింటి దారేది' (ఆ సినిమాలో స్పెషల్ సాంగ్‌ని గ్రూపుతో చేయలేనని రిజెక్ట్ చేశారు), రెండోది 'అర్జున్ రెడ్డి' (ఈ మూవీ పబ్లిక్ ఫంక్షన్‌లో ఆడవాళ్లపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు), మూడోది అంతకుముందు 'గంగోత్రి' (ఆ సినిమాలో అల్లు అర్జున్ తనకు నచ్చలేదని చెప్పడం). అయితే అప్పట్లో మెచ్యూర్టీ లేకుండా, లౌక్యం లేకుండా మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడిన మాటలు అవి. కానీ ఎవరి మీదా అయిష్టంతోనో, హిడెన్ ఎజెండాతోనో మాట్లాడిన మాటలు కావు. అప్పుడు నన్ను చాలా అగౌరవపరిచారు... పర్సనల్‌గా టార్గెట్ చేస్తూ, మెసేజ్‌లు పెట్టారు. అయితే నన్ను బాధపెట్టే విషయం ఏంటంటే... ఫ్యాన్స్ పేరుతో ట్రోల్స్ చేస్తున్నప్పుడు, అరాచకాలు చేస్తున్నప్పుడు ఎవరి ఫ్యాన్ అని వారు చెప్పుకుంటారో ఆ స్టార్ ఒక్క మాట చెబితే బాగుండేది. కానీ అలా ఎప్పుడూ జరగలేదు.

■ తొలి ప్రాధాన్యం కుటుంబానికే...

నాకు సినిమానే జీవితం కాదు... యాక్టింగ్ అంటే ఇష్టం... అంతే. నా తొలి ప్రాధాన్యం నా కుటుంబానికే. అందరూ ఆదర్శంగా తీసుకునేలా నా ఫ్యామిలీ లైఫ్ లీడ్ చేయాలనుకుంటాను. అందుకే కెరీర్‌కన్నా ఫ్యామిలీకి ప్రాధాన్యం ఇస్తాను. అవకాశాల కోసం ఎవరి మోచేతి నీళ్లు తాగాల్సిన అవసరం నాకు లేదు. ఒకవేళ అలా చేసి, అవకాశాలు తెచ్చుకుంటే నాకు తృప్తిగా ఉండదు.

■ రెబల్ అనుకున్నా ఫర్వాలేదు

పిరికిగా ఉండే స్త్రీలనే మగవాళ్లు టార్గెట్ చేస్తారు. బోల్డ్‌గా ఉండే అమ్మాయిల గురించి నెగెటివ్‌గా ప్రచారం చేస్తారు. 'ఫేక్ ఫెమినిజమ్' అని, 'అటెన్షన్ సీకింగ్'లో భాగంగా ఇలా మాట్లాడుతున్నానని కూడా అంటారు. అయినా 'నో ప్రాబ్లమ్'. నేను ఉమెన్‌ని కోరేది ఒక్కటే. పిరికిగా ఉండొద్దు. ధైర్యంగా బతకాలి. 'రెబల్' అనుకున్నా ఫర్వాలేదు... మన జోలికి ఎవరూ రారు.

■ ఆ జంతువులతో జాగ్రత్త

మనం అడవికి వెళ్లామనుకోండి... జంతువుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడం కోసం జాగ్రత్తలు తీసుకుంటా కదా. అలాగే సమాజంలోని మగాళ్ల రూపంలో ఉండే కొన్ని జంతువులు ఉన్న చోట మనం (మహిళలు) ఉండాల్సినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మగవాళ్లల్లో మంచివాళ్లు చాలామంది ఉన్నారు. కానీ జంతువుల్లా ఉండే వాళ్లతో జాగ్రత్త. ఎందుకంటే వాళ్లు మనుషులు కాదు... సంస్కారం ఉండదు. జంతువులు కాబట్టి రెచ్చిపోతారు. అలాంటివాళ్లు ఉన్న చోట నా జాగ్రత్తలో నేను ఉంటాను.

■ మా అత్తగారింట్లో నన్ను అర్థం చేసుకున్నారు

మా ఆయన బిహారీ. మా పెళ్లప్పటికి నేను సినిమా ఇండస్ట్రీలో లేను. మా అత్తగారింట్లో 'గూంఘట్' (ముసుగు) కల్చర్ ఉంది. కానీ నేను అలా ముసుగు వేసుకోవాలని వాళ్లు ఆశించలేదు. నేను మోడ్రన్‌గా ఉంటాను. అయితే నా వస్త్రధారణకు, నా మనస్తత్వానికి ఏమాత్రం సంబంధం లేదని మా మామగారు గ్రహించారు. నన్ను కూతురిలా చూసుకుంటారు. మా ఆయన నాకు చాలా సపోర్టివ్‌గా ఉంటారు. మా ఇంట్లో నా చుట్టూ అలాంటి మగవాళ్లు ఉన్నారు. వేరే అమ్మాయిల జీవితాల్లోనూ ఇలా మంచి మగవాళ్లు ఉండాలన్నది నా ఆశ.

■ ధోతీ కట్టుకుని ఉండగలరా?

వస్త్రధారణ అనేది కంఫర్ట్ కోసమే. ఇప్పుడు మగవాళ్ల దుస్తులు గురించి మాట్లాడుకుందాం. ఇంట్లో పూజలు చేసినప్పుడు పట్టు ధోతీ కట్టుకుని చేస్తారు కదా... పూజ అయిపోగానే తీసేసి, 'షార్ట్స్' వేసుకుంటారు. మరి... ధోతీ కట్టుకుని గంటలు గంటలు ఉండమంటే వాళ్లు ఉంటారా? ఉండరు... ఎందుకంటే ధోతీ వారికి సౌకర్యం కాదు. మరి అమ్మాయిలు వాళ్ల కంఫర్ట్ గురించి ఆలోచించకూడదా? అయినా చీర కట్టుకో అంటారు... అసలు చీర కంటే 'ఎక్స్‌పోజింగ్' వేరే ఏ డ్రెస్‌లో ఉంటుంది?

■ అసలు ఆ పదం ఏంటి?

'సామాను' అనే పదం ఏంటి? ఆడవాళ్ల శరీర భాగాలను అలా పోల్చడానికి ఎంత ధైర్యం ఉండాలి? పైగా బహిరంగ వేదిక మీద 'దరిద్రపు....', 'సామాను' అనే పదాలు వాడటం ఎంత ధైర్యం? రాజకీయాల్లో ఉన్నామనే ధైర్యమా? వాళ్లకి కూతుళ్లు లేరా? అయినా వేరేవాళ్లకు తగ్గట్టుగా మన వస్త్రధారణ ఉండాలా? నేనేదో రెబలియస్‌గా మాట్లాడటం లేదు. అమ్మాయిలు కుక్కిన పేనులా ఉండాలని సీక్రెట్ ఎజెండాతో కొందరు మగవాళ్లు రూల్స్ పెట్టారు. కానీ, అమ్మాయిలను గౌరవించే మగవాళ్లు మన సమాజంలో చాలామంది ఉన్నారు. ప్రపంచంలో మంచి భాగస్వాములుగా ఉండే మగవాళ్లు చాలామంది ఉన్నారు. ఇలాంటి వాళ్లని చూసినప్పుడల్లా ఆ జంతువుల్లాంటి మగవాళ్లు ఇలా ఎందుకు ఉండటంలేదు అనిపిస్తుంటుంది.

నాకు ఇద్దరు మగపిల్లలున్నారు. ఒక తల్లిగా వాళ్లకి మంచి ప్రపంచం ఉండాలని కోరుకుంటాను. చేతకాని మగవాళ్లందరూ ఆడవాళ్లను హర్ట్ చేస్తుంటారు. అందుకే మా అబ్బాయిలు నాకంటే ధైర్యంగా ఉండాలని కోరుకుంటాను. ఎందుకంటే ధైర్యంగా ఉండే మగవాళ్లు హర్ట్ చేయాలనుకోరు. వాళ్లకి ఇన్‌సెక్యూర్టీ ఉండదు కాబట్టి.

■ అక్కడ క్రైమ్ రేట్ తక్కువ

అమ్మాయిలు ధరించే దుస్తులే వారికి ప్రొటెక్షన్ అంటే... అస్సలు కానే కాదు. నా కుటుంబంలో ఉన్న మగవాళ్లు ప్రొటెక్ట్ చేస్తారు... కానీ రక్షణ పేరుతో కంట్రోల్ చేయాలనుకోలేదు. కొన్ని దేశాలు ఉన్నాయి... అక్కడ క్రైమ్ రేట్ చాలా తక్కువ. ధరించే దుస్తులతో సంబంధం లేదు. ఆ దేశాల్లో అందరికీ సమాన హక్కులు ఉంటాయి. మరి... మనకు ఎందుకీ పక్షపాతం?

– సినిమా డెస్క్

కరుణే కానుక

శాంటా తాత వస్తాడు అడిగినవన్నీ ఇస్తాడు...
అని పిల్లలు అనుకోవడం ఆనవాయితీ.
తల్లిదండ్రులే ఏ అర్ధరాత్రో వారి దిండ్ల వద్ద ఆ కానుకలు
పెట్టి ఆశ్చర్యపరచడమూ ఆనవాయితే.
కాని శాంటాలు రాని ఇళ్లుంటాయి.
శాంటా బహుమతులు అందని పిల్లలుంటారు.
ఈ క్రిస్మస్ వేళ పేద పిల్లలకు,
హోమ్స్‌లో ఉండే నిరాధార పిల్లలకు
మీరే శాంటాలుగా కానుకలు ఎందుకు ఇవ్వకూడదు?
అవి అందుకున్న వారి ముఖాల్లో
నక్షత్ర కాంతిని ఎందుకు చూడకూడదు?

మీరూ శాంటా కావచ్చు

శాంటా క్లాజ్‌కు దేశం లేదు.... ప్రాంతం లేదు... భాష లేదు... అందరు పిల్లలకూ శాంటా తాత ఇష్టం. తాత తెచ్చే కానుకలు ఇష్టం. అందుకే క్రిస్మస్ వస్తుందనగా తమ కోరికలన్నీ కాగితం పై రాసి జాగ్రత్తగా డబ్బాలో వేసి పెట్టడమో, ఫ్రిజ్‌కు ఉన్న అయస్కాంతం కింద వేళ్లాడగట్టడమో, పోస్ట్ బాక్స్‌లో వేయడమో చేస్తారు. ఎప్పుడెప్పుడు శాంటా వస్తాడా... కానుకలు ఇస్తాడా అని ఉద్వేగంగా ఎదురు చూస్తారు.

క్రిస్మస్ ముందు రోజు రాత్రి తప్పకుండా శాంటా వస్తాడని పిల్లల నమ్మకం. 'జింగిల్ బెల్స్... జింగిల్ బెల్స్... జింగిల్ ఆల్ ద వే' అని పాడుకుంటూ, మువ్వలు గలగలలాడుతున్న రైన్‌డీర్‌ల బండి ఎక్కి, కానుకల మూటతో శాంటా వచ్చి ఒక్కో పిల్లవాడికి/పాపకు ఇవ్వాల్సిన గిఫ్ట్ ఇచ్చి వెళతాడని వాళ్లు భావిస్తారు. అంతేనా? మంచి నడవడిక చూపినందుకు, బాగా చదువుకుంటున్నందుకు 'మెచ్చుకోలు పత్రం' కూడా ఇచ్చి వెళతాడు. ఏదైనా చెడ్డ అలవాటు ఉంటే మానుకోమని హెచ్చరిస్తాడు కూడా. అలా అని విశ్వసించే పిల్లలు క్రిస్మస్ రోజు కళ్లు తెరిచి తమ దిండ్ల పక్కనే ఉన్న బహుమతులు చూసుకుని కేరింతలు కొడతారు. శాంటా ఇచ్చాడని మురిసిపోయి పక్కింటి పిల్లలకు చూపిస్తారు. శాంటా లేఖను పదే పదే చదువుకుంటారు. ఇది వారి మురిపమైన అమాయక ప్రపంచం. ఆ ప్రపంచంలో వారిని ఉంచేందుకు తల్లిదండ్రులు/ బంధువులు రహస్యంగా కానుకలు ఏర్పాటు చేస్తారు. ఇలా సీక్రెట్ శాంటాలుగా కన్నబిడ్డలకే కాదు... మనసులోని చిన్న చిన్న కోరికలు కూడా నెరవేరని స్థితిలో ఉన్న పిల్లలకు కూడా కావచ్చు.

సీక్రెట్ శాంటా నెట్‌వర్క్స్

మన దేశంలో అనేక స్వచ్ఛంద సంస్థలు 'సీక్రెట్ శాంటా నెట్‌వర్క్స్' కలిగి ఉన్నాయి. ఇవి తమ వెబ్‌సైట్స్‌లో అండర్ ప్రివిలేజ్డ్ పిల్లలు అంటే పేద బస్తీల్లో, హాస్టళ్లలో, అనాథ గృహాలలో ఉన్నవారు కోరిన కోరికలను ఉంచుతారు. వాటిని చూసి ఆ కోరిక నెరవేర్చేందుకు సాయం చేయవచ్చు. లేదా ఆ గిఫ్ట్‌ను స్వయంగా అందే ఏర్పాటు చేయవచ్చు. శాంటా పంపినట్టే ఈ పిల్లలకు ఆ గిఫ్ట్స్ అందుతాయి. ఇలాంటి పని కోసం వలెంటీర్లుగా పని చేసే విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. 'భూమి', 'హోమ్‌లెస్ కేర్ ఫౌండేషన్', 'లిటిల్ హార్ట్ ఫౌండేషన్', 'ది లెప్రసి మిషన్ ట్రస్ట్ ఇండియా'... వంటి సంస్థలు సీక్రెట్ శాంటాలుగా క్రిస్మస్ సమయంలో పేద పిల్లల ముఖాన చిర్నవ్వులు చిందించే ఏర్పాటు చేస్తున్నారు. నగరాలన్నింటిలోనూ ఇంకా అనేక సంస్థలు పని చేస్తున్నాయి. ఇంటర్నెట్ ద్వారా ఎంచుకుని సహాయం చేయవచ్చు.

చిన్న కానుక... ఎంతో సంతోషం:

క్రిస్మస్ డిసెంబర్ ఆఖరున వస్తుంది. కాబట్టి స్వెటర్లు, ఉన్ని టోపీలు, రగ్గులు ఇవ్వొచ్చు. స్కూలు బ్యాగులు, నోట్‌బుక్స్, షూస్, హైజీన్ కిట్స్... ఇవన్నీ వారికి ఆనందాన్ని ఇచ్చేవే.

బొమ్మలు, బట్టలు చెప్పనక్కర్లేదు. కేక్స్, చాక్లెట్లు తప్పనిసరిగా ఉండాలి. 'నీకు మంచి భవిష్యత్తు ఉంది. నువ్వు చాలా మంచి పిల్లాడివి' అని రాసిన శాంటా లేఖ వారికి వేయి ఏనుగుల బలం ఇస్తుంది. మనం నివసిస్తున్న చోట హౌస్ హెల్ప్‌గా పని చేసే వారి పిల్లలకు, వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్స్ పిల్లలకు సీక్రెట్ శాంటాగా బహుమతులు పంపితే ఆ తర్వాత ఆ పిల్లల రియాక్షన్ తెలుసుకుంటే ఎంతో సంతృప్తిగా ఉంటుంది. శాంటా కథ 'మంచికి ప్రతిఫలం ఉంటుంది' అని చెబుతుంది. పిల్లల్లో ఈ విశ్వాసం నింపడం ముఖ్యం. అండర్ ప్రివిలేజ్డ్ పిల్లల్లో మన కోసం కూడా మంచి భవిష్యత్తు ఉంటుంది... మనకూ బహుమతులు ఉంటాయి అనే భరోసా కల్పించడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

క్రిస్మస్ చెట్టు, తార, బెల్స్... ప్రేమను పంచమనే చెబుతాయి. చిన్నపిల్లలకు ప్రేమను పంచడానికి మించిన ఆనందం లేదు.

● ముగ్గు ముచ్చట

ఎ. హన్సిక,
5వ తరగతి,
విద్యాస్ఫూర్తి స్కూల్,
బెంగళూరు

13 చుక్కలు, మధ్య చుక్క, 7 వచ్చేవరకు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
డిసెంబర్ 23న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,39,410	1,40,840	1,38,550	1,40,840	1,39,500	1,39,310
బంగారం (22 క్యారెట్లు)	1,20,110	1,27,000	1,27,000	1,30,810	1,27,420	1,27,700
వెండి	2,16,000	2,16,400	2,34,000	2,16,400	2,12,000	2,34,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

నీరజ్, నేను క్రీడాంశాలపై చర్చించాం: ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: రెండు ఒలింపిక్ పతకాల విజేత, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ ఏడాది చోప్రా మాజీ టెన్నిస్ ప్లేయర్ హిమాని మోర్‌ను వివాహమాడారు. సతీమణితో వెళ్లి ప్రధానితో కాసేపు ముచ్చటించారు. చాంపియన్ అథ్లెట్‌తో భేటీని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'నీరజ్, తన శ్రీమతి హిమానితో నన్ను కలుసుకోవడం నాకు సంతోషాన్నిచ్చింది. ఈ సందర్భంగా చోప్రా, నేను క్రీడాంశాలపై చర్చించాం. ఇతర విషయాలపై కూడా ఇద్దరి మధ్య సరదా సంభాషణ జరిగింది' అని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 27 ఏళ్ల నీరజ్ చోప్రాకు ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు వచ్చాయి. చాన్నాళ్లు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తాను ఆశించినట్లే 90 మీటర్ల మార్కును దోహా డైమండ్ లీగ్‌లో అధిగమించాడు. కానీ సెప్టెంబర్లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. ఎనిమిదో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. హేమాహేమీలతో స్వయంగా తన పేరుతో నిర్వహించిన బెంగళూరు ఈవెంట్‌లో చోప్రానే విజేతగా నిలిచాడు.

ఒకే ఓవర్‌లో 5 వికెట్లు

- ఇండోనేసియా బౌలర్ ప్రియందన అరుదైన ఘనత
- అంతర్జాతీయ టి20ల్లో తొలి బౌలర్‌గా రికార్డు

బాలి (ఇండోనేసియా): అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో ఇండోనేసియా బౌలర్ గెడె ప్రియందన అరుదైన ఘనత సాధించాడు. కంబోడియాతో మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో 'హ్యాట్రిక్' సహా 5 వికెట్లు తీసిన ప్రియందన... ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా రికార్డులోకి ఎక్కాడు. ఎనిమిది మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. కంబోడియా ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన ప్రియందన... తొలి బంతికి షా అబ్రార్ (37)ను అవుట్ చేశాడు. తర్వాతి రెండు బంతులకు వరుసగా నిర్మల్ జీత్ సింగ్ (0), చన్‌తోన్ (0)ను పెవిలియన్ బాట పట్టించాడు. దీంతో 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. నాలుగో బంతికి పరుగులు రాకపోగా... చివరి రెండు బంతులకు మొంగదారా సోక్ (0), పెల్ వాన్నక్ (0) అవుటయ్యారు. దీంతో ఈ 28 ఏళ్ల మీడియం పేసర్ రికార్డుల్లోకెక్కాడు. ఈ మ్యాచ్‌లో ప్రియందన 1 ఓవర్ వేసి వైడ్ రూపంలో 1 పరుగు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. గతంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో 4 వికెట్లు తీసిన ఘటనలు 14 ఉండగా... 5 వికెట్లు పడగొట్టడం మాత్రం ఇదే తొలిసారి. ఇక ఓవరాల్‌గా పురుషుల టి20ల్లో గతంలో ఇద్దరు బౌలర్లు ఇలా ఒకే ఓవర్‌లో 5 వికెట్లు పడగొట్టారు. 2013లో విక్టరీ డే కప్ సందర్భంగా అల్ అమీన్ హొసేన్, 2019–20 సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో కర్ణాటక బౌలర్ అభిమన్యు మిథున్ హరియాణాపై ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు తీశారు. ఇక ఈ మ్యాచ్‌లో ఇండోనేసియా జట్టు 60 పరుగుల తేడాతో కంబోడియాను ఓడించింది.

షఫాలీ షో

11 ఫోర్లు, 1 సిక్స్‌తో 34 బంతుల్లో 69 నాటౌట్

- రెండో టి20లో 7 వికెట్లతో భారత మహిళల జయభేరి
- స్పిన్‌తో కట్టడి చేసిన వైష్ణవి, శ్రీచరణి
- 2–0కు పెరిగిన ఆధిక్యం
- 26న తిరువనంతపురంలో మూడో టి20

సాక్షి, విశాఖపట్నం: ఓపెనర్ షఫాలీ వర్మ ధనాధన్ షోతో భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని సాధించింది. మంగళవారం జరిగిన రెండో టి20లో హర్మన్‌ప్రీత్ నేతృత్వంలోని భారత్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయఢంకా మోగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–0తో ఆధిక్యంలో ఉంది. మొదట శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులే చేసింది. హర్షిత సమరవిక్రమ (32 బంతుల్లో 33; 4 ఫోర్లు), కెప్టెన్ చమరి (24 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారంతే! భారత బౌలర్లలో తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి (2/23), కొత్త స్పిన్నర్ వైష్ణవి శర్మ (2/32) లంక బ్యాటర్లను కట్టడి చేశారు. అనంతరం భారత మహిళల జట్టు 11.5 ఓవర్లలోనే మూడే వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (34 బంతుల్లో 69 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) ఆకాశమే హద్దుగా చెలరేగింది. దీంతో 8.1 ఓవర్ల ముందే లక్ష్యం మంచు ముక్కలా కరిగింది.

ఆరంభం నుంచే దూకుడుగా....

చిన్న లక్ష్యాన్ని దూకుడుగా ఛేదించే క్రమంలో స్మృతి మంధాన (14) అవుటైంది. క్రీజులో ఉన్న మరో ఓపెనర్ షఫాలీకి జెమీమా (15 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్) జతయ్యాక స్కోరు వాయువేగంతో దూసుకెళ్లింది. ఇనోక వేసిన ఐదో ఓవర్లో వరుస బౌండరీలు కొట్టిన షఫాలీ... చమరి మరుసటి ఓవర్ మూడు బంతుల్ని 4, 6, 4గా తరలించింది. పవర్‌ప్లేలో 68/1 స్కోరు చేసింది. తర్వాత జెమీమా కూడా తానేం తక్కువ కాదని 2 ఫోర్లు, ఓ భారీ సిక్సర్‌తో విరుచుకుపడింది. కాసేపటికి ఆమె అవుట్‌కాగా, 9 ఓవర్లలోనే భారత్ స్కోరు వందకు చేరింది. షఫాలీ 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. గెలుపు ముంగిట కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (10) బౌల్డ్ కాగా, రిచా ఘోష్ (1 నాటౌట్) విన్నింగ్ రన్ తీసింది. షఫాలీ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మూడో టి20 తిరువనంతపురంలో ఈ నెల 26న జరుగనుంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: విష్మి గుణరత్నే (సి అండ్ బి) క్రాంతి 1; చమరి (సి) అమన్‌జోత్ (బి) స్నేహ్ రాణా 31; హాసిని పెరీరా (సి అండ్ బి) శ్రీచరణి 22; హర్షిత (రనౌట్) 33; కవీశా (సి) అమన్‌జోత్ (బి) శ్రీచరణి 14; నీలాక్షిక (సి) శ్రీచరణి (బి) వైష్ణవి 2; కౌశిని (రనౌట్) 11; శాషిని (సి) స్మృతి మంధాన (బి) వైష్ణవి 0; కావ్య (రనౌట్) 1; మల్కిని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 128. **వికెట్ల పతనం:** 1–2, 2–38, 3–82, 4–104, 5–109, 6–121, 7–122, 8–126, 9–128. **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 3–0–21–1, అరుంధతి రెడ్డి 3–0–22–0, స్నేహ్ రాణా 4–1–11–1, అమన్‌జోత్ కౌర్ 2–0–11–0, వైష్ణవి శర్మ 4–0–32–2, శ్రీచరణి 4–0–23–2.

భారత ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) కావ్య (బి) దిల్హారి 14; షఫాలీ వర్మ (నాటౌట్) 69; జెమీమా రోడ్రిగ్స్ (సి) దిల్హారి (బి) కావ్య 26; హర్మన్‌ప్రీత్ (బి) మాల్కి మదర 10; రిచా ఘోష్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (11.5 ఓవర్లలో 3 వికెట్లకు) 129. **వికెట్ల పతనం:** 1–29, 2–87, 3–128. **బౌలింగ్:** మాల్కి మదర 2.5–0–22–1, కావ్య 3–0–32–1, కవీశా 2–0–15–1, ఇనోక రణవీర 2–0–31–0, చమరి 1–0–17–0, శాషిని 1–0–12–0.

రన్నరప్ ఆంధ్రప్రదేశ్

మహిళల టీమ్ విభాగంలో టైటిల్ నిలబెట్టుకున్న హరియాణా

సాక్షి, విజయవాడ: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టీమ్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ హరియాణా 3–0తో ఆంధ్రప్రదేశ్‌ను ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భారత స్టార్ పీవీ సింధు ఫైనల్ మ్యాచ్‌కు దూరంగా ఉంది. తొలి మ్యాచ్‌లో దేవిక సిహాగ్ 20–22, 21–16, 21–16తో నవ్య కందేరిపై గెలిచింది. రెండో మ్యాచ్‌లో ఉన్నతి హుడా 21–14, 21–14తో సూర్య చరిష్మా తామిరిపై నెగ్గి హరియాణాకు 2–0తో ఆధిక్యాన్ని అందించింది. మూడో మ్యాచ్‌లో ఉన్నతి–అన్‌మోల్ ద్వయం 21–13, 24–22తో నవ్య–సూర్య చరిష్మా జంటపై గెలవడంతో హరియాణాకు టైటిల్ ఖరారైంది. రన్నరప్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టులో నవ్య, సూర్య చరిష్మా, సీహెచ్ఎస్ఆర్ ప్రణవి, దీపిక దేవనబోయిన, కవిప్రియ సభ్యులుగా ఉన్నారు. పురుషుల టీమ్ విభాగంలో తమిళనాడు చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో తమిళనాడు 3–2తో హరియాణా జట్టును ఓడించింది. విజేత జట్లు హరియాణా, తమిళనాడు జట్లకు రూ. 3 లక్షల 50 వేల చొప్పున ప్రైజ్‌మనీ లభించింది. నేటి నుంచి ఐదు రోజులపాటు పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.

నంబర్‌వన్ దీప్తి

టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానం

దుబాయ్: టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ... ఐసీసీ మహిళల టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానం దక్కించుకుంది. ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా 28 ఏళ్ల దీప్తి రికార్డుల్లోకెక్కింది. శ్రీలంకతో జరుగుతున్న టి20 సిరీస్ తొలి మ్యాచ్‌లో ఒక వికెట్ పడగొట్టిన దీప్తి... తాజా ర్యాంకింగ్స్‌లో 737 పాయింట్లతో 'టాప్' ప్లేస్‌కు చేరింది. ఆస్ట్రేలియా బౌలర్ అనాబెల్ సదర్లాండ్ (736 పాయింట్లు), పాక్ బౌలర్ సాదియా ఇక్బాల్ (732 పాయింట్లు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నారు. బ్యాటింగ్ విభాగంలో భారత్ నుంచి అత్యుత్తమంగా స్మృతి మంధాన (766 పాయింట్లు) నాలుగో స్థానంలో ఉండగా... లంకతో తొలి పోరులో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన జెమీమా రోడ్రిగ్స్ (653 పాయింట్లు) ఐదు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంక్‌కు చేరింది. రెండో మ్యాచ్‌లో దంచికొట్టిన షఫాలీ వర్మ (650 పాయింట్లు) పదో స్థానంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

కథ విన్నారా?

హీరో రవితేజ, 'బింబిసార' ఫేమ్ వశిష్ట కాంబినేషన్‌లో ఓ సినిమాకి సన్నాహాలు జరుగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఇటీవల ఓ సైన్స్ ఫిక్షన్ కథను రవితేజకు వశిష్ట వినిపించారని, ఈ కథ నచ్చి, సినిమా చేసేందుకు రవితేజ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సమాచారం. దీంతో ఈ సినిమా స్క్రిప్ట్‌కు మరింత మెరుగులు దిద్దే పనిలో పడ్డారట వశిష్ట. అలాగే తనకు 'కిక్' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన దర్శకుడు సురేందర్ రెడ్డితోనూ రవితేజ ఓ సినిమాకి చర్చలు జరుపుతున్నారని తెలిసింది. ఈ కథ కూడా విన్నారని తెలిసింది. ఇంకా 'మ్యాడ్, మ్యాడ్ 2' చిత్రాల ఫేమ్ కల్యాణ్ శంకర్ దర్శకత్వంలోనూ రవితేజ ఓ సినిమా కమిట్‌అయినట్లుగా వార్తలున్నాయి. రవితేజ కొత్త సినిమా కబురు ఏ దర్శకుడితో ఉంటుందనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి' (వర్కింగ్ టైటిల్)తో రవితేజ బిజీగా ఉన్నారు. అలాగే 'భర్తమహాశయులకు విజ్ఞప్తి' వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న సంగతి తెలిసిందే.

● రవితేజ

శంబాలతో సక్సెస్ కొడతాను

"రాజశేఖర్, మహీధర్ రెడ్డిగార్లకు నిర్మాతలుగా 'శంబాల' తొలి చిత్రమైనా ఎంతో ప్యాషన్‌తో నిర్మించారు. అయితే కథపై నమ్మకంతో నా మార్కెట్‌కి మించి ఎక్కువగానే బడ్జెట్ పెట్టారు. కానీ ఎక్కడా వృథా ఖర్చు చేయలేదు. ఈ నెల 25న చాలా సినిమాలు వస్తున్నాయి... పోటీ బాగా ఉండటంతో ప్రమోషన్స్ కూడా భారీ ఎత్తున నిర్వహించారు. 'శంబాల' ఔట్‌పుట్ పట్ల యూనిట్ అంతా చాలా సంతృప్తిగా ఉన్నాం" అని ఆది సాయికుమార్ చెప్పారు. ఆయన హీరోగా, అర్చనా అయ్యర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. అలాగే డిసెంబరు 23న ఆది పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆది సాయికుమార్ పంచుకున్న విశేషాలు...

– ఆది సాయికుమార్

● 'శంబాల' నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్ నుంచి మా మూవీపై మంచి బజ్ ఏర్పడింది. దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేసిన టీజర్, ప్రభాస్, నానీగార్లు విడుదల చేసిన ట్రైలర్స్ ఆడియన్స్‌లో మా మూవీ పట్ల మంచి బజ్ తీసుకొచ్చాయి. ఈసారి మంచి విజయాన్ని అందుకోబోతున్నామనే నమ్మకం ఉంది. మా సినిమాని అందరూ ఎంజాయ్ చేస్తారనుకుంటున్నాను. 80వ దశకంలో వచ్చే కథ కాబట్టి లుక్స్ విషయంలో చాలా జాగ్రత్త పడ్డాం... అందుకే కాస్ట్యూమ్స్‌ని చాలా సెలెక్టివ్‌గా తీసుకున్నాం. మా సినిమాలో అద్భుతమైన పోరాట సన్నివేశాలున్నాయి. రాజ్‌కుమార్ మాస్టర్ బాగా చూపించారు. ● 'శంబాల' అనే ప్రాంతం ఉందా? లేదా అనేది ఎవరికీ తెలీదు. మన పురాణాల ప్రకారం శంబాలకి ఓ మంచి గుర్తింపు ఉంది. ఆ టైటిల్ చెప్పినప్పుడు నేను చాలా ఎగ్జయిట్ అయ్యాను. 'కల్కి' తర్వాత శంబాల పేరు మరింత ఎక్కువగా ట్రెండ్ అయింది. ఈ మూవీ కోసం యుగంధర్‌గారు చాలా కష్టపడ్డారు... ఆయన పెద్ద డైరెక్టర్ అవుతారు. శ్రీచరణ్ పాకాల ఆర్ఆర్ చూసి అందరం షాక్ అయ్యాం. సినిమా చూసిన తర్వాత అందరూ నేపథ్య సంగీతం గురించి మాట్లాడుకుంటారు. ప్రస్తుతం ఆడియన్స్‌కు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ కావాలి. ఇలాంటి జానర్‌లను ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. 'శంబాల' లాంటి చిత్రాన్ని థియేటర్లో చూస్తేనే ఆ ఫీల్‌ను ఎంజాయ్ చేస్తారు. ● క్రిస్మస్ అనేది మంచి సీజన్. శ్రీకాంత్‌గారి ఫ్యామిలీతో మాకు మంచి బాండింగ్ ఉంది. రోషన్‌తో నాకు మంచి పరిచయం ఉంది. మా 'శంబాల'తో పాటు రోషన్ నటించిన 'చాంపియన్' సినిమా కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. ఇక ఇన్నేళ్ల నా కెరీర్ పట్ల పూర్తిగా సంతృప్తిగా లేను. ఎందుకంటే అప్ అండ్ డౌన్స్ ఉన్నాయి. 'శంబాల'తో సక్సెస్ కొడుతున్నాను. ఆ తర్వాత కూడా మంచి కథలు ఎంచుకుంటాను. నేను నటించిన 'సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్' సినిమా చాలా బాగా వచ్చింది.. ఇంకా నా పాత్రకు నేను డబ్బింగ్ చెప్పాల్సి ఉంది. ఆ సినిమా త్వరలో విడుదలవుతుంది.

నన్ను నేను కాపాడుకోవడానికి..!

● 'సిగ్మా' పోస్టర్

సందీప్ కిషన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సిగ్మా'. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండా, మగాలక్ష్మి సుదర్శనన్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. కేథరీన్ ఓ స్పెషల్ సాంగ్‌లో నటించారు. నిధి వేట నేపథ్యంలో సాగే ఈ యాక్షన్–అడ్వెంచర్ కామెడీ సినిమాని తమిళ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించారు. మంగళవారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'మంచోడు, మహానుభావుడు, చెడ్డోడు, రాక్షసుడు... చూసే నీ చూపును బట్టి... ఇప్పుడు ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగన్నా మారతాను' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

ఈషా కథ విని షాక్ అయ్యాను



"శ్రీనివాస్ మన్నెగారు చెప్పిన 'ఈషా' కథ విన్నప్పుడు షాకింగ్‌గా అనిపించింది. సినిమాలో ట్విస్టులు, సౌండ్ డిజైనింగ్ అద్భుతంగా ఉంటాయి. ఆడియన్స్‌కి మంచి అనుభూతి నిచ్చే మూవీ ఇది. హారర్, థ్రిల్లర్ సినిమాలు చూసేవారికి మా సినిమా కొత్త అనుభూతినిస్తుంది" అని అఖిల్ రాజ్ తెలిపారు. త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా, హెబ్బా పటేల్, సిరి హనుమంతు హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమాని వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ నెల 25న విడుదల చేస్తున్నారు. అఖిల్ రాజ్ విలేకరులతో మాట్లాడుతూ– ''రాజు వెడ్స్ రాంబాయి' కంటే ముందు ఒప్పుకున్న సినిమా 'ఈషా'. నేను చేసిన 'సఖియా' అనే వెబ్ సిరీస్ గ్లింప్స్ చూసి, దర్శకుడు శ్రీనివాస్‌గారు నన్ను ఆడిషన్ చేసి, ఈ చిత్రంలో వినయ్ పాత్రకి ఎంపిక చేశారు. అయితే ముందుగా 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలైంది. ఆ సినిమాలో నేను చేసిన రాజు పాత్రకి పూర్తి వైవిధ్యంగా ఉండే వినయ్ పాత్రను 'ఈషా'లో చేశాను. దామోదర ప్రసాద్ సమర్పణ అనగానే ఎలాగైనా ఈ సినిమాలో భాగం కావాలనిపించింది. ఆయన, హేమ వెంకటేశ్వరరావుగార్లు రాజీ పడకుండా ఈ మూవీ నిర్మించారు. సినిమా పట్ల క్లారిటీ ఉన్న దర్శకుడు శ్రీనివాస్‌గారు. వంశీ నందిపాటి, బన్నీవాసుగార్లు 'ఈషా' విషయంలోనూ సక్సెస్ అవుతారని నమ్ముతున్నాను. ప్రస్తుతం తరుణ్ భాస్కర్, అనుపమగార్లతో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నాను'' అని చెప్పారు.

– అఖిల్ రాజ్

సమాజంలోని బలహీనతలపై దండోరా



● బిందు మాధవి, నవదీప్

రవికృష్ణ, నవదీప్, నందు, మనికా చిక్కాల, బిందు మాధవి, రాధ్య, అదితీ భావరాజు, శివాజీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం రేపు (గురువారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''దండోరా' సినిమా టీజర్, ట్రైలర్ చూస్తుంటే ఈ సినిమా చిరస్థాయిగా నిలిచిపోతుందనిపించింది. సమాజంలోని బలహీనతను దమ్ముతో దండోరా వేయించి చెప్పేందుకు చాలా గట్స్ ఉండాలి. దర్శకుడు మురళీకాంత్‌కు దమ్ము, ధైర్యం ఉంది. ఈ చిత్రంలో అద్భుతమైన ఆర్టిస్టులు నటించారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''దండోరా' సినిమాలో ఏదో ఒక కొత్త విషయం ఉందని జనాల వరకు రీచ్ అయ్యింది. ఈ కథను మాత్రం ఎవ్వరూ ఊహించలేరు'' అన్నారు నవదీప్. ''ఈ 'దండోరా' చిత్రానికి స్టోరీనే హీరో. కంటెంట్ హీరోయిన్'' అన్నారు రవీంద్ర బెనర్జీ. ''సినిమా తీయాలని ఇండస్ట్రీకి వచ్చాను. సినిమా తీశాను. నా దృష్టిలో నేను విజయం సాధించాను'' అని పేర్కొన్నారు మురళీకాంత్. ''ఈ సినిమా ప్రేక్షకులను నిరాశపరచదు'' అన్నారు నటుడు రవికృష్ణ.

ఎమోషన్... రివెంజ్

● పార్థగోపాల్, మేఘన

పార్థగోపాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'డైమండ్ డెకాయిట్'. ఈ చిత్రంలో మేఘన హీరోయిన్‌గా నటించారు. ఈ ఫ్యామిలీ ఎమోషనల్ అండ్ రివెంజ్ డ్రామా సినిమాకు సూర్య జి. యాదవ్ (సురేష్‌బాబు) దర్శకత్వం వహించగా, పార్థగోపాల్ నిర్మించారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో పార్థగోపాల్ మాట్లాడుతూ– ''ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రేక్షకుల సపోర్ట్ కావాలి'' అన్నారు. ''కడప జిల్లాలోని అరవై లొకేషన్స్‌లో ఈ సినిమా తీశాం'' అని తెలిపారు సూర్య జి. యాదవ్. హీరోయిన్ మేఘన, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్ మాట్లాడారు.

వీరుని కహానీ

● సిమ్రాన్, అవినాష్

అవినాష్ తిరువీధుల హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'వానర'. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా, నందు విలన్‌గా నటించారు. శంతను పత్తి సమర్పణలో అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం జనవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'లబోరే లబోరే..లబ లబ లబ' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'సూడు సూడు మల్లేషు, జుర్రుకుంటా పుల్లైసు, మన వానర వీరుని కహానీ...' అంటూ ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు వివేక్‌సాగర్ స్వరకల్పనలో భరద్వాజ్ గాలి ఈ పాటకు సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్, సాయి మాధవ్ పాడారు.

క్రిస్మస్ కానుకగా మిషన్ సాంటా

'మహావతార్ నరసింహ' మూవీలా యానిమేషన్ నేపథ్యంలో రూపొందిన ఫీచర్ ఫిలిం 'మిషన్ సాంటా'. రికార్డ్స్ కుస్నో, డామ్జన్ మిత్రెవ్‌స్కీ దర్శకత్వంలో బ్రాడ్‌విజన్ ఇండియా–స్టూడియో 56 సంస్థలు నిర్మించాయి. ఈ సినిమా క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో ఇంగ్లిష్‌లో విడుదలవుతోంది. ''అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన భారీ యానిమేటెడ్ ఫిలిం 'మిషన్ సాంటా'. కుటుంబ సమేతంగా చూడదగ్గ కథతో రూపొందింది. యానిమేషన్ క్వాలిటీ, ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వెంచర్... ఇలా ఓ మంచి సినిమా చూసిన అనుభూతిని ఇవ్వబోతున్నాయి'' అని మేకర్స్ తెలిపారు.

● 'మిషన్ సాంటా' పోస్టర్

సాక్షి బిజినెస్

బుధవారం
24-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
43	5
85,525	26,177

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	23,511	△	84
డోజోన్స్	48,453	△	91
ఎఫ్‌టీఎస్ఈ 100	9,890	△	23
డాక్స్	24,412	△	128
షాంఘై	3,920	△	3
నికాయ్	50,413	△	10

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.25	90.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.50	122.53
€	యూరో	ఎస్‌బీఐ	104.30	107.12
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.74	58.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.57	61.43
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.38	71.11
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.01	24.52
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.52	24.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.88	13.70

బిలియన్ డాలర్ల ఆదాయం

- అయిదేళ్లలో రాంకీ ఇన్‌ఫ్రా లక్ష్యం
- ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పారిశ్రామిక పార్క్‌లపై ఫోకస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏటా సుమారు 30 శాతం వృద్ధితో వచ్చే అయిదేళ్లలో 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 9,000 కోట్లు) ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీఈవో సునీల్ నాయర్ తెలిపారు. ప్రస్తుతం ఇది దాదాపు రూ. 2,000 కోట్ల స్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం దాదాపు రూ. 10,000 కోట్లుగా ఉన్న ఆర్డర్ల విలువను రూ. 30,000 కోట్ల స్థాయికి పెంచుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా రెండు విభాగాలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు నాయర్ వివరించారు. నీరు–వ్యర్థ జలాలకు సంబంధించిన ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పారిశ్రామిక పార్క్‌లపై ఫోకస్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,000 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులను దక్కించుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు నాయర్ తెలిపారు. ఇప్పుడు దాదాపు రెండున్నరేళ్లకు సరిపడా ఆర్డర్ బుక్ ఉన్నట్లు ఆయన వివరించారు. దేశీయంగా 1 బిలియన్ డాలర్లు, అంతర్జాతీయంగా రూ. 1,000 కోట్లు విలువ చేసే ప్రాజెక్టులను దక్కించుకోవడంపై కసరత్తు జరుగుతోందన్నారు. ఆదాయాల్లో ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) వాటా 45 శాతంగా, బీవోటీ (బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) వాటా 25 శాతంగా ఉందని నాయర్ చెప్పారు.

కొత్త విభాగాలపై దృష్టి..

ప్రధాన వ్యాపారానికి అనుబంధంగా ఉండేలా డేటా సెంటర్లు, పర్యావరణహిత ఏవియేషన్ ఇంధనంలాంటి కొత్త విభాగాల్లోకి కూడా విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు నాయర్ తెలిపారు. మరోవైపు, డివిడెండు పాలసీ కూడా పరిశీలనలో ఉందని సంస్థ సీఎఫ్‌వో స్రవంత్ రాయపూడి చెప్పారు. రుణ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా పూర్తిగా చెల్లించివేసి రుణరహిత సంస్థగా కంపెనీ మారిందని ఆయన వివరించారు. ప్రాజెక్టులు బట్టి స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్‌పీవీ)కి సంబంధించి మాత్రమే రుణం తీసుకుంటున్నట్లు స్రవంత్ తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో గోదావరి జలాలను నింపేందుకు ఉద్దేశించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ నుంచి దక్కించుకున్న రూ. 2,085 కోట్ల భారీ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని నాయర్ చెప్పారు.

పసిడి సరికొత్త రికార్డు

ఢిల్లీలో ధర @ 1,40,850

- ఒకేరోజు రూ.2,650 పెరుగుదల
- ఈ ఏడాది 78 శాతం ర్యాలీ
- రూ.2.17 లక్షలకు చేరిన వెండి

న్యూఢిల్లీ: పసిడి, వెండి రికార్డు ర్యాలీలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధరల్లో సరికొత్త రికార్డు నమోదైంది. మంగళవారం 10 గ్రాములకు రూ.2,650 పెరిగి రూ.1,40,850కు చేరుకుంది. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బంగారం ధర 78 శాతం పెరిగినట్టయింది. 2024 డిసెంబర్ 31న ఉన్న రూ.78,950 నుంచి నికరంగా రూ.61,900 వరకు 10 గ్రాములకు పెరిగింది. ఢిల్లీ మార్కెట్లో వెండి ధర కిలోకి మరో రూ.2,750 పెరగడంతో సరికొత్త రికార్డు రూ.2,17,250 నమోదైంది. వెండి ధర ఈ ఏడాది ఏకంగా 142 శాతం పెరగడం గమనార్హం. 2024 డిసెంబర్ 31న కిలో ధర రూ.89,700 వద్ద ఉండగా, అక్కడి నుంచి నికరంగా రూ.1,27,550 లాభపడింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ వెండి ధర ఔన్స్‌కు 1.4 శాతం పెరిగి 70 డాలర్ల మార్క్‌ను మొదటిసారి చేరుకుంది. బులియన్‌లో అసాధారణ ర్యాలీ కొనసాగుతోందని, అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 4,500 మార్క్‌ను చేరుకున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. యూఎస్ ఫెడ్ 2026లో ఒకటికి మించిన రేట్ల కోతను చేపట్టొచ్చన్న అంచనాలు తాజాగా మరో విడత పసిడి, వెండి ధరల్లో ర్యాలీకి కారణమవుతున్నట్టు చెప్పారు. దీనికి తోడు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో సురక్షిత సాధనంగా డిమాండ్ సైతం కొనసాగుతున్నట్టు తెలిపారు. అంతర్జాతీయంగా పసిడి స్పాట్ ధర ఔన్స్‌కు ఈ ఏడాది 18,92 డాలర్ల నుంచి 4,500 డాలర్లకు చేరుకోవడం గమనార్హం

చిన్నగానే చుట్టేసొద్దాం..

- శీతాకాలపు విదేశీ విహారయాత్రలపై మారుతున్న ధోరణి
- కరెన్సీ క్షీణత, వ్యయాలు పెరగడమే కారణం
- దుబాయ్, వియత్నాంకి డిమాండ్

సాక్షి, బిజినెస్‌డెస్క్

కరెన్సీ కదలికలు, క్రిస్మస్..న్యూ ఇయర్ సీజన్ వ్యయాలు విహార యాత్రల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. చాలా మంది పర్యాటకులు సుదీర్ఘ యాత్రల కన్నా అయిదు రోజుల్లో చుట్టేసొచ్చేలా టూర్లను ప్లాన్ చేసుకుంటున్నారు. అందులోనూ వీసా సులభంగా దొరికే దేశాలను ఎంచుకుంటున్నారు. ట్రావెల్ సర్వీసుల కంపెనీ కాక్స్ అండ్ కింగ్స్‌కి నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం గత శీతాకాలంతో పోలిస్తే ఈసారి అంతర్జాతీయ ప్రయాణాలకి కేవలం 15–20 రోజులు ముందుగా బుక్ చేసుకునే ధోరణి 30 శాతం పెరిగింది. 65 శాతం బుకింగ్స్ అయిదు రోజుల్లోపు ట్రిప్‌లకే పరిమితమైంది. ఈసారి భారతీయ ప్రయాణికులు బయల్దేరడానికి కాస్త ముందుగా మాత్రమే బుక్ చేసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో ఖర్చులు అంచనాలకు అనుగుణంగా ఉండే ప్రాంతాలను ఎంచుకుంటున్నారని, సుదీర్ఘ ప్రయాణాలను...డాలర్ మారకంతో ముడిపడి ఉండే ప్రయాణ ఖర్చులను తగ్గించుకుంటున్నారని నివేదిక పేర్కొంది. అలాగని ప్రయాణాలకు డిమాండేమీ తగ్గిపోలేదని తెలిపింది. ఈసారి క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పర్యాటకులు తమ సౌకర్యానికి, ఖర్చు చేసే ప్రతి రూపాయికి లభించే ప్రయోజనాలకి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారని వివరించింది.

రిపోర్టులో మరిన్ని విశేషాలు..

- మిగతా పేరొందిన ప్రాంతాలతో పోలిస్తే దుబాయ్, వియత్నాంల వైపు పర్యాటకులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కనెక్టివిటీ బాగుండటం, వీసా ప్రక్రియ సులభతరంగా ఉండటం, తక్కువ రోజుల్లోనే ఎక్కువగా చుట్టేసేయడానికి అవకాశంలాంటి అంశాలు వీటికి సానుకూలంగా ఉంటున్నాయి. అందుకే ఆఖరు నిమిషంలో ప్లాన్ చేసుకునే వారు దుబాయ్, వియత్నాంల వైపు చూస్తున్నారు. శ్రీలంక, బాలి, ఒమన్ వెళ్లే వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.
- ఆఖరు నిమిషంలో బుక్ చేసుకుంటున్న వారిలో 45 శాతం మంది పిల్లలు, వృద్ధులతో కలిసి ప్రయాణిస్తున్న కుటుంబాలకు చెందినవారే ఉంటున్నారు. వారు భద్రత, వైద్య సదుపాయాలు మెరుగ్గా ఉండే దుబాయ్‌లాంటి డెస్టినేషన్లను ఎంచుకుంటున్నారు. ఇక తొలిసారిగా విదేశీ పర్యటన చేస్తున్న వారికి, మిలీనియల్స్‌కి, జెనరేషన్ జెడ్‌కి, యువ జంటలకి, బ్యాక్‌ప్యాకర్స్, యువ ప్రొఫెషనల్స్, మిత్ర బృందాలకి వియత్నాం ఫేవరెట్‌గా ఉంటోంది. సాధారణంగా ఇది పీక్ సీజన్ కావడంతో పాటు కొన్ని ప్రదేశాలకు టికెట్ల కొరత ఉన్నప్పటికీ ఈ–వీసా ప్రక్రియపై స్పష్టత, ఎయిర్ కనెక్టివిటీ మెరుగ్గా ఉండటం లాంటి అంశాలు ఆ దేశానికి సానుకూలంగా ఉంటున్నాయి.
- శీతాకాలంలో స్వల్ప వ్యవధి టూర్లకు బుక్ చేసుకునే వారిలో 55 ఏళ్ల పైబడిన వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మౌలిక సదుపాయాలు, ప్రయాణం సులభతరంగా ఉండే ప్రాంతాలను వారు ఎంచుకుంటున్నారు.
- ఆఖరు నిమిషపు శీతాకాలం బుకింగ్స్‌లో అత్యధిక వాటా దుబాయ్‌ది ఉంటోంది. ముఖ్యంగా పిల్లలు, వయోవృద్ధులున్న కుటుంబాలు దీన్ని ఎంచుకుంటున్నాయి.

ఐటీ, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్

ముంబై: ఐటీ, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం స్వల్ప నష్టంతో ముగిసింది. సెన్సెక్స్ 43 పాయింట్లు కోల్పోయి 85,525 వద్ద స్థిరపడింది. నిఫ్టీ అయిదు పాయింట్లు పెరిగి 26,177 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు సానుకూలంగా మొదలయ్యాయి. వీక్లీ ఎక్స్‌పైరీ రోజు కావడంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 85,343 – 85,705 శ్రేణిలో ట్రేడైంది. నిఫ్టీ 26,119 వద్ద కనిష్టాన్ని, 26,234 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఐటీ 0.71%, రియల్టీ 0.21%, కన్జూమర్ డ్యూరబుల్స్ 0.10% నష్టపోయాయి. మరోవైపు కమోడిటీస్ 0.68%, వినిమయ 0.59%, మెటల్ 0.52%, విద్యుత్ 0.40%, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇంధన 0.36% లాభపడ్డాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.38%, 0.07% పెరిగాయి.
- తన అనుబంధ సంస్థలు ఏసీసీ లిమిటెడ్, ఓరియంట్ సిమెంట్స్ కంపెనీల విలీనానికి అంబుజా సిమెంట్స్ సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఓరియంట్ సిమెంట్స్ షేరు 4.40% పెరిగి రూ.171 వద్ద ముగిసింది. ఒక దశలో 10% పెరిగి రూ.180 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అంబుజా సిమెంట్స్ షేరు 1.25% పెరిగి రూ.547 వద్ద స్థిరపడింది. ఒక దశలో 4.30% లాభపడి రూ.563 వద్ద గరిష్టాన్ని తాకింది. ఏసీసీ షేరు 1.21% నష్టపోయి రూ.1,754 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 1.50% పతనమై రూ.1,802 కనిష్టాన్ని తాకింది.
- కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.384)తో బీఎస్ఈలో 3.50% డిస్కౌంటుతో రూ.370 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 9% క్షీణించి రూ.350 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 8% నష్టంతో రూ.355 వద్ద ముగిసింది.

సన్‌టెక్‌లో సచిన్ టెండూల్కర్ పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ట్రూజాన్ సోలార్ బ్రాండ్ కింద సౌర విద్యుత్ ఉత్పత్తులను అందించే సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్‌లో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఇన్వెస్ట్ చేశారు. బ్రాండ్ విశ్వసనీయత మరింత పెరిగేందుకు, జాతీయ స్థాయిలో వేగంగా విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని సంస్థ వ్యవస్థాపకుడు చారుగుండ్ల భవానీ సురేశ్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలను బలోపేతం చేసుకుంటున్నామని, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్ తదితర మార్కెట్లో దూకుడుగా విస్తరిస్తున్నామని ఆయన వివరించారు. 2008లో ఏర్పాటైన సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ సంస్థ రెసిడెన్షియల్, కమర్షియల్ తదితర విభాగాల్లో అవసరాలకు కావాల్సిన సోలార్ ఉత్పత్తులను అందిస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టాటా మోటార్స్ 5 ఏళ్లలో ఐదు కొత్త ఈవీలు	అంబుజాలో ఏసీసీ విలీనం

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

బండిఆత్మకూరు: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎ.కోడూరుకి చెందిన దేరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి(38) తనకున్న ఐదెకరాల భూమితో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంట దిగుబడి లేకపోవడంతో పాటు మద్దతు ధర లభించక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. భారీగా అప్పులు పెరగటంతో తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ప్రభుత్వం నుంచీ ఎటువంటి ఆర్థిక భరోసా లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామ సమీపంలోని ఖాదర్ వలి స్వామి దర్గా వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

అవన్నీ వదంతులే.. వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా

బుట్టా రేణుక స్పష్టీకరణ

ఎమ్మిగనూరు టౌన్: తాను బీజేపీ లేదా జనసేనలో చేరుతున్నట్లు వార్తలు వస్తున్నాయని.. అవన్నీ కేవలం వదంతులేనని, అటువంటి వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్టారేణుక చెప్పారు. మంగళవారం ఎమ్మిగనూరులో తన పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తనకు పార్టీ మారే ఆలోచనే లేదని, తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. సమావేశంలో బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ఏఎస్జీగా కనకమేడల రవీంద్రకుమార్

మరో ఇద్దరికీ అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: సీనియర్ న్యాయవాది, టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్‌ను సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ ఫర్ ఇండియా(ఏఎస్‌జీఐ)గా కేంద్రం నియమించింది. ఆయనతోపాటు మరో ఇద్దరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్‌లకూ ఏఎస్‌జీలుగా చోటు కల్పించింది. ఈ మేరకు మంగళవారం కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురూ మూడేళ్లపాటు లేదా తదుపరి ఆదేశాల వరకు అదనపు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా కొనసాగుతారని పేర్కొంది.

గోదావరి–కావేరి అనుసంధానంపై త్వరలో సీఎంలతో భేటీ

- ఏకాభిప్రాయం సాధించాకే అనుసంధాన పనులు
- ప్రత్యేక కమిటీ సమావేశంలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్

సాక్షి, అమరావతి: గోదావరి–కావేరి అనుసంధానంపై నదీ పరివాహక ప్రాంతాలలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని కేంద్ర జల్ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చెప్పారు. ఏకాభిప్రాయం సాధించాకే గోదావరి–కావేరి అనుసంధాన పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ కార్యాలయంలో మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన నదుల అనుసంధానంపై ఏర్పాటైన ప్రత్యేక కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంతోపాటే ఎన్‌డబ్ల్యూడీఏ 39వ సాధారణ సమావేశాన్నీ నిర్వహించారు. ఇచ్చంపల్లి(గోదావరి) నుంచి నాగార్జునసాగర్(కృష్ణా), సోమశిల(పెన్నా), అరణియార్ రిజర్వాయర్ మీదుగా 148 టీఎంసీల గోదావరి జలాలను కావేరికి తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించిన అనుసంధాన ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చించారు. ఈ అనుసంధానంలో అంతర్భాగంగా కర్ణాటకలో బెడ్తి–వరద అనుసంధానం చేపడతామన్నారు. కావేరికి తరలించే 148 టీఎంసీల(ఛత్తీస్‌గడ్ కోటాలో వాడుకోని జలాలు) గోదావరి జలాలు, బెడ్తి–వరద అనుసంధానంలో తరలించే 18.5 టీఎంసీలు వెరసి 166.5 టీఎంసీలలో.. తెలంగాణకు 43.65, ఆంధ్రప్రదేశ్‌కు 43.86, తమిళనాడుకు 40.93, కర్ణాటకకు 34.40, పుదుచ్చేరికి 2.19 టీఎంసీలు కేటాయిస్తామన్నారు. దీని వల్ల 6,78,797 హెక్టార్లకు నీళ్లందించడంతోపాటు తాగునీటిని అందించవచ్చునని వివరించారు.

ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర అభ్యంతరం

సమావేశంలో అనుసంధానంపై ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపాయి. తమ కోటాను పూర్తి స్థాయిలో వాడుకోవడానికి ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని.. అలాంటప్పుడు తమ కోటా నీటిని ఎలా తరలిస్తారని ఛత్తీస్‌గఢ్ అధికారులు నిలదీశారు. హిమాలయ నదుల నుంచి మహానదికి నీటిని తరలించి.. అక్కడి నుంచి గోదావరికి నీటిని తెచ్చే వరకూ ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని నీటినే కావేరికి తరలిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని ఏపీ జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు కోరారు. నాగార్జునసాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేస్తే.. దాని కింద ఉన్న ఆయకట్టుకు నీళ్లందించడం సవాల్‌గా మారుతుందని, ఈ నేపథ్యంలో గోదావరి–కావేరి అనుసంధానంలో కొత్త రిజర్వాయర్లు నిర్మించాలని సూచించారు. ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం నుంచి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని.. అందులో భాగంగా పోలవరం–బనకచర్లను చేపట్టాలని కోరారు. కర్ణాటకలో చేపట్టే బెడ్తి–వరద అనుసంధానం తరలించే నీటిలో ఏపీకి వాటా ఇవ్వాలన్నారు. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించడాన్ని సూత్రప్రాయంగా అంగీకరిస్తామని, కానీ తరలించే నీటిలో 50 శాతం జలాలను తమకే కేటాయించాలని తెలంగాణ అధికారులు కోరారు. గోదావరి–కావేరి అనుసంధానంలో తరలించే జలాల్లో తమ వాటా 34.40 నుంచి 40 టీఎంసీలకు పెంచాలని కర్ణాటక అధికారులు కోరారు. అనుసంధానంలో తమకు ఎలాంటి నీటి వాటాలు కేటాయించకపోవడంపై మహారాష్ట్ర, కేరళ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. తక్షణమే పనులు చేపట్టాలని తమిళనాడు, పుదుచ్చేరి అధికారులు కోరారు. అన్ని రాష్ట్రాల అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్.. ఇప్పటికే గోదావరి–కావేరి అనుసంధానంపై ఏకాభిప్రాయం సాధించడానికి మూడు పర్యాయాలు సంప్రదింపు సమావేశాలను నిర్వహించామని గుర్తు చేశారు. ఏకాభిప్రాయం సాధన కోసం ముఖ్యమంత్రులతో త్వరలో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

మా భూములు వదిలేయండి సారూ..!

- అధికారులకు కుప్పం విమానాశ్రయ భూముల రైతుల మొర
- వివరాల సేకరణకు వచ్చిన అధికారుల అడ్డగింత
- భారీగా పోలీసుల మోహరింపు
- రైతుల వ్యతిరేకతతో వెనుదిరిగిన అధికారులు

రైతులతో చర్చిస్తున్న అధికారులు

శాంతిపురం: ప్రతిపాదిత కుప్పం విమానాశ్రయానికి భూములు ఇచ్చేందుకు సుముఖంగా లేని రైతుల భూముల్లోని నిర్మాణాల వివరాల నమోదుకు అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలోని దండికుప్పం వద్దకు మంగళవారం అధికారులు వస్తున్నారన్న సమాచారంతో పెద్ద ఎత్తున రైతులు అక్కడికి చేరుకున్నారు. అధికారులతో వాదనకు దిగారు. రైతులకు నచ్చజెప్పేందుకు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, డీటీ శివకుమార్ చర్చలు జరిపారు. తమ భూములు ఇచ్చేందుకు సుముఖంగా లేమని, హైకోర్టును ఆశ్రయించినట్టు 44 మంది రైతులు తెలిపారు. కోర్టు ఉత్తర్వు, తమ అంగీకారం లేకుండా భూముల్లోకి రావద్దని తేల్చి చెప్పారు. పాతికేళ్ల క్రితం టైడల్ సిల్క్ పరిశ్రమ కోసం అమ్మవారిపేట, కిలాకిపోడు రెవెన్యూలలో లాక్కున్న భూములు, ఇతర పరిశ్రమల కోసం ఆరేళ్ల క్రితం విజలాపురం, అమ్మవారిపేట రెవెన్యూలలో తీసుకున్న భూములు కూడా వృథాగానే ఉన్నాయన్నారు. రైతుల నుంచి తీసుకున్న భూములు ఐదేళ్లలో అభివృద్ధి చేయకపోతే భూ సేకరణ చట్టం ప్రకారం తిరిగి వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల్లోని నిర్మాణాల వివరాలను నమోదు చేసుకోవడానికి మాత్రమే వచ్చామని, సహకరించాలని అధికారులు కోరినా రైతులు ససేమిరా అన్నారు. కోర్టు వ్యాజ్యంలోని ఆస్తుల్లో ఎవరూ ప్రవేశించరాదని రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసిన బోర్డులను అధికారులకు చూపించారు. ఇప్పటికే సేకరించిన రెండు వేలకు పైగా ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించి మిగతా రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చక్రపాణిరెడ్డి అధికారులను కోరారు. రైతుల అభిప్రాయాలను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కరుణకుమారికి అధికారులు ఫోన్‌లో వివరించి వెనుదిరిగారు.

రిజిస్ట్రేషన్ అధికారుల ఇళ్లలో ఏసీబీ తనిఖీలు

సోమశేఖర్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు, తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఇబ్రహీంపట్నం (మైలవరం), చిలమత్తూరు, విశాఖ సిటీ, భోగాపురం: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి జరుగుతోందన్న ఫిర్యాదులపై ఏసీబీ అధికారులు నవంబర్ 5, 6 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. తనిఖీల్లో పలు కార్యాలయాల్లో లెక్కల్లో చూపని నగదు, దస్త్రాలను స్వాధీనం చేసుకోగా.. మంగళవారం రిజిస్ట్రేషన్ అధికారుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన భవానీపురం టెలిఫోన్ కాలనీలో నివాసం ఉంటున్న ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఎస్‌కే మహ్మద్ ఇంట్లో తెల్లవారుజాము నుంచి సోదాలు జరిపారు. అలాగే, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండపల్లికి చెందిన దివ్య ఇంట్లో సైతం దాడులు నిర్వహించారు. కొండపల్లితో పాటు భవానీపురంలో సబ్ రిజిస్ట్రార్ ఇళ్లల్లో చేపట్టిన తనిఖీల్లో విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే, శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రసాద్ వ్యవహారాలు చూసుకుంటున్న ప్రైవేటు ఉద్యోగి సోమశేఖర్ ఇంట్లోనూ సోదాలు జరిపారు. విశాఖపట్నంలోని సూపర్‌బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహన్‌రావుతో పాటు మరో ఇద్దరు సిబ్బందికి సంబంధించిన నాలుగు ఇళ్లలో ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో దాడులు చేశారు. అలాగే, విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్ పి.రామకృష్ణ, ఆఫీస్ బాయ్ కనకరాజు ఇళ్లలోనూ అధికారులు సోదాలు చేశారు.

చంద్రబాబు జమానాలో జూదం లీగలే

- పేకాట క్లబ్‌లకు కూటమి ప్రభుత్వ అండదండలు
- మాజీ హోంమంత్రి తానేటి వనిత ధ్వజం

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమై అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వం, రాష్ట్రంలో జూదాన్ని మాత్రం లీగల్ చేస్తోందని మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అండదండలతోనే విచ్చలవిడిగా పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మంగళవారం మాట్లాడారు. 'తనది 40 ఇయర్స్ ఇండస్ట్రీ' అని.. సంపద సృష్టించడం తెలుసని చెప్పుకునే చంద్రబాబు ప్రభుత్వమే గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో బోర్డులు పెట్టి, బహిరంగంగా పేకాట ఆడిస్తుండడం దారుణమన్నారు. మంత్రి పార్థసారథి నియోజకవర్గం నూజివీడులోని ఆగిరిపల్లిలో రిక్రియేషన్ క్లబ్ పేరిట పేకాట డెన్ ఏర్పాటు చేశారని.. పక్క రాష్ట్రాల నుంచి విలాసవంతమైన కార్లలో వచ్చి ఇక్కడ పేకాట ఆడుతున్నారన్నారు. జూదగాళ్ల కోసం అంబులెన్స్ కూడా ఏర్పాటు చేశారంటే ప్రభుత్వం పేకాటరాయుళ్లకు ఎంత ప్రాధాన్యమిస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ఇల్లీగల్ వ్యవహారాలన్నీ మంత్రి నారా లోకేశ్ ప్రధాన అనుచరుడు కాట్రగడ్డ అశోక్ నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇంత జరుగుతున్నా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో 2 లక్షల కిలోల గంజాయిని ధ్వంసం చేశామని, 'ఆపరేషన్ పరివర్తన్'తో పూర్తిగా నియంత్రించామని గుర్తు చేశారు. అప్పట్లో 7,552 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం చేశామన్నారు. వైఎస్ జగన్ పాలనలో అన్ని మంచి పనులు చేస్తే... గంజాయి పెంచి పోషించామంటూ హోం మంత్రి అనిత అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి సరఫరా చేయిస్తూ అధికార పార్టీల నాయకులు, కార్యకర్తల సంపద పెంచడానికే పోలీస్ వ్యవస్థను వాడుకుంటున్నారని ఆరోపించారు.

వైఎస్ జగన్ పాలనలో పేకాట క్లబ్‌ల రద్దు

విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2019 వరకు పేకాట క్లబ్‌లు ఉండేవని, 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేశారని తానేటి వనిత గుర్తు చేశారు. 2024 నుండి చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ పేకాట క్లబ్‌లను పెంచి పోషిస్తోందన్నారు. మంత్రి పార్థసారథి నియోజకవర్గంలో పేకాట క్లబ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. వైజాగ్ సమీపంలోని భీమిలిలో కూడా కార్తీక వన భోజనాల పేరుతో పిక్నిక్ ఏర్పాటు చేసి పబ్లిక్‌గా పేకాట శిబిరం నిర్వహించారని గుర్తు చేశారు.

హోం మంత్రి అనిత ఏం చేస్తున్నారో...?

రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా క్షీణించి మహిళలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యమైనా మహిళా హోం మంత్రి అనిత స్పందించకపోవడం దురదృష్టకరమని తానేటి వనిత అన్నారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి పీఏ సతీష్ వేధించారని ఒక మహిళా ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితురాలిపైనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. మరోవైపు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ఎమర్జెన్సీ కాల్స్ చేస్తే స్పందించే పరిస్థితి లేదన్నారు. ప్రజలను రక్షించేందుకు కాకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టేందుకు పోలీసులను చంద్రబాబు వినియోగిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పూర్తిగా దిగజార్చిందని ఆమె ఆక్షేపించారు.

చూద్దామని వెళ్లి.. చిరుత బోనులో ఇరుక్కున్నాడు

మైసూరు: చిరుతపులిని పట్టుకోవడానికి పెట్టిన బోను ఎలా ఉంటుందో చూద్దామనే అత్యుత్సాహంతో లోపలికి వెళ్లిన వ్యక్తి.. అందులోనే ఇరుక్కుపోయాడు. ఈ ఘటన కర్ణాటకలోని గంగవాడిలో జరిగింది. చిరుత సంచరిస్తుందన్న సమాచారంతో గంగవాడిలో రుద్ర అనే రైతు పొలంలో అటవీ అధికారులు బోను ఏర్పాటు చేశారు. దానిని చూద్దామని కిట్టి అనే వ్యక్తి బోను లోపలికి వెళ్లాడు. ఆ వెంటనే తలుపులు మూసుకుపోవడంతో.. అందులోనే ఇరుక్కుపోయాడు. అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని అతన్ని బోను నుంచి బయటకు తీసుకువచ్చారు.



బోనులో చిక్కుకున్న వ్యక్తి

శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో పెద్దపులి గజ ఈత!

నదిలో ఈదుతున్న పెద్దపులి (ఫైల్)

ఆత్మకూరు రూరల్: శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ఏపీ వైపు నుంచి తెలంగాణ వెళ్లాలంటే సుమారు 2 కి.మీ. దూరం పడవపై వెళ్లాలి. ఈ మార్గంలో తరచూ స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇవే జలాల్లో పెద్దపులులు తరుచూ నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి అమ్రాబాద్ అభయారణ్యానికి అలవోకగా ఈదుతూ వెళ్లి వస్తున్నాయి. వారం రోజుల క్రితం ఆత్మకూరు డివిజన్‌లోని సంగమేశ్వరం సమీప ప్రాంతం నుంచి టీ65 అనే పెద్దపులి నదిలో ఈదుతూ అమ్రాబాద్ పులుల అభయారణ్యానికి చేరుకుంది. ఇది అడవిలోకి వెళ్లకుండా కొల్లాపురం మండలంలో సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. స్థానికులు, మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరించారు. ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావ్ పులి కదలికలపై నిఘా ఉంచారు. అది క్షేమంగా అడవిలోకి వెళ్లే వరకు ఈ పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

రైలు ఢీకొని చిరుత మృతి

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని కుప్పగల్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో చిరుతపులి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శివరామయ్య మంగళవారం తెలిపారు. అక్కడికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు చిరుతపులి కళేబరాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

మృతి చెందిన చిరుత

గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్ద పులి మృతి

- పల్నాడు జిల్లాలో ఘటన

మృతి చెందిన పెద్ద పులి

వెల్దుర్తి/మార్కాపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్ద పులి మృతి చెందింది. ఈ ఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని 565 జాతీయ రహదారిపై శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద మంగళవారం జరిగింది. మృతి చెందిన ఆడపులి వయసు మూడేళ్లు ఉండవచ్చని అధికారుల అంచనా. విషయం తెలుసుకున్న అటవీ శాఖాధికారులు, పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పులి కళేబరాన్ని పరిశీలించారు. పులి జాతీయ రహదారిని ఓవైపు నుంచి మరోవైపు దాటే సమయంలో పొగమంచు కారణంగా రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో ఏదో ఒక వాహనం ఢీకొని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన చోటుకు 100 మీటర్ల దూరంలో వన్యమృగాలు దారి దాటడానికి కల్వర్ట్ ఉంది. కల్వర్ట్ నుంచి దారి దాటకుండా ఇనుప ఫెన్సింగ్ లేని చోట రోడ్డుపైకి రావడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కాలంలో వెల్దుర్తి మండలం పరిధిలో తరచూ మేతకు వెళ్లిన పశువులపై పులులు దాడి చేస్తున్నాయి. విజయపురిసౌత్ రేంజ్‌ను ఆనుకొని ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో 4 పులులు ఉండగా మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ పులి చనిపోయింది. పులి కళేబరాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా, పులి మృతిపై విచారణ కోసం కమిటీని వేస్తున్నామని, ఇందులో అటవీ, పశు సంవర్ధక, పులులకు సంబంధించిన నిపుణులు ఉంటారని మార్కాపురం డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్ చెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదం కారణంగానే పులి మరణించినట్టు మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా...

జనవరి 5 నుంచి డిపార్ట్‌మెంటల్ టెస్ట్

సాక్షి, అమరావతి: వచ్చేనెల 5 నుంచి 10వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ టెస్ట్ (నవంబర్–2025) నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. 21 జిల్లాల్లో జరిగే ఈ పరీక్ష కోసం 45,531 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఈనెల 30వ తేదీ నుంచి కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.

ఏపీపీ పోస్టుల ఫలితాలు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 42మంది అసిస్టెంట్ ప్రబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టుల పరీక్ష ఫలితాలు రాష్ట్ర పోలీసు నియామక మండలి మంగళవారం విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కటాఫ్ మార్కుల వివరాలు తమ వెబ్‌సైట్ (slprb.ap.gov.in)లో అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. ఏమైనా సందేహాలు ఉంటే ఈ నెల 26లోగా తమకు ఈ–మెయిల్ (mail&slprb@ap.gov.in) చేయాలని సూచించింది.

గోడను ఢీకొట్టిన బైక్.. ముగ్గురు యువకుల మృతి

పశ్చిమ గోదావరి జిల్లాలో ఘటన

సత్యనారాయణ, అంజిబాబు, రాజు (ఫైల్)

పెనుమంట్ర: పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం పాలమూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి మోటార్‌సైకిల్‌పై వెళుతూ అదుపుతప్పి గోడను ఢీ కొట్టిన ఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. పెనుమంట్ర పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కోళ్ల వీర వెంకట సత్యనారాయణ (20), ఏలేటి రాజు (18), ఏలేటి అంజిబాబు (24) సోమవారం రాత్రి స్థానిక చర్చిలో జరిగిన యూత్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మోటార్‌సైకిల్‌పై బయల్దేరారు. బస్టాండ్ సెంటర్‌కు వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపు తప్పి ఇంటి గోడను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొక యువకుడు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు.

బేడ, బుడగ జంగం కులాల సమస్యలను పరిష్కరించండి

మందకృష్ణ మాదిగ

సాక్షి, అమరావతి: దళితుల జాబితా నుంచి విడదీయడం వల్ల బేడ, బుడగ జంగం కులాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఈ సమస్యకు సరైన పరిష్కారం లభించలేదన్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్టీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను మంగళవారం మందకృష్ణ మాదిగ కలిసి విజ్ఞప్తి చేశారు.

మార్కెట్‌లోకి సరికొత్త వాషింగ్ మెషీన్లు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఏఐడీడీ 2.0 టెక్నాలజీతో 10 సరికొత్త మోడళ్లలో వాషింగ్ మెషీన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఏలూరు రోడ్డులో ఉన్న సోనోవిజన్ షాపింగ్‌మాల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.భాస్కరమూర్తి, రీజినల్ బిజినెస్ హెడ్, ఆంధ్రప్రదేశ్ కె.వి.కృష్ణాజీ, బ్రాంచ్ మేనేజర్, విజయవాడ పి.కిషోర్ బాబు, రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ పి.మనోజ్ కుమార్ ఎల్‌జీ బృందం చేతుల మీదుగా కొత్త మోడళ్లను మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కొత్త మోడళ్లలో ఫ్రంట్ లోడ్, టాప్ లోడ్, వాషర్ డ్రయర్ రకాలు ఉన్నాయి.

విషపు రాతలకు ఢిల్లీ హైకోర్టు కళ్లెం!

తిరుమల లడ్డూ వివాదంలో తప్పుడు కథనాలపై న్యాయస్థానం సీరియస్

- ఎంపీ వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌పై విచారణ
- ఈనాడు సహా పలు మీడియా సంస్థలు, గూగుల్‌కు నోటీసులు
- ఇకపై ఇష్టారాజ్యంగా రాస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: ''ఇకపై వైవీ సుబ్బారెడ్డి గురించి గానీ, తిరుమల లడ్డూ వ్యవహారం గురించి గానీ ప్రచురించే ప్రతి కథనం కోర్టు విచారణకు లోబడి ఉంటుంది. తప్పుడు రాతలు రాస్తే కోర్టులో మూల్యం చెల్లించుకోక తప్పదు. వాటికి తగిన పరిణామాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి'' అని ఢిల్లీ హైకోర్టు హెచ్చరించింది. తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో తనపై ఉద్దేశపూర్వకంగా అసత్య కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ చైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గతంలో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కథనాలు రాసిన ఈనాడు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి సంస్థలతో పాటు గూగుల్‌పై రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ బన్సల్.. సదరు మీడియా సంస్థలకు నోటీసులు జారీ చేశారు. విచారణ సందర్భంగా అసత్య ప్రచారాలు చేస్తున్న మీడియా తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

- గత ఏడాది నవంబర్‌లో ఏపీ సీఎం చంద్రబాబు చేసిన నిరాధార ఆరోపణలను పట్టుకుని, వాస్తవాలను వక్రీకరిస్తూ ఈనాడు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి సంస్థలు తన ప్రతిష్ఠ దెబ్బతినేలా కుట్రపూరిత కథనాలు రాశాయని వైవీ సుబ్బారెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. కనీసం తన వివరణ కూడా తీసుకోకుండా, జర్నలిజం విలువలకు తిలోదకాలిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ విషపు రాతలను అడ్డుకోవాలని, ఇప్పటికే ప్రచురించిన కథనాలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ప్రతివాదులు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ (ఈనాడు), తదితర సంస్థలకు నోటీసులు జారీ చేసింది.
- వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది దయాన కృష్ణన్... విచారణ సందర్భంగా ఆయనపై జరిగిన అసత్య ప్రచారాలు, కుట్రలను ఎండగట్టారు. 'తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తు సంస్థల విచారణ తేలనే లేదు. చార్జిషీట్‌లో నా క్లయింట్ పేరు కూడా లేదు. కానీ, ఈ మీడియా సంస్థలు మాత్రం కక్షగట్టి, ఆయన అక్రమాలకు పాల్పడ్డారని కథనాలు వండివార్చాయి. విచారణ జరగకముందే దోషిగా నిలబెట్టి ఉరితీశాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తు సాగుతుండగానే, మీడియా సమాంతర విచారణలు జరుపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని, ఇప్పటికే ప్రచురించిన కథనాలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, వాదనల తదుపరి విచారణను న్యాయమూర్తి జనవరి 29కి వాయిదా వేశారు.

ఇదంతా చంద్రబాబు కోసమేగా?

- పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు
- ఏమిటా చిత్రవిచిత్ర మాటలు.. పీకుడు భాష?
- వైఎస్సార్‌సీపీ ఏమీ అనకుండానే ఎందుకీ వాగుడు?

సాక్షి, అమరావతి: 'ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలు, ఉపన్యాసం పరిశీలిస్తే చాలా విచిత్రంగా ఉంటుంది. ఓపెనింగ్‌లో ఓవరాక్షన్ చేస్తారు. ఇంటర్వెల్‌లో ఇరిటేషన్ అవుతారు. కన్‌క్లూజన్‌లో కన్ఫ్యూజ్ అయిపోతారు. ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కాదు' అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. ఇదంతా చంద్రబాబు కోసమేనని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా ఉంటూ పీకుడు భాష ఏమిటని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నుంచి పవన్ కళ్యాణ్‌ను ఎవరూ ఏమీ అనకపోయినా, ఆయన అదేపనిగా తమ పార్టీపైనా, నాయకులపైనా ఎందుకు విరుచుకు పడుతున్నారని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'యోగి ఆదిత్యనాథ్ చేస్తున్నట్లు ఇక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులను చేయాలంటున్నారు. అరచేతిలో రేఖలు నలగ్గొట్టేస్తాను.. తొక్కేస్తాను.. అంటున్నారు. రాజకీయ భాష కాకుండా భిన్నమైన భాషతో ఎవరినో బెదిరించాలని ఇలా మాట్లాడుతున్నారు. ఆయన్ను ఎవరైనా ఏమైనా అన్నారా? ఎందుకు వైఎస్సార్ కాంగ్రెస్ మీద ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారు? ఆయన పిచ్చి మాటలకు తెలంగాణ వాళ్లు తిట్టారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వ అసమర్థత వల్ల అనేక సమస్యలు వచ్చాయి. ప్రధానంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇచ్చారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి మందికి పైగా సంతకాలు పెట్టారు. మేం వాటిని గవర్నర్‌కు ఇచ్చాం. మళ్లీ మేము రాగానే ఈ స్కామ్‌పై విచారణ చేయించి, ఇందుకు బాధ్యులైన వారిని జైలుకు పంపుతామని చెప్పాం. కనీసం 15 ఏళ్లు చంద్రబాబుతో ఉంటామని చెబుతున్న మీరు అందుకే భయపడుతున్నారా? ఈ స్కామ్‌లో మీకు వాటా ఉంది కాబట్టే రెచ్చిపోతున్నారా? తొక్కేస్తాం.. అణిచేస్తాం.. అంటున్నది అందుకేనా?' అని ధ్వజమెత్తారు. అంబటి ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబుకు కాపు కాస్తూనే ఉండండి

- తమ పాలనలో ఎక్కడా అవినీతి జరగడానికి వీల్లేదని, లంచాలు తీసుకోవడానికి వీల్లేదని పవన్ ఈ మధ్య చెప్పారు. పౌర సరఫరాల శాఖ తరఫున సీజ్ ది షిప్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బియ్యం అక్రమ రవాణా ఆగిందా? కాకినాడ రేవు నుంచి బియ్యం అక్రమ రవాణా అవుతూనే ఉంది. మధ్యవర్తులు డబ్బులు సంపాదించుకుంటున్నారు. అందులో నుంచి మంత్రి మనోహర్‌కు డబ్బు వస్తూనే ఉంది. మీరు మాత్రం నీతి గురించి ఇంకా ఉపన్యాసాలు ఇస్తున్నారు.
- మేం ఏమీ అనకపోయినా తొక్కి నార తీస్తామని హెచ్చరికలు చేస్తున్నారు. ఇదంతా చంద్రబాబు కోసమేగా? మీరు చంద్రబాబుకు కాపు కాస్తూనే ఉండండి. వైఎస్సార్‌సీపీ సింగిల్‌గానే వస్తుంది. బంధు ప్రీతి లేదని చెప్పిన మీరు మీ అన్నకు ఎమ్మెల్సీ పదవి ఎందుకు ఇచ్చారు? కులతత్వానికి వ్యతిరేకినన్న మీరు రెండు మంత్రి పదవులను ఓసీలకే ఎందుకు ఇచ్చారు? మీ అన్నకూ మంత్రి పదవి ఇస్తామన్నారు. ఏడాదైనా ఎందుకు ఇవ్వలేదు?
- దేహీ అని పదవులు తీసుకునే దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్న మీరు.. వైఎస్సార్‌సీపీ నేతల్ని రౌడీలని ప్రచారం చేస్తున్నారు. రౌడీల్ని పోలీసులు కొట్టరా అంటున్నారు. పోలీసులు జనాన్ని కొట్టడం మొదలుపెడితే ఈ సమాజం ఉంటుందా? మన దేశంలో ఓ రాజ్యాంగం ఉంది. డీఎస్పీ జయసూర్య ప్రైవేటు పంచాయతీలు చేసి ఆదాయం ఎమ్మెల్యేలకు పంచుతున్నాడని, శిక్షించాలని ఫిర్యాదు చేశారు. మరి ఆయన్ను శిక్షించారా? కూటమిలో మీ పరిస్థితి ఇదీ.
- జలధార మీద ప్రమాణం చేసి చంద్రబాబు, లోకేశ్ అవినీతిలో వాటా లేదని చెప్పగలరా? మీ ఎమ్మెల్యే నానాజీ ప్రిన్సిపాల్‌ను కొడితే ఏం చేశారు? ఇంతకూ మీది తుపాకీ గొట్టం భావాజాలమా.. సనాతన ధర్మం భావజాలమా.. చంద్రబాబును మోసే భావజాలామా?' ఇప్పటికైనా పిచ్చివాగుడు మానాలి.

న్యాయం చేయడం అధికారుల పని కూడా!

వైఎస్సార్‌సీపీ భవనం విషయంలో హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, అమరావతి: న్యాయం కోసం వచ్చే పౌరులకు న్యాయం చేయడమన్నది న్యాయస్థానాల పని మాత్రమే కాదని.. న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపై కూడా ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తులతో వచ్చే పౌరుల జీవితాలు అందులో ముడిపడి ఉంటాయని పేర్కొంది. కాబట్టి విధి నిర్వహణలో అధికారులు ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోవాలని తేల్చిచెప్పింది. అన్ని విషయాల్లో నిష్పాక్షికంగా ఉండాలని అధికారులకు హితవు పలికింది. వైఎస్సార్‌సీపీ మచిలీపట్నంలో పార్టీ కార్యాలయ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో నిష్పాక్షికంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం నాలుగు రోజుల్లో మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్‌కు భౌతికంగా దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నానిని హైకోర్టు ఆదేశించింది. అనుమతులకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు కమిషనర్‌కు సమర్పించేలా నానికి వెసులుబాటు ఇచ్చింది. ఓ దరఖాస్తును మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ న్యాయవాది ఏసీఎస్ బోస్‌కి సైతం ఇవ్వాలని నానికి స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ నిర్మించిన పార్టీ కార్యాలయ భవనం విషయంలో స్వల్ప ఉల్లంఘనలు ఏమైనా ఉంటే వాటిని రాజీ చేసుకునేందుకు నానికి అవకాశం ఇవ్వాలని కమిషనర్‌కు స్పష్టం చేసింది. నాని పెట్టుకునే దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని చట్ట ప్రకారం నిర్ణయం వెలువరించాలని కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలన్న సింగిల్ జడ్జి

మచిలీపట్నంలోని ఈడేపల్లిలో వైఎస్సార్‌సీపీ నిర్మించిన పార్టీ కార్యాలయ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఆఫీసులోకి వెళ్లడానికి డ్రైనేజీపై నిర్మించిన దారిని కూడా అధికారులు తొలగించారని, ఈ దారిని పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి ఓసారి భవన నిర్మాణం పూర్తయిన తరువాత అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చి చెప్పారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ గత నెల 10న ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు.

రాజకీయ కక్ష సాధింపు

వైఎస్సార్‌సీపీ తరఫున న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం తన క్లయింట్ పట్ల రాజకీయ కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందన్నారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చిన తరువాతే నిర్మాణాలు చేపట్టారన్నారు. అవసరమైన అన్ని డాక్యుమెంట్లు కూడా సమర్పించామన్నారు. ఎత్తి చూపిన లోపాలను సవరించామన్నారు. అయినా కూడా ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్ ద్వారా నోటీసులపై నోటీసులు జారీ చేస్తూ వేధింపులకు గురి చేస్తోందన్నారు. సింగిల్ జడ్జి ఆదేశాలను సైతం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే అధికారులు నిబంధనలకు తిలోదకాలిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన వివరించారు.

ఈ అప్పీల్‌పై మంగళవారం సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ధర్మాసనం విచారణ జరిపింది. కమిషనర్ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ ప్లాన్‌కు అనుగుణంగా పార్టీ కార్యాలయ భవన నిర్మాణం జరగలేదన్నారు. నిబంధనల ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఆర్మీ జవాన్ దుర్మరణం

రాజశేఖర్ (ఫైల్)

పెనుమంట్ర: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో భారత సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన సన్నాయిల రాజశేఖర్ (26) మృతి చెందినట్టు మంగళవారం ఆయన బంధువులు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా డార్జిలింగ్ సమీపంలోని తీస్తా నదిలో సోమవారం ఉదయం శీతాకాలపు శిక్షణ నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ నదిలో పడి గల్లంతయ్యారని, సుదీర్ఘ రెస్క్యూ ఆపరేషన్ అనంతరం రాజశేఖర్ మృతదేహం లభ్యమైందని పేర్కొంటూ ఆర్మీ అధికారులు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు.

సైన్యంలో చేరాలనే మక్కువతో..

వ్యవసాయ కూలిగా పనిచేస్తున్న సన్నాయిల గాంధీకి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిని డిగ్రీ వరకు చదివించారు. పెద్ద కుమారుడు బాల నాగరాజు స్థానికంగా వ్యవసాయ కూలీగా పని చేస్తుండగా, రెండో కుమారుడు రాజశేఖర్ సైన్యంలో చేరాలనే మక్కువతో 2020లో డిగ్రీ సెకండియర్ చదువుతూనే ఆర్మీలో చేరారు. అప్పుడప్పుడు సెలవుల్లో వచ్చి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను చూసి వెళ్తున్నారు. వారం క్రితం సెలవుపై వచ్చి వెళ్లిన రాజశేఖర్ అకస్మాత్తుగా మృతిచెందాడనే వార్త విని తల్లిదండ్రులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆయన మృతదేహన్ని బుధవారం ఉదయానికి ఆలమూరు గ్రామానికి తీసుకురానున్నట్టు ఆర్మీ అధికారులు వెల్లడించారు.

మీ విధానాల వల్లే ధాన్యం కొనలేకపోతున్నాం

మంత్రి అచ్చెన్న ముందు కుండబద్దలు కొట్టిన మిల్లర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ విధానాల వల్లే ఆశించిన రీతిలో ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నామని మిల్లర్లు మంత్రి అచ్చెన్నాయుడు ముందు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం రైస్ మిల్లర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ మాట్లాడుతూ గత పదేళ్లుగా జిల్లాలో సుమారు రూ.400 కోట్ల విలువైన బ్యాంకు గ్యారెంటీలు ఇస్తున్నామని, ఒక్కసారిగా వాటిని పెంచడంతో ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 48 గంటల్లోగా బ్యాంకు గ్యారెంటీ సమర్పించని మిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ నిలిపివేస్తామని హెచ్చరించారు.

నాన్నా.. మేమేం పాపం చేశాం!

- ఇద్దరు కూతుళ్లను కాలువలోకి తోసిన తండ్రి
- రెండు రోజుల తర్వాత బయటపడ్డ పెద్ద కుమార్తె మృతదేహం
- చిన్న కుమార్తె జాడ కోసం కొనసాగుతున్న గాలింపు

సింధు, అనూష (ఫైల్), కూతుళ్లను కాలువలో తోసిన తండ్రి కల్లప్ప (ఇన్‌సెట్‌లో)

బొమ్మనహాళ్: తండ్రే ఆ చిన్నారుల పాలిట కాలయముడయ్యాడు. దేవాలయానికి తీసుకెళ్తానని ఇద్దరినీ కాలువలో తోసేశాడు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లుకు చెందిన శిల్ప, కల్లప్పకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కల్లప్ప కూలి పనులు చేస్తుంటాడు. కుమార్తెలు సింధు (11), అనూష (9) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6, 5 తరగతులు చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దే ఉన్న కుమార్తెలను కల్లప్ప ఆలయానికి తీసుకెళ్లాడు. కర్ణాటకలోని సిరిగేరి క్రాస్ వద్ద తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వద్దకు వెళ్లాక సింధును నీటిలోకి తోసేశాడు. చిన్న కుమార్తె అనూష గమనించి భయంతో పరుగులు తీయగా.. కల్లప్ప వెంబడించి మరీ పట్టుకుని కాలువలోకి విసిరేశాడు. ఏమీ తెలియనట్టు సోమవారం గ్రామానికి చేరుకున్నాడు. పిల్లలు ఏమయ్యారని కుటుంబ సభ్యులు ప్రశ్నించగా సమాధానం రాలేదు. మంగళవారం ఉదయమైనా పిల్లలు రాకపోయేసరికి బంధువులు, గ్రామస్తులు గట్టిగా నిలదీశారు. దీంతో మద్యం మత్తులో ఉన్న కల్లప్ప సిరిగేరి క్రాస్ వద్ద ఎల్లెల్సీ కాలువలో తోసేశానని ఓసారి.. గ్రామ సమీపంలోని హెచ్చెల్సీలోకి తోసేశానని మరోసారి చెప్పాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారుల ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, కర్ణాటక, ఆంధ్ర పోలీసులు కాలువలో గాలించగా మంగళవారం మధ్యాహ్నం సింధు మృతదేహాన్ని దమ్మూరు సమీపంలోని ఎల్లెల్సీవద్ద గుర్తించి బయటకు తీశారు. చిన్నమ్మాయి అనూష జాడ కోసం గాలిస్తున్నారు.

తహసీల్దార్ కళ్లలో కారం.. 3 గంటలు నిర్బంధం

- ఏలూరు జిల్లా ఇనుమూరులో భగ్గుమన్న భూ వివాదం
- అధికారుల వాహనాలను ధ్వంసం చేసిన గిరిజనులు
- పోలీసులతో తోపులాట.. పలువురికి గాయాలు
- రాత్రి సమయానికి నచ్చజెప్పి బయటపడ్డ తహసీల్దార్
- రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు

తోపులాటలో గాయపడిన చంద్రశేఖర్

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరులో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్వేదిగూడెం రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ మారుమూల గ్రామంలో సర్వే నంబర్ 218లోని 7.17 ఎకరాలపై 30 ఏళ్లుగా వివాదం నెలకొంది. ఈ భూమి 1/70లోకి వస్తుందని, చాలాకాలంగా సాగు చేస్తున్నామని గిరిజనులు వాదిస్తున్నారు. కానీ, యాంత్రప్రగడ సత్యనారాయణ, అతడి కుటుంబం, ఒట్టికూటి ఝాన్సీరాణి, యాంత్రప్రగడ రామాంజనేయులు మాత్రం ఆ భూమిపై అన్ని హక్కులు కలిగి ఉన్నామని, రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ప్రొటెక్షన్ ఆర్డర్ అమలు చేసేందుకు తహసీల్దార్ పీవీ చలపతిరావు వీఆర్వోలు, సర్వేయర్లు, పోలీసులతో కలిసి బైక్‌లపై ఇనుమూరు వెళ్లారు. గిరిజనులు సాగు చేసిన మొక్కజొన్నను ట్రాక్టర్‌తో దున్నే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, గిరిజనులకు మధ్య తోపులాట జరిగింది. స్థానికులు చంద్రశేఖర్, మహిళకు గాయాలయ్యాయి. ఇది తెలిసి ఇతర గిరిజనులు కత్తులు, కర్రలు, కారంతో వచ్చారు. అధికారుల మోటార్‌సైకిళ్లలో గాలి తీసేశారు. ఓ వీఆర్‌వో బైక్ అద్దాలను పగులగొట్టారు. పంటను పాడుచేసినందుకు సమాధానం చెప్పాలంటూ... తహసీల్దార్ కంట్లో కారం చల్లి చుట్టుముట్టి నిర్బంధించారు. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు భయాందోళనకు గురయ్యారు. చేసేదేమీ లేక తహసీల్దార్‌తో పాటు, ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు, ఆరుగురు కానిస్టేబుళ్లు, రెవెన్యూ సిబ్బంది మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 వరకు అక్కడే ఉండిపోయారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ బాలసురేష్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పడంతో గిరిజనులు శాంతించారు. కాగా, బైక్‌లను ధ్వంసం చేయడంతో రెవెన్యూ అధికారులు ఇనుమూరు నుంచి కాలినడకన పందిరిమామిడిగూడెం వచ్చారు. బుట్టాయగూడెంకు చెందిన రైతు తాటినాడ హరిబాబుకు ఫోన్ చేయగా ఆయన కారు తీసుకెళ్లి తహసీల్దార్‌ను రాత్రి 7:30కు తీసుకొచ్చారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

రాష్ట్రంలో మరో నాలుగు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆయా కార్పొరేషన్లు డిస్కంలతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్ (పీపీఏ) కుదుర్చుకున్నారు. మంగళవారం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో విజయవాడలో ఈ ఒప్పందం జరిగినట్టు మున్సిపల్ శాఖ ప్రకటించింది.

అమరావతిలో ఐకానిక్ ఎన్టీఆర్ విగ్రహ ప్రాజెక్టు

- మార్గనిర్దేశం చేసేందుకు మంత్రుల బృందం

సాక్షి, అమరావవతి : అమరావతిలో ఏర్పాటు చేయనున్న ఐకానిక్ ఎన్టీఆర్ విగ్రహ ప్రాజెక్టుకు మార్గనిర్దేశం చేసేందుకు ఐదుగురు మంత్రులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. మున్సిపల్, ఆర్థిక, పర్యాటక, రెవెన్యూ, ఆరోగ్య శాఖల మంత్రులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు.

అసెంబ్లీ సెక్రటేరియట్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సెక్రటేరియట్ ప్రచురించిన 2026 వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్, డైరీలను సీఎం చంద్రబాబు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆవిష్కరించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు ఏటా నాలుగు విడతలు ఓటు హక్కుకు అర్హత

సాక్షి, అమరావతి: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తరహాలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనూ ఆ ఏడాది జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు నెలల్లో ఒకటో తేదీకి అర్హత కలిగిన అందరికీ ఓటు హక్కు కలిగించేలా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. న్యాయ శాఖ మంగళవారం జీవో విడుదల చేసింది.

పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణకు కేంద్రం అంగీకారం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలో 7,567 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దగెడ్డ ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై)– ఆయకట్టు అభివృద్ధి నీటి యాజమాన్యం, ఆధునికీకరణ(కాడ్వామ్) పథకం కింద ఆధునికీకరించే పనులను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కేంద్రం ఆదేశాల మేరకు పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆయకట్టును అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా గుర్తిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజనులపై దాడిని తక్షణం ఆపాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా ఇనుమూరులో ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి, అడ్డొచ్చిన గిరిజనులు, మహిళలపై దాడికి పాల్పడిన పోలీస్, రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

పాస్టర్లకు రూ.50.04 కోట్లు వేతన నిధులు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాస్టర్ల గౌరవ వేతనాలు చెల్లింపునకు రూ.50.04 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 డిసెంబరు నుంచి 2025 నవంబరు వరకు, ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున 12 నెలల గౌరవ వేతనం 8,427 మంది పాస్టర్ల ఖాతాలకు జమచేయనున్నట్లు వెల్లడించారు.

కాకినాడలో విద్యుత్ ఓసీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 క్యాలెండర్‌ను ఈ నెల 27న కాకినాడలో ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఉన్న జి.కన్వెన్షన్‌హాల్‌లో జరిగే ఈ వేడుకకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యులు హాజరుకావాల్సిందిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల రంగారావు, ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

అదిరేలా.. కళ్లు చెదిరేలా..

- విరి వనాల్లో సీజనల్స్ సందడి
- అందుబాటు ధరల్లో లభ్యం
- కొనుగోలుదార్ల ఆసక్తి

కడియం: తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీల్లో సీజనల్స్ సందడి ప్రారంభమైంది. ఈసారి కాస్త ఆలస్యంగా డిసెంబర్ నెలలో మొదలైన ఈ సందడి జనవరి నెలాఖరు వరకూ ఉంటుందని నర్సరీ రైతులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో వచ్చే బంతి, చామంతి, పాన్‌చిటియా, ఎగ్జోటిక్స్ తదితర రకాల మొక్కలు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వాతావరణ ప్రభావం, కొనుగోలుదారుల ఆసక్తి మార్పుల కారణంగా ఇక్కడి నర్సరీల్లో సీజనల్స్ కొన్నేళ్లుగా తక్కువగానే కనిపిస్తున్నాయి. అయితే, ఎప్పటికప్పుడు ప్రజల ఆసక్తిని గమనించి సరికొత్త వెరైటీలు సృష్టించడం కడియం ప్రాంత నర్సరీ రైతుల ప్రత్యేకత. అదే రీతిలో ఈ ఏడాది సీజనల్ మొక్కలు ప్రత్యేకమైన కుండీల్లో లభించేలా రూపొందించారు. ఇవి సులభంగా తీసుకువెళ్లడానికి, ఎవరికైనా బహుమతిగా ఇవ్వడానికి సౌలభ్యంగా ఉంటోంది. చిన్న ప్యాకెట్లలో రూ.50 నుంచి సీజనల్స్ లభ్యమవుతున్నాయి. ప్లాస్టిక్ కుండీల్లోని మొక్కల ధరలు రూ.200 ప్రారంభమవుతున్నాయి. దాదాపు 10 రకాల చామంతులు చూడగానే కళ్లు చెదిరే రంగుల్లో లభ్యమవుతున్నాయి. చూడచక్కని కుండీల్లో పొద మాదిరిగా, ఒద్దికగా ఉన్న ఈ మొక్కలు ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో ఉండే మొక్కలను తీసుకువెళ్లి ఎవరికైనా ఇవ్వాలంటే ఇబ్బందిగా ఉండేదని, ప్రస్తుతం కుండీల్లో పెట్టడంతో వీటిపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారని రాజమహేంద్రవరానికి చెందిన మొక్కల కొనుగోలుదారు లావణ్య చెప్పారు.

కడియం ప్రాంత నర్సరీల్లో కనువిందు చేస్తున్న సీజనల్స్

అంబేడ్కర్ లా కాలేజీ ఫీజుల దోపిడీపై విచారణ చేయాలి

- రివల్యూషనరీ విద్యార్థి సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: తిరుపతిలోని అంబేడ్కర్ న్యాయ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నడుపుతోందని, విద్యార్థుల నుంచి బలవంతంగా రూ.వేలాది ఫీజులు వసూలు చేస్తోందని రివల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) ఆరోపించింది. ఈ మేరకు ఆర్ఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యాశాఖ మండలి కార్యదర్శికి మంగళవారం వినతి పత్రం అందచేసినట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. సొంత ప్రయోజనాల కోసం స్థానిక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారి స్థలాన్ని ఆక్రమించి కళాశాల భవనం నిర్మించారని పేర్కొన్నారు. ఉన్నత విద్యాశాఖ తక్షణమే కళాశాల అక్రమాలపై విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులను వేధిస్తే సహించేది లేదు

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులు స్వేచ్ఛగా విద్యార్థులకు బోధించకుండా ఏదో ఒక అంశంపై రోజూ విద్యాశాఖ డైరెక్టరేట్ టార్గెట్ చేస్తోందని... ఇలాగే వేధింపులు కొనసాగితే సహించబోమని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో హెచ్చరించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ పేరుతో విద్యార్థులను, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే పరీక్షల విషయంలోనూ నానా హడావుడి చేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడే పరిస్థితి తలెత్తుతోందన్నారు. సంవత్సరంలో పూర్తి చేయాల్సిన సిలబస్‌ను 6 నెలల్లో హడావిడిగా పూర్తి చేయించి, మరలా రివిజన్, రోజు వారీ పరీక్షల పేరుతో వేధిస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. పదో తరగతిలో సరైన ఫలితాలు రాకుంటే విద్యాశాఖ అధికారులదే బాధ్యతని ఆరోపించారు.

కొబ్బరి ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: కొబ్బరి పరిశ్రమను ప్రోత్సహించేందుకు మూడెకరాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఐదెకరాల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను నిర్మించడంతో పాటు, రైతు ఉత్పత్తి సంస్థలను ప్రోత్సహించి కొబ్బరి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం సచివాలయంలో కొబ్బరి పరిశ్రమ అభివృద్ధిపై అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ..తూర్పుపాలెం, ఉప్పలగుప్తంలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రైతులు కొబ్బరికాయల తొక్కలు తీసి, ఎండు కొబ్బరికాయలను తమిళనాడు, కేరళ, కర్ణాటక మార్కెట్లకు పంపుతున్నారని, అక్కడే ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నారని చెప్పారు. దీనికి కారణం కోనసీమ జిల్లాలో సమగ్ర కొబ్బరి ప్రాసెసింగ్ పరిశ్రమలు లేకపోవడమేనని, దీనిపై అధ్యయనం చేసి జిల్లా స్థాయిలో చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

మార్టిన్ గ్రూప్ రూ.110 కోట్ల విరాళంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ

సాక్షి, చెన్నై: లాటరీ రంగంలో ఉన్న మార్టిన్ గ్రూప్ నుంచి గతంలో డీఎంకే, అన్నాడీఎంకేలకు రూ.110 కోట్ల మేరకు విరాళాలు వచ్చినట్లు తమిళనాడులో తాజాగా చర్చ జరుగుతోంది. రాజకీయ పక్షాలకు విరాళాల సేకరణ కొత్తేమీ కాదు. అయితే లాటరీ రంగంలో కీలకంగా ఉన్న మార్టిన్ గ్రూప్ నుంచి ఈ విరాళం రావడంపై ఎన్నికల కమిషన్ సైతం దృష్టి పెట్టి, విచారణ జరుపుతున్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. అయితే ఈ విరాళాల వ్యవహారం అంతా ఎన్నికల నేపథ్యంలో ఆరోపణలే తప్ప మరేమీ కాదంటూ ఆ పార్టీలు అంటున్నాయి.

సీడబ్ల్యూసీ, జేజేబీలో దరఖాస్తులకు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ)లలో చైర్‌పర్సన్లు, సభ్యులు, జువైనల్ జస్టిస్ బోర్డుల(జేజేబీ)లో సోషల్ వర్కర్ సభ్యులుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 29వతేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఏపీ ప్రభుత్వ బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎమ్.వేణు గోపాల్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు దరఖాస్తులను http://wdcw.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు.

ఆయుర్వేద శస్త్ర చికిత్సలకు ఆమోదం

- వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి : 2020 ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ నియమావళి, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ మెడిసిన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేలా తగు గుర్తింపుతోపాటు అనుమతివ్వడానికి ఆమోదం తెలిపినట్లు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో 39 శల్యతంత్ర (జనరల్ సర్జరీ) చికిత్సలు, 19 శలక్యతంత్ర (ఈఎన్‌టీ, ఆప్తమాలజీ) చికిత్సలను ఆయుర్వేద వైద్యులు చేయవచ్చన్నారు. రాష్ట్రంలోని ఆయుర్వేద కళాశాలల్లో తక్షణమే శల్యతంత్ర, శకల్యతంత్ర పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించామని తెలిపారు.

తనిఖీలకు ఇతర శాఖాధికారులను నియమించడం సరికాదు: ఎస్టీయూ

సాక్షి, అమరావతి: విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై తనిఖీలకు ఇతర శాఖల అధికారులను నియమించడం సమంజసం కాదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంపునకు 75 రోజుల ప్రణాళిక అమల్లో భాగంలో సెలవుల్లో సైతం శిక్షణ ఇవ్వాలంటూ వేధిస్తున్నారన్నారు. విద్యా సంబంధ అంశాలపై పర్యవేక్షణ, తనిఖీలకు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డీవైఈవోలు ఉండగా ఇతర శాఖల అధికారులను నియమించడం విద్యాశాఖను అవమానించడమేనన్నారు.

ఆప్కోలో 40-60శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు

సాక్షి, అమరావతి: సంక్రాంతి సందర్భంగా ఆప్కో షోరూమ్‌లలో 40, 50, 60 శాతాల చొప్పున డిస్కౌంట్‌లపై అమ్మకాలు చేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో 26 నుంచి చేనేత బజార్ నిర్వహించనున్నామన్నారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ 60 శాతం డిస్కౌంట్ అమ్మకాలపై గుంటూరులోని చేనేత ఏడీ కార్యాలయ ఆవరణలోనూ, మంగళగిరిలోని యర్రబాలెంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. విజయవాడ ఆప్కో షోరూమ్‌లో 50 శాతం డిస్కౌంట్ అమ్మకాలు చేయనున్నామని తెలిపారు. 29 నుంచి ప్రత్యేక డిస్కౌంట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని మిగిలిన అన్ని ఆప్కో షోరూమ్‌లలో 40 శాతంపై సంక్రాంతి వరకూ డిస్కౌంట్ అమ్మకాలు కొనసాగించాలని సూచించారు.

ఒక్కోపోగును కలిపి మిరుమిట్లు గొలిపే పట్టుచీరలను నేసే వారి బతుకు మాత్రం అంధకారంలో మగ్గిపోతోంది. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా కూలి కూడా గిట్టుబాటు కాక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. ముడి పట్టు ధరలు అమాంతం పెరిగినా... చీర ధర మాత్రం పైకి రానంటోంది. వ్యయం పెరిగి..ఆదాయం తగ్గి అప్పుల పాలైన నేతన్నలు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు తెగిస్తున్నా... చంద్రబాబు సర్కార్ పైసా సాయం విదల్చడం లేదు.

పోగు కలవక.. పొట్ట నిండక

రేషం (ముడిపట్టు)

చేనేతకు.. లేదు చేయూత

- నేతన్నల సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు
- ఏడాదిన్నర కాలంలో రూపాయి విదల్చని వైనం
- పెరిగిన ముడిపట్టు ధరలు, పట్టుచీరకు దక్కని మద్దతు
- అప్పుల బాధలతో ఆత్మహత్యలకు తెగిస్తున్న నేతన్నలు
- ఉపాధి లేక వలసలు వెళ్తున్న చేనేత కార్మికులు
- గతంలో 'నేతన్న నేస్తం'తో చేనేతల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్ సర్కార్
- ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక చేయూత
- నాటి సంక్షేమ పాలనను తలచుకుంటున్న చేనేతలు

కార్మికులు పనిచేయకపోవడంతో ఖాళీగా ఉన్న చేనేత మగ్గాలు

చేనేత మగ్గానికి కవర్ చుట్టిపెట్టిన దృశ్యం

ధర్మవరం: సత్యసాయి జిల్లాలో ధర్మవరం, సోమందేపల్లి, పెనుకొండ, హిందూపురం, గోరంట్ల, చిలమత్తూరు తదితర ప్రాంతాలలో 24 వేలకుపైగా చేనేత మగ్గాలున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.20 లక్షల మందికిపైగా చేనేత కార్మికులు, అనుబంధ రంగాలవారు చేనేతపై ఆధారపడి పని చేస్తున్నారు. ధర్మవరం పట్టును అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన డిజైనర్లూ ఉన్నారు. వీరందరికీ మగ్గం పని తప్ప మరొకటి తెలియదు. అందుకే నష్టమైనా..కష్టమైనా మగ్గంపైనే జీవనం సాగిస్తున్నారు.

నాడు వెలుగులు..

గత పాలకుల నిర్లక్ష్యంతో చేనేత రంగం కుదేలైంది. ఆర్థిక చేయూత లేక చాలామంది నేతన్నలు మగ్గం పక్కనపెట్టి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కానీ రాష్ట్రంలో జగన్ సర్కార్ కొలువుదీరాక పరిస్థితి పూర్తిగా మారింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నేతన్న నేస్తం' పథకాన్ని ప్రవేశపెట్టి చేనేత రంగానికి ప్రాణం పోశారు. 2019 డిసెంబర్ 21న తన జన్మదినం రోజున ధర్మవరంలోనే ఈ పథకాన్ని ప్రారంభించి ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేలు ముడిపట్టురాయితీని ఒకేసారి ఖాతాలో జమ చేసి ఆదుకున్నారు. ఇలా ఐదేళ్ల పాటు సాయం అందించారు. కరోనావంటి కష్టకాలంలోనూ రెండు నెలలు ముందుగానే 'నేతన్న నేస్తం' నిధులు కార్మికులకు ఖాతాలలో జమ చేశారు. ఇలా ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తం ఉన్న 83వేల మంది కార్మికులకు రూ.960 కోట్ల ఆర్థిక సాయం అందింది. ఈ క్రమంలో జిల్లాలోని 16వేల మంది చేనేత కార్మికులకు రూ.178 కోట్లు దక్కాయి. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే 12 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.136 కోట్ల మేర చేయూత లభించింది. గతంలో ఎవరూ చేయనంత సాయం వైఎస్ జగన్ ప్రభుత్వం అందించింది. దీంతో చేనేతలు మగ్గాలను అభివృద్ధి చేసుకుని నూతన డిజైన్లతో మార్కెట్‌లో తమ సత్తా చాటారు. తద్వారా ఆదాయమూ పెరిగి ఆనందంగా ఉండేవారు. పిల్లలనూ బాగా చదివించుకున్నారు.

భారీగా పెరిగిన ముడిపట్టు ధరలు..

రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ కొలువుదీరగానే చేతనల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. నేతన్న నేస్తం పథకానికి మంగళం పాడిన సీఎం చంద్రబాబు...ఏడాదిన్నర కాలంలో రూపాయి కూడా ఆర్థిక సాయం చేయలేదు. మరోవైపు పట్టుచీరలకు ఉపయోగించే ముడిపట్టు ధరలు (వార్పు, రేషం, జరీ) ధరలు ఏడాదిన్నర కాలంలో 30 శాతానికి పైగా పెరిగాయి. అప్పట్లో కిలో రేషం రూ. 4 వేలు, వార్పు కిలో రూ.4,500 ధర ఉండగా... ప్రస్తుతం కిలో రేషం రూ.6 వేలు, కిలో వార్పు రూ.6,500లకు చేరింది. చీర తయారీకి వాడే జరీ (మార్కు రకం) సైతం గతంలో రూ.600 ఉండగా... ప్రస్తుతం రూ.800లకు పెరిగింది. దీంతో ప్రతి చీరపైన 30 శాతం పెట్టుబడి వ్యయం పెరిగింది. మరోవైపు పట్టుచీరల ధరలు మాత్రం పెరగలేదు. దీంతో చేనేత కార్మికులకు కూలి కూడా గిట్టుబాటు కాక అప్పుల పాలై మగ్గానికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునే హృదయ విదార కరమైన పరిస్థితులు నెలకొన్నాయి.

పైసా సాయం విదల్చని చంద్రబాబు సర్కార్

చంద్రబాబు సర్కార్ చేనేతలకు పైసా సాయం విదల్చలేదు. ఈ ఏడాది చేనేత దినోత్సవం రోజున 'నేతన్న నేస్తం' పథకాన్ని అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినప్పటికి ఆచరణకు నోచుకోలేదు. మరోవైపు ముడిపట్టు ధరలు పెరగడం... పట్టుచీరల ధరలు మాత్రం అంతంతమాత్రంగానే ఉండటంతో నేతన్నలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. చాలా మంది కార్మికులు మగ్గాలు పక్కన పెట్టారు. మరికొందరు పొట్టచేతబట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇలాంటి దయనీయ పరిస్థితులు ఎప్పుడూ లేవని పలువురు నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు కావడం లేదు

ముడిపట్టు ధరలు విపరీతంగా పెరిగాయి. రోజంతా మగ్గం నేసినా కూలి గిట్టుబాటు కావడం లేదు. గతంలో 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేల సాయం అందేది. ఆ డబ్బుతో మగ్గంను అభివృద్ధి చేసుకుని కొత్త డిజైన్లు నేయడం ద్వారా కూలి గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం పథకం నిలిపివేయడంతో మా అవస్థ వర్ణనాతీతంగా ఉంది.

–గాజుల సోము, చేనేత కార్మికుడు, ధర్మవరం.

మనుగడ ప్రశ్నార్థకమే

జగనన్న సీఎంగా ఉన్న ఐదేళ్లలో ఉనికి కోల్పోతున్న చేనేత వ్యవస్థకు ప్రాణం పోశారు. 'నేతన్న నేస్తం' ద్వారా ఏటా రూ.24 వేలు అందజేశారు. ఆ సాయంతో చేనేతలు ఎంతో అభివృద్ధి చెందారు. చంద్రబాబు ప్రభుత్వం చేనేతలను పూర్తిగా విస్మరించింది. ముడిపట్టు ధరలు పెరిగి నష్టాల పాలవుతున్నా పట్టించుకోవడం లేదు. ఉపాధి లేక చేనేత కార్మికులు కేరళ వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కొంతమంది అప్పుల బాధను తాళలేక మగ్గానికే ఉరివేసుకునే దుర్భర పరిస్థితులు జిల్లాలో కనపడుతున్నాయి. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే చేనేత మనుగడ ప్రశ్నార్థకమే.

– గుండా ఈశ్వరయ్య, చేనేత సంఘం నాయకుడు, ధర్మవరం

టైటిల్ క్యాచీగా ఉంటే ఆడియన్స్ అటెన్షన్ని ఈజీగా క్యాచ్ చేస్తుంది... అది చిన్న టైటిలా? పెద్ద టైటిలా? అన్నది కాదు. అయితే ఒక్కోసారి రెండక్షరాలతోనే టైటిల్ కుదరొచ్చు... ఇరవై అక్షరాలతోనూ కుదరొచ్చు. ఇప్పుడు కొన్ని టైటిల్స్ చూస్తే మాత్రం 'పెద్ద' టైటిల్ ట్రెండ్ సాగుతున్నట్లనిపిస్తోంది. ఆ లెంగ్తీ టైటిల్స్ అన్నీ అచ్చ తెలుగులో చక్కగా క్యాచీగా ఉన్నాయి. ఆ టైటిల్స్, ఆ చిత్రాల్లో నటిస్తున్న హీరోలు, ఆ కథా కమామీషులోకి వెళదాం.

నయనతార, చిరంజీవి

వెంకటేశ్

పెద్ద టైటిల్!

● ఇప్పుడు ఇదే ట్రెండు గురూ

మన శంకరవరప్రసాద్గారు...

'ఆచార్య, గాడ్ఫాదర్, వాల్తేరు వీరయ్య, భోళా శంకర్, విశ్వంభర' వంటి చిన్న టైటిల్స్ చిత్రాల తర్వాత చిరంజీవి నటిస్తున్న పెద్ద టైటిల్ చిత్రం 'మన శంకరవరప్రసాద్గారు' కావడం విశేషం. ఈ చిత్రంలో శంకర వరప్రసాద్, శశిరేఖల ప్రేమకథ, కుటుంబ గాథల కహానీ ఏంటి? అన్నది తెలియాలంటే సంక్రాంతి వరకు వేచి చూడాల్సిందే. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండక్కి వస్తున్నారు' అనేది ఉపశీర్షిక. 'సంక్రాంతికి వస్తున్నాం' (2025) వంటి బ్లాక్బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. నయనతార హీరోయిన్గా నటిస్తున్నారు. 'సైరా నరసింహారెడ్డి' (2019) చిత్రం తర్వాత చిరంజీవి–నయనతార జోడీగా నటిస్తున్న సినిమా ఇది ('గాడ్ఫాదర్' చిత్రంలో అన్న, చెల్లెలుగా నటించారు). ఈ చిత్రంలో హీరో వెంకటేశ్ ముఖ్య పాత్రలో నటిస్తుండగా, కేథరీన్, సచిన్ ఖేడేకర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్గా రూపొందుతోన్న ఈ చిత్రంలో నయనతార (శశిరేఖ), చిరంజీవి (వరప్రసాద్ పాత్రలో) భార్యాభర్తలుగా నటిస్తున్నారు. వెండితెరపై వీరిద్దరి మధ్య అనుబంధం ఎలా ఉంటుంది? అన్నది 'మీసాల పిల్ల...' అనే పాటలో చూపించారు. చాలా గ్యాప్ తర్వాత చిరంజీవి నటిస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఇది. అంతేకాదు... తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోలైన చిరంజీవి–వెంకటేశ్ కలిసి 'మన శంకరవరప్రసాద్గారు' చిత్రంలో నటస్తుండటంతో ఈ సినిమాపై ఫుల్ క్రేజ్ నెలకొంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన తొలి పాట 'మీసాల పిల్ల...', ద్వితీయ పాట 'శశిరేఖ...' ఏ స్థాయిలో శ్రోతలను అలరించాయో తెలిసిందే. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 2026 సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకువస్తోంది.

ఆదర్శ కుటుంబం హౌస్ నెం:47...

కుటుంబ కథా చిత్రాలతో ఫ్యామిలీ ఆడియన్స్ని., మరీ ముఖ్యంగా మహిళా ప్రేక్షకులను అలరించడంలో వెంకటేశ్ దిట్ట. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో తన కెరీర్లో ఓ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ని తన ఖాతాలో వేసుకున్నారాయన. అంతేకాదు... కెరీర్లో తొలిసారి రూ. 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డును సాధించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ తర్వాత వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47'. ఈ సినిమాకి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. హారిక– హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సినీ ప్రయాణంలో 77వ చిత్రంగా రూపొందుతోన్న ఈ సినిమాకి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' అనే టైటిల్ని ఖరారు చేసి, ఈ నెల 10న ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ''కుటుంబ కథా చిత్రాల కథానాయకుడిగా వెంకటేశ్కి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే చక్కిలిగింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. వీరిద్దరి కలయికలో రానున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా హాస్యం, భావోద్వేగాల మేళవింపుతో ఈ సినిమా వెండితెరపై వినోదాల విందుని అందించనుంది. వెంకటేశ్–త్రివిక్రమ్ కలయిక ప్రేక్షకులందరికీ చిరస్మరణీయమైన అనుభూతిని అందించడానికి సిద్ధమవుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'నారప్ప, దృశ్యం 2, ఎఫ్ 3, సైంధవ్, సంక్రాంతికి వస్తున్నాం' వంటి షార్ట్ టైటిల్స్ తర్వాత వెంకటేశ్ నటిస్తున్న బిగ్ టైటిల్ మూవీ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం:47'. ఈ చిత్రం 2026 వేసవిలో విడుదల కానుంది.

రవితేజ, డింపుల్ హయతి

పవన్ కల్యాణ్

భర్త మహాశయులకు విజ్ఞప్తి....

హీరో రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చేస్తున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. రవితేజ కెరీర్లో 76వ సినిమాగా రూపొందుతోన్న ఈ మూవీకి కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎస్ఎల్వీ సినిమాస్పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రామసత్యనారాయణ పాత్రలో నటిస్తున్నారు రవితేజ. ఇటీవల విడుదల చేసిన ఈ మూవీ టైటిల్ గ్లింప్స్ వీడియోలో.. ''నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, చాట్ జీపీటీ, జెమిని.. ఇలా అన్నింటినీ అడిగాను. మే బీ వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్లని ముఖ్యంగా మొగుళ్లని అడిగాను.. ఆశ్చర్యపోయారే తప్పా ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని, పెళ్లయిన వాళ్లకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ.. మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే... భర్త మహాశయులకు విజ్ఞప్తి'' అంటూ రవితేజ పలికిన సంభాషణలకు మంచి స్పందన వచ్చింది. ''చాలా రోజుల తర్వాత రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎంటర్టైనర్ చేయడం రిఫ్రెషింగ్గా ఉంది. అద్భుతమైన కామెడీ టైమింగ్, స్క్రీన్ ప్రెజెన్స్తో తన వెర్సటాలిటీని ప్రజెంట్ చేశారు రవితేజ. కిశోర్ తిరుమల టచ్తో ఈ టైటిల్ ఫ్యామిలీ ఫీలింగ్ కలిగించింది. మా సినిమా పక్కా ఎంటర్టైనింగ్గా, మనసుని హత్తుకునేలా ఉంటుంది. ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్కి సంక్రాంతి పర్ఫెక్ట్ సీజన్'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే... 'ధమాకా, మాస్ జాతర' వంటి చిత్రాల తర్వాత హీరో రవితేజ–సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కాంబినేషన్లో వస్తోన్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమా నుంచి విడుదలైన 'బెల్లా బెల్లా...', 'అద్దం ముందు నిలబడి అబద్ధం చెప్పలేనే...' వంటి పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. కాగా 'ఈగల్, మిస్టర్ బచ్చన్, మాస్ జాతర' వంటి చిన్న టైటిల్స్ సినిమాల తర్వాత రవితేజ నటిస్తున్న పెద్ద టైటిల్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమా 2026 సంక్రాంతి బరిలో నిలుస్తోంది.

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా

ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'గబ్బర్ సింగ్' (2012) సూపర్ హిట్ సాధించిన సంగతి తెలిసిందే. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్బస్టర్ మూవీ తర్వాత వీరి కలయికలో రూపొందుతున్న ద్వితీయ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి విడుదల చేసిన పవన్ కల్యాణ్ ప్రత్యేక పోస్టర్కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ నుంచి విడుదల చేసిన 'దేఖ్ లేంగే సాలా...' అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్కి మంచి స్పందన వచ్చింది. ఈ పాటను భాస్కరభట్ల రాయగా, విశాల్ దద్లానీ పాడారు. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాని 2026లో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

సంయుక్త, శర్వానంద్, సాక్షి వైద్య

నారీ నారీ నడుమ మురారి

బాలకృష్ణ హీరోగా శోభన, నిరోషా హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఎ. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో నరసింహ నాయుడు నిర్మించిన ఈ మూవీ 1990 ఏప్రిల్ 27న విడుదలై, సూపర్ హిట్గా నిలిచింది. ఈ మూవీ రిలీజైన ముప్పై ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఈ సినిమా ప్రస్తావన ఎందుకంటే.. 'నారీ నారీ నడుమ మురారి' పేరుతో శర్వానంద్ హీరోగా ఓ సినిమా తెరకెక్కింది. 'సామజవరగమన' మూవీ ఫేమ్ రామ్ అబ్బరాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంయుక్త, సాక్షీ వైద్య కథానాయికలు. ఏకే ఎంటర్టైన్మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ చిత్రంలో శర్వానంద్, సంయుక్త, సాక్షీ వైద్య బావా మరదల్లుగా నటించారట. మరి... ఇద్దరు మరదల్లు కలిసి బావని ఎలా ఆటపట్టించారు? ఈ బావా–మరదల్లు వెండితెరపై చేసిన సందడి ఏ స్థాయిలో నవ్వులు పంచింది? అన్నది తెలియాలంటే సినిమా విడుదల వరకు ఆగాల్సిందే. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'ఎక్స్ప్రెస్ రాజా' (2016', 'శతమానం భవతి' (2017) వంటి సినిమాలతో సంక్రాంతి బరిలో దిగి హిట్స్ అందుకున్న శర్వానంద్, 'నారీ నారీ నడుమ మురారి' సినిమాతో 2026 సంక్రాంతికి ముచ్చటగా మూడోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటం విశేషం. ''ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్గా రూపొందిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. జాయ్ ఫుల్ హిలేరియస్ రైడ్గా ఈ చిత్రం ఆడియన్స్ను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అనగనగా ఒకరాజు

'జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి సినిమాలతో ప్రేక్షకులకు తనదైన శైలిలో వినోదాలు పంచిన నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్గా రూపొందుతోన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన లుక్స్, ప్రోమోస్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రత్యేకించి సంక్రాంతి ప్రోమో అంటూ రిలీజ్ చేసిన నవీన్ లుక్ ఆకట్టుకుంది. బ్లూ అండ్ వైట్ కుర్తా, పైజామా ధరించి కళ్లజోడు పెట్టుకుని పక్కా సంక్రాంతి బుల్లోడిలా ఉన్నారు నవీన్. ఆయన బ్యాక్గ్రౌండ్లో జాయింట్ వీల్, భారీ ఎత్తున ప్రజలు ఉన్నారు. ఆ పోస్టర్ పక్కాగా సంక్రాంతి పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి నవంబరు 27న విడుదలైన 'భీమవరం బల్మా...' అంటూ సాగే పాటకి అద్భుతమైన స్పందన వచ్చినట్లు చిత్రయూనిట్ తెలిపింది. ''సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే సంక్రాంతికి సరైన సినిమాగా 'అనగనగా ఒక రాజు'ను రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించేలా మా చిత్రం ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే... ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల ప్రేక్షకులముందుకొస్తోంది.

దుల్కర్ సల్మాన్

మీనాక్షీ చౌదరి, నవీన్ పొలిశెట్టి

ఓం శాంతి శాంతి శాంతి

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది', 'కీడా కోలా' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు డైరెక్టర్ తరుణ్ భాస్కర్. దర్శకుడిగా తనకంటూ చక్కని గుర్తింపు సొంతం చేసుకున్న ఆయన నటుడిగా టర్న్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్న తరుణ్ భాస్కర్ లీడ్ రోల్లో నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా కథానాయికగా నటించారు. నూతన దర్శకుడు ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో ఎస్ ఒరిజినల్స్–మూవీవెర్స్ స్టూడియోస్పై సజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించారు. బ్రహ్మానందం, బ్రహ్మాజీ, సురభి ప్రభావతి, గోపరాజు విజయ్ ఇతర పాత్రలు పోషించారు. మలయాళ సినిమా 'జయ జయ జయ జయహే'కి తెలుగు రీమేక్గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాని తొలుత ఆగస్టు 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ విడుదల వాయిదా పడింది. 2026 జనవరి 23న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమాలో తరుణ్ భాస్కర్ ఓ వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా, ఈషా రెబ్బా కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయి పాత్ర చేశారు. ఇటీవల విడుదలైన ఈ మూవీ టీజర్కి మంచి స్పందన వచ్చింది. ''గ్రామీణ నేపథ్యంలో వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. అంబటి, ప్రశాంతిల పెళ్లి తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదాలు, గొడవలు ఆరంభమవుతాయి. ఈ సమయంలో కథ ఎలాంటి మలుపు తిరుగుతుంది?'' అనేది మా సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. మా మూవీ ఆడియన్స్ని తప్పకుండా ఎంటర్టైన్ చేస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఆకాశంలో ఒక తార

'మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్' వంటి సినిమాలతో హిట్స్ని తన ఖాతాలో వేసుకున్నారు దుల్కర్ సల్మాన్. అంతేకాదు... మలయాళ హీరో అయినప్పటికీ తెలుగు కథానాయకుడే అన్నట్లు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారాయన. మలయాళంలో స్టార్ హీరోల్లో ఒకరిగా దూసుకెళుతున్న ఆయన తెలుగులోనే కాదు తమిళ, హిందీ భాషల్లో సైతం మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. దుల్కర్ నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. సాత్విక వీరవల్లి హీరోయిన్గా నటిస్తున్నారు. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. జూలై 28న దుల్కర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఆకాశంలో ఒక తార' చిత్రం నుంచి విడుదల చేసిన గ్లింప్స్కి చక్కని స్పందన వచ్చినట్లు చిత్రబందం పేర్కొంది. దుల్కర్ సల్మాన్ ఓ సాధారణ రైతు పాత్ర చేశారు. ఓ పల్లెటూరికి చెందిన ఆయన అంతరిక్షంలోకి వెళ్లాలనే తన కలని ఎలా నెరవేర్చుకున్నాడు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుందని తెలుస్తోంది. ''సీతారామం, లక్కీ భాస్కర్, మహానటి' వంటి వరుస హిట్లతో టాలీవుడ్లో దూసుకెళుతున్న దుల్కర్ సల్మాన్.. 'ఆకాశంలో ఒక తార' సినిమాతో మరో హిట్ని తన ఖాతాలో వేసుకుంటారనే నమ్మకం ఉంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం మా సినిమాకి ప్లస్ అవుతుంది'' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు.

ఈ టైటిల్స్ మాత్రమే కాదు... ఇంకా లెంగ్తీ టైటిల్ ఉన్న చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

- దేరంగుల జగన్ మోహన్

ఓ మాయగా ఉన్నదే...

నయన్ సారిక, సమర్జీత్

''ఎవ్వరే నువ్వెవ్వరే
ఓ దేవత చెప్పవే, ఏమిటే ఇదేమిటే ఓ
మాయగా ఉన్నదే, ఏ శరానివో నీవు, ఏ స్వరానివో నీవు, ఏ వరానివో
నీవు, తేలే వీలే లేదే' అంటూ సాగుతుంది 'వృషభ' సినిమాలోని 'చిన్ని చిన్ని' సాంగ్. మోహన్లాల్ హీరోగా నటించిన హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'వృషభ'. సమర్జీత్ లంకేశ్, నయన్ సారిక, రాగిణి ద్వివేది, అజయ్, నేహా సక్సేనా, గరుడ రామ్ ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. తండ్రీకొడుకుల అనుబంధం, పునర్జన్మ వంటి ప్రధానాంశాలతో తెలుగు, మలయాళ భాషల్లో దర్శకుడు నందకిశోర్ ఈ సినిమాను తెరకెక్కించారు. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'చిన్ని చిన్ని..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సామ్ సీఎస్ సంగీతంలో కల్యాణ్ చక్రవర్తి లిరిక్స్ అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. ''నా ప్రయాణమే మారి, నీ పదాలలో చేరి, నా ప్రపంచమే నువ్వైతివే, ఎవ్వరే నువ్వెవ్వరే, నీ ఆలోచనే నా ఆలాపనైపోయో, చిన్ని, చిన్ని నా చిన్ని చిన్ని నా కన్నీ నువ్వే అయిపోయావే...' అంటూ సాగుతుందీ పాట. ఈ సినిమాకు సహ–నిర్మాత: విమల్ లహోటి.

కొత్త డాన్ తప్పకున్నాడా?

రణ్వీర్ సింగ్

'ధురంధర్' సినిమా బ్లాక్బస్టర్ సక్సెస్తో మంచి జోష్లో ఉన్నారు హీరో రణ్వీర్ సింగ్. అయితే 'డాన్ 3' సినిమా నుంచి రణ్వీర్ సింగ్ తప్పుకుంటున్నారనే టాక్ బాలీవుడ్లో చర్చనీయాంశంగా మారింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3' సినిమా రానున్నట్లుగా 2023 ఆగస్టు 9న ప్రకటన వచ్చింది. రితేష్ సిద్వానీ, ఫర్హాన్ అక్తర్ ఈ 'డాన్ 3' సినిమాను నిర్మిస్తారని, 2025లో ఈ సినిమా విడుదలవుతుందనేది ఆ అనౌన్స్మెంట్ సారాంశం. కానీ వివిధ కారణాల వల్ల రణ్వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3' సినిమా ఇంకా సెట్స్కు వెళ్లలేదు. 'ధురంధర్' సినిమా తర్వాత రణ్వీర్ సింగ్ నెక్ట్స్ మూవీ 'డాన్ 3' అని అందరూ అనుకున్నారు. కానీ రణ్వీర్ సింగ్ ఈ సినిమా నుంచి తప్పుకోవాలనుకుంటున్నారని బీ టౌన్ టాక్. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక 'డాన్ 3' సినిమా అనౌన్స్మెంట్ వచ్చినప్పుడు 'డాన్'గా రణ్వీర్ సింగ్ వెండితెరపై కరెక్ట్ కాదన్నట్లుగా కొంతమంది షారుక్ ఖాన్ అభిమానులు సోషల్ మీడియాలో విమర్శించారు (ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్లో వచ్చిన 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), 'డాన్ 2 (2011) చిత్రాల్లో షారుక్ ఖాన్ హీరోగా నటించారు). కానీ 'డాన్ 3'లో యాక్టర్గా తాను ప్రేక్షకులను మెప్పిస్తానని రణ్వీర్ సింగ్ రెస్పాండ్ అయ్యారు. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి ఆయన తప్పుకుంటున్నట్లు ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే... రణ్వీర్ సింగ్ కొత్త సినిమాకు 'ప్రళయ్' అనే టైటిల్ ఖరారైందని, ఇదొక జాంబీ ఫిల్మ్ అని, ఒక తండ్రి తన కుటుంబాన్ని ఎలా రక్షించుకుంటాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ టాక్.

బిజినెస్ రీల్

చైనా జేవీలో అరబిందో ఫార్మా వాటాల పెంపు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చైనా కంపెనీతో ఏర్పాటు చేసిన లువోక్సిన్ అరోవిటాస్ జాయింట్ వెంచర్‌లో అదనంగా 20 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఇందుకోసం 5.12 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 46 కోట్లు) వెచ్చించనున్నట్లు వివరించింది. దీనికోసం భాగస్వామి షాన్‌డాంగ్ లువోక్సిన్ ఫార్మా గ్రూప్‌తో తమ అనుబంధ సంస్థ హెలిక్స్ హెల్త్‌కేర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. మూడు నెలల వ్యవధిలో ఈ లావాదేవీ ముగియనుంది. జేవీలో హెలిక్స్‌కి 30 శాతం, షాన్‌డాంగ్‌కి 70 శాతం వాటాలు ఉన్నాయి. 2029 నాటికి 18.86 మిలియన్ డాలర్లతో మిగతా 50 శాతం వాటాను అరబిందో ఫార్మా కొనుగోలు చేసేందుకు ఆస్కారం ఉంది.

ఓయో ఐపీవోకు వాటాదారులు ఓకే

రూ. 6,650 కోట్ల సమీకరణకు ఓటు

న్యూఢిల్లీ: ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫామ్ ప్రిజమ్ పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు వాటాదారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తాజాగా నిర్వహించిన అసాధారణ సర్వసభ్య సమావేశం(ఈజీఎం)లో ఇందుకు అనుగుణంగా ఓటు వేసినట్లు ఓయో బ్రాండ్ కంపెనీ ప్రిజమ్ పేర్కొంది. ఐపీవోలో తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ. 6,650 కోట్లు సమీకరించేందుకు వాటాదారులు ఆమోదించినట్లు వెల్లడించింది. వెరసి తగిన సమయంలో లిస్టింగ్ సన్నాహాలకు తెరతీయనున్నట్లు తెలియజేసింది.

రిలయన్స్ కన్జూమర్ చేతికి 'ఉదయం'

న్యూఢిల్లీ: రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్) తాజాగా తమిళనాడుకి చెందిన ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్‌లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసింది. జాయింట్ వెంచర్ ఒప్పందం ప్రకారం కంపెనీలో ఆర్‌సీపీఎల్‌కి మెజారిటీ వాటాలు, సంస్థ గత ప్రమోటర్లు ఎస్. సుధాకర్, ఎస్. దినకర్‌లకు మైనారిటీ వాటాలు ఉంటాయి. ఈ డీల్‌తో ఆర్‌సీపీఎల్ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోలో ఉదయం బ్రాండ్ కూడా చేరినట్లయింది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను దశాబ్దాలుగా అందిస్తూ ఉదయం ఎంతో పేరొందిందని ఆర్‌సీపీఎల్ డైరెక్టర్ టి. కృష్ణకుమార్ తెలిపారు. ఉదయం బ్రాండ్ కింద బియ్యం, సుగంధ ద్రవ్యాలు, ప్యాకేజ్డ్ పప్పు ధాన్యాలు మొదలైన అమ్ముడవుతున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-12-2025

విశాఖ	702-00
చిత్తూరు	703-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	695-00
విజయవాడ	720-00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	675-00
వరంగల్	677-00
రిటైల్ ధర	7.35

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
COALINDIA	400.65	3.73
SHRIRAMFIN	957.5	2.42
ITC	408.85	1.53
ULTRACEMCO	11,682.00	1.3
TMPV	362.6	0.96

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,664.60	-1.48
BHARTIARTL	2,123.00	-1.15
ADANIPORTS	1,492.80	-1.05
SUNPHARMA	1,753.40	-0.93
TECHM	1,631.50	-0.92

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,427
ఎన్ఎస్ఈ	89,156
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,31,705
ఎఫ్ఐఐ	- 1,795
డీఐఐ	+ 3,812

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	58.29	$	58.01
బ్రెంట్	62.36	$	62.07

ఐటీ హైరింగ్ 16 శాతం అప్



- నియామకాల్లో జీసీసీల వాటా 27 శాతం
- ప్రోడక్ట్ సంస్థల్లో కూడా రిక్రూట్‌మెంట్స్
- 2025పై క్వెస్‌కార్ప్ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఈ ఏడాది హైరింగ్ మెరుగ్గా నమోదైంది. గతేడాదితో పోలిస్తే నియామకాలు 16 శాతం పెరిగాయి. 2025లో మొత్తం ఐటీ ఉద్యోగాల డిమాండ్ 18 లక్షలకు చేరినట్లు వర్క్‌ఫోర్స్, టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ క్వెస్ కార్ప్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రకారం ఐటీ హైరింగ్ మార్కెట్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) అత్యధికంగా 27 శాతం వాటా దక్కించుకున్నాయి. 2024లో నమోదైన 15 శాతంతో పోలిస్తే గణనీయంగా ఉద్యోగులను తీసుకున్నాయి. ఇక ప్రోడక్ట్, సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్) సంస్థలు కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో రిక్రూట్ చేసుకున్నాయి. అయితే, ఐటీ సర్వీసెస్, కన్సల్టింగ్ విభాగాల్లో మాత్రం నియామకాల వృద్ధి ఒక మోస్తరుగానే నమోదైంది. **నిధుల ప్రవాహం నెమ్మదించడంతో స్టార్టప్‌లలో హైరింగ్ కనిష్ట స్థాయి సింగిల్ డిజిట్‌కి** పడిపోయినట్లు నివేదిక వివరించింది. అప్పటికప్పుడు పూర్తి స్థాయి ఉద్యోగ విధులను నిర్వర్తించేందుకు సన్నద్ధంగా ఉన్న వారితో పాటు మిడ్ కెరియర్ ప్రొఫెషనల్స్ (4–10 ఏళ్ల అనుభవం) ఉన్నవారి ప్రాధాన్యం లభించింది. మొత్తం హైరింగ్‌లో వీరి వాటా 65 శాతానికి పెరిగింది. 2024లో ఇది 50 శాతం.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- మొత్తం డిమాండ్‌లో ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల్లో హైరింగ్ వాటా 15 శాతంగా ఉంది.
- కాంట్రాక్ట్ ఉద్యోగాలకు నియామకాలు మొత్తం ఐటీ హైరింగ్‌లో 10–11 శాతంగా నమోదయ్యాయి. 2024లో ఇది సుమారు 8 శాతంగా నిల్చింది. ఐటీలో నెలకొన్న డిమాండ్‌ని బట్టి చూస్తే ఐటీ కొలువుల్లో కాంట్రాక్ట్ నియామకాల వాటా పెరిగింది.
- ఏఐ, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీ నైపుణ్యాలు ఉన్న వారిపై కంపెనీలు ప్రధానంగా దృష్టి పెట్టాయి.
- వచ్చే ఏడాది (2026) ఆసాంతం ఐటీ హైరింగ్ ఇదే విధంగా ఉండొచ్చు. డిజిటల్‌లో స్పెషలైజ్డ్ **ఉద్యోగ విధులు, ద్వితీయ శ్రేణి నగరాల పరిధిని దాటి క్రమంగా విస్తరిస్తుండటం వంటి** అంశాలు ఇందుకు దన్నుగా ఉంటాయి. ఏఐ, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీ, డేటా ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ నెలకొనవచ్చు. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), తయారీ, సాస్, టెలికం రంగాల్లో నియామకాలు ఎక్కువగా ఉండొచ్చు.

సర్వీసుల్లో ఫ్రెషర్స్, మహిళల నుంచి దరఖాస్తుల వెల్లువ

సర్వీసుల ఆధారిత ఉద్యోగాలవైపు మహిళలు, ఫ్రెషర్స్ మొగ్గు చూపడంతో ఈ ఏడాది ఉద్యోగాలకు దరఖాస్తులు 29 శాతం పెరిగాయి. అప్నాడాట్‌కో నివేదిక ప్రకారం 9 కోట్లకు పైగా జాబ్ అప్లికేషన్లు వచ్చాయి. మెట్రోల పరిధిని దాటి హైరింగ్, డిజిటల్ రిక్రూట్‌మెంట్ సాధనాల వినియోగం పెరిగింది. ఫైనాన్స్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, హెల్త్‌కేర్ సపోర్ట్ ఉద్యోగాలకు మహిళల నుంచి దరఖాస్తులు 36 శాతం పెరిగి 3.8 కోట్లుగా నమోదయ్యాయి. ఇక సర్వీస్, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో ఫ్రెషర్ల నుంచి దరఖాస్తులు సుమారు 10 శాతం పెరిగాయి. అప్నాడాట్‌కో పోర్టల్‌లోని ఉద్యోగ దరఖాస్తుల డేటా విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

దీని ప్రకారం ఏటా 1 కోటి మంది యువతీ, యువకులు ఉద్యోగాల్లో చేరుతున్నారు. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), రిటైల్, లాజిస్టిక్స్, ఈ–కామర్స్, ఆరోగ్య సంరక్షణ, మొబిలిటీ, ఐటీ సర్వీసులు తదితర విభాగాల్లో ఉద్యోగాలకు డిమాండ్ నెలకొంది. చిన్న, మధ్య తరహా సంస్థల్లో (ఎస్ఎంబీ) జాబ్ పోస్టింగ్స్ 11 శాతం పెరిగి 10 లక్షలుగా నమోదైంది. అటు పెద్ద సంస్థల్లో జాబ్ పోస్టింగ్స్ 14 శాతం పెరిగి 4 లక్షలుగా నమోదయ్యాయి. ప్రథమ శ్రేణి నగరాల నుంచి సుమారు 2 కోట్ల దరఖాస్తులు, ద్వితీయ..తృతీయ శ్రేణి నగరాల నుంచి 1.8 కోట్ల అప్లికేషన్లు వచ్చాయి. మహిళల జీతభత్యాలు సగటున 22 శాతం పెరిగాయి.

15 లక్షలు సవరించిన ఐటీఆర్‌లు..

- అప్‌డేటెడ్ రిటర్నులు 21 లక్షలు
- రూ.2,500 కోట్ల పన్ను చెల్లింపులు
- ఆదాయపన్ను శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: ఆదాయపన్ను చెల్లింపుదారులు 2025–26 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి (2024–25 ఆర్థిక సంవత్సరం) 15 లక్షలకు పైగా సవరణ రిటర్నులు దాఖలు చేసినట్టు ఆదాయపన్ను శాఖ ప్రకటించింది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు లేదా స్వచ్ఛంద సంస్థలకు చేసిన విరాళాలపై తప్పుగా పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసుకున్న పన్ను చెల్లింపుదారులకు ఆదాయపన్ను శాఖ 'నడ్జ్' కార్యక్రమం ద్వారా సూచనలు పంపడం గమనార్హం. ఈ సూచనల ఆధారంగా పన్ను చెల్లింపుదారులు సవరణ రిటర్నులు సమర్పించేందుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఆదాయపన్ను శాఖ టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగిస్తూ, పన్ను ఎగవేతలను నిరోధించే దిశగా చర్యలు అమలు చేస్తుండడం తెలిసిందే. ఇక 21 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు అప్‌డేటెడ్ రిటర్నులు దాఖలు చేసి, రూ.2,500 కోట్ల మేర పన్నులు చెల్లించినట్టు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. పన్ను తగ్గింపులు, మినహాయింపులు అన్నవి చట్టప్రకారం సహేతుకంగా ఉంటే, వాటిపై చర్యలు ఉండవని స్పష్టం చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ రిటర్నులు సమర్పించేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉంది. ఇప్పటికే గడువులోపు రిటర్నులు దాఖలు చేసిన వారు, అందులో తప్పులను సరిచేస్తూ ఈ రిటర్నులు సమర్పించొచ్చు. జనవరి 1 నుంచి అయితే సవరణలతోపాటు, గడువులోపు రిటర్నులు దాఖలు చేయని వారు అప్‌డేటెడ్ రిటర్నులుగా సమర్పించాల్సి ఉంటుంది.

అంబుజాలో ఏసీసీ విలీనం

- అదే బాటలో ఓరియంట్ సిమెంట్
- దేశీ సిమెంట్ దిగ్గజంగా విలీన సంస్థ
- 10.7 కోట్ల టన్నుల వార్షిక సామర్థ్యం
- 2028కల్లా 15.5 కోట్ల టన్నులకు విస్తరణ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్‌లో అనుబంధ సంస్థలు ఏసీసీ, ఓరియంట్ సిమెంట్ విలీనంకానున్నాయి. తద్వారా ఒకే సిమెంట్ ప్లాట్‌ఫామ్‌సహా.. దేశవ్యాప్త సిమెంట్ పవర్‌హౌస్‌గా ఆవిర్భవించనుంది. విలీనం తదుపరి అంబుజాలో అనుబంధ సంస్థలు ఏసీసీ, ఓరియంట్, పెన్నా సిమెంట్‌తోపాటు సంఘీ ఇండస్ట్రీస్ భాగంకానున్నాయి. వెరసి అంబుజా సిమెంట్ సామర్థ్యం వార్షికంగా 10.7 కోట్ల టన్నులకు చేరనుంది. విలీన పథకానికి అంబుజా సిమెంట్స్ లిమిటెడ్(ఏసీఎల్) బోర్డు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అత్యంత సమర్థవంత కార్యకలాపాల నిర్వహణకు వీలు చిక్కనున్నట్లు ఏసీఎల్ పేర్కొంది. అంతేకాకుండా తయారీ, లాజిస్టిక్స్, పెట్టుబడుల వినియోగం మరింత బలపడనున్నట్లు తెలియజేసింది. వెరసి లాభదాయకత మెరుగుపడటం, సామర్థ్య విస్తరణకు దన్నుసహా.. దీర్ఘకాలంలో వాటాదారుల రాబడి పుంజుకోనున్నట్లు వివరించింది. ప్రస్తుత 10.7 కోట్ల టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2027–28కల్లా 15.5 కోట్ల టన్నులకు పెంచుకునే వ్యూహాత్మక ప్రణాళికలకు అనుగుణంగా తాజా విలీనాన్ని చేపట్టినట్లు అంబుజా తెలియజేసింది.

షేర్ల జారీ తీరిలా

విలీన పథకం ప్రకారం వాటాదారులకు రూ. 10 ముఖ విలువగల 100 ఏసీసీ షేర్లకు రూ. 2 ముఖ విలువగల 328 అంబుజా సిమెంట్స్ షేర్లు జారీ కానున్నాయి. ఈ బాటలో రూ. 1 ముఖ విలువగల 100 ఓరియంట్ సిమెంట్ షేర్లకు 33 అంబుజా సిమెంట్స్(రూ. 2 ముఖ విలువ) షేర్లు లభించనున్నాయి. ఏసీఎల్ ప్రస్తుతం ఏసీసీలో 50.05 శాతం, సీకే బిర్లా గ్రూప్ నుంచి సొంతం చేసుకున్న ఓరియంట్ సిమెంట్‌లో 72.66 శాతం, హైదరాబాద్ కంపెనీ పెన్నా సిమెంట్‌లో 99.94 శాతం, సంఘీ ఇండస్ట్రీస్‌లో 58.08 శాతం చొప్పున వాటాలు కలిగి ఉంది. సంఘీ, పెన్నా విలీనానికి గతేడాది డిసెంబర్‌లోనే ఏసీఎల్ బోర్డు ఆమోదముద్ర వేసింది. కాగా.. అన్ని కంపెనీల విలీనం తదుపరి అంబుజాలో ప్రమోటర్ల వాటా 67.65 శాతం నుంచి 60.94 శాతానికి దిగిరానుంది. ఓరియంట్ విలీనం 2025 మే 1నుంచి, ఏసీసీ విలీనం 2026 జనవరి 1నుంచి అమల్లోకిరానున్నాయి. ఏసీఎల్ ప్రమోటర్ అదానీ గ్రూప్ స్విస్ దిగ్గజం హోల్సిమ్ నుంచి అంబుజా సిమెంట్స్‌లో నియంత్రిత వాటాను 6.4 బిలియన్ డాలర్లకు(రూ. 51,000 కోట్లు) కొనుగోలు చేయడం ద్వారా 2022 సెప్టెంబర్‌లో సిమెంట్ రంగంలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే.

అయిదేళ్లలో 5 కొత్త ఈవీలు

- రూ. 18,000 కోట్ల పెట్టుబడులు
- టాటా మోటర్స్ ప్రణాళికలు

న్యూఢిల్లీ: వాహనాల తయారీ దిగ్గజం టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) వచ్చే అయిదేళ్లలో (2030 ఆర్థిక సంవత్సరం నాటికి) కొత్తగా అయిదు ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉంది. తద్వారా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో 45–50 శాతం మెజారిటీ వాటాను నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం రూ. 16,000 కోట్ల నుంచి 18,000 కోట్ల వరకు కంపెనీ ఇన్వెస్ట్ చేయనుంది. కొత్త ఉత్పత్తులతో పాటు దేశవ్యాప్తంగా చార్జింగ్ మౌలిక సదుపాయాలను 10 లక్షల పాయింట్లకు పెంచుకోవడంపై ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. టీఎంపీవీ ఎండీ శైలేష్ చంద్ర ఈ విషయాలు తెలిపారు. ఈవీల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వివిధ సెగ్మెంట్లలో వాహనాలను అందుబాటులోకి తెచ్చి, ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రధాన స్రవంతిలో భాగంగా మార్చడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది సియెరా ఈవీతో పాటు పంచ్ ఈవీ కొత్త వెర్షన్‌ని ప్రవేశపెడతామని వివరించారు.

వచ్చే ఏడాది అవిన్యా శ్రేణి ..

2026 ఆఖరు నాటికి అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రీమియం స్పోర్ట్స్ యుటిలిటీ ఈవీల శ్రేణి అవిన్యాని ఆవిష్కరిస్తామని చంద్ర చెప్పారు. దీని కోసం ప్రత్యేక రిటైల్ మాధ్యమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఎంట్రీ లెవెల్ ఈవీ సెగ్మెంట్ చాలా సవాళ్లతో కూడుకున్నదైనప్పటికీ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే క్రమంలో సదరు విభాగంపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు. కేవలం సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో కాకుండా జాతి నిర్మాణానికి దోహదపడేలా విద్యుదీకరణ లక్ష్యంతో టాటా గ్రూప్ పని చేస్తోందని చంద్ర వివరించారు. 2030 నాటికి మొత్తం ప్యాసింజర్ వాహనాల (పీవీ) మార్కెట్లో ఈవీల వాటా 15–20 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం తమ పీవీల అమ్మకాల్లో వీటి వాటా 17 శాతంగా ఉందని పేర్కొన్నారు. టాటా మోటర్స్ ఇప్పటివరకు 2.50 లక్షల ఈవీలను విక్రయించింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 17 లక్షల కోట్లు

- డిసెంబర్ 17 నాటికి 8 శాతం అధికం
- రిఫండుల్లో తగ్గిన వేగం

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఆశావహంగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ 17 నాటికి రూ.17.04 లక్షల కోట్ల నికర ఆదాయం వసూలైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో వచ్చిన ఆదాయం కంటే ఇది 8 శాతం ఎక్కువ. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల నుంచి ముందస్తు పన్ను చెల్లింపులు అధికం కావడం, రిఫండ్‌ల జారీ నిదానించడం వృద్ధికి దోహదపడింది. కార్పొరేట్ పన్ను నికర ఆదాయం 10.54 శాతం పెరిగి రూ.8.17 లక్షల కోట్లకు చేరింది. నాన్ కార్పొరేట్ పన్ను ఆదాయం (వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, వ్యాపార సంస్థలు) సైతం 6.37 శాతం పెరిగి రూ.8.47 లక్షల కోట్లు వసూలైంది. సెక్యూరిటీస్ లావాదేవీల రూపంలో పన్ను (ఎస్‌టీటీ) రూ.40,195 కోట్లుగా ఉంది. కార్పొరేట్ కంపెనీలు చెల్లించిన ముందస్తు పన్ను 8 శాతం అధికంగా రూ.6.07 లక్షల కోట్లుగా ఉంది. నాన్ కార్పొరేట్ ముందస్తు పన్ను వసూళ్లు మాత్రం 6.49 శాతం తగ్గి రూ.1.81 లక్షల కోట్లకు పరిమితమైంది. మొత్తం మీద స్థూల ముందస్తు పన్ను చెల్లింపులు 4.27% పెరిగి రూ.7.88 లక్షల కోట్లుగా ఉన్నాయి. పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రిఫండ్‌లు 14 శాతం తగ్గాయి. రూ.2.97 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లు సర్దుబాటు చేయకముందు చూస్తే స్థూల ప్రత్యక్ష పన్నుల ఆదాయం 4.16% పెరిగి రూ.20.01 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఆదాయపన్ను శాఖ డేటా తెలియజేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సంలో రూ.25.20 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల ఆదాయాన్ని రాబట్టుకోవాలన్న అంచనాను బడ్జెట్‌లో ప్రభుత్వం నిర్దేశించుకుంది.

రూ.10 లక్షల కోట్లు దాటనున్న గృహ రుణాలు

- ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి
- గత నెలలోనే రూ.9 లక్షల కోట్లకు

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ తన గృహ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.10 లక్షల కోట్లను దాటనున్నట్టు ప్రకటించింది. ''ఇప్పుడు ఎస్‌బీఐ గృహ రుణ పోర్ట్‌ఫోలియో రూ.9 లక్షల కోట్లకు పైనే ఉంది. బ్యాంక్‌లో ఇది అతిపెద్ద రుణ విభాగం. మా మొత్తం రుణ ఆస్తుల్లో 20 శాతానికి పైనే ఉంటాయి. 14 శాతం వృద్ధి రేటు ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ గృహ రుణాల పోర్ట్‌ఫోలియో రూ.10 లక్షల కోట్లు దాటుతుంది''అని శెట్టి వివరించారు. బలమైన డిమాండ్, సానుకూల వడ్డీ రేట్లు (కనిష్ట స్థాయిలో) వృద్ధికి మద్దతుగా ఉన్నట్టు చెప్పారు. ఎస్‌బీఐ గృహ రుణాల పోర్ట్‌ఫోలియో గత నెలలోనే రూ.9 లక్షల కోట్లు దాటడంతో దేశంలోనే అతిపెద్ద మార్ట్‌గేజ్ రుణదాతగా నిలవడం గమనార్హం. 2024–25లో ఎస్‌బీఐ గృహ రుణాల పోర్ట్‌ఫోలియో 14.4 శాతం పెరిగి రూ.8.31 లక్షల కోట్లకు చేరింది. 2011 మార్చి నాటికి రూ.లక్ష కోట్లు మార్క్‌నకు చేరగా, అక్కడి నుంచి నాలుగున్నరేళ్లకే (2025 నవంబర్) రూ. 9 లక్షల కోట్లను దాటేయడం వేగవంతమైన వృద్ధిని సూచిస్తోంది. గృహ రుణ విభాగంలో వసూలు కాని మొండి బకాయిలను (ఎన్‌పీఏలు) ఒక శాతంలోపునకే కట్టడి చేస్తోంది. 2025 మార్చి నాటికి మొత్తం గృహ రుణాల్లో స్థూల ఎన్‌పీఏలు 0.72 శాతంగా ఉండడం గమనించొచ్చు.

ఎన్‌సీడీఈఎక్స్ 'మ్యూచువల్ ఫండ్స్ ప్లాట్‌ఫామ్'

ప్రారంభించేందుకు సెబీ అనుమతి

న్యూఢిల్లీ: నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్‌సీడీఈఎక్స్) మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీల కోసం ప్లాట్‌ఫామ్ ప్రారంభించేందుకు సెబీ సూత్రప్రాయ ఆమోదాన్ని తెలిపింది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు, ఆ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు ఈ ప్లాట్‌ఫామ్ వీలు కల్పించనుంది. కొనుగోలు, విక్రయ లావాదేవీల క్లియ రింగ్, సెటిల్‌మెంట్‌ను ఎన్‌సీడీఈఎక్స్ సబ్సిడరీ అయిన నేషనల్ కమోడిటీ క్లియరింగ్ లిమిటెడ్ చూడనుంది.

ఐదు 'వేదాంత'లు

- సొంతంగా ఎదిగే సామర్థ్యాలు
- మార్చి నాటికి డీమెర్జర్ పూర్తి
- సంస్థ చైర్మన్ అనిల్ అగర్వాల్



న్యూఢిల్లీ: వేదాంత త్వరలో ఐదు కంపెనీలుగా విడిపోనుండగా.. విడిగా ప్రతీ కంపెనీ ఒక వేదాంత స్థాయికి ఎదిగే సామర్థ్యాలున్నట్టు సంస్థ చైర్మన్ అనిల్ అగర్వాల్ పేర్కొన్నారు. వేదాంతలో ప్రస్తుతమున్న అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, ఐరన్ అండ్ స్టీల్, విద్యుత్ వ్యాపారాలను విడిగా స్టాండలోన్ కంపెనీలుగా విడదీసి, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసే ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలపడం తెలిసిందే. డీమెర్జర్ అనంతరం ఈ నాలుగు కంపెనీలతోపాటు వేదాంత ఎప్పటి మాదిరే కొనసాగనుంది. బేస్ మెటల్స్ వ్యాపారం (కాపర్ తదితర)తోపాటు హిందుస్థాన్ జింక్‌కు మాతృ సంస్థగా వేదాంత ఉంటుంది. విడిగా ఒక్కో వ్యాపారానికి పెరుగుతున్న బలమైన డిమాండ్ కారణంగానే వాటి విక్రయానికి బదులు డీమెర్జర్ (వేరు చేయడం)ను ఎంచుకున్నట్టు అగర్వాల్ తెలిపారు. ''వేదాంత ఒక మర్రిచెట్టు. ప్రతీ వ్యాపారం విడిగా మర్రిచెట్టుగా మారేంత సామర్థ్యాలున్నాయి''అని చెప్పారు. డీమెర్జర్ ప్రక్రియ వచ్చే మూడు, నాలుగు నెలల్లో ముగుస్తుందని, 2026 మార్చిలోపు ముగించాలన్న లక్ష్యం పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. వేదాంత వాటాదారులకు వారివద్దనున్న ప్రతి షేరుకు కొత్తగా లిస్టయ్యే కంపెనీలో ఒక షేరు లభించనుంది. ప్రపంచవ్యాప్తంగా బడా మైనింగ్ కంపెనీలు జింక్, అల్యూమినియం, వెండి, ఐరన్ ఓర్ ఇలా ప్రతీ వ్యాపారాన్ని స్వతంత్ర కంపెనీలుగా నిర్వహిస్తున్నట్టు అగర్వాల్ చెప్పారు. అంతర్జాతీయ నమూనాకు అనుగుణంగానే వేదాంత డీమెర్జర్‌ను ఎంచుకున్నట్టు తెలిపారు. రూ.48,000 కోట్ల రుణ భారాన్ని.. కంపెనీలవారీగా ఉన్న నగదు ప్రవాహాలకు అనుగుణంగా కేటాయిస్తామని చెప్పారు. ప్రతీ కంపెనీకి స్వతంత్ర బోర్డు, నిపుణులైన యాజమాన్యం ఉంటుందని, ప్రమోటర్లు అయిన తాము అన్నింటిలోనూ 50% వాటాను కొనసాగిస్తామన్నారు. రోజువారీ కార్యకలాపాల్లో తమ జోక్యం ఉండదని స్పష్టం చేశారు.

వెండి ఉత్పత్తి నాలుగు రెట్లు అధికం

జింక్ ఉత్పత్తిని రానున్న రోజుల్లో మరింత పెంచడం ద్వారా ప్రపంచంలో అతిపెద్ద కంపెనీల్లో ఒకటిగా మారాలని అనుకుంటున్నట్టు అగర్వాల్ ప్రకటించారు. వెండి ఉత్పత్తిని ప్రస్తుతమున్న 700 టన్నులు (వార్షిక ఉత్పత్తి) నుంచి 3,000 టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. చమురు ఉత్పత్తిని స్వల్ప కాలంలో రోజుకు మూడు లక్షల బ్యారెళ్లు, ఐదేళ్లలో మిలియన్ బ్యారెళ్లకు పెంచుకోనున్నట్టు తెలిపారు. విద్యుదుత్పత్తి 20వేల మెగావాట్ల లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు చెప్పారు. భవిష్యత్తులోనూ వాటాదారులకు డివిడెండ్ పంపిణీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

రిత్విక్ స్థానం పదిలం

- శ్రీరామ్ బాలాజీపై వేటు
- నెదర్లాండ్స్‌తో డేవిస్‌కప్ క్వాలిఫయర్స్ మ్యాచ్ కోసం భారత జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే డేవిస్ కప్ పురుషుల ప్రపంచ టీమ్ టెన్నిస్ టోర్నీ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ తొలి రౌండ్‌లో పోటీ పడే భారత జట్టును ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన డబుల్స్ స్పెషలిస్ట్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బెంగళూరు వేదికగా జరిగే క్వాలిఫయర్స్ తొలి రౌండ్‌లో నెదర్లాండ్స్ జట్టుతో భారత్ తలపడుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో స్విట్జర్లాండ్ జట్టుతో జరిగిన వరల్డ్ గ్రూప్–1 మ్యాచ్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన డబుల్స్ స్పెషలిస్ట్ శ్రీరామ్ బాలాజీ ఈసారి జట్టులో స్థానం కోల్పోయాడు. సింగిల్స్ మ్యాచ్‌ల కోసం భారత నంబర్‌వన్, ప్రపంచ 277వ ర్యాంకర్ సుమిత్ నగాల్, ప్రపంచ 471వ ర్యాంకర్ కరణ్ సింగ్, ప్రపంచ 524వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ సురేశ్‌లను ఎంపిక చేశారు. డబుల్స్ మ్యాచ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ యూకీ బాంబ్రీ, ప్రపంచ 90వ ర్యాంకర్ రిత్విక్ కలిసి ఆడతారు. 'భవిష్యత్ అవసరాలదృష్ట్యా యువ ఆటగాళ్లను ఎంపిక చేయాలని సెలెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. శ్రీరామ్ బాలాజీ మంచి ఆటగాడే కానీ అతనిలో దూకుడు తక్కువగా ఉందని సెలెక్షన్ కమిటీ భావించింది' అని భారత టెన్నిస్ జట్టు కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ వివరించారు. హైదరాబాద్‌కే చెందిన మరో డబుల్స్ స్పెషలిస్ట్ అనిరుధ్ చంద్రశేఖర్‌తోపాటు ఆర్యన్ షా, దిగ్విజయ్ సింగ్‌లను రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. బెంగళూరులో నిర్వహించే శిక్షణ శిబిరానికి ప్రాక్టీస్ పార్ట్‌నర్‌లుగా ప్రజ్వల్ దేవ్, అర్ణవ్ పాపర్కర్ హాజరవుతారని రాజ్‌పాల్ తెలిపారు.

సౌత్‌జోన్ అక్వాటిక్స్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం

సాక్షి, హైదరాబాద్: సౌత్ జోన్ సబ్ జూనియర్, సబ్ జూనియర్ అక్వాటిక్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తారు. 2008 నుంచి 2017లోపు జన్మించిన వారు ఈ ఈవెంట్‌లోని వివిధ వయో విభాగాల్లో పోటీపడవచ్చని తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

దేశవాళీల్లో సూపర్ స్టార్‌లు

బరిలోకి దిగనున్న కోహ్లి, రోహిత్
- నేటి నుంచి విజయ్ హజారే వన్డే టోర్నీ
- నాలుగు నగరాల్లో మ్యాచ్‌లు
- ఢిల్లీతో ఆంధ్ర తొలి పోరు
- ఉత్తరప్రదేశ్‌తో హైదరాబాద్ 'ఢీ'

డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక (ఫైల్)



బెంగళూరు: ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీకి రంగం సిద్ధమైంది. జాతీయ జట్టులో ఎంపికకు పరిగణనలోకి తీసుకోవాలంటే దేశవాళీ టోర్నీల్లో తప్పక ఆడాల్సిందే అనే నిబంధనల నేపథ్యంలో... స్టార్ ఆటగాళ్లు సైతం ఈ టోర్నీ బరిలోకి దిగనున్నారు. టి20, టెస్టు ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన భారత స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతో పాటు శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ వంటి పలువురు టీమిండియా ప్లేయర్లు తమ రాష్ట్రాల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. 'కింగ్' కోహ్లి విజయ్ హజారే టోర్నీలో ఆడి దాదాపు 16 సంవత్సరాలు అవుతోంది. కోహ్లి చివరగా ఈ టోర్నీ బరిలోకి దిగిన సమయంలో టీమిండియా రెండోసారి వన్డే ప్రపంచకప్ గెలవలేదు... క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ టీమిండియా ఓపెనర్‌గా కొనసాగుతున్నాడు... మహేంద్ర సింగ్ ధోనీ భారత టెస్టు జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు... రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ భారత మిడిలార్డర్‌లో పరుగుల వరద పారిస్తున్నారు! తొలిసారి ఈ టోర్నీ ఆడే సమయానికి భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకోని కోహ్లి... ఆ తర్వాత ఇన్నేళ్లలో ఎప్పుడూ తిరిగి విజయ్ హజారే టోర్నీలో ఆడలేదు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న కోహ్లి... 2027 వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగాలనుకుంటున్న నేపథ్యంలో... ఫామ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు ఈ టోర్నీ తొలి దశ మ్యాచ్‌లు ఆడనున్నట్లు వెల్లడించాడు. ఇటీవల స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు ఒక హాఫ్‌సెంచరీతో మూడొందలకు పైగా పరుగులు చేసిన విరాట్... అదే జోరు దేశవాళీల్లోనూ కొనసాగిస్తాడా చూడాలి. ఇక 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ 2017–18లో చివరగా విజయ్ హజారే ట్రోఫీలో ఆడాడు.

- మొత్తం 32 ఎలైట్ జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో ఎనిమిదేసి జట్లు ఉన్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో... ఒక్కో జట్టు మిగిలిన ఏడు జట్లతో తలపడుతుంది. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.
- బెంగళూరు, జైపూర్, రాజ్‌కోట్, అహ్మదాబాద్... ఈ నాలుగు వేదికల్లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నా... ఈ ఏడాది ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సందర్భంగా జరిగిన విజయోత్సవ వేడుకల్లో భాగంగా జరిగిన తొక్కిసలాటలో 10 మందికి పైగా అభిమానులు మృతిచెందడంతో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి లభించలేదు.
- ఈ టోర్నీలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా... గ్రూప్ 'డి' మ్యాచ్‌లు బెంగళూరులో జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కోహ్లిని చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఎగబడే అవకాశం ఉండటంతో పోలీసులు మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదు. దీంతో బుధవారం ఢిల్లీ, ఆంధ్ర మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానానికి తరలించారు.
- గతంలో విరాట్ రంజీ ట్రోఫీలో బరిలోకి దిగినప్పుడు ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్ల మైదానం అభిమానులతో నిండిపోయింది. అందుకే ముందు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నారు.
- ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొట్టిన రోహిత్ శర్మ... దక్షిణాఫ్రికాపై సైతం మంచి ఇన్నింగ్స్‌లు ఆడాడు. కెరీర్‌ను పొడిగించుకోవాలనే లక్ష్యంతోనే భారీగా బరువు తగ్గిన 'హిట్‌మ్యాన్' ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడో చూడాలి. తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా సిక్కిం, గోవాతో ముంబై తలపడనుంది.
- టీమిండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై కూడా అందరి దృష్టి నిలవనుంది. ఏడాది కాలంగా విఫలమవుతున్న సూర్యకుమార్... వచ్చే ఏడాది ఆరంభంలో న్యూజిలాండ్‌తో సిరీస్ వరకు లయ అందుకునేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగపడనుంది.
- ఈ ఏడాది టి20ల్లో సూర్యకుమార్ సగటు 12.84 కాగా... స్ట్రయిక్ రేట్ 117.87. ఇది అతడి స్థాయికి ఏమాత్రం తగినది కాదు. గత 22 ఇన్నింగ్స్‌ల్లో అతడు ఒక్క అర్ధశతకం కూడా నమోదు చేసుకోలేదు. అయితే వచ్చే ఏడాది టి20 వరల్డ్‌కప్ జట్టుకు సారథ్యం వహించే అవకాశం దక్కించుకున్న సూర్య... మెగా టోర్నీకి ముందు విజయ్ హజారే టోర్నీ ద్వారా ఫామ్‌లోకి రావాలని భావిస్తున్నాడు.
- కోహ్లి ప్రాతినిధ్యం వహిస్తున్న ఢిల్లీ జట్టుకు రిషభ్ పంత్ సారథ్యం వహించనున్నాడు. విరాట్ ఆరంభ మ్యాచ్‌లు మాత్రమే ఆడనుండగా... రిషభ్ టోర్నీ మొత్తం అందుబాటులో ఉండనున్నాడు. ప్రస్తుతం కేవలం భారత టెస్టు జట్టులోనే కొనసాగుతున్న పంత్... పరిమిత ఓవర్లలో పునరాగమనం చేసేందుకు ఈ టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడనుంది.
- ఇటీవల జరిగిన దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అద్వితీయ ప్రదర్శనతో జార్ఖండ్ జట్టుకు టైటిల్ అందించిన యువ ఓపెనర్ ఇషాన్ కిషన్... ఈ ఆటతీరులో వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇప్పుడతడు... విజయ్ హజారేలో సైతం అదే దూకుడు కొనసాగించాలని భావిస్తున్నాడు.
- గతేడాది ఈ టోర్నీలో పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్ డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. 2024–25 సీజన్‌లో అతడు 8 ఇన్నింగ్స్‌ల్లో 389.5 సగటుతో 779 పరుగులు చేశాడు. అందులో ఆరు సెంచరీలు సైతం ఉన్నాయి. దీంతో పాటు రంజీల్లోనూ రాణించిన అతడికి ఎనిమిదేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులో చోటు దక్కింది.
- ఐపీఎల్ మినీ వేలం ముగిసినప్పటికీ... ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేసిన ప్లేయర్లపై ఫ్రాంచైజీలు దృష్టి సారించడం ఖాయం. గతంలో ఈ టోర్నీ ఆటతీరు ఆధారంగా... స్మరణ్, మయాంక్ ఐపీఎల్ అవకాశాలు దక్కించుకున్నారు.
- ఫలితాలపై వాతావరణం ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో మ్యాచ్‌లన్నీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా షెడ్యూల్ రూపొందించారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసే జట్టుపై ఎలాంటి మంచు ప్రభావం పడే అవకాశం లేదు.
- ఇక టి20 వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌పై కూడా అందరి దృష్టి నిలవనుంది. అభిషేక్ శర్మ సారథ్యంలో పంజాబ్ జట్టు తరఫున గిల్ బరిలోకి దిగనున్నాడు.
- ప్రస్తుతం భారత జట్టులో పేస్ బౌలర్ల లోటు స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై పని భారం ఎక్కువవుతుండగా... ఇతర పేసర్లు నిలకడలేమితో ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్ స్పీడ్ స్టార్ మొహమ్మద్ సిరాజ్‌ను సెలెక్టర్లు కేవలం టెస్టు ఫార్మాట్‌కే పరిమితం చేసినట్లు కనిపిస్తోంది. మరి ఈ నేపథ్యంలో తదుపరి తరం పేసర్లు ఎవరనేదానికి ఈ టోర్నీ ద్వారా సమాధానం లభిస్తుందా చూడాలి. గుర్‌జపనీత్ సింగ్ (తమిళనాడు), గుర్‌నూర్ బ్రార్ (పంజాబ్), యుధ్‌వీర్ సింగ్ (జమ్మూ కశ్మీర్), అనూజ్ (హరియాణా), షకీబ్ హుసేన్ (బిహార్) రూపంలో పలువురు యువ పేసర్లు ఈ టోర్నీలో ఆడనున్నారు.

హైదరాబాద్ X ఉత్తర ప్రదేశ్

ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా రాజ్‌కోట్‌లో జరగనున్న మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌తో హైదరాబాద్ జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీలో హైదరాబాద్ జట్టుకు రాహుల్ సింగ్ సారథ్యం వహిస్తుండగా... రాహుల్ బుద్ధి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన చేసి... సునాయాసంగా 'సూపర్ లీగ్'కు చేరిన హైదరాబాద్... చివరి మ్యాచ్‌లో పరాజయంతో ఫైనల్ ఆడే అవకాశం కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని హైదరాబాద్ భావిస్తోంది. కెప్టెన్ రాహుల్ సింగ్‌తో పాటు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, అమన్ రావు, అభిరథ్ రెడ్డి, కార్తికేయ, రక్షణ్ సమష్టిగా సత్తా చాటాల్సిన అవసరముంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో జట్టులో ప్రియం గార్గ్, ధ్రువ్ జురెల్, కార్తీక్ త్యాగి, సమీర్ రిజ్వీ, రింకూ సింగ్ కీలకం కానున్నారు.

ఆంధ్ర జట్టుకు లక్కీ చాన్స్

ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం జరగనున్న తొలి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు... స్టార్‌లతో నిండి ఉన్న ఢిల్లీ టీమ్‌తో తలపడనుంది. బెంగళూరు వేదికగా జరగనున్న మ్యాచ్‌లో విరాట్ కోహ్లి, రిషభ్ పంత్‌తో కూడిన ఢిల్లీ జట్టుపై మెరుగైన ప్రదర్శన చేయాలని ఆంధ్ర జట్టు భావిస్తోంది. ఈ మ్యాచ్‌పై అందరి దృష్టి నిలవనున్న నేపథ్యంలో... మనవాళ్లు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారనేది ఆసక్తికరం. టీమిండియా పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆంధ్ర జట్టుకు సారథ్యం వహిస్తుండగా... శ్రీకర్ భరత్, రికీ భుయ్, అశ్విన్ హెబ్బర్, షేక్ రషీద్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. సత్యనారాయణ రాజు, వినయ్, స్టీఫెన్ బౌలింగ్ భారం మోయనున్నారు.

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా జెమీమా

జెమీమాకు జెర్సీ అందజేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ్ జిందాల్

న్యూఢిల్లీ: టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి కెప్టెన్‌గా ఎంపికైంది. భారత జట్టు తొలిసారి ఐసీసీ వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన జెమీమాకు ఢిల్లీ జట్టు పగ్గాలు అప్పగిస్తున్నట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది. వరల్డ్‌కప్ సెమీఫైనల్లో జెమీమా వీరోచిత సెంచరీ సాధించడంతో టీమిండియా ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. 'ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనుండటం గౌరవంగా భావిస్తున్నా. నా మీద నమ్మకముంచిన జట్టు యాజమాన్యానికి కృతజ్ఞతలు. ఈ ఏడాది నాకు ఎంతో బాగా సాగింది. వరల్డ్‌కప్ గెలిచిన ఆనందంలో ఉన్న సమయంలోనే ఈ వార్త నా సంతోషాన్ని రెట్టింపు చేసింది. మూడేళ్లుగా ఇదే జట్టుతో సాగుతున్నా. ఎంతో నేర్చుకున్నా. గత మూడు సార్లు ఫైనల్ చేరినా ట్రోఫీ చేజిక్కించుకోలేకపోయాం. ఈ సారి ఆ గెలుపు గీత దాటుతాం'అని జెమీమా పేర్కొంది. డబ్ల్యూపీఎల్ ఆరంభం నుంచి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ప్రాతినిధ్యం వహిస్తున్న జెమీమా... 27 మ్యాచ్‌లాడి 139.67 స్ట్రయిక్ రేట్‌తో 507 పరుగులు చేసింది. లీగ్‌లో ఇప్పటి వరకు మూడుసార్లు ఢిల్లీ జట్టు ఫైనల్‌కు చేరగా... మూడింట్లోనూ జెమీమా ఆడింది. గతంలో ఢిల్లీ జట్టుకు మెగ్ లానింగ్ కెప్టెన్‌గా వ్యవహరించింది. వచ్చే ఏడాది జరగనున్న డబ్ల్యూపీఎల్‌లో తమ తొలి మ్యాచ్‌లో జనవరి 10న ముంబై ఇండియన్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.

ఈజిప్ట్ బోణీ

సలా

రబాట్: ఆఫ్రికా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ ఈజిప్ట్ శుభారంభం చేసింది. జింబాబ్వే జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఈజిప్ట్ 2–1తో గెలుపొందింది. ఈజిప్ట్ తరఫున స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలా (90+1వ నిమిషం), మర్మూష్ (64వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... జింబాబ్వే జట్టుకు డుబె (20వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఇదే గ్రూప్‌లోని మరో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 2–1తో అంగోలా జట్టును ఓడించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మాలి, జాంబియా జట్ల మధ్య మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. గ్రూప్ 'డి'లో జరిగిన మ్యాచ్‌ల్లో డీఆర్ కాంగో 1–0తో బెనిన్ జట్టుపై, సెనెగల్ 3–0తో బోట్స్‌వానా జట్టుపై విజయం సాధించాయి.

కమిన్స్‌కు విశ్రాంతి

లయన్ స్థానంలో టాడ్ మర్ఫీ ● ఇంగ్లండ్‌తో 'బాక్సింగ్' డే టెస్టుకు ఆస్ట్రేలియా జట్టు

లయన్



కమిన్స్

మెల్‌బోర్న్: సొంతగడ్డపై సంపూర్ణ ఆధిపత్యంతో ఇప్పటికే 'యాషెస్' సిరీస్ నిలబెట్టుకున్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు 'బాక్సింగ్ డే' టెస్టుకు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు విశ్రాంతినిచ్చింది. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆడిన తొలి మూడు టెస్టుల్లోనూ గెలిచిన ఆసీస్ ఇప్పటికే 3–0తో సిరీస్ దక్కించుకోగా... శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య నాలుగో మ్యాచ్ ప్రారంభం కానుంది. దీని కోసం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మంగళవారం 15 మందితో జట్టును ప్రకటించింది. మూడో టెస్టు విజయంలో కీలక పాత్ర పోషించిన స్పిన్నర్ లయన్ గాయంతో ఇబ్బంది పడుతుండటంతో అతడి స్థానంలో టాడ్ మర్ఫీని ఎంపిక చేశారు. ఇక కమిన్స్ గైర్హాజరీలో మరోసారి స్టీవ్ స్మిత్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. గాయం కారణంగా కమిన్స్ ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు సైతం దూరం కాగా... అప్పుడు కూడా స్మిత్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. కునేమన్, కోరె రోకిసియోలి జట్టులో చోటు దక్కించుకోగా... ఫాస్ట్ బౌలర్ జే రిచర్డ్‌సన్ నాలుగేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చాడు. లయన్ మూడో టెస్టు మ్యాచ్‌లో బౌండరీ వద్ద బంతిని ఆపే క్రమంలో గాయపడ్డాడు. 2023 'యాషెస్' సిరీస్‌లో సైతం లయన్ గాయం కారణంగా రెండు మ్యాచ్‌లకు దూరం కాగా... మర్ఫీకి అవకాశం దక్కింది.

గ్లోబల్ చెస్ లీగ్ విజేత అల్పైన్ ఎస్‌జీ పైపర్స్

ముంబై: 'హ్యాట్రిక్' సాధించాలని ఆశించిన త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టుకు చుక్కెదురైంది. టెక్ మహీంద్రా గ్లోబల్ చెస్ లీగ్‌లో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టు కొత్త చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జరిగిన ఫైనల్లో అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ 2–0 (4–2; 4.5–1.5) పాయింట్ల తేడాతో తొలి రెండు ఎడిషన్స్‌లో టైటిల్ నెగ్గిన త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ జట్టును బోల్తా కొట్టించింది. అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టులో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, లియోన్ ల్యూక్ మెండోంకా, కరువానా (అమెరికా), హు ఇఫాన్ (చైనా), అనీశ్ గిరి (నెదర్లాండ్స్), నినో బతియాష్‌విలి (జార్జియా) సభ్యులుగా ఉన్నారు. తొలి ర్యాపిడ్ మ్యాచ్‌లో అల్పైన్ జట్టు 4–2తో త్రివేణి జట్టును ఓడించింది. రెండో ర్యాపిడ్ మ్యాచ్‌లో అల్పైన్ జట్టు 4.5–1.5తో త్రివేణి జట్టును మళ్లీ ఓడించి టైటిల్‌ను ఖరారు చేసుకుంది. కాంటినెంటల్ కింగ్స్ జట్టులో అలీరెజా (ఫ్రాన్స్), వె యి (చైనా), విదిత్ (భారత్), జు జినెర్ (చైనా), కొస్టెనిక్ (స్విట్జర్లాండ్), మౌరిజి (ఫ్రాన్స్) సభ్యులుగా ఉన్నారు. మూడో స్థానం మ్యాచ్‌లో పీబీజీ అలాస్కన్ నైట్స్ 3–1 (2–4; 3.5–2.5; 3.5–2.5; 4–2)తో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టుపై నెగ్గింది. పీబీజీ అలాస్కన్ నైట్స్ జట్టులో గుకేశ్ దొమ్మరాజు, అర్జున్ ఇరిగేశి (భారత్), కాటరీనా లాగ్నో (ఉక్రెయిన్), సారా ఖాదెమ్ (స్పెయిన్), లెనియర్ (అమెరికా), డేనియల్ దర్దా (బెల్జియం) సభ్యులుగా ఉన్నారు.

ఏసు క్రీస్తు జన్మస్థలంగా భావించే వెస్ట్ బ్యాంక్‌లోని బెత్లెహెమ్ నగరంలోని చర్చ్ ఆఫ్ నేటివిటీ మాంగెర్ స్క్వేర్‌లో క్రిస్మస్ ట్రీ వద్ద పర్యాటకుల సందడి

రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటైన సంతలో క్రిస్మస్ ట్రీలను పరిశీలిస్తున్న మహిళ

రబీ సాగు.. భలే జోరు!

గతేడాదితో పోలిస్తే 8 లక్షల హెక్టార్లు పెరిగిన విస్తీర్ణం

- దేశవ్యాప్తంగా 5.80 కోట్ల హెక్టార్లలో రబీ పంటలు
- సెనగ సాగులో సరికొత్త రికార్డు.. పప్పుధాన్యాల సాగులో భారీ పెరుగుదల
- ఆశాజనకంగా గోధుమ, వరి.. నూనెగింజలకూ మంచి డిమాండ్
- కేంద్ర వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రబీ సీజన్ సాగు జోరందుకుంది. వాతావరణం అనుకూలించడం, జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు ఉత్సాహంగా సాగు పనులు చేపట్టారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది డిసెంబర్ 19 నాటికి అందిన సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా మొత్తం 5.80 కోట్ల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయానికి ఇది 5.72 కోట్ల హెక్టార్లుగా ఉండగా, ఈసారి అదనంగా 8.12 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేయడం విశేషం. ఈ మేరకు మంగళవారం కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

పప్పుధాన్యాలపై పెరిగిన మక్కువ

ఈ సీజన్‌లో రైతులు పప్పుధాన్యాల సాగు వైపు ఎక్కువగా మొగ్గు చూపినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పప్పుధాన్యాల మొత్తం సాగు విస్తీర్ణం 126.74 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది ఇది 123.01 లక్షల హెక్టార్లు మాత్రమే. అంటే సుమారు 3.72 లక్షల హెక్టార్ల పెరుగుదల నమోదైంది. ఇందులో సెనగలదే సింహభాగంగా ఉంది. గత ఏడాది 86.81 లక్షల హెక్టార్లలో సెనగలు సాగు చేయగా, ఈసారి అది 91.70 లక్షల హెక్టార్లకు పెరిగింది. అంటే ఒక్క సెనగ సాగులోనే దాదాపు 4.89 లక్షల హెక్టార్ల భారీ పెరుగుదల కనిపించింది. కాగా పెసలు, మినప పంటల సాగు కూడా నిలకడగా సాగుతోంది. కుల్తీ, ఇతర పప్పుధాన్యాల సాగు వివరాలను కూడా కేంద్రం వెల్లడించింది.

ఆహార భద్రతకు భరోసా.. గోధుమ, వరి

దేశ ఆహార భద్రతలో కీలకమైన గోధుమ, వరి సాగు కూడా ఆశాజనకంగా ఉంది. రబీ సీజన్‌లో ప్రధాన పంట అయిన గోధుమ సాగు 301.63 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది సుమారు 3 కోట్ల హెక్టార్లతో పోలిస్తే 1.29 లక్షల హెక్టార్ల పెరుగుదల నమోదైంది. అదే సమయంలో రబీ వరి సాగులోనూ మంచి వద్ధి కనిపిస్తోంది. గతేడాది 11.52 లక్షల హెక్టార్లలో వరి నాట్లు పడగా, ఈసారి అది 13.35 లక్షల హెక్టార్లకు పెరిగింది. 1.83 లక్షల హెక్టార్ల మేర సాగు విస్తీర్ణం పెరగడం వరి రైతుల ఉత్సాహానికి నిదర్శనమని వ్యవసాయ శాఖ పేర్కొంది.

నూనెగింజలు, చిరుధాన్యాల తీరు ఇలా..

వంటనూనెల కొరతను తగ్గించే దిశగా నూనెగింజల సాగు కూడా సానుకూలంగా ఉంది. మొత్తం 93.33 లక్షల హెక్టార్లలో నూనెగింజలు సాగవుతున్నాయి. ఇందులో ఆవాలు సాగు విస్తీర్ణం 87.95 లక్షల హెక్టార్లకు చేరాయి. చిరుధాన్యాల విషయంలో శ్రీ అన్న (మిల్లెట్స్) సాగు పట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. జొన్నలు, మొక్కజొన్న, రాగులు తదితర పంటలు కలిపి మొత్తం 45.65 లక్షల హెక్టార్లలో సాగవుతున్నాయి. జొన్నల సాగు 19.33 లక్షల హెక్టార్లుగా, మొక్కజొన్న సాగు 14.97 లక్షల హెక్టార్లుగా నమోదైంది. బార్లీ సాగు కూడా 6.94 లక్షల హెక్టార్లకు చేరింది.

గణాంకాల సారాంశం (లక్షల హెక్టార్లలో)

పంట రకం	2024 (గతేడాది)	2025 (ప్రస్తుతం)	తేడా
గోధుమలు	300.34	301.63	+1.29
వరి	11.52	13.35	+1.83
పప్పుధాన్యాలు	123.01	126.74	+3.72
చిరుధాన్యాలు	45.30	45.65	+0.35
నూనెగింజలు	92.42	93.33	+0.91
మొత్తం	572.59	580.70	+8.12

భర్త భార్య ఒక చపాతి

గోరఖ్‌పూర్(యూపీ): ఉరుమురిమి మంగళం మీద పడ్డట్లు.. తాగుబోతుల నిర్వాకాలు ఎటు పోతాయో ఎవరూ చెప్పలేరు. రాత్రి పూట హాయిగా పిల్లాడితో కలిసి నచ్చింది వండుకుని తిందామనుకున్న ఆ ఇల్లాలికి పిడుగులా మీద పడ్డాడు తాగుబోతు భర్త. డ్రైవర్‌గా సంపాదించిందంతా తాగుడుకే నీళ్లగా ఖర్చయిపోగా ఆగమేఘాల మీద క్షణాల్లో చపాతి కావాలంటూ భీష్మించుకు కూర్చుని భార్యకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాడు. మెరుపువేగంతో చపాతి చేయకపోతే పిడిగుద్దులు ఖాయమని హెచ్చరించి చివరకు అనుకున్నంత పనీ చేశాడు. భార్యతో పాటు నాలుగేళ్ల కుమారుడి రక్తం కళ్లజూశాడు. తాగుబోతు డ్రైవర్ నిర్వాకంపై ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాస్త్రీనగర్‌లో ఒక్కటే చర్చ జరుగుతోంది. చపాతి ఆలస్యంగా చేసిందన్న చితకబాదుతాడా వెధవ అంటూ అతడిని తిట్టిపోయని వాళ్లు లేరు. 30 ఏళ్ల భార్యామణి రాధికా సహానీ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ భార్యాభర్తల చపాతి గొడవ ఆలస్యంగా వెలుగుచూసింది. డిసెంబర్ 20వ తేదీన ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు, బాధితురాలు తెలిపిన సమాచారం మేరకు.. గత శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో లాల్‌చంద్ సహానీ పూటుగా తాగి ఇంటికొచ్చాడు. పీకలదాకా తాగి రావడం అతనికి సర్వసాధారణం. లక్నోలో డ్రైవర్‌గా పనిచేయడం వచ్చిన ఆ కాసిన్ని డబ్బులు తాగుడకు తగలేయడం అతనికి దినచర్యగా తయారైంది. శనివారం రాత్రి ఇంటికి రాగానే 'రోటీ రెడ్ చెయ్' అని హోటల్‌లో సర్వర్‌కు ఆర్డర్ వేసినట్లు ఆర్డర్ వేశాడు. ఇంట్లో అంట్లు తోమడం వంటి ఇంటి పనులు ముగించుకుని రోటీలు చేసి ఇచ్చింది. రోటీ చేయడానికి ఇంత సమయం పడుతుందా? ఇంత ఆలస్యంగా తీసుకొస్తావా? అంటూ లాల్‌చంద్ పట్టరాని కోపంతో ఊగిపోయాడు. అప్పటికే వంటగదిలో పొయ్యి మీద వేడిమీదున్న పెనం తీసుకుని భార్యను చితక్కొట్టాడు. గొడవతో భయపడి అటుగా వచ్చిన తమ నాలుగేళ్ల కుమారుడి తల మీదా లాల్‌చంద్ పెనంతో టపటపా వాయించాడు. దీంతో పిల్లాడి తలకు గాయమై రక్తం ధారగా కారింది. దీంతో భయపడిపోయిన లాల్‌చంద్ వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెల్సిన ఇరుగుపొరుగు వాళ్లు వెంటనే పిల్లాడిని ఆస్పత్రిలో చేర్పించాడు. పారిపోతూ లాల్‌చంద్ భార్యను 'నిన్ను చంపేస్తా'' అంటూ అరుస్తూ పరుగెత్తాడని పొరుగువాళ్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు తాగుబోతు భర్త కోసం గాలింపు మొదలెట్టారు. లాల్‌చంద్‌ను వెంటనే పట్టుకుని తగిన బుద్ధి చెప్తామని గోరఖ్‌నాథ్ పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శశిభూషణ్ రాయ్ చెప్పారు.

కాస్త చూసుకుని నడుపు గురూ..

కారు ఈఎంఐ ఇంకా అయిపోలేదు

మంగళూరు: ఫ్రిడ్జ్, ఏసీ, ఆపిల్ ఐఫోన్, ల్యాప్‌టాప్, కారు, బైక్, వాషింగ్ మెషీన్, ఫర్నీచర్.. ఇలా నిత్యావసర ఎలక్ట్రానిక్ వస్తువులను ఈకాలంలో చాలా మంది ఈఎంఐ పద్ధతిలోనే తీసుకుంటున్నారు. వాటి ఈఎంఐ గడువు తీరేలోపే వాటికి రిపేర్లు రావడమో, పాడవడమో, ఎవరో కొట్టేయడమో జరిగితే ఆ బాధ వర్ణణాతీతం. ఆ బాధ పడొద్దనే ఉద్దేశంతో ఓ కారు యజమాని వినూత్న రీతిలో ఆలోచించారు. రోడ్లపై సర్రున దూసుకుపోయే వాహనదారుల్లో ఎవరైనా తన కారును ఢీకొడితే రిపేర్ల ఖర్చుల కోసం జేబుకు చిల్లు పడటం ఖాయమని భావించాడు. అనుకున్నదే తడవుగా కారుకు వెనకాల కొత్త తరహాలో బంపర్ స్టిక్కర్‌గా వినూత్న క్యాప్షన్ రాసి వెనకాల వచ్చే వాహనదారులందర్నీ ఆలోచనల్లో పడేశాడు. '' నా కారును పొరపాటున ఢీకొట్టకండి. అసలే ఇది ఈఎంఐలో కొన్నా. అదింకా పూర్తవలేదు'' అనే అర్థం వచ్చేలా ఒక క్యాప్షన్ రాశారు. ఇది చూసి 'కారు కష్టాలు' అని కొందరు సానుభూతి వ్యక్తపరిస్తే మరికొందరేమో అతని సృజనాత్మకతను మెచ్చుకుంటూ సరదాగా నవ్వుకుంటూ తమ దారిలో వెళ్లిపోతున్నారు. ఇతనిలో ఎంతో హాస్యచతురత ఉందని లోలోపల పొగుడుతూనే మరోవైపు అతని నిజాయతీకి, విజ్ఞాపనకు ఫిదా అయిపోతున్నారు. కర్ణాటకలోని మంగళూరులో సర్క్యూట్ హౌస్ రోడ్డులో వెళ్తున్న ఒక తెలుపురంగు మారుతి సుజుకీ ఆల్టో కారుకు సంబంధించిన వీడియోను ఒక వ్యక్తి తన ఇన్‌స్టా గ్రామ్ ఖాతాలో పోస్ట్ చేయగా ఇప్పటికే ఏకంగా 5.4 కోట్ల మంది ఈ వీడియోను ఆన్‌లైన్‌లో చూడడం విశేషం. 33.41 లక్షలకుపైగా లైక్‌లు వచ్చాయి. వేలాది మంది తమకు నచ్చిన రీతిలో స్పందిస్తున్నారు. ''కారు యజమాని తాను చెప్పదల్చుకున్న విషయాన్ని అత్యంత వైవిధ్యభరితంగా చెప్పారు' అని ఒక నెటిజన్ ప్రశంసల జల్లు కురిపించాడు. '' ఈఎంఐ అనేది సగటు భారతీయుని జీవితంలో ఒక భాగమైపోయిందనడానికి ఇదొక చక్కటి ఉదాహరణ' అని ఒకరు వ్యాఖ్యానించారు. '' ఎంత కష్టపడి కొనుకున్నాడో. అందుకే కారంటే అతనికి అంత ప్రేమ'' అని మరొకరు పోస్ట్ చేశారు. '' ఈఎంఐ మంజూరుచేసిన బ్యాంక్‌కు ఇతను అసలుసిసలు నిఖార్సయిన కస్టమర్' అని మరో నెటిజన్ వ్యాఖ్యానించారు. ''గుంతల రోడ్డుపై వాయుకాలుష్యంలో కొట్టుకుపోతున్న నాకు ఎదురుగా ఈ క్యాప్షన్ ఎండాకాలంలో చల్లటి మజ్జికలా హాయినిచ్చింది'' అని ఇంకొకరు పోస్ట్‌చేశారు. ''ఎన్నో బాధ్యతలున్న సగటు జీవి కారు ఇది'', ''కార్లపై చూసిన అతిగొప్ప నినాదం ఇదే'', ''మోదం, ఖేదం కలబోత ఈ క్యాప్షన్'' అంటూ ఎవరికి నచ్చినట్లు వాళ్లు పోస్ట్‌లుపెట్టారు.

ఈఎంఐ పెండింగ్ ఉందంటూ స్టికర్ అంటించిన కారిదే

జ్ఞానపీఠ్ గ్రహీత వీకే శుక్లా కన్నుమూత

రాయ్‌పూర్: ప్రముఖ హిందీ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత వినోద్ కుమార్ (వీకే) శుక్లా(88) మంగళవారం కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో కొంతకాలంగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. శ్వాస సంబంధ సమస్యలతో ఈ నెల 2వ తేదీన రాయ్‌పూర్ ఎయిమ్స్‌లో చేర్పించామని, మంగళవారం సాయంత్రం 4.48 గంటలకు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని కుమారుడు శాశ్వత్ శుక్లా చెప్పారు. వీకే శుక్లాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1937 జనవరి ఒకటో తేదీన ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించిన శుక్లా హిందీ సాహిత్యంలో అగ్రగణ్యుడిగా ఉన్నారు. ఆయన రాసిన నౌకర్ కీ కమీజ్, ఖిలేగా తో దేఖేంగే, దీవార్ మే ఏక్ ఖిడ్‌కీ రహతీ థీ, ఏక్ చుప్పి జగాహ్ వంటి నవలల్లో సామాన్యుల జీవితాలను, సామాజిక వాస్తవాలను ప్రతిబింబించి తీరు ఆయనకు పేరు తెచ్చి పెట్టింది. దీవార్ మై ఏక్ ఖిడ్‌కీ రహతీ థీ నవలతో 1999లో సాహిత్య అకాడమీ అవార్డు, 2025లో 59 జ్ఞానపీఠ అవార్డు దక్కాయి. నౌకర్ కీ కమీజ్(1979) నవల అనంతరం సినిమాగా కూడా వచ్చింది. శుక్లా మరణంపై ప్రధాని మోదీ స్పందించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

గ్రీన్‌కార్డులపై గూగుల్ గుడ్‌న్యూస్

- హెచ్–1బీ వీసాదారులకు శాశ్వత నివాసిత హోదా
- 'పెర్మ్'ప్రక్రియను వేగవంతం చేస్తామని వెల్లడి
- విదేశీ ఉద్యోగులకు అంతర్గతంగా సమాచారం

వాషింగ్టన్: అమెరికాలో హెచ్–1బీ వీసాతో గూగుల్ సంస్థలో పని చేస్తున్నవారికి శుభవార్త. వారి గ్రీన్‌కార్డు కలలకు త్వరలోనే మోక్షం లభించనుంది. తమ ఉద్యోగుల గ్రీన్ కార్డు స్పాన్సర్‌షిప్ ప్రక్రియను వచ్చే ఏడాది వేగవంతం చేయబోతున్నట్లు గూగుల్ యాజమాన్యం వెల్లడించింది. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు సమాచారం చేరవేసింది. అమెరికాలో వేలాది మంది విదేశీయులు తాత్కాలిక వీసాలతో గూగుల్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కంపెనీ స్పాన్సర్‌షిప్‌తో శాశ్వత నివాసిత హోదా(గ్రీన్‌కార్డు) పొందాలని చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. నిజానికి వారికి గత రెండేళ్లుగా గ్రీన్‌కార్డు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అర్హులైన ఉద్యోగులకు గ్రీన్‌కార్డులు లభించడానికి వీలుగా ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్(పెర్మ్) దరఖాస్తులు స్వీకరించడంతోపాటు వాటికి ప్రభుత్వం నుంచి త్వరగా ఆమోదం లభించేలా చర్యలు చేపట్టబోతున్నట్లు గూగుల్ యాజమాన్యం తెలియజేసింది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు పొందడంలో పెర్మ్ అనేది కీలకమైన ప్రక్రియ. అమెరికాలోని టెక్నాలజీ కంపెనీలు ఈ ప్రక్రియను విస్తృతంగా వాడుకుంటాయి. టెంపరరీ వర్క్ వీసాలపై పని చేస్తున్న తమ ఉద్యోగులకు పర్మినెంట్ రెసిడెన్సీ స్టేటస్ వచ్చేలా సహకరిస్తాయి. పెర్మ్‌కు అర్హులైన వారికి వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో గ్రీన్ కార్డు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, దీనిపై గూగుల్ బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతర్గతంగా సమాచారం మాత్రం ఇచ్చింది.

విదేశీ ప్రయాణాలు ఇప్పుడే వద్దు

ఉద్యోగులకు అమెరికా టెక్ కంపెనీల సూచన

అమెరికాలో మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలు వర్క్ వీసాలపై పని చేస్తున్న తమ ఉద్యోగులకు కీలక సూచన జారీ చేశాయి. విదేశీలకు వెళ్లాలన్న ఆలోచన ఉంటే వాయిదా వేసుకోవాలని తెలియజేశాయి. అంతర్జాతీయ ప్రయాణాలు ఇప్పుడే వద్దని పేర్కొన్నాయి. విదేశాల్లోని అమెరికా ఎంబీసీలు, కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చాలా ఆలస్యమవుతోంది. నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఏడాది కాలం పడుతోందని చెబుతున్నారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో విదేశాలకు వెళ్లిరావడం కష్టమన్న ఉద్దేశంతోనే ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని టెక్ కంపెనీలు సూచించాయి. ఈ మేరకు కొన్ని రోజులుగా తమ ఉద్యోగులకు సమాచారం అందిస్తున్నాయి.

మరో డ్రగ్స్ బోటుపై అమెరికా దాడి

వాషింగ్టన్: పసిఫిక్ సముద్రంలో డ్రగ్స్ అక్రమంగా రవాణా చేస్తున్న మరో బోటుపై దాడి చేసినట్లు అమెరికా మిలటరీ సోమవారం ప్రకటించింది. ఈ దాడిలో ఒకరు చనిపోయారని పేర్కొంది. తూర్పు పసిఫిక్ జలాల్లో ఒక పడవ డ్రగ్స్ రవాణాదారులు సాధారణంగా అనుసరించే రూట్‌లో వస్తున్న విషయాన్ని ఇంటెలిజెన్స్ విభాగం కనిపెట్టి మాకు తెలిపింది'అని సదరన్ కమాండ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అయితే, పడవలో డ్రగ్స్ ఉన్నాయనేందుకు గల ఆధారాలను మాత్రం బయటపెట్టలేదు. ఘటనపై విడుదల చేసిన వీడియోను బట్టి..మొదటి దాడిలో పడవ ఒక పక్క నీళ్లలో మంటలు రాగా, రెండో దాడితో పడవకు మంటలు అంటుకుని, మునిగిపోయింది. సెప్టెంబర్ నెల నుంచి అమెరికా ఇప్పటి వరకు చేపట్టిన ఇటువంటి 29 దాడుల్లో కనీసం 105 మంది చనిపోయారు.

నేవీ విమానం కూలి.. ఐదుగురు మృతి

గాల్వెస్టన్: మెక్సికోకు చెందిన చిన్న నేవీ విమానం అమెరికాలోని టెక్సాస్ తీరంలో కూలిపోయింది. ఘటనలో కనీసం ఐదుగురు చనిపోయారు. మెక్సికో నుంచి తీవ్రంగా కాలిన గాయాలైన బాలుడిని గాల్వెస్టన్‌లో ఆస్పత్రికి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో విమానంలో బాలుడు, నలుగురు నేవీ అధికారులు, స్వచ్ఛంద సంస్థకు చెందిన ముగ్గురు సిబ్బంది ఉన్నారు. గాల్వెస్టన్ బే సమీపంలో విమానంలో కూలిన ఘటనలో కనీసం ఐదుగురు చనిపోయారని యూఎస్ కోస్ట్‌గార్డ్ విభాగం తెలిపింది. వారి వివరాలను మాత్రం వెల్లడించలేదు. సహాయక, రక్షణ చర్యలు ముమ్మరం చేశామంది.

వచ్చి లొంగిపోతేనే: మాల్యాకు కోర్టు స్పష్టీకరణ

ముంబై: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టాన్ని (ఎఫ్ఈఓ) తనకు వర్తింపజేయొద్దన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా పిటిషన్ పై బాంబే హైకోర్టు ఘాటుగా స్పందించింది. వెంటనే భారత్ వచ్చి లొంగిపోయేదాకా ఈ పిటిషన్‌ను ఆలకించేది లేదని ఆయన తరఫు లాయర్‌కు స్పష్టం చేసింది. ఎప్పటిలోగా వచ్చి లొంగిపోతారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ శంకర్, జస్టిస్ గౌతం అంఖడ్ ధర్మాసనం ప్రశ్నించింది. బ్యాంకులకు వేల కోట్ల రూపాయల ఎగవేత కేసులో మాల్యా 2016లో దేశం విడిచి పారిపోవడం తెలిసిందే.

బెంగాల్‌లో మూకహత్య.. 13 మందికి జీవిత ఖైదు

కోల్‌కతా: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన మూకదాడిలో తండ్రీకొడుకుల మరణంపై కోర్టు 13 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15లక్షలను పరిహారంగా చెల్లించాలని జాంగీపూర్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించిందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివాస్ చటర్జీ అన్నారు. ఏప్రిల్ 12వ తేదీన సంసేర్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జఫ్రాబాద్‌లో తమ నివాసంలో ఉన్న హరగోబింద్ దాస్(72), ఆయన కుమారుడు(42)పై కొందరు దాడి చేసి, చంపేశారు.

కశ్మీరీ లాబీయిస్ట్ ఆస్తులు అటాచ్

శ్రీనగర్: అమెరికా కేంద్రంగా పనిచేసే కశ్మీరీ లాబీయిస్ట్ గులామ్ నబీ ఫాయ్‌కి చెందిన భూమిని తక్షణమే అటాచ్ చేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వాద్వాన్, చట్టాబుఘ గ్రామాల్లో ఉన్న ఫాయ్‌కి చెందిన 8,100 చదరపు అడుగుల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ బుద్గాం జిల్లా ఎన్ఐఏ కోర్టు ప్రత్యేక జడ్జి యాహయా ఫిరోడ్స్ ఉత్తర్వు జారీ చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇక్బాల్ రాథర్ పిటిషన్‌పై ఈమేరకు బుద్గామ్ కలెక్టర్‌ను ఆదేశించారు. బుద్గాం వాసి అయిన ఫాయ్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం–2020కింద కేసు నమోదైంది. దీనిపై పోలీసుల ఎదుట హాజరు కావాలంటూ కోర్టు నోటీసులు జారీ చేసింది. 30 రోజుల్లోగా అతడు స్పందించకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో పరారీలో ఉన్న నేరగాడిగా కోర్టు ప్రకటించింది. పాక్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) ఏజెంట్‌గా ఫాయ్‌పై ఆరోపణలున్నాయి.

కార్తీ చిదంబరంపై ఆరోపణలు నమోదు చేయండి

ఢిల్లీ కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: చైనా వీసా కుంభకోణం కేసుకు సంబంధించి కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఆరోపణలు నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు సీబీఐని ఆదేశించింది. కార్తీ చిదంబరం, మరో ఏడుగురిపై నమోదైన కేసు విచారణ జరుపుతున్న సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి డిగ్ వినయ్ సింగ్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ నేరపూరిత కుట్ర కేసు నుంచి చేతన్ శ్రీవాస్తవ అనే ఏడో నిందితుడి పేరును మినహాయించాలని కోరింది. తన తండ్రి పి.చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో 2011లో ఓ విద్యుత్ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకు లంచం తీసుకుని చైనీయులకు వీసాలు మంజూరు చేయించిన ఆరోపణలపై సీబీఐ 2024లో కార్తీపై నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ తదితరాలకు పాల్పడినందుకు అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది.

బఘేల్ కుమారుడి వాటా రూ.250 కోట్లు

లిక్కర్ స్కాంలో ఏసీబీ ఛార్జిషీటు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న లిక్కర్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్యకు వాటాగా రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు ముడుపులుగా ముట్టాయని యాంటీ కరప్షన్ బ్యూరో/ఎకనామిక్ అఫెన్స్ వింగ్(ఏసీబీ/ఈవోడబ్ల్యూ) పేర్కొంది. ఈ మేరకు సోమవారం ప్రత్యేక కోర్టులో ఏడో అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేసింది. రాష్ట్రంలో 2018–23 సంవత్సరాల మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎక్సైజ్ శాఖలో ఏర్పాటైన ఈ రాకెట్ సూత్రధారి చైతన్య అని తెలిపింది. అక్రమంగా చేతులు మారిన మొత్తం రూ.3 వేల కోట్లపైమాటేనని, ఏసీబీ/ఈవోడబ్ల్యూ తన 3,800 పేజీల భారీ ఛార్జిషీటులో పేర్కొంది. దీనితో కలిపితే ఈ కేసులో ఇప్పటి వరకు 8 ఛార్జిషీట్లను రాష్ట్ర పోలీసు విభాగం దాఖలు చేసినట్లయింది.

లూయిస్‌పై ఈడీ ఫిర్యాదును పరిగణనలోకి..

న్యూఢిల్లీ: కృత్రిమ అవయవాలపై పంపిణీలో భారత ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన ఆరోపణలపై డాక్టర్ జకీర్ హుస్సేన్ మెమోరియల్ ట్రస్ట్, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షిద్ భార్య లూయిస్ ఖుర్షిద్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీటును లక్నోలోని ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. రూ. 45.92 లక్షల విలువైన ఆస్తులను జప్తు చేయాలని, నిందితులకు తగు శిక్ష విధించాలని కోరుతూ ఆగస్టు 11న లక్నోలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ ఛార్జిషీటును నవంబర్ 25న ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని వివరించింది. యూపీ పోలీసు ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన 17 ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా దర్యాప్తు జరిపినట్లు వివరించింది. తాము పంపిన ప్రశ్నలకు లూయిస్ ఖుర్షిద్ నుంచి ఎటువంటి సమాధానం రాలేదని ఈడీ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం కృత్రిమ అవయవాల పంపిణీ కోసం మంజూరు చేసిన రూ.71.50లక్షలను నిందితులంతా వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నారని తెలిపింది.

ఉన్నావ్ రేప్ ఘటన.. కుల్దీప్ సెంగార్‌కు బెయిల్

న్యూఢిల్లీ: 2017నాటి ఉన్నావ్ రేప్ ఘటన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కోర్టు మంగళవారం అతడిపై విధించిన జైలు శిక్షను నిలిపివేసింది. అంతేకాదు, పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. రూ.15 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే మొత్తంతో సమానంగా ముగ్గురు వ్యక్తుల ష్యూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. ఢిల్లీలోని బాధితురాలి నివాసం చుట్టుపక్కల 5 కిలోమీటర్ల పరిధిలోకి వెళ్లవద్దని తెలిపింది. బాధితురాలిని గానీ, ఆమె తల్లిని గానీ బెదిరించరాదంది. ఈ షరతులను ఉల్లంఘించిన పక్షంలో బెయిల్ రద్దవుతుందని హైకోర్టు హెచ్చరించింది. రేప్ కేసులో ట్రయల్ కోర్టు జీవితకాల జైలు శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ సెంగార్ వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంతకాలం మాత్రమే జైలుశిక్ష రద్దు ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. దోషిగా రుజువైన పక్షంలో మిగతా శిక్షా కాలం పూర్తి చేసేందుకు గాను అందుబాటులో ఉండాలని తెలిపింది.

ప్రియాంక ప్రధాని పదవి చేపడతారు...

ఆ సమయం వస్తుందంటూ భర్త రాబర్ట్ వాద్రా వ్యాఖ్య

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ గురించి ఆమె భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రియాంకా గాంధీకి రాజకీయాల్లో మంచి భవిష్యత్తు ఉందంటూ.. ఆమె అత్యున్నత పదవి చేపట్టే సమయం వస్తుందన్నారు. ప్రియాంకా గాంధీ ప్రధాని పదవిని చేపడితే..నానమ్మ ఇందిరాగాంధీ మాదిరిగా బలమైన ప్రధానిగా ఉంటారంటూ పార్టీ ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులన ఆమె అడ్డుకుంటారన్నారు. దీనిపై వాద్రా స్పందించారు. 'ప్రియాంకా గాంధీ నానమ్మ ఇందిర, తండ్రి రాజీవ్‌గాంధీ, తల్లి సోనియా, ఇంకా సోదరుడు రాహుల్ నుంచి ఎంతో నేర్చుకున్నారు. ఆమె ప్రధాని పదవిని చేపట్టాలని కొందరు కోరుకుంటున్నారు కూడా. ప్రజలకు అవసరమైన విషయాలను గురించి ప్రియాంక మాట్లాడుతుంటారు. ఆమె ప్రధాని పదవిని చేపడితే దేశంలో అవసరమైన మార్పులను తీసుకొస్తారు'అని పేర్కొన్నారు.

26న గోవాలో 'మీడియేషన్ అవేర్‌నెస్ వాక్'

పణాజి: ప్రజలకు ఎంతో కూలమైన, వివాదాల పరిష్కారానికి ప్రభావవంతమైన మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నడుం బిగించారు. ఈ నెల 26వ తేదీన గోవాలో సీజేఐ సారథ్యంలో మీడియేషన్ అవేర్‌నెస్ వాక్ జరగనుంది. ఇదే అంశంపై జరిగే సదస్సులోనూ సీజేఐ పాల్గొంటారని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గోవా రాజధాని పణాజిలోని కళా అకాడమీ నుంచి మొదలయ్యే రెండు కిలోమీటర్ల వాక్‌ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ), బీసీఐ ట్రస్ట్, ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నిర్వహిస్తున్నాయి.

ఆరావళి పరిరక్షణకు కాంగ్రెస్ ఆందోళనలు

జైపూర్: ఆరావళి పర్వతాల్లో చేపట్టే మైనింగ్‌తో కలిగే పరిణామాలపై కేంద్రం, రాజస్తాన్‌లలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. బీజేపీ పాలనలో అధికారులు, మాఫియా కలిసి ఆరావళి శ్రేణిలోని 90 శాతం పర్వతాలకు ముప్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టాయంది. అందుకే, పర్వత శ్రేణిలోని 100 మీటర్లకు పైబడి ఎత్తున్న వాటినే గుట్టలుగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోపించింది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని 19 జిల్లాల్లో ఆరావళి బచావో నిరసనలు చేపడతామని తెలిపింది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఇవి కొనసాగుతాయంది.

మీ వల్లే వాయు కాలుష్యం

కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఎల్జీ లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని గత ఆప్ ప్రభుత్వం దాదాపు 11 ఏళ్లపాటు చేసిన నిర్లక్ష్యం వల్లే గాలి కాలుష్య సమస్య తీవ్రంగా పెరిగిపోయిందని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆరోపించారు. దేశ రాజధానిలో ప్రస్తుత పరిస్థితికి ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాలే కారణమని నిందించారు. ఈ మేరకు వీకే సక్సేనా మంగళవారం కేజ్రీవాల్‌కు రాసిన 15 పేజీల లేఖలో పేర్కొన్నారు. కేజ్రీవాల్ చేసిన తప్పిదాలను సరిచేసేందుకు ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం చేయగలిగిందంతా చేస్తోందన్నారు. అయినప్పటికీ పది నెలల పాలనను అనవసరంగా కేజ్రీవాల్ తక్కువ చేసి మాట్లాడుతున్నారంటూ విమర్శించారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పాటైన సంవత్సరం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర – బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916-21)

ఇతడి కాలంలో 1916లో కాంగ్రెస్ లక్నో సమావేశంలో అతివాదులు,మితవాదులు,హిందూ – ముస్లింలు ఏకమయ్యారు. 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1918లో అహ్మదాబాద్‌లో నూలుమిల్లుల ఉద్యమం జరిగాయి. 1919లో మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ద్వంద్వ పరిపాలన (Diarchy) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు కల్పించారు. ఆర్థిక వ్యవహారాలు, శాంతిభద్రతలు గవర్నర్ ప్రత్యక్ష ఆధీనంలో (Reserved Subjects); విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవి శాసన సంబంధమైన అంశాలు(Transferred Subjects) గా ఉంటాయి. దీని ద్వారా ఎగువసభ, దిగువ సభలు ఏర్పడ్డాయి. చెమ్స్‌ఫర్డ్ కాలంలోనే 1919లో జలియన్ వాలాబాగ్ ఊచకోత జరిగింది. 1919లో ఢిల్లీలో అఖిల భారత ఖిలాఫత్ సమావేశం జరిగింది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించారు. గాంధీజీ తనకు ఇచ్చిన కైజర్–ఇ–హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చేశారు. 1920లో బాలగంగాధర్ తిలక్ మరణించారు. సి.ఎన్. బెనర్జీ ఇండియన్ లిబరల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమైంది. పుణేలో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

లార్డ్ రీడింగ్ (1921-26)

ఇతడి కాలంలో అలీగఢ్ జామియా మిలియా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ తదితర విద్యాసంస్థలను స్థాపించారు. 1921లో పంజాబ్‌లో సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను తొలగించడానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1922లో చౌరీచౌరాలో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఘటనలో 22 మంది పోలీసులు మృతి చెందారు. దీంతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు.

1922 డిసెంబర్‌లో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ కలిసి స్వరాజ్య పార్టీని స్థాపించారు. 1921లో ఎం.ఎన్.రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1926లో మతకలహాలు చెలరేగాయి. వీటిలో భాగంగా ప్రముఖ నాయకుడు, జాతీయవాది అయిన స్వామి శ్రద్ధానంద్‌ను మతఛాందసవాదులు హత్య చేశారు. కె.బి.హెగ్డేవార్, ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించారు.రౌలత్ చట్టాన్ని రద్దు చేశారు.

లార్డ్ ఇర్విన్ (1926-31)

ఇర్విన్ కాలంలో 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికీ సభ్యత్వం కల్పించలేదు. దీంతో ఈ కమిషన్‌కు దేశవ్యాప్తంగా నిరసన ఎదురైంది. 1928 డిసెంబర్‌లో తొలిసారిగా అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. 1928లో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది.

భగత్‌సింగ్, బి.కె. దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు. ప్రజారక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వీరు ఈ ఘటనకు పాల్పడ్డారు. 1930లో చిట్టగాంగ్‌లో ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి జరిగింది. సూర్యాసేన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో మహిళలు సైతం పాల్గొన్నారు. రాజకీయ ఖైదీలను ఉంచే జైళ్లలో దుర్భర పరిస్థితులు ఉండేవి. దీనికి నిరసనగా జతిన్‌దాస్ అనే యువకుడు 63 రోజుల పాటు ఉపవాస దీక్ష చేసి ప్రాణత్యాగం చేశాడు. 1931లో భగత్‌సింగ్, రాజ్‌గురును పోలీసు అధికారుల హత్యకేసుల్లో విచారించి ఉరితీశారు. 1929లో కాంగ్రెస్ పార్టీ లాహోర్‌లో సమావేశమైంది. 'సంపూర్ణ స్వరాజ్యం' కాంగ్రెస్ ఆశయమని ఈ సమావేశంలోనే ప్రకటించారు. అదే ఏడాది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ 1930 మార్చి 12న దండి సత్యాగ్రహం ప్రారంభించారు. ఇదే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది. 1930లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ నాయకులను ఆహ్వానించారు. కానీ, సైమన్ నివేదికపై చర్యకు నిరసనగా వీరు సమావేశాన్ని బహిష్కరించారు. తర్వాత గాంధీ–ఇర్విన్ సంధి జరిగింది. ఉద్యమాన్ని నిలిపివేశారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలో పఠాన్లు 'ఖుదాయ్ ఖిద్మత్ గార్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి భగవంతుడి సేవకులని అర్థం. వీరినే 'రెడ్ షర్ట్'లు అని కూడా పిలుస్తారు. మణిపూర్ వాసులు జాతీయోద్యమంలో సాహసోపేత పాత్ర పోషించారు. గాంధీజీ పిలుపు మేరకు నాగాలాండ్ వీరనారి 'రాణి గైడిన్‌లియూ' పదమూడేళ్ల వయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఆమె తిరుగుబాటు జరిపారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం రాణికి యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ వెళ్లారు. ఈ సమావేశంలో 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించారు. దీనికి నిరసనగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టారు.

నిమ్నజాతులకు కూడా ప్రత్యేక స్థానాలను ప్రకటించారు. గాంధీ–అంబేద్కర్ మధ్య పుణే ఒప్పందం జరిగింది. 1932లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఓటింగ్ అర్హత, ఉమ్మడి నిధులు, రాష్ట్రాల ఆర్థిక వనరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యుల సమాఖ్య, ఎగువసభ, ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైనవి ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. గాంధీ–ఇర్విన్ ఒప్పందం తర్వాత 1933లో కాంగ్రెస్ అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసింది. 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ ఏర్పాటైంది. రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారం లభించింది. 1935 చట్టంరాజ్యాధికారాలను మూడు రకాలుగా విభజించింది. అవి:

1. సమాఖ్య అధికారాలు
2. రాష్ట్ర అధికారాలు
3. ఉమ్మడి అధికారాలు

తమ అధికార పరిధిలో శాసనాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వాధికారం ఉంటుంది. ఉమ్మడి జాబితాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనం చేయవచ్చు. ఏ శాసన్నానైనా వీటో చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. బిల్లులను పునఃపరిశీలించమని సూచించే లేదా బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం ఎగువ సభలో 2/5వ వంతు, దిగువ సభలో 3/5వ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కేటాయించారు. భారత్ నుంచి బర్మాను వేరు చేశారు. జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. 1936లో ఆలిండియా కిసాన్ సభ ఏర్పాటైంది.

లార్డ్ లిన్‌లిత్ గో (1936-44)

భారత ప్రభుత్వ చట్టం–1935 ప్రకారం 1937 జూలై నాటికి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలను సాధించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1937లో జవహర్ లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1936లో తొలి అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. నాటి నుంచి రైతాంగం జాతీయోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో సోషలిజాన్ని ఆమోదించారు.

1938లో జాతీయ కాంగ్రెస్ గుజరాత్‌లోని హరిపూర్‌లో సమావేశమైంది. దీనికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 1939లో బోస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. గాంధీ,నెహ్రూ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ సుభాష్ చంద్రబోస్ గెలుపొందారు. వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయులు బోస్ పట్ల విముఖత చూపారు. దీంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కొందరు వామపక్ష వాదులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు. 1927 డిసెంబర్ నాటికే అఖిల భారత సంస్థాన ప్రజాసభ ప్రారంభమైంది. 1939లో నెహ్రూ ఈ సభకు అధ్యక్షుడయ్యాడు. 1939లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారతీయులను సంప్రదించకుండానే భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలోకి అడుగుపెట్టింది. ఈ విషయమై జాతీయ కాంగ్రెస్‌కు లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులకు మాట మాత్రంగా కూడా చెప్పలేదు. 1940లో ముస్లిం లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఏడాది బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ఆఫర్ జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీలకు అధిక స్థానాలను కేటాయిస్తారు. యుద్ధం ముగిశాక నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. 1941లో సుభాష్ చంద్రబోస్ నిర్బంధం నుంచి తప్పించుకొని బెర్లిన్ వెళ్లారు. 1942లో ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హిందు ఫౌజ్)ని స్థాపించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశాల నుంచే బోస్ పోరాడారు. ఆయన 'జైహింద్' అనే నినాదమిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం కోసం బ్రిటన్ ప్రయత్నించింది. ఇందు కోసం 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో ఒక రాయబార బృందాన్ని భారత్‌కు పంపింది. క్రిప్స్ బ్రిటిష్ మంత్రివర్గ సభ్యుడు, లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. వీలైనంత త్వరగా స్వపరిపాలన ప్రతిపాదించడమే తమ లక్ష్యమని క్రిప్స్ తెలిపారు. కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ, గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత ప్రజాపోరాటాన్ని కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేసింది.

లార్డ్ వేవెల్ (1944-47)

1944లో అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1945లో కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీలు లార్డ్ వేవెల్ సమక్షంలో సిమ్లాలో సమావేశమయ్యాయి. రాజ్యాంగ, మత అడ్డంకులను తొలగించేందుకు ఆ పార్టీలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 1946లో అఖిల భారత తంతి–తపాలా కార్మికులు సమ్మె చేశారు. కౌలు రేట్ల తగ్గింపు కోసం రైతాంగ పోరాటాలు అధికమయ్యాయి. సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో కేబినెట్ మిషన్‌ను పంపింది. అధికార బదిలీ గురించి భారత జాతీయ నాయకులతో ఈ మిషన్ సంప్రదింపులు జరిపింది. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చే దాకా తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటిష్ రాయబార వర్గం సూచించింది. 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. ముస్లింలీగ్ మంత్రి వర్గంలో చేరింది. కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్ 1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటించింది. నేవీ తిరుగుబాటు చేసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించింది.

లార్డ్ మౌంట్ బాటన్ (1947)

మౌంట్ బాటన్ 1947లో భారత వైస్రాయ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కాంగ్రెస్, ముస్లిం లీగ్ నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలైంది. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్ నూతన దేశంగా ఆవిర్భవించింది. అదే రోజు అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరి 30న గాడ్సే గాంధీజీని కాల్చి చంపాడు.

ముఖ్యాంశాలు

- 1929: లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం. 'సంపూర్ణ స్వరాజ్యమే' తమ ఆశయమని ప్రకటన.
- 1930 మార్చి 12: దండి సత్యాగ్రహాన్ని ప్రారంభించిన మహాత్మా గాంధీ.
- 1942 మార్చి: సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో భారత్‌కు రాయబార వర్గం రాక.
- 1942 ఆగస్టు 8: బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం, క్విట్ ఇండియా తీర్మానానికి ఆమోదం.
- 1946 మార్చి: కేబినెట్ మిషన్ భారత్ రాక.
- 1946 ఆగస్టు 16: కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్, ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటన.
- 1947 జూన్ 3: భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయనే ప్రకటన విడుదల.

కోడ్‌లు గుర్తుంచుకుంటే క్యాలెండర్ సమస్యలు సులువు!

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

మాదిరి ప్రశ్నలు

మోడల్-1

1. రోహిత్ పుట్టిన తేది 2006 సెప్టెంబర్ 25 అయితే అది ఏ వారం?
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శనివారం

ఈ తరహా ప్రశ్నలు అడిగినప్పుడు అభ్యర్థులు వారాలు, నెలలు, సంవత్సరాలకు సంబంధించిన కింది కోడ్‌లను తెలుసుకుంటే సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

వారం	కోడ్
శనివారం	0
ఆదివారం	1
సోమవారం	2
మంగళవారం	3
బుధవారం	4
గురువారం	5
శుక్రవారం	6
నెల	**కోడ్**
జనవరి	1
ఫిబ్రవరి	4
మార్చి	4
ఏప్రిల్	0
మే	2
జూన్	5
జూలై	0
ఆగస్టు	3
సెప్టెంబర్	6
అక్టోబర్	1
నవంబర్	4
డిసెంబర్	6
సంవత్సరం	**కోడ్**
1600 నుంచి 1699	6
1700 నుంచి 1799	4
1800 నుంచి 1899	2
1900 నుంచి 1999	0
2000 నుంచి 2099	6
2100 నుంచి 2199	4

సూత్రం: [ప్రశ్నలో ఇచ్చిన తేది + నెల కోడ్ + సంవత్సరాలు (చివరి రెండు అంకెలు) + లీపు సంవత్సరాలు + సంవత్సరం కోడ్] 7
ఇచ్చిన ప్రశ్నలో తేది = 25
లీపు సంవత్సరాలు = ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండంకెలను 4తో భాగిస్తే వచ్చే భాగఫలం

సూత్రం ప్రకారం
= (25 + 6 + 6 + 1 + 6) 7
7|44(6
42
2

∴ శేషం రెండు కాబట్టి వారం – కోడ్ పట్టిక ప్రకారం రోహిత్ పుట్టిన రోజు సోమవారం

2. 1776 జూలై 16న ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) బుధవారం
సి) శనివారం డి) మంగళవారం
జవాబు: డి

3. 1947 ఆగస్టు 15న ఏ వారం?
ఎ) శనివారం బి) శుక్రవారం
సి) గురువారం డి) బుధవారం
జవాబు: బి

4. 2020 ఆగస్టు 15 ఏ వారం?
ఎ) గురువారం బి) శనివారం
సి) శుక్రవారం డి) ఆదివారం
జవాబు: బి

5. 2014 జనవరి 1 ఏ రోజు ?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శుక్రవారం
జవాబు: సి

మోడల్-2

1. 2005 మార్చిలో ఏ తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.
ఎ) 3, 10, 19, 23 బి) 4, 11, 18, 25
సి) 1, 8, 15, 22 సి) 2, 9, 16, 23
జవాబు: బి

వివరణ: 1-3-2005 న వచ్చే వారం
1 + 4 + 5 + 1 + 6 7 = 3
అంటే 1-3-2005 – మంగళవారం
4-3-2008 – శుక్రవారం
కాబట్టి 4, 11, 18, 25 తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.

2. 2016 నవంబర్‌లో శుక్రవారాలు ఎప్పుడు వస్తాయి?
ఎ) 1, 8, 15, 22, 29 బి) 3, 10, 17, 24
సి) 5, 12, 19, 26 డి) 4, 11, 18, 25
జవాబు: డి

3. 1994 ఏప్రిల్‌లో ఏ తేదీల్లో బుధవారం వస్తుంది?
ఎ) 3, 10, 17, 24 బి) 4, 11, 18, 25
సి) 12, 19, 26 డి) 7, 18, 21, 28
జవాబు:ఎ

మోడల్-3

1. 2003 సంవత్సరం క్యాలెండర్ కిందివాటిలో ఏ సంవత్సరం క్యాలెండర్‌ను పోలి ఉంటుంది?
ఎ) 2005 బి) 2009 సి) 2014 డి) 2004
జవాబు: సి

వివరణ: 2003 నుంచి మొత్తం విషమ రోజులు సున్నా వచ్చే వరకు లెక్కించాలి. సున్నా వచ్చిన తర్వాత సంవత్సరం మొదటి క్యాలెండర్‌ను పోలి ఉంటుంది.

సంవత్సరం	విషమ రోజులు
2003	1
2004	2
2005	1
2006	1
2007	1
2008	2
2009	1
2010	1
2011	1
2012	2
2013	1

మొత్తం రోజులు
= 1+ 2 + 1 + 1 + 1+ 2+ 1+1 +1 +2 + 1 = 14
విషమ రోజు = 14/7 = 0
2003 క్యాలెండర్
2014 క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.

2. 2007 క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Communications S.I. -2012)
ఎ) 2013 బి) 2018
సి) 2008 డి) 2010
జవాబు: బి

3. 2002 సంవత్సరం క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Deputy Jailor-2012)
ఎ) 2003 బి) 2008
సి) 2030 డి) 2013
జవాబు: డి

మోడల్ : 4

1. 2006 సెప్టెంబర్ 25 సోమవారం రోహిత్ పుట్టినరోజు అయితే 2014లో రోహిత్ పుట్టినరోజు ఏ వారం?
ఎ) సోమవారం బి) గురువారం
సి) శనివారం డి) ఆదివారం
జవాబు: బి

వివరణ: 2006 సెప్టెంబర్ 25
2007 సెప్టెంబర్ 25 1 (విషమ రోజులు)
2008 సెప్టెంబర్ 25 2 (విషమరోజులు)
2009 సెప్టెంబర్ 25 1
2010 సెప్టెంబర్ 25 1
2011 సెప్టెంబర్ 25 1
2012 సెప్టెంబర్ 25 2
2013 సెప్టెంబర్ 25 1
2014 సెప్టెంబర్ 25 1
మొత్తం రోజులు 10
విషమ రోజులు 3
అంటే సోమవారం + 3 = గురువారం

2. 2012 మార్చి 6 ఆదివారం అయితే 2016 మార్చి 6 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) శుక్రవారం బి) సోమవారం
సి) శనివారం డి) గురువారం
జవాబు: ఎ

3. 2006 జనవరి 1 ఆదివారం అయితే 2010 జనవరి 1 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) సోమవారం బి) శనివారం
సి) మంగళవారం డి) శుక్రవారం
జవాబు: డి

మోడల్- 5

1. 1999 డిసెంబర్ 5 ఆదివారం అయితే 2000 మార్చి 20 ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) మంగళవారం డి) బుధవారం
జవాబు: ఎ

వివరణ:
1999 డిసెంబర్ 5 నుంచి 2000 మార్చి 20 సంవత్సరం మొత్తం రోజులు:
డిసెంబర్ నెలలో 5వ తేదీ తర్వాత మిగిలిన రోజులు (31-5) = 26 రోజులు
2000 సంవత్సరంలో
జనవరి = 31రోజులు
ఫిబ్రవరి = 29రోజులు
మార్చి = 20 రోజులు
మొత్తం రోజులు = 106 రోజులు
అంటే విషమ రోజుల సంఖ్య = 1
∴ 2000 మార్చి 20 → ఆదివారం + 1
= సోమవారం

2. 2013 జనవరి 1 మంగళవారం అయితే 10 అక్టోబర్ 2013 ఏ రోజు అవుతుంది?
(General SI- 2012)
ఎ) గురువారం బి) శుక్రవారం
సి) మంగళవారం డి) శనివారం
జవాబు: బి

ముఖ్యాంశాలు

- 2003 సంవత్సరానికి ముందు లీపు సంవత్సరం వచ్చి మూడేళ్లు అయితే అలాంటి సంవత్సరం కావాలంటే 2003+11= 2014
- లీపు సంవత్సరం తర్వాత 2 సంవత్సరాలు అయితే 2006 లాంటి సంవత్సరం కావాలంటే + 11 సంవత్సరాలు చేయాలి. ఉదా. 2006 + 11 = 2017 2006 లాంటి కాలెండర్ 2017.
- లీపు సంవత్సరం వచ్చి 1 సంవత్సరం అయింది. ఉదాహరణకు 2013 లాంటి సంవత్సరం కావాలంటే + 6 సంవత్సరాలు చేయాలి. 2013+ 6 = 2019 2013 క్యాలెండర్ 2019 ఒకటే.
- లీపు సంవత్సరం అయితే + 28 సంవత్సరాలు చేయాలి ఉదా. 2012 + 28 = 2040 2012 క్యాలెండర్ 2040 క్యాలెండర్ ఒకటే.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో జేఆర్ఎఫ్‌లు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు/ప్రాజెక్ట్ అసోసియేట్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణులవ్వాలి. » **వేతనం:** నెలకు రూ.37,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: **padmabati.mondal@labs.iisertirupati.av.in.**
» దరఖాస్తులకు చివరితేది: 03.01.2026.
» వెబ్‌సైట్: **www.iisertirupati.ac.in**

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో సీనియర్ రీసెర్చ్ ఫెలోలు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) తాత్కాలిక ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్-1/సీనియర్ రీసెర్చ్ ఫెలోలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:**సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ,పీహెచ్‌డీ(లైఫ్ సైన్సెస్ లేదా బయోటెక్నాలజీ)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.42,000 నుంచి 58,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: **pavithrachavali@iisertirupati.ac.in**
» దరఖాస్తులకు చివరితేది: 29.12.2025.
» వెబ్‌సైట్: **www.iisertirupati.ac.in**

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.28,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.12.2025
» వెబ్‌సైట్: **https://pgimer.edu.in**

‘పుట్టుక నీది చావు నీది.. బతుకంతా దేశానిది’

అరుదైన కోవకు చెందిన మన తరం మహానుభావుడు కాళోజీ. ఆయన నిజాయతీగా మాట్లాడారు. అనుకున్నది కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. ప్రభుత్వంతో ఏనాడూ రాజీ పడలేదు. పదవుల కోసం పాకులాడలేదు. సామాన్య ప్రజలను మర్చిపోలేదు. ఎల్లప్పుడూ ప్రజల పక్షం వహించి అనేక ప్రజాసమస్యలపై పోరాడారు. ప్రజల గొడవ.. తన గొడవగా, జనం వాణి.. తన బాణీగా వినిపిస్తూ.. నిరంతరం ఉద్యమాన్ని నడిపించారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణను ఉద్దేశించి కాళోజీ ‘పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది’ అని పేర్కొన్నారు. ఈ మాటలు ఆయనకూ వర్తిస్తాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

కాళోజీ నారాయణరావు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఈయన కుటుంబం కర్ణాటకలోని బీజాపూర్ నుంచి తెలంగాణాలోని వరంగల్ జిల్లాకు వలస వచ్చి మడికొండ గ్రామంలో స్థిరపడింది. కాళోజీ తల్లిదండ్రులు రంగారావు, రమాబాయమ్మ. ఈయన హైదరాబాద్‌లోని చౌమొహల్లా పాఠశాల, సిటీ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. 1939లో హైదరాబాద్ హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ భాషల్లో ప్రముఖ కవిగా గుర్తింపు పొందారు.

కాళోజీ జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారు. నిజాం ప్రభుత్వ కాలంలో తన రచనల ద్వారా తెలంగాణా ప్రజల్లో దేశభక్తి రేకెత్తించారు. సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించడం ఈయన కవిత్వానికి ఉన్న ప్రత్యేకత. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంలో పాల్గొనడం వల్ల బహిష్కరణకు గురైన విద్యార్థులను నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించారు.

అన్యాయాన్ని ఎదిరిస్తూ కలమెత్తిన ప్రజాకవి..

కాళోజీ 1948 భారత విలీనోద్యమంలో ఏడు నెలల పాటు వరంగల్, గుల్బర్గా జైళ్లలో శిక్ష అనుభవించారు. వరంగల్‌లో నిజాం రజాకార్లు జాతీయవాది అయిన మొగులయ్యను హత్య చేసినప్పుడు కాళోజీ రాసిన గేయం ప్రజలను కదిలించింది. నిజాం ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ వరంగల్ సందర్శించినప్పుడు ‘ఎన్నాళ్ల నుండియో..’ అనే గేయం రాశారు. ‘అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా’, ‘అతిథివోలె వుండి.. అవని విడిచి వెళ్లుతాను’ లాంటి కాళోజీ కవితా పంక్తులు ప్రసిద్ధి చెందాయి.

విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి కాళోజీ వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయణ్ని నగరం నుంచి బహిష్కరించారు. హైదరాబాద్‌లో ‘ఆంధ్ర సారస్వత పరిషత్’ స్థాపకుల్లో ఒకరైన కాళోజీ తెలంగాణా రచయితల సంఘం ఏర్పాటులోనూ ప్రముఖపాత్ర పోషించారు.

కేంద్ర ప్రభుత్వం కాళోజీ సేవలను గుర్తించి 1992లో పద్మవిభూషణ్ బిరుదునిచ్చి సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు ‘ప్రజాకవి’ బిరుదు ఇచ్చింది. 1992లో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం కాళోజీకి గౌరవ డాక్టరేట్ బహూకరించింది.

రచనలు

కాళోజీ ‘మనమే నయం’, ‘తెలియక ప్రేమ.. తెలిసి ద్వేషం’, ‘విభూతి లేక ఫేస్ పౌడర్’ తదితర శీర్షికలతో కథలు రాశారు. వ్యంగ్యం, అధిక్షేపాలను కలగలిపి వీటిని రచించారు. సమాజంలో నిరుపేదలు, కష్టజీవుల బతుకులు దుర్భరంగా ఉన్నాయనే వాస్తవికతను కాళోజీ ఈ కథల్లో వ్యంగ్యంగా చిత్రీకరించారు. కె.సి. గుప్తా 1943లో సుల్తాన్ బజార్‌లోని ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ తరఫున ‘అణా గ్రంథమాల’ ప్రచురణల వరసలో 24వ గ్రంథంగా ‘కాళోజీ కథలు’ పేరుతో పుస్తకాన్ని ముద్రించాడు. అప్పట్లో దీని వెల ఒక కల్దారు అణా మాత్రమే. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో హాలీ చిక్కాలు (నాణేలు) అమల్లో ఉన్నప్పటికీ దీని ధరను కల్దారులో ప్రకటించారు. ‘సుభాష్ చంద్రబోస్’ అనే గ్రంథాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం కె.సి. గుప్తాకు ఒక నెల కఠిన శిక్షతో పాటు రూ. 250 జరిమానా, రచయితకు 18 నెలల కఠిన శిక్ష విధించింది. అల్లూరి సీతారామరాజుపై వెలువరించిన గ్రంథాన్ని కూడా నిషేధించింది. ఇలాంటి స్థితిగతులూ, ప్రభుత్వ నిర్బంధ విధానాలు ఉన్నప్పటికీ కాళోజీ ధైర్యంగా తన కలాన్ని కదిలించారు.

కాళోజీ 1941లో ‘అణా కథలు’, 1946లో ‘కాళోజీ కథలు’, 1953లో ‘నా గొడవ’ రచించారు. 1969–70లో తెలంగాణా ఉద్యమ కవితలు రచించారు. కాళోజీ ఆత్మకథ ‘ఇది నా గొడవ’. దీన్ని 1995లో రచించారు.

కాళోజీ నారాయణరావు 2002 నవంబర్ 13న మరణించారు. ఆయన తన దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ కళాశాల పేరును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చారు.

రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని ‘తెలంగాణా భాషా దినోత్సవం’గా ప్రకటించింది. 2015 సెప్టెంబర్ 9న తొలిసారిగా తెలంగాణా భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ స్మారక పురస్కారం అందించారు. దీన్ని మొదటిసారిగా ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు 2015 సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ప్రదానం చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఏ సంవత్సరంలో జన్మించారు?
   1) 1914 సెప్టెంబర్ 9
   2) 1923 నవంబర్ 10
   3) 1925 అక్టోబర్ 1
   4) 1910 డిసెంబర్ 12
2. ‘అణా గ్రంథమాల’ సంపాదకుడి పేరు?
   1) వట్టికోట ఆళ్వార్ స్వామి
   2) అడవి బాపిరాజు
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కె.సి.గుప్తా
3. ‘ఇది నా గొడవ’ అనే పేరుతో కాళోజీ నారాయణరావు ఆత్మకథ ఏ సంవత్సరంలో రచించారు?
   1) 1946 2) 1941
   3) 1995 4) 1953
4. కాళోజీ నారాయణరావు స్మారక ప్రథమ పురస్కార గ్రహీత ఎవరు?
   1) డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
   2) డాక్టర్ ఎన్. గోపి
   3) డాక్టర్ వల్లూరి శివారెడ్డి
   4) అందెశ్రీ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1.

ఆచార్య సి. నారాయణ రెడ్డి

ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారె) ఈ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖులు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సినారెకి తెలుగు సాహితీవనంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈయన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హన్మాజీపేటలో 1931 అక్టోబర్ 29న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి. సిరిసిల్ల, కరీంనగర్‌లో సినారె ప్రాథమిక, మాధ్యమిక విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., ఎం.ఎ. పట్టాలు పొందారు. 1962లో ‘ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు–ప్రయోగాలు’ అనే సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ గ్రంథాన్ని 20వ శతాబ్ద పూర్వార్ధ ప్రామాణికమైన సాహిత్య చరిత్రగా పేర్కొనవచ్చు. ఆయన కవిత్వాన్నే ఎన్నుకొని ఆయా నవీన కవితారీతులు సమగ్రంగా విశ్లేషించి ఆధునిక సాహిత్య నేపథ్యాన్ని సమన్వయించి చూపారు.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, గిడుగు కృషి వల్ల నూతన సాహిత్య పోకడలు ఆవిష్కృతమయ్యాయి. సాహిత్యంతోపాటు కళాత్మక విలువలు కూడా పెంపొందాయి. కవితా మాధ్యమం, శిల్పమూ, ఛందమూ నూతన అందాలు సంతరించుకున్నాయి. ఈ శతాబ్దంలో మాత్రా ఛందస్సులు, గీతికలు, గేయాలు, రొమాంటిసిజంతో కాల్పనిక కవులు, రచయితలు ప్రభావితులయ్యారు. వారిలో ఆచార్య సినారె కూడా ఒకరని చెప్పుకోవచ్చు.

‘‘తెలుగు కళ్ళకు తెలుసు నా లలిత కళా రూపం తెలుగిళ్ళకు తెలుసు నా కల గీతికా దీపం’’

సాహిత్యం

ఆచార్య సి. నారాయణ రెడ్డి తెలుగు భాషకు సమగ్రపుష్టి. ప్రధానంగా ఈయన నాదకవి. సినారె రచనల్లో అనేక ప్రక్రియలు కనిపిస్తాయి. గీతికలు, గేయాలు, అభినవ కవితలు హృదయాన్ని హత్తుకుంటాయి. ఈయన రచించిన ‘దివ్వెల మువ్వలు’ లాంటి ముక్తకాల నుంచి ‘నాగార్జున సాగరం’, ‘కర్పూర వసంతరాయలు’ లాంటి కథా కావ్యాలు, ‘నవ్వని పువ్వు’, ‘రామప్ప విశ్వదీపం’ తదితర సంగీత రూపకాల వరకూ ఈయన కవితా రచనలో నాద తరంగిణి వినిపిస్తుంది. ఈయన స్వయంగా కర్పూర వసంతరాయలు కావ్యం గానం చేస్తుంటే హృదయం పులకరిస్తుంది. ఐదు దశాబ్దాలపాటు సినారె కొన్ని వందల గేయాలు, గీతాలు రచించారు. అనేక సినిమా పాటలు కూడా రాశారు. ఆధునిక సాహిత్యంలో గేయరచనకు స్థిరస్థానం కల్పించారు. డా. సి. నారాయణరెడ్డి పేరు వినగానే కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం, విశ్వంభర మొదలైన గేయ కథాకావ్యాలు గుర్తుకు వస్తాయి. ‘తెలుగు గజల్లు’, ‘ప్రపంచ పదులు’ లాంటి వినూత్న రచనలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. ‘విశ్వంభర’, ‘మట్టీమనిషీ ఆకాశం’ లాంటి దీర్ఘకావ్యాలు సినారె తాత్వికతకు నిదర్శనాలు. ‘మట్టీ మనిషీ ఆకాశం’ హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదమైంది. పుస్తక సమీక్షలు కూడా వచ్చాయి. డా. ముదిగొండ వీరభద్రయ్య దానిమీద వందపేజీల వ్యాఖ్యా గ్రంథం రాశారని సినారె స్వయంగా చెప్పారు. ఇవే కాకుండా ఎన్నో వచన కవితలు, గీతాలు, గజల్లు, ప్రపంచ పదులు, ద్విపదలు రచించారు.

సినారె కవిత్వం ఒక నిరంతర ప్రస్థానం. ఎల్లలెరుగని విశ్వమానవీయత ఆయన తత్వం. అనాదిగా మానవజీవితం విశ్వంలో ఏ విధంగా ప్రతిస్పందిస్తుందీ, విశ్వాంతర ప్రకృతిలో మానవ మహితాత్మ ఎలా నిరంతర యాత్ర సాగిస్తోందీ.. అనే విషయాలను తన విశ్వంభర సుదీర్ఘ కావ్యంలో ప్రతిపాదించారు. ఈ కావ్యం సినారెను ఆధునిక భారతదేశ సాహిత్య చరిత్రలో మహాకవిగా, ఆధునికాంధ్ర సార్వభౌముడిగా నిలబెట్టింది. 1988లో ‘జ్ఞానపీఠ్ పురస్కారం’ సాధించిపెట్టింది. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో ముగ్గురికి మాత్రమే ‘జ్ఞానపీఠ్’ పురస్కారం లభించింది. సినారెతో పాటు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ (రామాయణ కల్పవృక్షం – 1970లో), రావూరి భరద్వాజ (పాకుడు రాళ్లు – 2012లో) ఈ పురస్కారం అందుకున్నారు. 1990–91లో యుగోస్లవియాలో జరిగిన ‘విశ్వకవి’ సమ్మేళనంలో సినారె పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నలభై దేశాలు, నలభై భాషల కవులు పాల్గొన్న సమ్మేళనంలో మనదేశం తరఫున భారతీయ భాషల ప్రతినిధిగా నారాయణరెడ్డిని భారత ప్రభుత్వం పంపించింది. అక్కడ నియమం ప్రకారం ఆ కవి రాసిన భాషలోనే తన కవిత చదవాలి. అలా చదివిన తర్వాత దాని అనువాదం ఉంటుంది. అది విన్న పండితులు, కవులు, హర్షధ్వానాలతో నారాయణ రెడ్డిని స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా విశేష పాఠకాదరణ ఉన్న ఇరవైమంది భారతీయ సాహితీవేత్తల్లో ఆచార్య నారాయణరెడ్డి ఒకరని ‘దేశ్’ అనే బెంగాలీ పత్రిక తన సర్వేలో తెలిపింది.

ఈ శతాబ్ద సాహిత్యమూర్తుల్లో విలక్షణ వ్యక్తిత్వం నారాయణ రెడ్డిది. కవితా తాత్వికుడిగా, కళావేత్తగా, గాన, సాహిత్యవేత్తగా పేరొందారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఈయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

మాదిరి ప్రశ్నలు

1. ఆచార్య సి. నారాయణరెడ్డి తెలంగాణలో ఏ జిల్లాలో, ఎక్కడ జన్మించారు?
   1) కరీంనగర్ జిల్లా–హన్మాజీ పేట
   2) వరంగల్ జిల్లా– హనుమకొండ
   3) మహబూబ్ నగర్ అలంపురం
   4) నల్లగొండ జిల్లా – కొలనుపాక
2. ఆచార్య సి. నారాయణరెడ్డికి ఏ గ్రంథానికి 1988లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది?
   1) కర్పూర వసంతరాయలు
   2) నాగార్జున సాగరం
   3) మట్టీ మనిషీ ఆకాశం
   4) విశ్వంభర గేయ కథాకావ్యం
3. కిందివారిలో ఎవరు నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, లాంటి రచనలు చేశారు?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) డా. సి. నారాయణ రెడ్డి
   3) తిరుమల రామచంద్ర
   4) గుంటూరు శేషేంద్రవర్మ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2.

A European visitor to the..

BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books
   2) few books
   3) some books
   4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
   1) Himself to
   2) his self to
   3) himself for
   4) his self from
   5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
    1) whom matters
    2) whose matters
    3) whose matter
    4) who matter
    5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
    1) dissent 2) decent
    3) descent 4) dissuade
    5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
    1) Fight, draw
    2) Position, aspect
    3) Plight, drain
    4) Struggle, issue
    5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
    1) proper, for
    2) correct, along
    3) suitable, among
    4) valid, from
    5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
    1) ways, deep
    2) methods, destroyed
    3) paths, shortened
    4) means, annihilated
    5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
    1) apposite, position
    2) opposite, fact
    3) relevance, media
    4) significance, party
    5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1)A 2) C 3) D 4) E 5) F
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the ________ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought
    2) thinking
    3) think
    4) thinned
    5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense
    2) suspect
    3) suspected
    4) suspecting
    5) suspects
29. 1) convicted
    2) allowed
    3) acquitted
    4) arrested
    5) prosecuted
30. 1) are to
    2) will be
    3) will been
    4) have been
    5) were

KEY

1) 3; 2) 2; 3) 4; 4) 5; 5) 4; 6) 3; 7) 1; 8) 2; 9) 2; 10) 4; 11) 3; 12) 3; 13) 4; 14) 4; 15) 1; 16) 4; 17) 1; 18) 5; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5.